అపరాధ పరిశోధన

రు. 6 అక్టోబరు '84

...న్ నెం:
...843

Blank Page

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. ప్రణయసామ్రాజ్ఞి—శ్యాంబాబు
23. మంచు మనిషి—కె. వి. రమణ
45. సంహార నేరస్తులు—బొమ్మిడి అచ్చారావు
61. ఎడిటర్ చలపతి—పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ
76. నాట్యతారలు—ఎమ్.వి.వి. సత్యనారాయణ
94. ఆదర్శ దొంగలు—కె. లక్ష్మి
101. ఎర్రసిరా మరకలు—ప్రతాప రవిశంకర్
114. హై క్లాస్ పిట్ట—మల్లిక్
126. అరణ్యవాసం—బి. రాజేశ్వరి
157. తికమక శవం—ఓరుగంటి పద్మావతి
172. కాంచన శిఖరం (సీరియల్)—వాణిశ్రీ

నవలలు (సప్లిమెంట్)

3. మానవత్వం ఎలుక కెందుకు?—చంద్రశేఖర ఆజాద్
59. ఊహించని అదృష్టం—టెంపోరావ్
98. సత్యభామ శపథం—ఎమ్.డి. చైతన్య
138. తీవ్రవాది—ఎమ్. వి. వి. సత్యనారాయణ
184. అగ్ని కిరీటం (సీరియల్)—ప్రతాప రవిశంకర్

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!

"ఎంత?" అడిగాను బొమ్మ పిస్తోలువైపు చూపించి.

వాడు దాన్ని తీసి నా చేతి కందిస్తూ చెప్పాడు, "నలభై!"

రిఎన్ ఫోర్సడ్ ప్లాస్టిక్‌తో చేసిన బొమ్మ పిస్తోలది. ప్లాస్టిక్ కాగితంలో చుట్టివుండే అచ్చం నిజం పిస్తోలులా వుంది నల్లగా, నిగనిగ లాడుతూ.

బర్మాబజార్లో వున్న డజన్లకొద్దీ షాపుల్లో అదొకటి. రకరకాల స్మగుల్డ్ సామానులు. ఇమిటేషన్ వస్తువులు అమ్మడం ఆ షాపుల ప్రత్యేకత పారిస్ కార్నర్ నుండి పోర్ట్ వైపు వెళ్ళే రోడ్డులో కుడివైపు పుట్‌పాత్‌లను ఆక్రమించికొని వుంటాయి చిన్నచిన్న బంకుల్లా కట్టిన ఆ షాపులు.

సిగరెట్ లైటర్లు, బ్లేడులు, కాసెట్‌లు, గొడుగులు రకరకాల వస్తువులు అన్నీ స్మగుల్డ్‌వి....చాలా బహిరంగంగా అమ్ముతారు ఆ షాపుల్లో. వాటితోపాటు నకిలీ వస్తువులు కూడా వుంటాయి. తెలియనివారు తేలిగ్గా మోసపోగలరు. ఆ మార్కెట్‌లో క్రొత్తవాళ్ళను ఇట్టే పసిగట్టే చాకచక్యం వుంది ఆ షాపు వాళ్ళకు.

నాతోపాటు వున్న మరో కస్టమరు వెళ్ళేవరకూ ఆ బొమ్మ పిస్తోలును అటూ ఇటూ ఆడిస్తూ, ట్రిగ్గర్ యాక్షన్ టెస్ట్ చేస్తూ నిలబడ్డాను.

"చెప్పు సామీ! ఎంతక్కావాలి?" అడుగుతున్నాడు షాపువాడు విసుగ్గా.

నేను నవ్వుతూ వాడివైపు చూశాను. జపాన్ ఆక్రలిక్ టీషర్టు వేసుకొని, గళ్ళలుంగీ కట్టుకొని వున్నాడు వాడు. పొట్టిగా, నల్లగా నిగనిగలాడుతూవున్నాడు.

"నిజం పిస్తోలయితే ఎంతవుతుంది?" అన్నాను వాడి ముఖంలోకే చూస్తూ.

నా మాటలు వాడి మనస్సులోకి ఇంకడానికో క్షణం పట్టింది. ఒకక్షణం ఆశ్చర్యం కనబడింది వాడి ముఖంలో.

"పరాచికమాడుతున్నావా?" అన్నాడు వాడు కాస్త తేరుకొని.

అడ్డంగా తలవూపాను నేను. "లేదు....నిజంగా కావాలి

ఎంతవుతుంది?" అన్నాను బొమ్మ పిస్తోల్ని ప్లాస్టిక్ కాగితంలో చుట్టేస్తూ.

మూణ్ణెల్ల క్రితం తెలిసింది. కుల్‌కర్ణీ అని నా స్నేహితుడు. బాగా డబున్నవాడు. ఓ రోజు సాయంత్రం కాస్మాపాలిటన్ క్లబ్బులో ఏదో సంభాషణ సందర్భంలో చెప్పాడు. బర్మాబజార్‌లో తను అన్‌ఆథరైజ్డ్‌గా ఓ గన్ కొన్నట్లు. ట్రాఫిక్ లైటుకు తిన్నగా వున్న షాపని చెప్పాడు. ఇదే అయివుండాలి.

"ఎవరు చెప్పారు?" అడిగాడు వాడు అనుమానంగా.

"ఓ స్నేహితుడు మూణ్నెల్ల క్రితం ఓ 'బెరెట్టా' కొన్నాడు. రెండువేల రెండొందలకు."

తల వూపాడు వాడు. "ఇప్పుడు ధర పెరిగింది."

"ఎంత?"

"రెండువేల అయిదువందలు. అమ్యునిషన్ ఎక్స్ట్రా."

"ఇక్కడుందా?"

"లేదు. డబ్బు ముందు ఇవ్వాలి. తర్వాత మీ అడ్రస్‌కు పోస్టులో వస్తుంది" అన్నాడు వాడు పరిసరాల్ని జాగ్రత్తగా గమనిస్తూ.

ఎవరో కస్టమర్లు వచ్చారు. సిగరెట్ లైటర్లు బేరమాడుతున్నారు. వాళ్ళు వెళ్ళేవరకూ మాట్లాడకుండా నిలబడ్డాను. డబ్బు ముందుగా యిచ్చేసి, మన అడ్రసు వాడికివ్వడం ఎంతవరకు సమంజసమో తేల్చుకోలేకపోతున్నాను. కాని వాడి పద్ధతిలో కొంత లాజిక్ కనబడింది. అమ్మినవాడు చట్టానికి దొరక్కుండా తప్పించుకొనే రక్షణ వుంది.

నే నెవర్నో వాడికి తెలియదు. పోలీసు మనిషినే కావచ్చు. బహుశా కొట్టువాడి దగ్గరేమీ వుండకపోవచ్చు. వీడు కేవలం ఏజెంట్ అయివుంటాడు. పిస్తోలు అమ్ముతా

నని డబ్బు తీసుకొన్నంత మాత్రాన వీణ్ణి కోర్టులో నిలబెట్టి శిక్షించడం సాధ్యంకాదు డబ్బు ముట్టిం తరువాత దేశంలో ఏ మారుమూల పోస్టాఫీసు నుండో బహుశా పిస్తోలును పార్శిల్‌లో పంపుతాడు. ఎవరు పంపారో తెలుసుకొనే అవకాశం లేదు. మన దేశం స్మగ్లర్లు తెలివైనవాళ్ళు.

సిగరెట్ లైటర్ల బేరం అయిపోయింది

"అడ్రెస్ ఎందుకు? నాకే యివ్వొచ్చుగా?" అడిగాను.

"సేఫ్టీ! లైసెన్స్ లేకుండా తుపాకులు కొనడం, అమ్మడం ఫైర్ ఆర్మ్స్ యాక్ట్ క్రింద నేరం."

"గన్‌ను చెక్ చేసుకోవద్దూ!"

"అక్కరలేదు. అన్నీ మేమే చెక్‌చేసి పంపుతాము. అది పూర్తిగా పని చేస్తుందని గ్యారెంటీ!"

నేను ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాను. వీణ్ణి నమ్మి డబ్బివ్వచ్చునా అని....

"ఈ వ్యాపారంలో నమ్మకం ముఖ్యం. ముక్కూ ముఖం తెలియని మీకు అమ్మడానికి ఎలా సిద్ధపడ్డానో, అలాగే మీరూ డబ్బివ్వడానికి సంకోచించకూడదు. పదేళ్ళబట్టి వ్యాపారం చేస్తున్నాను. ఎప్పుడూ తేడా లేదు" అన్నాడు వాడు తన ధోరణిలో.

పిస్తోలు నాకు అవసరం. తప్పదు. వాణ్ణి నమ్మాలి. ఇక్కడ కొన్న పిస్తోలయితే మళ్ళీ ట్రేస్ చేసే అవకాశం వుండదు. సైలెన్సరు, ఎక్‌స్ట్రా అమ్యునిషనూ కావాలని చెప్పాను.

జేబులో నుండి డబ్బుతీసి లెక్కబెట్టి ఇచ్చాను. చిన్న కాగితం ముక్కమీద అడ్రస్సు కూడా వ్రాసిచ్చాను. రెండూ జేబులో పెట్టుకొన్నాడు వాడు.

"థాంక్యూ సార్! వారం రోజుల్లో మీకందుతుంది"

అన్నాడు నవ్వి తల వూపుతూ.

నా పథకంలో ఒక భాగం పూర్తయింది. మరో వారం రోజుల్లో అనుకొన్న పని పూర్తి చెయ్యాలి

2

దీపను చంపెయ్యాలని రెండు నెల్ల క్రితం నిశ్చయించు కొన్నాను నేను.

ఏ పనయినా ఒక పథకం ప్రకారం, జాగ్రత్తగా ఆలోచించి, మెథడికల్‌గా చెయ్యడం అలవాటు నాకు. ఏడు సంవత్సరాలు సైన్యంలో పని చేయడం వలన అలవడిన క్రమశిక్షణ, తర్వాత బ్యాంకులో ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించడం వలన నిర్ణయాలు తీసుకోవడంలో జాగ్రత్త, అమలు చేయడంలో మెళుకువ, వేగం నా స్వభావంలో జీర్ణించుకుపోయాయి.

దీపను చంపడం, తప్పా, రైటా అని యీ స్థితిలో తర్కించే అవకాశం లేదిక. ఆమెను చంపాలనే నిర్ణయం తీసుకొనేముందే ఆ విషయంపై మానసికంగా చాలా సంఘర్షణకు గురైయ్యాను. ఒక మనిషి ప్రాణాన్ని తీసేందుకు మరో మనిషికి హక్కేముందనే ప్రశ్న నన్ను చాలాకాలం వేధించింది.

యుద్ధంలో మనుషుల్ని—శత్రు సైనికుల్ని చంపడం వేరు. మామూలు పౌరుడుగా ఒక పథకం ప్రకారం ఓ నిండు ప్రాణాన్ని చేజేతులా తియ్యడం వేరు. కోపంలో, ఆవేశంలో, ఉన్మాదస్థితిలో, తాత్కాలికోద్రేకంలో ఓ మనిషి మరో మనిషిని చంపడం కొంత సమంజసమేమో....కాని, నిదానంగా, ఆలోచించి పథకంవేసి డెలిబెరేట్‌గా హత్య చేయడం ఫస్ట్ డిగ్రీ మర్డర్ అవుతుంది. కోల్డ్ బ్లడెడ్ మర్డర్.

తెలుసు! అయినా దీపను చంపాలని నిశ్చయించు కొన్నాను. కొందరు మనుషులు బ్రతికివుండడం మిగిలిన మనుష్యుల ఉనికికి ప్రమాదమయినప్పుడు ఆ వ్యక్తుల్ని మట్టు బెట్టడం మానవధర్మం.

దీపవల్ల నష్టపోతోంది నేనొక్కడినే అయితే మేమిద్దరం విడిపోతే సరిపోయేదేమో ...విడాకులు పుచ్చుకొనో, లేకో విడిపోతే పోయేదేమో! యస్! దీప నా భార్య. నా జీవితానికో విచిత్రమైన శాపం!

దీప నన్ను మోసం చేస్తోందని తెలిసినప్పుడు షాక్ తిన్నాను. నిజంగా దీప ఇలాంటి మనిషా అని గుండెలవిసేలా ఏడ్చాను. పొరపాటు మానవనైజం అని సరి పుచ్చుకోబోయాను. ఆ కుర్రాడు ఎర్రగా, నాజూగ్గా నాకంటే అందంగా వుంటే తాత్కాలికంగా, చిత్తచాంచల్యం వలన కాలు జారిందేమో ననుకొన్నాను. క్షమవలన పశ్చాత్తాపం పుడుతుందనుకొన్నాను.

నో! మగాడి విశాలహృదయం ఆడదాని కంటికి చేత గానితనంగా కనబడుతుందని తెలుసుకోలేకపోయాను.

ముందు ఎదిరింటి కాలేజీ కుర్రాడు. తర్వాత ప్రక్కింటి రామ్మూర్తి. బంధువుల్లో బావవరస అయ్యే మరొకతను, ఇలా రకరకాల వ్యక్తుల్తో ఆమె ప్రణయకలాపాలు రోజు రోజుకీ మితిమీరిపోతున్నాయ్ భర్త అనే వాడికి తెలుస్తుందేమో, సంసారం చెడుతుందేమో, నలుగురిలో నవ్వుల పాలు కావలసి వస్తుందేమోననే ఆలోచనలేదు ఆ పాతకికి. మొగుడు తప్ప మరే మగాడయినా పడకెక్కడానికి సిద్ధ పడుతుంది.

గత రెండు సంవత్సరాల్లో నాలుగిళ్ళు మారాము. పరువునష్టం భరించలేక, చుట్టుప్రక్కల వాళ్ళ గొడవలు

పడలేక....

దీప చుట్టుప్రక్కల వుంటే భార్యలు భర్తల్ని దాచేసే వారు. తల్లులు కొడుకుల్నీ, తండ్రుల్నీ దాచేవారు. దీప రెప్యుటేషన్ తెలిసిన తరువాత ముక్కూ ముఖం తెలియని మగ బంధువుల తాకిడి ఎక్కువై పోయింది.

చూస్తూ ఊరుకోగలగడం ఏ భర్తకూ సాధ్యంకాదు. తిట్టేను, సాధించాను, భయపెట్టేను. చావచితక్కొట్టాను, ప్రతిమాలాను. దాని బుద్ధి మారదు. మారలేదు.

దీని వలలోపడి ఓ ఇంటర్మీడియట్ కుర్రాడు, ఫస్టు క్లాసులో పాసవ్వాల్సినవాడు పరీక్ష తప్పాడు. ఓ ఎదురింటి ఇంజనీరు భార్య కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకోవ డానికి ప్రయత్నించింది.

చివరికి రెణ్నెల్ల క్రితం నా అన్నకొడుకు సురేష్, పధ్నాలుగేళ్ళవాడు, తొమ్మిదో తరగతి చదువుతున్నవాడు, సరదాగా చుట్టపుచూపుల కొస్తే, నేనింట్లో లేని సమయంలో వాణ్ణి లొంగదీసుకొని, దాని కామానికి బలిచేసింది. ఆ రోజు మధ్యాహ్నం, అనుకోకుండా యింటికొచ్చిన నాకు బెడ్ రూమ్‌లో దృశ్యం అశనిపాతంలా తగిలింది. ముప్పైఏళ్ళ పడతితో ముక్కుపచ్చలారని కుర్రాడి శృంగారం. దీపను చంపెయ్యాలని ఆ రోజే నిర్ణయించుకొన్నాను.

అన్నట్లు చెప్పడం మరిచాను....దీప రచయిత్రి.

మామూలు రచయిత్రి కాదు. నవలా రచయిత్రి. ఈ వ్యాపకం కూడా దీప స్వైరవిహారానికి బాగా దోహదం చేసింది. సాహితీ సభలని, సదస్సులని, ఏవో మీటింగులని పొరుగూళ్ళకు వెళ్ళిపోవడానికి, యధేచ్ఛగా అర్థమైన వాళ్ళతో తిరగడానికి మంచి అవకాశాలు వచ్చేవి ఈ కాగితాలు ఖరాబుచేసే వ్యవహారం వలన.

అయితే; ఆ వ్యాపకమే దాని చావుకు మొదటి క్లూ యిచ్చింది నాకు.

దీప క్రొత్తల్లో వ్రాసిన నవల ఒకదాంట్లో కధానాయకి చివర్లో 'తన చావుకి తాను తప్ప మరెవ్వరూ కారణం కాదని' ఉత్తరం వ్రాసిపెట్టి ఆత్మహత్య చేసుకొంటుంది. ఆ నవల చిత్తుప్రతిని సంపాయించేను అటకమీది కాగితాల కట్టల్లో నుండి. నాకు కావలసిన భాగం పేజీ చివరకు ఉండడం నా అదృష్టం. జాగ్రత్తగా ఆ భాగాన్ని కత్తిరించి మిగతా స్క్రిప్ట్ అంతా బాయిలర్లో పడేసి తగలబెట్టాను. అయితే ఆ కాగితం మీద దీప సంతకం వుండదు. కేవలం ఆమె చేతివ్రాతలో వ్రాసిన అక్షరాలు తప్ప.

చంపి దొరికిపోవడం ఇష్టంలేదు. దీపలాంటి మనిషిని చంపడానికి వెనుకంజ వెయ్యాల్సిన అవసరంలేదు. అయితే చట్టం దృష్టిలో హత్య హత్యే కదా! అంచేత దీప చేతి వ్రాతలో వున్న ఆత్మహత్య ఉత్తరం ఉపయోగించి ఆమె హత్యను ఆత్మహత్యగా నిరూపించాలని నా పథకం.

మనిషిని చంపడానికి పిస్తోలుకన్న అనువైన ఆయుధం మరోటి లేదని నా విశ్వాసం. ఉరి తీసో, విషం యిచ్చో, కారు యాక్సిడెంట్ చేసో, కత్తితో పొడిచో, ఎలక్ట్రిక్ షాక్ ద్వారానో, నీళ్ళలో ముంచో, గొంతు పిసికో రక రకాల పద్ధతుల్లో మనిషిని చంపవచ్చు ఎలా చంపినా దొర క్కుండా, అల్లరవకుండా చంపాలి. అదీ నా ఆలోచన. సైలన్సర్ అమర్చిన పిస్తోలు అన్నిటికన్నా అనువుగా అని పించింది నాకు. బహుశా నామిలటరీ బాక్గ్రౌండ్ అందుకు కొంత కారణం కావచ్చు.

వెల్! ఏది ఏమైనా దీపకి భూమ్మీద నూకలు చెల్లి పోయాయి. మరో వారం తర్వాత అవకాశం చూసుకొని

ఆ కామ పిశాచిని అంతమొందించాలి.

జీవితంలో ఒక మంచి పని చేస్తున్నాననే, తృప్తి, ధైర్యం నాకున్నాయి

3

బర్మాబజార్ వ్యాపారస్థుల తెలివికి జోహార్లు అర్పించకుండా వుండలేకపోతున్నాను.

సరిగ్గా నాలుగోరోజు మధ్యాహ్నం నా బ్యాంకు అడ్రసుకి కవరు వచ్చింది. కవరులో యస్. ఆర్. ఎమ్. టి. వారి రసీదు, చిన్న టైపుచేసిన వుత్తరం వున్నాయి.

బేసిన్ బ్రిడ్జ్ ప్రాంతంలోని ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ ఆఫీసులో పార్శిల్ విడిపించుకోమని ఆ వుత్తరం సారాంశం. పార్శిల్ కోయంబత్తూరు నుండి బుక్ చేసినట్లు తెలుస్తోంది.

ఆ రోజు సాయంత్రం పార్శిల్ విడిపించి, మోటార్ సైకిల్ మీద బీచ్ రోడ్ వెంట నిర్మానుష్యంగా వున్న ప్రదేశానికి వెళ్ళాను.

చిన్న చెక్కపెట్టెలో చాలా పకడ్బందీగా పార్శెల్ చేశారు.

టూల్ కిట్ తీసి స్క్రూడ్రైవర్‌తో పెట్టె తెరిచి పేపర్ వేస్టు మధ్య వుంచిన గన్‌ను బయటికి తీశాను.

బెరెట్టా .22. ముచ్చటయిన గన్. క్రోమ్‌ప్లేటింగ్ చేయబడ్డ గన్‌మెటల్. పిస్టల్ పిడినుండి బుల్లెట్లు మాగజైన్ ద్వారా లోడ్ చేస్తారు. గన్‌తోపాటు చిన్న బాక్స్‌లో నలభై ఎనిమిది రౌండ్ల అమ్యూనిషన్ వుంది. కాటన్ వేస్టుతో గన్‌కి వున్న ఆయిల్ తుడిచి ఒక మాగజైన్ లోడ్ చేశాను. దాదాపు నాలుగంగుళాల పొడవున చిన్న సిలెండర్లా వున్న సైలెన్సర్‌ను అమర్చాను. సేఫ్టీకాచ్ ఆఫ్ చేసి చుట్టు చూశాను.

దరిదాపుల్లో జనసంచారంలేదు. పిస్తోలు కాలి స్తే శబ్దం అవుతుందని భయంలేదు. కాని పిస్తోలు చేతవుంచుకొని ఎవరికంటా పడడం ఇష్టంలేదు.

బీచ్‌లో నాలుగయిదు గజాల కవతల ఎండిన కొబ్బరి కాయ ఒకటి కనిపిస్తోంది. జాగ్రత్తగా ఎయిమ్ తీసుకొని ట్రిగ్గర్ నొక్కాను.

'షూష్!'—మని చప్పుడయింది. సన్నటి పేము బెత్తాన్ని వేగంగా గాలిలో ఆడించినప్పుడు కలిగే చప్పుడు. కొబ్బరికాయకు బుల్లెట్ తగిలి ఓ అడుగు దూరం జరి గింది.

చకచక మిగిలిన అయిదు బుల్లెట్లూ కాల్చేశాను.

గురితో సంబంధంలేదు. పిస్తోలు పని చేస్తుందో లేదో పరీక్ష చేసుకోవడంకోసమే.

జాగ్రత్తగా క్రిందపడిన ఆరు ఎంప్టీ కార్ట్రిడ్జెస్ ఏరి జేబులో వేసుకొన్నాను. పాకెట్‌లోంచి మరో ఆరు కార్ట్-రిడ్జెస్ తీపి గ్రీస్ తుడిచి, మాగజైన్‌లో అమర్చి పిస్టల్‌ను మళ్ళీ లోడ్‌చేశాను సైలన్సర్‌ను విప్పి, రెండింటినీ మోటార్ సైకిల్‌కి వున్న మెటల్ బాక్సులో పెట్టాను.

సాధారణంగా బుల్లెట్లు పేల్చిన తర్వాత గన్ బారల్‌ను క్లీన్‌చేస్తారు. ఎందుకంటే పేల్చిన బుల్లెట్ తాలూకు కరిగిన సీసం అణువులు, కార్బన్ డస్టు బారెల్‌లో పేరుకు పోతాయి. బారెల్ క్లీన్‌గా లేకపోతే తర్వాత బుల్లెట్లు పేల్చి నప్పుడు మజిల్ వేడెక్కి గన్ పాడయిపోయే అవకాశం వుంది.

కాని బారెల్ క్లీన్ చేయడానికి కావలపిన సామాను లేదు. అయినా ఇకముందు యీ గన్‌నుండి నేను పేల్చ బోయేది కేవలం ఒక్క బుల్లెట్ మాత్రమే. అంచేత గన్

పాడయిపోయినా బాధలేదు.

సాయంత్రం మునిమాపు చీకటి పడేవరకూ అక్కడే కూర్చొన్నాను. కూర్చొన్నచోట కాజువల్‌గా ఇసుకలో లోతుగా, దాదాపు అడుగులోతు. అమ్యునిషన్ బాక్సు పట్టే గొయ్యి తీశాను. మిగిలిన మ్యాప్పై ఆరు రౌండ్లు, ఎమ్టీలు అందులో పడేసి గొయ్యి పూడ్చేశాను. గుర్తు తెలియకుండా చుట్టుప్రక్కల వున్న తడి ఇసుక దానిపై నెట్టాను.

దీపను చంపడానికి రంగం పూర్తిగా సిద్ధమయింది'

4

సినిమా హాల్లో జనం కిటకిటలాడుతున్నారు.

'రైడర్స్ ఆఫ్ ది లాస్ట్ ఆర్క్' హాలివుడ్ చిత్రం. ఎనిమిది రూపాయల బాల్కనీ టికెట్టు ఇరవై అయిదు రూపాయలకు బ్లాకులో అమ్ముతున్నారు. నిన్న ఫస్టు షో చూశాను ఇదే సినిమా.

మళ్ళీ ఈ రోజు సెకండ్ షో. టైము చూసుకొన్నాను. పది కావడానికి పది నిముషాలుంది. గేట్‌పాస్ తీసుకొని బయటికి నడిచాను.

బ్లాక్‌మార్కెట్ వాళ్ళు హాలు బయట జోరుగా అమ్మకాలు చేస్తున్నారు. బేరం కుదరక వెళ్ళిపోతున్న ఒకతన్ని పిలిచాను.

"టికెట్టు కావాలా?"

"ఏ టికెట్టు?" అడిగాడతను....

"'బాల్కనీ.... గేట్‌పాసు.... హాల్లోకి వెళ్ళాక గుర్తొచ్చింది అర్జెంటు పని.... వెళ్ళిపోతున్నాను. లాభం అక్కరలేదు"—

అతను ఆనందంగా పాస్ కొనుక్కొని హాలువైపు పరుగులు తీశాడు.... టికెట్ ముక్క నా పర్సులో భద్రంగా

వుంది. ఆట అయిపోయిం తరువాత పాస్‌లు లెక్కబెట్టు కొన్నప్పుడు హాలువాడికి లెక్క తేడారాకూడదని నా వుద్దేశ్యం. అన్ని జాగ్రత్తలూ తీసుకోవడంలో తప్పు లేదుగా!

చకచక నడుచుకొంటూ ఫర్లాంగుదూరంలో వున్న మెట్రో సినిమా వరకూ వెళ్ళాను. అక్కడ ఆటో ఎక్కి రంగరాజపురంలో క్రొత్తగా కట్టిన కాలనీవైపు పోనిమ్మ న్నాను....ఆ కాలనీలో వుంది మా ఇల్లు....కోడంబాకం హైవేమీద ఆటో దిగి డబ్బులిచ్చి పంపేశాను....నడుచు కొంటూ మా కాలనీలో ప్రవేశించాను.

రాత్రి పది దాటింతరువాత వీధిలో అట్టే జనసంచారం వుండదు. వీధి దీపాలు కరెంట్ కోతవలన వెలగవు. చీకట్లో నన్నెవరూ గుర్తుపట్టే అవకాశంలేదు.

సెపరేట్‌గా వున్న టుబైపు ఇల్లు మాది. బయిటి గేటు తెరుచుకొని చప్పుడు చెయ్యకుండా వరండాలోకి వెళ్ళాను. ఇంట్లోకి వెళ్ళే మెయిన్ తలుపుకు టూవే లాక్ వుంది. తాళం తెరుచుకొని లోపలకు నడిచాను. నేను సినిమా కెళ్ళాను గదా అని దీప తన ప్రియుల్నెర్నయినా పిలపించుకొనే అవకాశం లేదని నాకు తెలుసు. విన్నటి నుండి ఆమె 'బయట' వుంది.

మా ఇద్దరి పడగ్గదులు వేరే అని వేరే చెప్పనవసరం లేదనుకొంటాను. దీప గదిలో బెడ్‌లైటు వెలుగుతోంది.... టైము పది ముప్పైఅయిదు అయింది.

గుమ్మానికున్న తెర తొలగించి చూశాను. గోడవైపుకు తిరిగి విద్రపోతోంది.

వెనక్కి తిరిగి నా గదిలోకి నడిచాను....తాళంచెవుల గుత్తితీసి, చెవితో డ్రాయిర్ తాళం తెరచి లోపల దాచిన

పిస్తోలు బయటికి తీశాను. సైలెన్సర్ అమర్చి, సేఫ్టీ కాచ్ ఆఫ్‌చేసి వెనక జేబులో పెట్టుకొన్నాను. పిల్లిలా చప్పుడు చెయ్యకుండా అడుగులు వేస్తూ మళ్ళీ దీప గదిలోకి నడిచాను.

నిద్రలో అటునుండి ఇటువైపు తిరిగి వుంది ఈసారి. నిద్రలో అందంగా ప్రశాంతంగా వుంది ఆమె ముఖం. ఈ అందమైన పంకిలాన్ని వదిలించుకోక తప్పదు.

వెనకజేబులో నుండి పిస్తోలు తీసి పట్టుకొని మంచానికి దగ్గరగా వెళ్ళాను.

ఓసారి సేఫ్టీ కాచ్ సరిచూసుకొని పిస్తోలు ఆమె కుడి కణతకు ఆనించి ట్రిగ్గర్ నొక్కాను.

"ఫ్యూస్!"—తల ఒక్కసారి ఎగిరి దిండుమీద పడింది. ఆ క్షణంలో ఆ కనురెప్పలు తెరుచుకొన్నాయి. కాళ్ళు టపటప పరుపుమీద కొట్టుకొన్నాయి. దీప చరిత్ర ఆ క్షణంలో ముగిసింది.

పిస్తోలును చేతిరుమాలుతో శుభ్రంగా తుడిచి, రుమాలు తోనే బారెల్ పట్టుకొని ఆమె కుడిచేతిలో ఇరికించాను. చూపుడు వేలును బలవంతంగా ట్రిగ్గర్‌మీదకు నెట్టాను. ఇప్పుడు పిస్తోలుమీద ఆమె వేలిముద్రలు మాత్రమే వుంటాయి.

కుడిచేతిలో పిస్తోలు, కుడికణతలో గాయం.... ఆత్మ హత్యకు పర్‌ఫెక్ట్ పొజిషన్.

పర్సులోనుండి అంతకు ముందే సిద్ధంగా వుంచిన ఆమె చేతి వ్రాతలో వున్న 'ఆత్మహత్య ఉత్తరం' తీశాను.

"ఈ జీవితంపై విసుగు, విరక్తి భరించలేకపోతు న్నాను. నా చావుకు నేను తప్ప మరెవ్వరూ బాధ్యులు కారు—"

రెండు వాక్యాలు వ్రాసివున్న చిన్న కాగితం ముక్క అది. తిరిగి జాగ్రత్తగా మడిచి డ్రెస్సింగ్ టేబిల్‌మీద పెట్టాను.

ఇంట్లోంచి బయటికి వచ్చి చీకటి సందుల వెంట థియేటర్ వైపు నడవసాగాను. ఆట వదిలే సమయానికి అక్కడికి చేరాలి గుడ్.... వెరీగుడ్....దీప జీవితానికి ఈ క్షణంతో గుడ్‌బై! విచారం లేదు నాకు....షియీజ్ బెటర్ డెడ్ దాన్ ఎ లైవ్.

5

వారం రోజులు గడిచింది.

దీప పీడ వదలిపోయి ఇది ఎనిమిదవరోజు.

మొదటి మూడురోజులు చాలా హడావిడిగా గడిచింది. ఆత్మహత్య గనుక పోలీసులు రంగప్రవేశం చెయ్యక తప్ప లేదు.

కుడిచేతిలో పిస్తోలు, కుడికణతలో బుల్లెట్ గాయం, గాయం చుట్టూ వేడికి కాలి నల్లబడిన చర్మం, దీప స్వదస్తూరీతో ఆత్మహత్య ఉత్తరం....పోలీసులకు అట్టే అనుమానాలు కలగలేదు.

శవాన్ని పోస్ట్‌మార్టమ్‌కు పంపి, రొటీన్ ఇన్‌వెస్టిగేషన్ చేశాడు ఇన్‌స్పెక్టర్.

ఆ రోజు రాత్రి నేను ఎక్కడ వున్నది మొదలయిన విషయాలు అడిగాడు. నా దగ్గిర వున్న పర్సులోని సినిమా టికెట్ ముక్క అడిగి పుచ్చుకొన్నాడు.

దీప చేతిలోని పిస్తోలు. ఆమె ఆత్మహత్య ఉత్తరం. మొదలైన సరంజామా అంతా స్వాధీనం చేసుకొన్నారు.

పోస్టుమార్టం పూర్తిచేసి మర్నాడు సాయంత్రానికి అప్పగించారు శవాన్ని అంత్యక్రియలకు....దుఃఖాన్ని నటించడం ఎంత కష్టమైన విషయమో ఈ వారం రోజుల్లో తెలుసుకొన్నాను. బంధువుల, స్నేహితుల ఓదార్పులు, పరామర్శలు ఈ వారం రోజులు ఊపిరి సలపకుండా వుంది....

దీప మరణించిన నాలుగోరోజు మళ్ళీ వచ్చాడు పోలీస్ ఇన్స్పెక్టర్....చాలా ప్రశ్నలు వేశాడు ఈసారి....దీపకు, నాకు మధ్య సంబంధ బాంధవ్యాల గురించి, ఆమె కారెక్టరు గురించి తను విన్న అపవాదులగురించి అడిగాడు.

అన్నిటికీ నిదానంగా, ఓపికగా జవాబులు చెప్పాను.... "దీప గురించి మీరు విన్న అపవాదులు నేనూ విన్నాను. అవి కేవలం అపవాదులేనా లేక వాటిలో నిజం వుందా అని నేను వెరిఫై చేసుకొనే అవకాశం లేదు. ఉదయం పదింటికి ఆఫీసుకు వెళ్ళిపోయి సాయంత్రం అయిదు దాటిం తరువాత తిరిగొచ్చే ఉద్యోగులు ఇంటిదగ్గర భార్య ఏం చేస్తోందోనని అనుమానపడి వర్రీ అవడంవలన ప్రయోజనం లేదని నాకు తెలుసు..." అన్నాను వేదాంత ధోరణిలో.

"రెండేళ్ళ క్రితం మైలాపూర్‌లో వున్నప్పుడు ప్రక్కింటతనో తిరుగుతోందని తెలిసి తన్నారటగా?"—అడిగాడు ఇన్స్పెక్టర్ అపోలజిటిక్‌గా....ఇలాంటి ప్రశ్నలు అడగడం తనకు నిజానికి ఇష్టంలేదనే ధ్వనితో....క్షణం ఆశ్చర్యపోయాను. అవునన్నట్లు తలవూపేను. తెలిసిపోయిన నిజాలను కప్పిపుచ్చాలని ప్రయత్నించడం అవివేకం.

"అవును. దీప గురించి అదే చెడుగా వినడం.... మొదటిసారి....కోపం వస్తుందనుకొంటాను ఎవరికైనా.... కోపంలో తిట్టాను....ఎదిరించి మాట్లాడింది .... కోపం

ఎక్కువై తన్నాను. ఆ తర్వాతెప్పుడూ ఆమెపై చేయి చేసుకొన్న గుర్తులేదు" అన్నాను దిగులుగా.

నా సమాధానాలు ఇన్‌స్పెక్టర్‌కు తృప్తి కలిగించినట్లే అనిపించినాయ్. దీపను నేను చంపాను అనడానికి సర్‌కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ కూడా సరిగ్గా లేదని తేలిగ్గా అర్థమవుతోంది. ఆమె చనిపోయిన సమయానికి నేను సినిమాహాల్లో వున్నట్లు సాక్ష్యం వుంది. హాల్లో నన్ను చూసినట్లు ఎవరూ సాక్ష్యం ఇవ్వకపోయినా, చూడలేదని కూడా ఎవరూ ఇవ్వరు....పోగా నేను సినిమా చూసినట్లు టికెట్ ఆధారం వుంది.

ఇక: దీప చేతిలో పిస్తోలుమీద నా వేలిముద్ర లెక్కడా లేకుండా జాగ్రత్తపడ్డాను. దీప ఆత్మహత్య ఉత్తరం ఆమె స్వదస్తూరితో వ్రాసింది అని నిరూపించవచ్చు. పోల్చి చూసుకోవడానికి ఆమె వ్రాత వున్న కొన్ని కాగితాలుకూడా పోలీసులు పట్టుకెళ్ళారు. నా వేలిముద్రలు కూడా తీసుకెళ్ళారు పిస్తోలుతో పోల్చి చూడడానికి.

అయితే; పోలీసులకు అర్థంకాని విషయాలు కొన్ని వుండవచ్చు. దీపకు జీవితంపై విరక్తి ఎందుకు కలిగింది? ఆమెకు పిస్తోలు ఎలా దొరికింది?.... ఈ ప్రశ్నలకు వాళ్ళకు సంతృప్తికరమైన సమాధానాలు దొరకవు. అంతమాత్రం చేత నన్ను అనుమానించి, హంతకుడిగా నిరూపించగలగడం వాళ్ళకు సాధ్యం కాదు. ఏ తెలివైన లాయరైనా నన్ను ఇట్టే విడుదల చేయించగలుగుతాడు.

బయట జీపు ఆగిన చప్పుడయింది.

ఇన్‌స్పెక్టర్ దిగి బూట్లు టకటక లాడించుకొంటూ లోపలికి వచ్చాడు.

"హలో మిస్టర్ ఆచార్యా!"—అన్నాడు నవ్వుతూ.

"హలో ఇన్‌స్పెక్టర్!" అన్నాను కూర్చోమని కుర్చీ చూపెడుతూ.

"ఏమీ లేదు....ఇంకా రెండుమూడు అనుమానాలున్నాయి...అవి తేలిపోతే కేసు క్లోజ్ చేసేద్దామని"—అన్నాడు ఇన్‌స్పెక్టర్ నిలబడే.

"అడగండి...."—

"దీపగారి చేతిలో పిస్తోలుగురించి...అలాంటి పిస్తోలు అదే బెరెట్టా. 22 మీకుగాని లేదుగదా?"

అడ్డంగా తలవూపాను... "లేదు... నా దగ్గర ఏ రకమైన పిస్తోలు లేదు" అన్నాను కాస్త ఆశ్చర్యంగా.

"ఇదివరకుగాని వుండేదా?"

చిన్నగా నవ్వాను... "ఏడేళ్ళు ఆర్మిలో షార్ట్ సర్వీస్ కమిషన్డ్ ఆఫీసరుగా చేశాను. అప్పట్లో సర్వీస్ పిస్టల్ వుండేది నా దగ్గిర. డిస్చార్జ్ అయినప్పుడు సరెండర్ చేశాను. అయినా అవన్నీ హెవీకాలిబర్ పిస్తోళ్ళు...." అన్నాను.

చిన్నగా నిట్టూర్చాడు ఇన్‌స్పెక్టర్ "అయితే మిమ్మల్ని అరెస్ట్ చెయ్యక తప్పదనుకొంటాను" అన్నాడు కానిస్టేబుల్‌కు సైగచేస్తూ.

ఇన్‌స్పెక్టర్ మాటలు అర్థంకావడానికి రెండు క్షణాలు పట్టింది నాకు. దిగ్భ్రాంతితో చూశాను...."ఇన్‌స్పెక్టర్ వాట్ డుయు మీన్!" అడిగాను కంగారుగా.

"యు ఆర్ అండర్ అరెస్ట్ మిస్టర్ ఆచార్యా! అయామ్ సారీ! ఇటీజ్ ఆల్‌మోస్ట్ ఎ పర్‌ఫెక్ట్ మర్డర్....కాని రెండు పొరపాట్లు మిమ్మల్ని పట్టి ఇస్తున్నాయి."

"పొరపాట్లా?" అన్నాను ఆశ్చర్యంగా ...మతిపోయిన వాడికి మల్లే.

"యస్ బుల్లెట్లను పిస్టల్ బట్‌లో లోడ్ చేసినప్పుడు మీ వేలిముద్రలు ఆ కాట్‌రిడ్జెస్‌మీద పడతాయని మీకు తట్ట లేదా....ఫైర్ అయిన కార్ట్‌రిడ్జ్ మాడిపోతుంది గనుక దాని మీద మీ వేలిముద్రలు లేవుగాని, మిగిలిన అయిదు బుల్లెట్ల మీద మీ వేలిముద్రలున్నాయి...." అన్నాడు ఇన్‌స్పెక్టర్ జాలిగా.

తల గిర్రున తిరుగుతున్నట్లనిపించింది....యస్....ఇన్‌స్పెక్టర్ చెప్పింది నిజమే ...క్రొత్త అమ్యూనిషన్ గ్రీజు తుడిచి లోడ్ చేసినప్పుడు వేలిముద్రలు బుల్లెట్ మెటల్ కేసింగ్‌మీద పడతాయి. గ్రీజు నునుపు కాద్దో గాపో వుండడం వలన చాలా స్పష్టంగా వుంటాయి. ఫైర్ అయిన బుల్లెట్ వేడికి కాలుతుంది గనుక గ్రీజ్ మార్క్సు కరిగి పోయి వేలిముద్రలు వుండవు ...అవును....పొరపాటే ... చాలా ఘోరమైన పొరపాటు.

కానిస్టేబులు హేండ్ కఫ్స్ తగిలిస్తోంటే చెప్పాడు ఇన్‌స్పెక్టర్ .... "అంతేకాదు .... ఇంకో పొరపాటుకూడా చేశారు....మీ చేతి వేలిముద్రలు దీప ఆత్మహత్య వుత్తరం మీద కూడా వున్నాయి."

"కాగితంమీదా? ఎలా? అబ్సర్డ్" అన్నాను మరింత ఆశ్చర్యపోతూ.

"అబ్సర్డ్ కాదు....బాడ్‌లక్ అనుకొంటాను ...క్రొత్త పిస్తోలు అవడంవలన దానికున్న ఫ్యాక్టరీ ఆయిలింగ్ పూర్తిగా తుడిచెయ్యలేదు మీరు. గన్ వుపయోగించిన తరువాత ఆ ఆత్మహత్యా వుత్తరం ముట్టుకొని వుంటారు.

మీ చేతికి అంటుకొన్న ఆయిల్ ట్రేసెస్ వల్ల వేలిముద్రలు స్పష్టంగా పడ్డాయి కాగితంపైన. కంటికి కనపడవుగాని అల్ట్రావైలట్ ఫిల్మ్ మీద స్పష్టంగా వచ్చాయి."

మాట్లాడలేదు నేను ....మాట్లాడేందుకేమీ లేదిక ...ఫ్రీగా వున్న చేత్తో సిగరెట్టు తీసి వెలిగించాను. ఓసారి పొగ పీల్చి "లెటజ్ గో!" అన్నాను.

కదలలేదు ఇన్స్పెక్టర్...."ఇంతకీ ఆమె చేతివ్రాత ఎలా సంపాయించారు? ఆ వుత్తరం ఫోర్జరీ కాదు...."— అన్నాడతను.

చిన్నగా నవ్వాను నేను. "సారీ! చెప్పను!" అన్నాను. రేపు ఏ తెలివైనా లాయరైనా నన్ను ఉరికంబం నుండి రక్షించడానికి అదొక్కటే ఆధారం అని తెలుసు నాకు.... □

నేనే చెబుతా!



మహామనిషి

కె.వి.రమణ

ఉదయభానుడి లేత కిరణాల వెలుగులో తళతళలాడుతూ దర్శనమిచ్చాయి యావద్భారతావనికే తలమానికంగా నిలిచే హిమాలయ పర్వత శిఖరాలు. మిర్రర్‌గుండా కను రెప్పలు సయితం వాల్చక ఆ సుందర దృశ్యాన్ని తిలకిస్తూ వుండిపోయింది లలిత.

హెలికాప్టర్‌ను నడుపుతున్న పైలట్ మహేష్ పూర్తిగా

తన పనిలో లీనమయి వున్నాడు. హిమాలయాలు అతనికి కొట్టిన పిండి. ప్రతిభా ఏజెన్సీలో మహేష్ హెలికాప్టర్ నడిపే వుద్యోగి ఆ ఏజెన్సీకి ఇదేమో స్తరు హెలికాప్టర్లు మరో రెండున్నాయి. ప్రతిభా ఏజెన్సీ వాటిని కావలసిన వాళ్ళకు అద్దెకు యివ్వడం. అమ్మడం చేస్తుంటారు. ప్రస్తుతం లలింద ఆ హెలికాప్టరును అద్దెకు తీసుకుంది.

హిమాలయ పర్వతాలు దగ్గరవుతున్న కొద్దీ లలింద కళ్ళల్లో అక్క స్వరూపమే మెదిలి నీళ్ళు నిలిచాయి. లలింద అక్క స్వరూప ఓ నెలరోజుల క్రిందటనే ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాలనే ప్రయత్నంతో బయలుదేరిన ఒక బృందంతో కలిపి బొంబాయినుండి బయలుదేరింది.

బృందం సభ్యులు యావన్మందీ ఎవరెస్టును అధిరోహిస్తూ వుండగా వూహించని రీతిలో వారంతా ఒక మంచు తుఫానులో చిక్కుకుపోయారు. పర్వతారోహణను తాత్కాలికంగా విరమిస్తూ వెనక్కు తిరిగింది బృందం. వారంతా కలపి అలా తిరిగి వస్తుండగా స్వరూప దురదృష్టవశాత్తూ వారి నుండి విడివడి దారి తప్పింది.

అంతే! ఆనక ఎవరెన్ని విధాలుగా ప్రయత్నాలు చేసినా స్వరూప ఆచూకీ మరి లభించలేదు. స్వరూప జాడను వెలికి తీయడం కోసం సైన్యం సయితం విరివిగా గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోయింది. స్వరూప ఏమయిందన్న విషయంలో అనేక తర్జన భర్జనలూ, వాద ప్రతివాదాలూ జరిగి చివర కది ఓ మిష్టరీగానే మిగిలి పోయింది.

స్వరూప విషయాన్నిక గతించిన సంగతిగా లోకం జమకట్టడాన్ని గమనించిన లలింద అక్క విషయాన్ని స్వయంగా తనే తేల్చుకోవాలని బయలుదేరింది. స్నేహి

తులూ బంధువులూ లలింద కోరికను ఆదిలోనే నిరుత్సాహ పరచాలని చూసారు. యెందరి ల్లనో సాధ్యంకానిది అందులోనూ ఆడదానివి నీ వల్లేమవుతుంది అన్నారు.

ఎవరేం చెప్పినా అందరికీ ఆమె సమాధానం ఒక్కటే! "అక్కకోసం తనూ తన వంతు ప్రయత్నం జరపాలన్నదే తన ధ్యేయం" చివరకు లలింద పంతమే నెరవేరి బొంబాయినుండి బయల్దేరింది.

స్వరూప, లలిందలు కోటీశ్వరులయిన జగత్‌నారాయణ్ దంపతుల బిడ్డలు. తలిదండ్రులిద్దరూ హఠాత్తుగా ఓ విమాన ప్రమాదంలో మరణించడంతో కోట్లకు వారసు లయినా ఆ అక్కచెల్లెలిద్దరూ అనాధలుగానే మిగిలిపోయారు. దిక్కుమొక్కు లేకున్నా వారి వెనకవున్న సంపదను చూసి తామే నిజమయిన శ్రేయోభిలాషులమంటూ ఎందరో వారిని చుట్టుముట్టారు.

రాబందుల్లాంటి బంధువులతో వేగలేక స్వరూప, పర్వతారోహణలూ క్రీడోత్సవాలూ అంటూ తరచూ వారందరినీ తప్పించుకు తిరగడంతో ఆ భారమంతా లలింద నెత్తిన పడేది.

స్వరూప ఆ రకంగా మాయంకావడం, ఆమెను వెదుక్కుంటూ వారికి కాస్త అడ్డంకిగా వున్న లలింద కూడా పోవడం వారందరికీ ఆనందదాయకమే. అయినా లోకం దృష్టిలో చెడ్డవాళ్ళం కావడం దేనికని లలింద ప్రయాణానికి ఆ మాత్రం అడ్డంకి చెప్పారు తప్ప ఆమెను ఆపాలనీ, ఆ ప్రయత్నంలో ఆమె క్షేమంగా వెళ్ళిరావాలనీ వారికి ఏ మాత్రం ఆసక్తిలేదు. ఆ సంగతి లలిందకూ తెలుసు

నిట్టూరుస్తూ జాకెట్‌లో పాలిథిన్ కవర్‌లో భద్ర

పరిచిన అక్క స్వరూప ఫోటోను తీసి నీళ్ళు నిండిన కళ్ళతో చూసింది. పాతికేళ్ళ వయసులో అందాలు వెద జల్లుతూ వుంది స్వరూప.

"మేడమ్! మనం ఎవరెస్టును సమీపించాం" అన్న మహేష్ పిలుపుతో వులిక్కిపడుతూ ఫోటోను యథా ప్రకారం తన గుండెల్లో భద్రపరచి ముందుకు చూసింది లలింద. ఎదురుగా ఆకాశాన్ని తాకుతూ సగర్వంగా నిలిచి వుంది ఎవరెస్ట్ పర్వతం.

"మిష్టర్ మహేష్! హెలికాప్టరును సాధ్యమయినంత చేరువగా పర్వతాన్ని చేర్చుతూ పోనివ్వండి" అంటూ బ్యాగులో వున్న బైనాక్యులర్స్ తీసింది లలింద.

"ఎస్ మేడమ్!" అంటూ కంట్రోలు పేనలుమీద చెయ్యి వెయ్యబోతూ "అమ్మా" అని బాధగా గుండెలు పట్టుకు వుండిపోయాడు మహేష్.

లలింద వులిక్కిపడుతూ బైనాక్యులర్స్ పక్కనపెట్టి మహేష్‌ను పట్టి వూపుతూ "ఏమయింది మహేష్" అన్నది ఆందోళనగా.

మహేష్ యేదో చెప్పబోతూ సాధ్యపడక బాధతో మెలికలు తిరిగిపోసాగాడు మొహం హఠాత్తుగా రంగులు మారుతూ క్రమేపీ నీలివర్ణంలోకొచ్చింది.

"మేడమ్....నాకు....గుండెపోటు వచ్చింది....నే నిక బ్రతకను....మీరు....చెప్పండి .... నే నేదో....చోట .... దింపేస్తాను" అన్నాడు అతికష్టంమీద.

లలింద అతడి మాటలను అర్థంచేసుకుంటూ కిందకు చూసింది. శిఖరాలమీద ఒక ప్రదేశాన్ని లాండింగ్‌కు అను కూలంగా నిర్ణయించింది. నిజానికి ఆ స్థలం కూడా హెలి కాప్టరు దిగడానికంతగా అనుకూలమైంది కాదు. అయినా

ఆ పరిస్థితుల్లో అంతకుమించి గత్యంతరంలేదు. మహేష్ పరిస్థితినిబట్టి అతడెంతోసేపు బ్రతకడని తెలిసిపోతూనే వుంది.

లలింద సూచనల మేరకు కడసారిగా మృత్యువుతో తీవ్రంగా పోరాడుతూ హెలికాప్టర్‌ను ఆ స్థలంలో దింపే ప్రయత్నంచేసాడు మహేష్. హెలికాప్టరు నేలకు సుమారు పదిహేనడుగుల దూరంలో వుండగా కంట్రోలు పానలు మీద నిర్జీవంగా వాలిపోయాడు మహేష్.

అప్పటివరకూ అతడు చేస్తున్న పనిని జాగ్రత్తగానూ ఆందోళనతోనూ పరికిస్తున్న లలింద ఆ స్థితిలో మిగిలి వున్న పనిని చేపట్టేందుకు ఉద్యుక్తురాలయింది. హెలికాప్టర్ నెమ్మదిగా లేండ్ అయింది. అయితే ఆఖరు క్షణంలో ఒక వీల్ కాస్తంత కిందకు జారి ఆ ఏటవాలు ప్రదేశంలో హెలకాప్టరు ప్రక్కకు ఒరిగిపడింది.

ఆ వూపుకు లలింద ముందుకు తూలగా ఆమె నుదురు కంట్రోల్ పానల్‌ను తాకి స్పృహ కోల్పోయిందామె.

2

నెమ్మదిగా కదులుతూ నీరసంగా కళ్ళు తెరచింది లలింద.

చుట్టూ చూసి, వులిక్కిపడుడూ చటుక్కున లేచి కూర్చుంది.

తానిప్పుడు హెలికాప్టరులో లేదు. మంచుతోకూడిన ఓ పర్వత గుహలో నేలమీద ఒత్తుగా పరచబడిన పూలతల మీద పరుండబెట్టబడి వుంది.

గుహ ముఖద్వారం ఎదురుగా కనిపిస్తూనే వుంది. దాని గుండా యెదురుగా కనపడుతున్న పర్వత పంక్తుల్నిబట్టి ప్రస్థుతం తను వున్న గుహ నేలకు చాలా ఎత్తులో

వున్నట్టు గ్రహించి ఆశ్చర్యపోయింది లలింద.

తననిక్కడికి తీసుకువచ్చిన వారెవరు? తనను ఇలా వదిలిపెట్టి ఎక్కడికి వెళ్ళారు? వాళ్ళు అపకారులా? వుపకారులా? నాగరికులా? అనాగరికులా? లలింద ఇలా రకరకాలయిన ప్రశ్నలతో భయాలతో తల మునకలవుతూ వెనకనుండి వినవచ్చిన అలికిడికి తలను చటుక్కున వెనక్కు తిప్పింది.

అంతే: ఎలా తిరిగిన మనిషి అలాగే నోరు తెరుచుకొని భయంతో స్థాణువులా వుండిపోయింది. ఆమె శరీరం పూర్తిగా అదుపు తప్పి సన్నగా వణుకుతోంది.

ఇంచుమించు గుహ పై కప్పును తాకేంత ఎత్తు అంటే సుమారు పదీ పదిన్నర అడుగుల ఎత్తు. ఆకారాన్నిబట్టి మనిషే! మంచులా తెల్లని దేహం. ఒత్తుగా పెరిగి వుంగరాలు తిరిగి భుజాలమీదకు దిగిన అల్లిబిల్లి జుత్తు. వెడల్పాటి ముక్కు. లావయిన పెదాలు. అన్నిటినీ మించి తీవ్రంగా సూటిగా చూడగలిగే నేత్రాలు. ఎక్కుపెట్టిన విల్లులా ఆ ఆకారం చూపులు తన వంకే గుచ్చి గుచ్చి చూస్తున్నాయి.

ఛాతీ విశాలమయిన బండరాయి మాదిరిగా రోమాలతో నిండివుంది. వుక్కు స్థంభాల్లాంటి చేతులు.

నడుము .... దాని దిగువున .... అంత భయంలోనూ సిగ్గుతో దృష్టిని చటుక్కున ప్రక్కకు మరల్చింది. ఆ ఆకారం పురుషుడని తెలిసి మరింత భయపడింది లలింద.

ఎవరీ దిగంబరుడు? మనుషుల్లో ఇంతటి మహాకాయులు వుండటం సంభవమేనా? ఇంతలో ఓ విషయం చటుక్కున జ్ఞప్తికొచ్చిందామెకు.

హిమాలయా పర్వత ప్రాంతాల్లో యతిగా పిలువబడే

మంచుమనిషి వునికిని గూర్చి వార్తాపత్రికల్లో వెలువడిన సంగతులను అప్పుడప్పుడూ చదివి వాటిని కేవలం పత్రికల వాళ్ళు ప్రచారంకోసం, పాఠకులకు సంభ్రమాశ్చర్యాలను కలిగించే వార్తలను అందించాలనే తాపత్రయం కొద్ది చేసే ట్రిక్కులుగా భావించేదామె.

ఇతడేనా ఆ మంచుమనిషి! ఏవో కొద్ది తేడాలు తప్ప వార్తాపత్రికల్లో మంచుమనిషిని గూర్చిన వర్ణన అచ్చంగా ఇదే!

అయితే వాటిల్లో ఎక్కడా మంచుమనిషిని గూర్చి శారీరక వర్ణన తప్ప స్వభావం గురించి ఏమీలేదు.

ఆకారాన్నిబట్టి చూడగా భయం గొలిపేట్టుగా వున్నాడు. కనురెప్పలు తాటిస్తూ భయం భయంగా చూడసాగింది లలింద మంచుమనిషి వంక.

మంచుమనిషి నెమ్మదిగా కదిలాడు. చిన్నగా అడుగులు వేస్తూ ఆమెను సమీపించసాగాడు. లలిందకు మృత్యువు ఆ రూపంలో తనను కబళించ వస్తున్నదేమో నన్నంత బెదురు కలిగింది. కనీసం లేచి వెనక్కు పరుగెత్తాలనే ధైర్యంకూడా లేదామెకు. తను ఎంతగానో శ్రమపడి పదడుగులు వేస్తే ఈ మనిషి సునాయసంగా అంతదూరాన్ని ఒక అడుగువేసి తనను సమీపించగలడు.

మంచుమనిషి ఆమెను సమీపిస్తున్నకొద్దీ గుండె ఆగి పోతుందేమోనన్నంత వేగంతో కొట్టుకోగా భయంతో కళ్ళు మూసుకుంది లలింద.

కొద్ది క్షణాల్లో మంచుమనిషి తనకు బాగా చేరువలో కొచ్చినట్టు గుర్తించింది. అతడి వుచ్ఛ్వాస నిశ్వాసలు తన చెవులకు స్పష్టంగా వినపడుతున్నాయి.

వూపిరి బిగబట్టింది లలింద. అయిపోయింది తన పని.

భగవంతుడా! ఏం చేయబోతున్నావు నన్ను. దిక్కూ మొక్కూ లేని ఈ కొండల్లో ఇటువంటి ఘోరమరణమా నాకు. అక్క స్వరూప జ్ఞాపకానికొచ్చిందామెకు. ఆమెను కూడా ఈ దుర్మార్గుడే చంపుకు తినివుంటాడు. అందుకే కనీసం శవమయినా లభ్యంకాకుండా పోయింది

ఇంతలో లలింద తన బుగ్గలను మంచుమనిషి వేళ్ళతో సుతారంగా తాకుతున్న స్పర్శకు లోనయ్యింది. వులిక్కి పడిందామె. ఇక ఏ క్షణంలోనైనా మంచుమనిషి తనమీద పడి దారుణంగా తనను చంపి పీక్కు తింటాడనే భావనతో బిర్రబిగుసుకొని క్షణాలు లెక్కపెడుతున్న లలింద అతడి ఈ చర్యను అర్థంచేసుకోలేక తికమక పడింది.

తెగించి ఓరగా కళ్ళు తెరిచి చూసింది. మంచుమనిషి మోకాళ్ళమీద కూర్చొని పరిశీలనగా తనవంకే చూస్తున్నాడు. అతడి వుత్సాహానికి అడ్డు నిలిచింది ఛాతీమీద ఉన్న పైట. చటుక్కున ఆ పైటను లాగి పక్కన పడేసాడు. ఉలిక్కిపడుతూ పైటను తీసి పైనవేసుకుంది లలింద.

మంచుమనిషి రెట్టించిన వేగంతో చిరాగ్గా తిరిగి పైటను లాగిపారేసాడు ఇంకోసారి అతడికి కోపం తెప్పించే ప్రయత్నం చేసే ధైర్యంలేక కిమ్మనకుండా వుండిపోయింది లలింద.

లలింద భయపడుతున్నట్టే మంచుమనిషి దృష్టి ఎత్తయిన ఆమె వక్షాన్ని అంటిపెట్టుకు వుండిపోయింది. అతడి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి తన ఛాతీవంక చూసుకున్నాడు. అది సమతలంగా వుండి ఇక్కడేం ఇలా వుంది?

చూపుడు వేలితో నెమ్మదిగా లోనికి నొక్కాడు. ఏదో

చెప్పలేని ఉత్సాహం ఆనందం కలిగిందతడికి. చిన్నగా అరిచాడు. ఈసారి వ్రేలితో రెండో ప్రక్క కూడా ఆలాగే చేసి ఆనందంగా చప్పట్లు చరిచాడు.

లలిందకు ఆ స్థితిలో ఏం చేసేందుకు పాలుపోవడం లేదు. మంచుమనిషి తనకు తెలియకుండానే వుద్రేకానికి లోనవుతున్నాడు. అతడి చేతులు క్రమంగా శక్తిని పుంజుకుంటూ శరీరం కంపనకు లోనవుతోంది. దిగంబరుడయిన మంచుమనిషిలో వుద్రేకం క్షణక్షణానికీ యే విధంగా హెచ్చుతున్నదీ స్పష్టంగానే గోచరిస్తున్నది.

ఏదో ఒకటి చేయకపోతే ఈ అడవిమనిషి చేతుల్లో తను ఈ క్షణంలో నలిగి నాశనం కావడం తథ్యం లలింద ఒక్కసారిగా వెనక్కి వాలిపోయింది. మంచుమనిషి ఆందోళనగా ముందుకు వంగి ఆమెను పొదివిపట్టి కుదిపాడు. పెద్దగా అరుస్తూ అర్థంకాని రీతిలో మాటాడసాగాడు.

ఆ తీరునుబట్టి తనను మాటాడమనీ ఏమయిందో చెప్పమనీ మంచుమనిషి అడుగుతున్నట్టుగా అర్థంచేసుకుంది లలింద. నిజానికి లలింద అప్పటికి బాగా ఆకలితో బాధపడుతోంది. అదే విషయాన్ని సంజ్ఞలద్వారా తెలియజేసింది లలింద.

ఆ సంజ్ఞలు అతడికి అర్థమయ్యాయి. వెంటనే లేచి గుహ ముఖద్వారంవేపు పరుగుతీసి క్షణంలో అదృశ్యమయ్యాడు.

తేలిగ్గా వూపిరి పీల్చుకుంది లలింద చటుక్కున లేచి కూర్చుంది. మంచుమనిషి తను భయపడినంత భయంకరుడేంకాదు. అంతవరకూ నయమే. లేచి గబగబ గుహ ద్వారాన్ని చేరింది. తక్షణంలో వీలయితే అక్కడ నుండి పారిపోవాలన్నదే ఆమె వుద్దేశం. గుహ ద్వారాన్ని చేరి

బయటకు తొంగిచూసిన లలింద ఆశ్చర్యంతో అలాగే నోరు వెళ్ళబెట్టేసింది.

గుహ నేలకు దాదాపు మూడువందల అడుగుల ఎత్తులో వుండి పూర్తిగా మంచుతో నిండివుంది. కొమ్ములు తిరిగిన పర్వతారోహకులు సయితం సరయిన పరికరాలు లేకుండా ఎక్కలేనంత నిట్టనిలువుగా వుంది. కింద ఎక్కడా మంచు మనిషి జాడలేదు.

ఇంతటి అసాధారణమయిన ఎత్తును ఏ ఆధారమూ లేకుండా ఈ మంచుమనిషి నిమిషాలమీద ఎలా యెక్కి దిగగలుగుతున్నాడు. ఈ పనిలో ఏమాత్రం కాలుజారినా అంత ఎత్తునుండి క్రిందపడి శరీరం నుగ్గు కావలసిందే. ఇటువంటి పరిస్థితుల్లో దాదాపు ఏభై అయిదు కేజీల బరువు గల తనను భుజాన వేసుకొని మంచుమనిషి ఈ చోటుకు రాగలిగాడంటే! ఒక్కసారిగా శరీరం కంపించిందామెకు.

నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ పోయి లతల పాన్పుమీద కూలబడిపోయింది లలింద. ఏది దారి? ఈ గుహనుండి బయటపడడం అంత తేలిగ్గా జరిగే పనికాదనిపించి దిగులుపడిందామె మనసు.

ఇంతలో ఆయాసంతో వగరుస్తూ గుహలోకి వచ్చి పడ్డాడు మంచుమనిషి. అతడి చేతిలో సుమారు అడుగు పొడవుగల రెండు పెద్ద చేపలూ, లలింద ఏనాడూ చూసి వుండని కొన్ని పండ్లూ వున్నాయి.

వాటిని లలింద ముందుంచి తినమంటూ సైగచేశాడు మంచుమనిషి. చేపలు ఇంకా బ్రతికేవుండి త్రుళ్ళిత్రుళ్ళి పడుతున్నాయి. వాటిని జాలిగా చూసింది లలింద.

లలింద చూపును మరోలా భావించి కోపంతో రెండు చేపల్నీ పట్టి నేలకేసి బాదాడు మంచుమనిషి. మరింక

కదలలేదవి. ఈసారి నవ్వుతూ లలిందకేసి చూసి ఇక భయంలేదు తినమని సైగచేశాడు.

లలింద తనముందున్న పండ్లలో కొన్నింటిని యేరి తినసాగింది. చాలా రుచిగా వుండి బాగున్నాయవి. కడుపు నిండా తిన్నది. లలింద తింటున్నంతసేపూ అదో వింతగా చూసాడు మంచుమనిషి.

మంచు మనిషి అలా దిగంబరంగా ఎదుట నిల్చోవడం యిబ్బందిగా వుందామెకు. ధైర్యంచేసి కూర్చొమన్నట్టుగా సైగచేసింది లలింద. బుద్ధిమంతుడిలా బడిపిల్లాడి మాదిరి ఆరడుగుల వెడల్పాటి మఠం వేసుక్కూర్చున్నాడు మంచు మనిషి.

లలింద తినగా మిగిలినవాటి వంక చూస్తూ ఆశ్చర్యంగా మరి వీటి మాటేమిటి అన్నట్టుగా చూసాడు మంచుమనిషి. నేనింక తినలేనన్నది లలింద. ఈ మాత్రం దానికేనా అంత ఆర్భాటం చేశావన్నట్టు పగలబడి నవ్వాడు మంచు మనిషి. ఆ నవ్వుకు గుహ ప్రతిధ్వనించి కంపించింది.

మంచు మనిషి రెండు చేపల్నీ ఒకేసారి కరకర నమిలేసాడు. పండ్లను తిరిగి ఆకలివేసినపుడు తినమని సైగచేసి గుహ బయటకు వెళ్ళిపోయాడు. బహుశా మరిన్ని చేపలు తినిరావడానికేమో!

3

రెండు రోజులు గడిచాయి.

మంచు మనిషి పైకి వెళ్ళి తిరిగి వచ్చినప్పుడల్లా లలిందకు తినేందుకు ఏదో ఒకటి తెచ్చి యిస్తూనే వున్నాడు. క్రమేపీ ఆమెకు అతడివద్ద భయం తగ్గుముఖం పట్ట సాగింది.

అలాగని ఆమెకు అక్కడ పూర్తి స్వేచ్ఛ వున్నట్టు భావించుకోకూడదు. మృగంలాంటి మంచు మనిషి ఏ క్షణంలో ఎలా వుంటాడోననే బెంగ మాత్రం లలింద మనసులో ఏదో మూల వుంది.

మంచు మనిషి ఒక పర్యాయం గుహకు తిరిగి వచ్చే సరికి తన పాన్పులో వున్న పొడవాటి లతల ఆకులను వరుసగా పేర్చి అల్లిన దానిని అతడి నడుముకు కట్టుకోమని ఇచ్చింది లలింద. మంచు మనిషికి అదేమిటో అర్థం కాలేదు. చేత్తో పట్టుకొని అటూ యిటూ తిప్పి పెదవి విరుస్తూ కింద పడేశాడు.

లలింద ఇక తప్పదనుకొని ధైర్యంచేసి ఆ ఆకుల పట్టీని తనే అతడి నడుముకు కట్టింది. మంచుమనిషి చిరాగ్గా దానిని తెంపబోతూ లలింద మొహంకేసి చూసి ఏమను కున్నాడో ఏమో అలాగే వుంచుకున్నాడు. అయినా అది అతడి కెంతో ఇబ్బంది కలిగిస్తున్నట్టు తరచూ దానిని సర్దుకో సాగాడు మంచుమనిషి. క్రమేపీ అందుకు అలవాటు పడ్డాడు.

మంచుమనిషి ఆ రోజు వుదయాన్నే యెక్కడికో వెళ్ళేడు.

లలింద వెంటనే తన లతల పాన్పుకింద దాచివుంచిన పొడవాటి తీగతాడును తీసింది. అ తాడును ఆమె తన పాన్పులో వున్న పొడవాటి లతలను ఒకదానికొకటి ముడి వేసి తయారుచేసింది.

మంచుమనిషి నడుముకు ఆకుల పట్టీ తయారుచేస్తున్న ప్పుడే ఆమెకు ఇలాంటి తాడును తయారుచేసి గుహనుండి బయటపడాలనే ఆలోచన వచ్చి అందుకు వుపక్రమించింది. అది కాస్తా నేటికి తయారై లలింద మంచుమనిషి బారి

నుండి తప్పించుకోవడానికి వుపయోగపడబోతున్నది.

తాడును గుహలో వున్న ఒక బరువయిన రాతికి కట్టి కిందకు జారవిడిచింది. నేలను తాకింది తాడు. గట్టిగా లాగి చూసి తృప్తిగా నిట్టూర్చింది.

గుహంతా ఒకమారు కలయచూసింది. ఆ క్షణంవరకూ అక్కడ నుండి తప్పించుకుపోవాలని ఆరాటపడుతూ; అంతా సిద్ధమయ్యాక మనసులో ఏదో మూల అలజడి చెలరేగి గుండె బరువెక్కినట్టనిపించింది.

తాడును పట్టి చక చకా కిందకు దిగసాగింది లలింద. మంచుమనిషి ఏ క్షణంలో తిరిగి వస్తాడోనని ఒకవంక గుండెలు అదురుతూనే వున్నాయ్.

చుట్టూ మంచుతో నిండిన బ్రహ్మాండమయిన పర్వత శిఖరాలు. కనుచూపుమేలో అంతా మంచుమయం. దారీ తెన్నూ లేని ఈ ప్రయాణంలో ఎటు తిరిగి ఎక్కడ చేరుతుందో.

భగవంతుడిమీద భారంవేసి ధైర్యంగా ముందుకు సాగుతోంది లలింద. అపుడపుడూ వెనక్కి తిరిగి చూస్తోంది మంచుమనిషి ఎక్కడ తన వెన్నంటి వస్తున్నాడో అనే భయంతో.

గుహను వదలి సుమారు రెండు గంటలయి వుంటుంది. ఈ సమయంలో మిట్టపల్లాలతో నిండిన ఆ మంచుదిబ్బల్లో రెండుమూడు మైళ్ళు నడచి వుండొచ్చు. అయినా తన ప్రయాణం ఒక కొలిక్కి వచ్చినట్టులేదు. నడుస్తున్నకొద్దీ దారి మరింత కష్టతరమౌతున్నది.

ఇంతలో తనకు ఓ వంద అడుగుల దూరంలో తెల్లనిదేదో కదులుతూ తనవేపే రావడం అగుపించి చటుక్కున ఆగిపోయింది లలింద. పరీక్షగా చూసింది దానివంక.

లలింద గుండెలు గుభేలుమన్నాయి. తెల్ల ఎలుగు! దీక్షగా తననే గమనిస్తూ నెమ్మదిగా వస్తున్నది.

ఎక్కడో ధృవప్రాంతాల్లో కనిపించే ఈ మంచుప్రాణి ఇక్కడికెలా వచ్చింది. మతిపోయిందామెకు. ఎలా వస్తే ఏం ఇప్పుడిది తనపాలిట మృత్యువు. పూర్తిగా మాంసాహారి. ఆకారంలో మామూలు ఎలుగుకు రెట్టింపు వుంది. బలంలోనూ అంతే!

లలిందకు ముచ్చెమటలు పోసాయి. కాళ్ళు గడగడలాడుతూ కదలనంటున్నాయి. తెల్ల ఎలుగు బాగా సమీపానికొచ్చేసింది. కోరలు బయల్పడేలా గుర్రుపెడుతూ బాకుల్లా వున్న గోళ్ళను కలిగిన ముంజేతిని లలింద గుండెలకేసి విసిరింది జోరుగా.

అంతే! తన పని ఆఖరు! భయంతో కెవ్వున అరచింది లలింద.

తెల్ల ఎలుగు హస్తం ఆమె గుండెలను తాకే క్షణంలోనే దానిని ఒడిసి పట్టి బలంగా వెనక్కు తోసింది, లలింద వెనకనుండి వచ్చిన మరో వుక్కు హస్తం.

ఆ విసురుకు అంతటి భారీ ఎలుగూ రెండడుగులు వెనక్కి తూలింది. తెల్లని ఆ వుక్కు హస్తం లలిందకు సుపరిచితమే. ఆమె మనసు ఆనందంతో నిండిపోయింది ఆ విపత్కర పరిస్థితిలో.

లలిందను తన వెనక్కి నెడుతూ తెల్ల ఎలుగు ముందు ఛాతీ విరుచుకు నిలబడ్డాడు మంచుమనిషి. తెల్ల ఎలుగును సవాలుచేస్తూ పిడికిళ్ళు బిగించి అరిచాడు గట్టిగా.

తన ఆహారాన్ని తనకు దక్కకుండా చేసిన మంచు మనిషి మీద రెట్టించిన కోపంతో విరుచుకుపడింది తెల్ల ఎలుగు. ఆ రెండు మంచు ప్రాణుల పోరాటాన్నీ గుండెలు

అరచేతుల్లో పెట్టుకొని చూస్తోంది లలింద.

చూస్తుండగానే పోరాటం తీవ్రస్థాయిని చేరింది. మంచు మనిషిని ఏదోలా తన పదునయిన గోళ్ళతో గాయపరచి చీల్చి చెండాడాలని శతవిధాలా ప్రయత్నిస్తోంది తెల్లఎలుగు. శారీరకంగా తెల్ల ఎలుగుకు సమానమయిన శక్తిని కలిగిన మంచుమనిషి; మనిషికి సహజంగా వుండే తెలివితేటలతో ప్రతి పర్యాయమూ తెల్ల ఎలుగును దెబ్బతీస్తూ ఒకమెట్టు పైనే వున్నాడు.

క్రమేపీ తెల్ల ఎలుగు నీరసించి వెనుకంజ వేయ సాగింది. సమయం చూసి దాని మెడా నడుమూ రెండు చేతులతోనూ బలంగా పట్టి అంతటి మహాకాయాన్నీ ఒక్క వుదుటున గాలిలోకి లేపి అదే వేగంతో నేలకేసి కొట్టాడు మంచుమనిషి.

ఆ దెబ్బకు శరీరంలో వున్న ఎముకలన్నీ కదలిపోగా బాధగా అరుస్తూ పడుతూ లేస్తూ పలాయనం చిత్తగించింది తెల్ల ఎలుగు. మంచుమనిషి దానిని ఓ ఫర్లాంగు దూరం వెంటతరిమి తిరిగి వచ్చాడు.

ఆ వూపున కోపంలో మంచుమనిషి తననేం చేస్తాదోనని భయపడింది లలింద. మంచుమనిషి మొహంలోమాత్రం కోపఛాయలేమీ లేకపోగా నవ్వుతూ "చూశావా! నానుండి తప్పించుకోవడం నీకే ప్రమాదం" అన్నట్టు చూసాడు.

మంచుమనిషి లలిందను చేతికర్రకన్నా సునాయాసంగా భుజాన వేసుకొచ్చి గుహలో దించాడు. తాను అష్టకష్టాలు పడి తాడు సహాయంతో దిగిన ఎత్తును మంచుమనిషి తనను మోస్తూ పది క్షణాల్లోనే యెక్కిరావడం ఆమె జీవితంలో కెల్లా మరచిపోలేని సంఘటన.

4

ఆ రోజు లగాయితూ లలింద విషయంలో జాగ్రత్తగా వుంటున్నాడు మంచుమనిషి.

లతలపాన్పులో వున్న తీగెలను అన్నింటినీ ఏరి పారేసాడు. మొదటిలా కాకుండా ఇప్పుడు ఎక్కడికి వెళ్ళినా క్షణాలమీద గుహకు తిరిగి వచ్చేస్తున్నాడు. లలింద మంచుమనిషికి ఒక అపురూపమయిన వస్తువులా వుంది.

మంచుమనిషి గుహలోనే ఒకసారి లలిందకు అక్క స్వరూప జ్ఞాపకానికొచ్చింది. ఆ సంగతి ఏదయినా మంచు మనిషికి తెలుసునేమో అనే భావనతో తనవద్ద వున్న స్వరూప ఫోటోను అతడికి చూపించింది లలింద.

ఫోటో చూడగానే మంచుమనిషి కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి.

ఫోటోలో వున్న మనిషిని నువ్వెన్నడయినా చూశావా అని సైగలతో ప్రశ్నించింది లలింద. చూశానన్నట్టుగా తలాడిస్తూ ఏమేమో సైగలు చేస్తూ లలిందను తనతోబాటు రమ్మన్నాడు మంచుమనిషి. లలింద అప్పటికప్పుడు అతని వెంట బయలుదేరింది.

మంచు పర్వతాల మధ్య వుత్తరదిశగా చాలా దూరం ప్రయాణం చేసారిద్దరూ. ఒకోచోట సామాన్యులెవరూ నడవలేని దుర్గమ ప్రదేశాలలో లలిందను భుజాని కెత్తుకు మరీ ప్రయాణం చేసాడు మంచుమనిషి. అటువంటి సమయంలో ఏమాత్రం కాలు జారినా చీకటి లోయల్లా వున్న ఆ అగాధాలలో నామరూపాలుండవు.

అలా ముందుకు సాగుతూ ఆకాశాన్ని తాకుతున్నట్టుగా వున్న పర్వత పంక్తుల మధ్య ఒకచోట మంచులో మోకాళ్ళ మీద కూర్చొని చేతులతో గబగబా వెడల్పాటి లోతయిన

గోతిని చేసాడు మంచుమనిషి. ఆ గోతిలో నుండి బయట పడిన స్వరూప శవాన్ని చూసి బావురుమంది లలింద.

మంచులో కప్పబడి వున్న కారణంగా శరీరం ఏ మాత్రం పాడవలేదు. ఎత్తయిన ఆ పర్వతాల మధ్యనుండి వస్తూ జారిపడి ప్రాణాలు పోయిన స్థితిలో వున్న ఆమె శవాన్ని ఏ జంతువులూ పీక్కు తినకుండా తానే ఇక్కడ పాతిపెట్టానని లలిందకు సంజ్ఞలద్వారా తెలియజేసాడు మంచుమనిషి.

ఆపుకోలేని దుఃఖంతో విలపిస్తున్న లలిందను అచేతనుడయి చూస్తూ వుండిపోయాడు మంచుమనిషి. ఆమె దుఃఖం అతడికి భరించలేనట్టుగా వుంది. ఏడుపు అతడు ఏనాడూ ఎరగనిది.

ఆ శవాన్ని అలా చూస్తున్నకొద్దీ ఆమెలో దుఃఖం క్షణక్షణానికీ హెచ్చుతున్నదనే విషయాన్ని గమనించి మంచుమనిషి లలిందను ప్రక్కకు లాగి స్వరూప శవాన్ని యథాప్రకారం మంచుతో కప్పేసాడు. లలింద చేయి పట్టుకుని తిరిగి వెనక్కి ప్రయాణమయ్యాడు. కొంతసేపటికి దుఃఖంనుండి తేరుకొని లలింద తిరిగి మామూలు మనిషయ్యింది.

మంచుమనిషి వెంట నడుస్తున్న లలింద బుర్రలో ఆలోచనలు బయలుదేరాయి. ఏదోలా తను వచ్చిన పని నెరవేరింది. అక్క శవాన్ని స్వయంగా చూడగలిగింది. చనిపోయాక శవాన్ని యెక్కడ పాతిపెట్టినా ఒకటే. తన మనసిప్పుడు కుదుటపడింది. ఇందుకు తాను మంచుమనిషికి ఋణపడి వుంది.

అయినా ఇక తానీ ప్రదేశంలో వుండలేదు. ఏదోలా ఈ మంచుమనిషి చెర తాను వదిలించుకోవాలి. అందుకు

సరయిన సమయమిదే. తప్పితే మరలా ఇటువంటి అవ కాశం ఎన్నటికో.

లలింద ఆ రకంగా ఆలోచిస్తూ మంచుమనిషి వెంట నడుస్తూ వుండగా ఒకచోట ఆమెకు తప్పించుకునే అవ కాశం కలిపివచ్చింది.

లోతట్టుగా వున్న గోయిలాంటి ప్రదేశంలో ముందుగా దిగుతున్నాడు మంచుమనిషి. ఆ ప్రదేశంలో ఏమాత్రం కాలుజారినా సుమారు ఓ ఇరవై అడుగుల పల్లంలో పడి పోయే అవకాశం వుంది. ఆ కారణంగా జాగ్రత్తగా అడు గేస్తూ లలిందను నెమ్మదిగా దిగమన్నట్టు తల వెనక్కి తిప్పకుండానే చేతితో పైనున్న లలిందకు సైగచేస్తున్నాడు మంచుమనిషి.

అదే అదనుగా అటూ ఇటూ చూసిన లలింద దృష్టిలో పడింది ఓ పెద్దరాయి. ఆ రాతిని ఎత్తి మంచుమనిషి తల మీద వేపింది లలింద. మంచుమనిషి ఆ దెబ్బకు కిక్కురు మనకుండా పల్లంలోకి జారిపోయాడు.

కింద పడివున్న మంచుమనిషి వంక ఆందోళనగా చూపింది లలింద. అతణ్ణి మూర్ఛపోగొట్టి పారిపోవా లన్నదే ఆమె ఉద్దేశ్యం తప్ప అతడికి ప్రాణాపాయం కలి గించే వుద్దేశ్యం లేదామెకు. దెబ్బ కాస్తంత గట్టిగానే తగి లినా ప్రాణాపాయం లేదని గ్రహించి తాత్సారం చేయ కుండా అక్కడి నుండి బయలేరింది.

తొందరగా అడుగులు వేస్తోంది. అక్క శవం కనిపిం చిన దిక్కుగా వెళితే తను భారతదేశ సరిహద్దుల్లోకి ప్రవే శించే అవకాశం వుంటుందని ఆమె నమ్మకం.

దారి మిట్టపల్లాలతో నిండివుంది. ప్రమాదకరమయిన మార్గాలను సాధ్యమయినంతగా తప్పుకొని ముందుకు వెళ

తోంది. ఆ కారణంగా ఒకోచోటు చాలా దూరాన్ని నడవ వలసి వస్తోంది. అయినా తప్పదు. కాలుజారి అగాధాల్లో పడి చచ్చేకన్నా ఆలస్యమయినా ఇదే వుత్తమం.

అలా రెండు గంటలపాటు నడిచిందో ఏమో వున్నట్టుండి సన్నని చలిగాలి ప్రారంభమయింది. అది క్రమేపీ ఉధృతమయి శరీరాన్ని దూసుకుపోయేట్టుగా వున్న మంచు గాలి విజృంభించింది. ఎక్కడా తల దాచుకునే చోటుకూడా లేదు. ఒకవేళ వున్నా ఆ చోటును చేరే మార్గాలు కనిపించడం లేదామెకు.

మంచుగాలులు ప్రళయభీకరంగా వీస్తూ లలింద ఒక అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి దాపురించింది. గాలి తాకిడికి మంచు దూదిపింజల్లా ఎగురుతూ ముందు ఏమున్నదో కనిపించడంలేదు సరిగ్గా. చుట్టూవున్న పర్వతాల పైనుండి బ్రహ్మాండమైన శబ్దాలతో మంచు చరియలు విరిగిపడుతూ వాతావరణం చాలా భయానకంగా వుంది.

గుండెలు అరచేతుల్లో పెట్టుకొని పట్టుదలతో ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తోంది లలింద ఈ గండం గడిచి తను బ్రతకగలననే నమ్మకం మాత్రం ఆమెలో అడుగంటింది.

ఒకచోటు మంచుపర్వతాన్ని ఆనుకొని వుంది సన్నని ఇరుకుదారి. మనిషి మొత్తం పర్వతాన్ని బల్లిలా అంటిపెట్టుకొని జాగ్రత్తగా అడుగులు వేస్తోంది లలింద. ఏ మాత్రం అజాగ్రత్తగా కాలు వేసినా సుమారు నాలుగైదు వందల అడుగుల లోతున్న అఖాతంలో పడిపోవడం ఖాయం.

భయపడుతున్నట్టుగానే లలింద వేసిన అడుగు ఒక మంచుగడ్డమీద పడి అది కాస్తా పగిలిపోగా పట్టుతప్పి కిందకు జారింది కెవ్వున అరుస్తూ.

కిందున్న అఖాతంలో ప్రవహిస్తున్న నీటిపై మంచుగడ్డ కట్టివుంది. లలింద అంత ఎత్తునుండీ దానిపై పడగానే అది విచ్ఛిన్నమయింది. లలింద నీటిలోనికి జారిపోగానే మంచుగడ్డలు యథాప్రకారం మూసుకుపోయే ప్రయత్నంలో వుండగా హఠాత్తుగా వాటిమీద మరో ప్రాణి వచ్చి పడి చెల్లాచెదురు చేసింది మరోసారి.

నీటి అడుక్కి జారిపోతున్న లలింద తననేదో ఒడిసి పట్టడం గుర్తించింది. అదేదో జలచరమనే భీతితో పూర్తిగా స్పృహను కోల్పోయింది.

5

నెమ్మదిగా కళ్ళు తెరిచింది లలింద.

తానింకా చావకుండా బ్రతికి వున్నందుకు ఆశ్చర్యపడింది. శరీరాన్ని గడగడలాడించే చలి ఒళ్ళంతా పీక్కుపోతున్నట్టుగా వుంది కుడికాలు కదల్చలేనంతగా తొడభాగంలో బాధ. మంచుముద్దలా వున్న శరీరానికి వూరట కలిగిస్తూ వెచ్చని స్పర్శ ఒంటిని తాకుతోంది అదేపనిగా.

ప్రక్కకు దృష్టిని సారించింది. నీళ్ళునిండిన కళ్ళకు దృశ్యం లీలగా అగపడుతోంది.

ఆ చోటు ఆమెకు పరిచయమయినదే. లలింద చేరువలో కర్రలతో వేసిన మంటలో చేతులు కాస్తూ వాటిని ఆమె దేహానికి తాకిస్తున్నాడు మంచుమనిషి. గుహలో గాలికి ఆరుతూ కనిపించిన తన చీరను గమనించి గతుక్కుమంటూ తనను తాను చూసుకుంది లలింద.

ఎండుటాకుల మధ్య బోసిగా వుంది తను. సిగ్గుతో చటుక్కున లేవబోయి కుడితొడ కరుక్కుమనగా కెవ్వుమంది.

మంచుమనిషి లలిందను లేవద్దన్నట్టుగా అడ్డంగా తన

డించాడు. మంచుమనిషి తిరిగి యథాప్రకారం లలింద శరీ రాన్ని మంటతో కాస్తూ తన పనిలో మునిగిపోయాడు. ఆ సమయంలో ఆమెకు వెచ్చదనం కరువయితే చలికి కొయ్య బారి మరణించడం తథ్యమని అతనికి తెలుసు.

లలింద చలిబాధ నుండి బాగా తేరుకున్నాక ఆరివున్న చీరా బ్లౌజూ తెచ్చియిచ్చాడు మంచుమనిషి. కానీ లేచి చీరను కట్టుకునే స్థితిలో లేదామె మంచుమనిషే చివరకు ఏదోలా చీరను ఆమె ఒంటికి చుట్టబెట్టాడు. బ్లౌజును మాత్రం అలా పడుకునివుంటూనే నెమ్మదిగా తొడుక్కోగలిగింది లలింద.

లలింద కుడితొడలో సుమారు ఆరంగుళాల పొడవున అంగుళం లోతులో గాయమయివుంది. ఆ గాయం ఆమె అఖాతంలోకి జారి పడినప్పుడు ఏర్పడింది.

మంచుమనిషి ఏవో ఆకులూ మూలికలూ తెచ్చి వాటిని ముద్దగాచేసి. గాయాన్ని శుభ్రంగా తుడిచాడు. ఆ ముద్దను అక్కడ వుంచి జాగ్రత్తగా కట్టుకట్టాడు. బాధ తగ్గి చల్లగా వున్నట్టనిపించింది లలిందకు.

మంచుమనిషి లలింద తిండికోసమని పళ్ళూ కాయలూ తేవడానికి తప్పితే అసలామెను ఒక క్షణం కూడా విడిచి వుండడంలేదు రాత్రీ పగలూ నిద్రపోకుండా లలింద దగ్గరే వుండిపోతున్నాడు. తిండి కూడా సరిగా తినడంలేదని అతడి మొహమే చెబుతోంది.

లలిందకు మంచుమనిషిని చూస్తుంటే బాధగా వుంది. తన మీద ఇంతటి ప్రేమాభిమానాలు వున్న మనిషినా తాను చావుదెబ్బతీసి పారిపోవాలనుకున్నది. తన ప్రాణాలను సయితం తెగించి తనకు ప్రాణదానం చేసిన ఈ మనిషి నుండేనా తాను అనుక్షణం తప్పించుకుపోవాలని ఆరాట పడింది.

ఎందుకోసమని? ఆ నాగరిక ప్రపంచంలో తనకు ఎవరున్నారని? ఉన్న ఒక్కగానొక్క సోదరి ఈ లోకాన్ని వీడిపోయింది. రాబందుల్లాంటి బంధువుల మధ్య: తను ఏ క్షణంలో పోయి తన ఆస్తి మొత్తం తమకు చెందుతుందోనని చూసే ఆ రాక్షసిమూకల మధ్య తను ఎన్నాళ్ళు జీవించి వుండగలదు.

మంచుమనిషితో పోల్చిచూస్తే వాళ్ళకు వున్న మానవత్వం ఏపాటిదో అర్థమవుతూనే వుంది. లలింద ఆలోచనలు అనేకంగా పరిపరి విధాలుగా పోతున్నాయి.

మంచుమనిషి ప్రతిరోజూ లలింద కాలికి మూలికలు ముద్దచేసి కట్టుకట్టడం ఆమెకు ఆహారాన్ని తెచ్చియివ్వడం చేస్తున్నాడు.

వారం రోజుల్లో లలింద గాయం పూర్తిగా నయమయి బాగా తిరగగలుగుతోంది. ఇప్పుడామెకు మంచుమనిషంటే ఏమాత్రం భయంలేదు. నిజానికి ఆమె ఇప్పుడు అతని సమక్షంలోనే ధైర్యంగా వుండగలుగుతోంది.

ఇలా లలింద బాగా తేరుకొన్నాక ఒక రోజు సూర్యోదయం అవుతూనే మంచుమనిషి ఆమెను సమీపించి ప్రయాణానికి సిద్ధం కమ్మన్నట్టుగా సైగ చేసాడు.

లలింద తెల్లబోతూ "ఏం" అన్నది సంజ్ఞ ద్వారానే.

"నీకిక్కడ బాగున్నట్టు లేదు. మాటిమాటికీ ఒంటరిగా తప్పించుకుపోవడం నీకే ప్రమాదం. అందుకని నిన్ను నేను ఈ ప్రాంతాన్ని దాటించి వస్తాను" అన్నాడు మంచుమనిషి సైగలద్వారా.

లలింద కృతజ్ఞతగా చూసింది అతడిని.

మంచుమనిషి ఆమెను భుజాన కెత్తుకొని భారంగా అడుగులు వేస్తూ హిమాలయాలను దిగసాగాడు. □

అతను పరుగెడుతున్నాడు. పిక్కబలంకొద్దీ పరుగెడుతున్నాడు. అర్ధరాత్రి వేళలో అతను నిర్మానుష్యంగా వున్న యిరుకు వీధుల్లో పరుగెడుతున్నాడు. అతని బూట్లు మెత్తగా చేస్తున్న చప్పుడు మధ్య వికృతంగా పెద్దపెద్ద శబ్దంచేస్తూ నాలుగు జతల బూట్లు నేలని అదరగొడ్తున్నాయి.

అతనొక్కడు—వాళ్ళు నలుగురు!

పరుగుపందెం ఇంకా కొనసాగి వుండేది! మలుపు తిరిగితే అతను క్షేమంగా తప్పించుకు పోగలిగివుండేవాడు. కాని, సరిగ్గా అప్పుడే వెనక పరుగెత్తుకొస్తున్న నలుగురిలోనూ ఓ వ్యక్తి ప్రయోగించిన రివాల్వర్‌నుంచి బుల్లెట్ సర్రున గాలికి దూసుకుంటూ వచ్చి అతని కాల్లో గుచ్చుకుంది. అమాంతం ముందుకుతూలి పడ్డాడతను.

రెండోసారి గర్జించింది సైలెన్సర్ అమర్చిన రివాల్వర్. ఈసారి అతని వెన్నులోంచి దూసుకుపోయింది బుల్లెట్. అతను నిస్సహాయంగా కూలబడిపోయాడు!

నలుగురు అతన్ని చుట్టుముట్టారు. అతను కొన ప్రాణంతో వున్నాడని అర్థమయిపోయింది.

రివాల్వర్ చేత ధరించిన వ్యక్తి కర్కశంగా అడిగాడు "ఏయ్ ప్రొఫెసర్, ఏదా కాగితం? మా కళ్ళుగప్పి తీసుకుపోవాలనే అనుకున్నావా? ఇలా ఇచ్చెయ్ దాన్ని!"

ప్రొఫెసర్ బలవంతాన కళ్ళెత్తి అతనివంక చూశాడు. ఆ తర్వాత శుష్కహాసం చేశాడు. అంతే, అతని తల నేలమీదికి వాలిపోయింది.

"ముందు వెనక చూడకుండా షూట్ చేశావు. చూడు, రహస్యం తెలియకముందే అతను చనిపోయాడు. ఇప్పుడెలా?" అన్నాడు నలుగురిలోను ఒకడు—రివాల్వర్ చేత ధరించిన వ్యక్తితో.

అందరు ప్రొఫెసర్ దుస్తులు చకచక వెతికారు. కాని, వాళ్ళు ఆశించిన కాగితంగాని, మరేవిధమైన సమాచారంగాని అతని దుస్తుల్లో దొరకలేదు.

"దారిలో ఎక్కడైనా పారేశాడేమో?" అన్నాడు ఒకడు.

"నో, నో! ప్రొఫెసర్ దాన్ని కోటుజేబులో దాయటం

నేను స్వయంగా చూశాను" అన్నాడు రెండోవాడు.

"ప్రొఫెసర్ ని బయల్దేరినప్పట్నుంచి వెయ్యికళ్ళతో వాచ్ చేస్తున్నాం. దాన్ని మధ్యలో ఎవరికీ యివ్వలేదు. ఏంచేశాడో మరి?"

"చిత్రంగా వుందే! ఓసారి వెనక్కి వెళ్దాం. పొరపాట్న రోడ్ మీద ఎక్కడైనా వదిలేశాడేమో ...?"

ప్రొఫెసర్ శవాన్నలాగే నడిరోడ్ మీద వదిలి నలుగురు వచ్చిన దారినే వెనక్కి వెళ్ళారు, జాగ్రత్తగా రోడ్ ని పరిశీలిస్తూ.

ఎక్కడా ఎలాంటి కాగితమూ కనిపించలేదు.

"ఇప్పుడెలా?" అన్నాడు రివాల్వర్ చేతనున్నవాడు.

"ప్రొఫెసర్ అసిస్టెంటున్నాడు కదూ, వాడ్ని పట్టుకుంటే-అంతే వాడే కక్కేస్తాడు!" అన్నాడు మొదటివాడు'

నలుగురు పక్కగా ఆపిన జీప్ ఎక్కి వేగంగా ఎక్కడికో దూసుకుపోయారు.

2

డిటెక్టివ్ కిరణ్ ఆఫీస్ రూంలో కూచుని ఆనాటి టపాల్ని చూసుకుంటున్నాడు. ఫాన్స్ మెయిల్ చూసి పక్కన పెట్టాడు.

"సార్, పోస్ట్!" గుమ్మంముందు పోస్ట్‌మన్ కంఠం, ఆ వెనక కాలింగ్ బజర్ వినిపించింది.

లేచి తలుపు తెరిచాడు కిరణ్.

రిజిష్టర్ లెటర్స్ పంచే పోస్ట్‌మన్!

"మీకో 'డ్యూ' లెటర్ సర్!" అన్నాడు వినయంగా.

డ్యూ చెల్లించి ఉత్తరం తీసుకున్నాడు కిరణ్.

మామూలు అరఠావుసైజు కాగితాన్ని నాలుగు మడతలుచేసి, ఓ మడతలోకి మరో మడతను సున్నితంగా

జొనిపిన ఉత్తరం అది.

మడత పైభాగంలో కేవలం డిటెక్టివ్ కిరణ్ అని మాత్రం రాసివున్నది. పోస్టేజి అసలు అతికించబడలేదు!

కాగితం మడతలు విప్పి టీపాయ్‌మీద పరిచి చూశాడు. ఈక్వేషన్స్, ఎబ్రీవియేషన్స్ కలగాపులగంగా వున్నాయి. సైన్సు తెలిసిన కిరణ్‌కి ఆ సంకేతాలకి అర్థం వెంటనే తెలిసిపోయింది.

అది దేని గురించో రాయబడిన ఫార్ములా! యెవరో శాస్త్రజ్ఞుడు అహోరాత్రాలు నిద్రాహారాలు కూడా పాటించక శ్రమించి కనుగొన్న పరిశోధన ఫలితమది!

ఇది తన దగ్గరకెలా చేరింది?

గుమ్మం దగ్గర అలికిడయితే చటుక్కున తలెత్తి చూశాడు డిటెక్టివ్ కిరణ్!

నలుగురు వ్యక్తులు రివాల్వర్స్ తన వంకనే గురిచేసి నించున్నారు! నలుగురు పచ్చినెత్తురు తాగే కసాయివాళ్ళ లాగా వున్నారు!

"మిష్టర్ కిరణ్! ఆ కాగితం యిలా యివ్వు! అది పోస్టయి వుండొచ్చునన్న ఆలోచన ముందే వచ్చివుంటే రాత్రే పోస్టుబాక్స్‌ని పగలకొట్టి దాన్ని చేజిక్కించుకుని వుండేవాళ్ళం!" అన్నాడు ఒకడు.

"ఎవరు మీరు? ఏమిటీ దౌర్జన్యం?" అన్నాడు కిరణ్. అతని చేతులు టీపాయ్ కిందికి వెళ్ళటం గమనించిన రెండో వ్యక్తి, "స్టాప్ దేర్! హేండ్సప్!" అంటూ అరిచాడు.

రివాల్వర్ తీయబోయిన కిరణ్ చేతులు ఆగిపోయి మెల్లిగా గాల్లోకి లేచాయి. ఒక్కో అడుగు ముందుకివేస్తూ రాబోతున్నారు నలుగురు దుండగులు.

"రాంసింగ్, మారో!" అన్నాడు కిరణ్ దుండగుల మీదినుంచి గుమ్మంలోకి చూస్తూ.

నలుగురు తుళ్ళిపడి వెనక్కి చూశారు.

ఆ ఒక్క క్షణం చాలు కిరణ్‌కి. చటుక్కున టీపాయ్ కింది సొరుగునించి రివాల్వర్ పైకి తియ్యటం, దుండగుల కాళ్ళకు గురిచూసి కాల్చటం క్షణాలమీద జరిగిపోయింది.

నలుగురిలోను ముగ్గురు గాయపడ్డారు. ఒక్కగెంతున కిందికి దూకేశారు. కిరణ్ మరో రెండుసార్లు కాల్చాడు. వాళ్ళు కాంపౌండ్ వాల్ దూకేశారు. మరుక్షణం జీప్ స్టార్టయిన శబ్దం వినిపించింది.

కిరణ్ జీప్ నంబర్ చూడటానికి ప్రయత్నించాడుగాని' అప్పటికే అది దూరమైపోయింది.

గేటుపక్కగా పడివున్న గూర్ఖా రాంసింగ్‌ను సమీపించి, మువి కాళ్ళమీద వంగి చూశాడు కిరణ్.

శ్వాస ఆడుతోంది. కాకపోతే మాడుమీద రివాల్వర్ మడమతో చేసిన గాయంనుంచి సన్నగా రక్తం స్రవిస్తోంది. చేతులమీద అతన్నెత్తి డ్రాయింగ్‌రూంకి మోసుకెళ్ళి ప్రథమ చికిత్స పరికరాల్ని తెచ్చి, చకచక అతనికి డ్రెస్సింగ్ చేయటంలో మునిగిపోయాడు కిరణ్.

పదినిమిషాల తర్వాత ఫార్ములాను మైక్రోఫిల్ములో ఫోటోగ్రాఫ్ చేశాడు కిరణ్ తర్వాత ఫార్ములాను సన్నటి మడతపెట్టి పైన నల్లటి రేపర్‌తో చుట్టాడు.

షూ విప్పాడు. సోల్ దగ్గర ఒత్తాడు. సోల్ మధ్య కొంత జాగా వచ్చింది. దాంట్లో నల్ల కాగితంలో చుట్టిన ఫార్ములా అమర్చి సోల్‌ని మామూలుగా అమర్చాడు.

చకచక ముందు గదిలోకి వచ్చాడు. వంటమనిషిని

పిలిచాడు ఆమె రాగానే, "అమ్మగారు కోర్టునించి వచ్చే సరికి నేనుండను.... రెండు రోజుల్లో వస్తానని చెప్పు!" అన్నాడు.

ఆమె "అలాగేనండయ్యా!" అన్నది వినయంగా.

"రాంపింగ్, క్యా హై?" అనడిగాడు కిరణ్ అతడిని.

"ఠీక్ హూఁ సాబ్!" అన్నాడు తలవంచి రాంపింగ్.

జాగ్రత్తగా యింటిని చూసుకోమని. దుండగులు మరోసారి దాడిచేసే ప్రమాదం లేకపోలేదని రెండు రోజుల్లో తాను తిరిగొస్తాననీ చెప్పి, అన్ని జాగ్రత్తలూ సూచించి రోడ్ మీదికొచ్చాడు. కిరణ్ వచ్చే ముందు కోడ్ వర్డ్ చెప్పాడు రాంపింగ్‌తో. పోతున్న టాక్సీని ఆపాడు.

3

మెత్తని తారు రోడ్ మీద నల్లతాచు వంపులు తిరిగినట్టు మెలికలు తిరిగిన సంజీవరెడ్డి నగర్ చౌరస్తానుంచి పక్కకు తిరిగింది టాక్సీ!

"డ్రైవర్, సీదా జావ్‌నా!?" అన్నాడు కిరణ్.

డ్రైవర్ వినలేదు. ఎర్రగడ్డ రోడ్డువైపు వేగంగా దూసుకుపోతున్నాడు.

"డ్రైవర్, గాడీ రుకో!" అన్నాడు గంభీరంగా కిరణ్.

అకస్మాత్తుగా డ్రైవర్ పక్క సీట్లోంచి రివాల్వర్ పైకి లేచింది. నిగనిగ మెరుస్తూ అది కిరణ్ పైపే గురి పెట్టబడివుంది!

కిరణ్ పరిస్థితిని గ్రహించాడు. "హేండ్సప్ మిష్టర్ కిరణ్. కోటుజేబునుంచి మేం తీసుకుంటాం నీ రివాల్వర్!" అన్నాడు రివాల్వర్ గురిపెట్టిన వ్యక్తి. అంతదాకా అతను డ్రైవర్ పక్కనున్న సీటుకింద దాక్కొని వున్నట్టు

గ్రహించాడు కిరణ్.

కిరణ్ చేతులు పైకెత్తాడు. "ఎవరు మీరు? ఏం కావాలి?" అన్నాడు కిరణ్ నిశ్చలంగా. డ్రైవరు మహా వేగంగా నడుపుతున్నాడు టాక్సీ. అతను, రివాల్వర్ పట్టుకున్న వ్యక్తి గంట క్రితం తన యిల్లు ముట్టడించిన నలుగురు వ్యక్తుల్లో యిద్దరని చాలా తేలిగ్గా గ్రహించాడు కిరణ్. డ్రైవర్ గుర్తుతెలీకుండా పంజాబీ గడ్డం, మీసం అతుక్కున్నాడు. ఆ నలుగురు యెంతమందిలో వున్నా గుర్తుపట్టగల జ్ఞాపకశక్తి కిరణ్‌ది!

కారు అప్పటికే ఎర్రగడ్డ దాటి రామచంద్రాపురం రోడ్డున వుంది. దూరంగా బి.హెచ్.యి.ఎల్. భవనాలు, ఫ్యాక్టరీ గొట్టాలు కనిపిస్తున్నాయి.

"మిష్టర్ కిరణ్! నువ్వు అఖండ మేధావివి. నీ ప్రాణాలు చాలా అమూల్యమైనవి. వాటిని ఓ పనికిరాని ప్రాణంలేని కాగితం కోసం ఎందుకు పోగొట్టుకుంటావు? ఆ ఫార్ములా కాగితం మాకిచ్చెయ్యి. నిన్ను పువ్వుల్లో పెట్టినట్టు తీసుకెళ్ళి మీ ఇంట్లో వదిలిపెడతాం. నువ్వు జరిగింది మర్చిపో! అసలు నీ కెలాంటి కాగితమూ పోస్టులో రాలేదని భావించు. సమస్యలేదు!"

"ఏ ఫార్ములా గురించి మీరు మాట్లాడేది?"

"మై డియర్ డిటెక్టివ్! నిన్న రాత్రి ప్రొఫెసర్ యాచేంద్ర ఓ పరిశోధనా ఫలితాన్ని ఫార్ములా రూపంలో కాగితంమీద పొందుపరిచి, దాన్ని తన అసిస్టెంటు శర్మకి కూడా చెప్పకుండా ఢిల్లీ తీసుకుపోయి హోం మినిష్టర్ కందించాలనుకున్నాడు. ఫ్లైట్‌లో వెళ్తే తెలిసిపోతుందని రాత్రికి రాత్రి కాజీపేటకి ట్రెయిన్‌లో వెళ్ళి జి. టి. ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ వెళ్ళాలని ఆయన ప్రయత్నం! భావ్యా

బిడ్డలక్కూడా చెప్పకుండా అప్పటికప్పుడు స్టేషన్‌కి బయ ల్దేరాడు.

"ఆ పరిశోధనా ఫలితం కోసం రెండేళ్ళుగా కాచుకుని వున్న మేము, ప్రతిక్షణం ఆయన్ని నీడలా అనుసరిస్తూనే వున్నాం. ఆయన ప్రయోగశాలలో జరిగే పరిశోధన సర్వం మాకు ఎప్పటికప్పుడు అతని అసిస్టెంటు శర్మ ద్వారా తెలు స్తూనేవుంది:

"శర్మని రెండు లక్షలకి కొనేశాం; అయితే శర్మకి తన పరిశోధనల సారాంశాన్ని తెలియనివ్వకుండా జాగ్రత్త పడ్డారు ప్రొఫెసర్. కాని నిన్న ఆయన సాధించిన ఫలి తాన్ని మా కళ్ళు ప్రత్యక్షంగా చూశాయి. పరిశోధన త్వర లోనే ముగిసిపోతున్న విషయం శర్మ ద్వారా తెల్సుకుని ప్రతిరోజూ, ప్రతిక్షణం మేము వేయికళ్ళతో కనిపెట్టుకుని వున్నాం. అందుకే పరిశోధన ఫలించిన విషయం శర్మకన్న ముందు మేమే గ్రహించగలిగాం:

"మేము నలుగురం ప్రొఫెసర్‌ని వెంబడించాం. ఆయన జంక్షన్‌లో వున్న ఓ ఆటో డ్రయివర్‌ని నిద్రలేపి బయ ల్దేరదీశాడు స్టేషన్‌కి. మేం జీప్‌లో ఆటోని వెంబడించాం. ఆటో చక్రాలకి గురిచూసి కాల్చి దాన్ని ఆపేశాం. ప్రమాదం గ్రహించిన ప్రొఫెసర్ ఆటోలో నుంచి ఉరికి పరుగులుపెట్టాడు. బాజార్ ఘాట్ నుంచి నాంపల్లి వరకు వెంట తరిమాం. మలుపు తిరిగితే ఆయన ఓవర్ బ్రిడ్జి దగ్గ రకు చేరిపోతాడనుకున్న సమయంలో కాలికి గురిచూసి కాల్చాడు మా వాడు. కాని రెండో గుండు దురదృష్ట వశాత్తు ఆయన వెన్నులో నుంచి పోయి గుండెలో చిక్కు కున్నట్టుంది. వెంటనే ప్రాణం పోయింది.

"చూడబోతే ఫార్ములా ఆయనవద్ద లేదు. దార్లో

ఎక్కడో పోస్టుబాక్స్‌లో జారవిడిచాడు. ఆ విషయం తర్వాత శర్మ సూచించగానే మాకు అర్థమయింది. మీకే పోస్టు చేసివుంటాడని శర్మ చెప్పాడు. వెంటనే పోస్టు ఆఫీస్‌కి వెళ్ళాం. ఆర్డినరీ టపా వెళ్ళిపోయిందప్పటికే.

"లెటర్‌కి డ్యూ పడివుంటుందన్న విషయం తెలీక రిజిష్టర్లు యిచ్చే పోస్టుమన్ సంగతి వదిలేసి ఆర్డినరీ టపా నిచ్చే పోస్టుమన్ కోసం వేట మొదలెట్టాం. ఈ లోపల డ్యూ లెటర్ పట్టుకుని మీ యింటి మెట్లెక్కుతున్న పోస్టుమన్ కనిపించాడు. మీ గూర్ఖా అడ్డుకోబోతే గాయపరిచి మీ యింట్లో జొరబడ్డాం. సమయస్ఫూర్తితో నువ్వు మమ్మల్ని తరిమేశావు. కాని, యిప్పుడు నువ్వు మాకు బందీవి! మర్యాదగా ఆ ఫార్ములా మాకు అందచేస్తే నీకెలాంటి హానీ చేయకుండా వదిలేస్తాం. ఏమంటావ్?" అతను చెప్పటం ఆపి అడిగాడు

"ఇంతకీ ఆ ఫార్ములా దేని గురించి?" అడిగాడు కిరణ్.

"అది నీ కనవసరం. నీ ప్రాణాలు నీవిగా వుండాలంటే యిలాంటి పనికిమాలిన ప్రశ్నలడగొద్దు!"

కిరణ్ ముఖం ఎర్రగా అయింది. "నా ప్రాణాలకన్న నాకు విధి నిర్వహణ ముఖ్యమయినది. ప్రొఫెసర్ యాచేంద్ర నాకు ఆ ఫార్ములా పోస్ట్ చేసినపుడే నా విధి నిర్వహణ ఆరంభమయింది. దాన్ని మధ్యలో ఎలాంటి అడ్డంకులొచ్చినా పూర్తిచేసి తీరుతాను" అన్నాడు గంభీరంగా. అతనిది వజ్ర సంకల్పమని వాళ్ళకు తెలుసు.

"మిస్టర్ కిరణ్! నీ యిల్లు కూలదోసి అయినా ఆ ఫార్ములా ఎక్కడ దాచావో మేం తెల్సుకోగలం. ఇంత సేపూ మర్యాదగా అడిగాం. ఇప్పుడు బలప్రదర్శనకు

మొండి వైఖరికి దిగవలసి వస్తుంది. అంతదాకా రానిచ్చేటంత తెలివిహీనుడవు కాదనే నమ్ముతున్నాను!"

"ప్రాణాలకోసం ప్రాకులాడనని కూడా తెల్సుకుంటే మంచిది!"

ఆ వ్యక్తి గుర్రుగా చూశాడు కిరణ్ వంక.

"మిస్టర్ కిరణ్! మా ఫ్రెండ్స్ యిద్దరు మీ యింటినే కనిపెట్టుకుని వుంటారు. మీ యింటినుంచి యెవరు బయటకి వెళ్ళినా వాళ్ళను వెంటాడి వేటాడటానికి వేటకుక్కల్లా కాచుకుని వున్నారు. ఆ ఫార్ములా యిప్పటివరకు మూడో మనిషి చేతిలో పడలేదని మా ప్రగాఢ విశ్వాసం! మొదటి వ్యక్తి ప్రొఫెసర్ అయితే రెండో వ్యక్తివి నువ్వు. పోస్ట్ మాన్ కేవలం నిమిత్తమాత్రుడు! నాలుగో వ్యక్తి ప్రభుత్వం కావటం మాకు బొత్తిగా నచ్చని పని! ఏమంటావ్?" అన్నాడతను.

"ఈపాటికి ఆ ఫార్ములా ప్రభుత్వానికందివుంటే... ?"

"అసంభవం! నువ్వు యిల్లు వదిలి బయటకి రాగానే మేం పట్టుకున్నాం! మా అనుచర స్నేహితులిద్దరు మీ యింట్లోంచి బయటికొచ్చే పురుగును సైతం శల్య పరీక్ష చెయ్యకుండా వదలరు ఇకపోతే నీ భార్య లాయర్ బిందుకీ విషయం యింకా తెలీదు. ఆమె సాయంత్రం కోర్టు నుంచి వచ్చేసరికి ఫార్ములా మా చేతుల్లోకి రావటం. విదేశాలకు మార్పిడి జరిగిపోవటం—అంతా అయిపోతుంది. నువ్వు సజీవంగా నీ భార్య కళ్ళముందుండాలంటే మామాట విను. గోటితో పోయేదానికి గొడ్డళ్ళదాకా పోనివ్వకు!"

కిరణ్ కొద్దిక్షణాలు మౌనం వహించాడు. అకస్మాత్తుగా అతనికో విషయం గుర్తింపుకొచ్చింది. అంతవరకు టాక్సీ ఎక్కడా ఆగలేదు! బయటికి చూస్తే బి.హెచ్.ఇ.ఎల్

ఫ్యాక్టరీ గొట్టాలు కనిపిస్తున్నాయి. తన అంచనా ప్రకారం కనీసం టాక్సీ వంద కిలోమీటర్లకి పైగానే ప్రయాణం చేసి వుంటుంది! కాని గంటక్రితం చూసిన ఫ్యాక్టరీ గొట్టాలే కనిపించటం చిత్రంగానే వున్నది!

అతని మనసు గ్రహించినట్టుగా రివాల్వర్ పట్టుకున్న వ్యక్తి గుంభనగా నవ్వాడు. "మీ ప్రభుత్వం సంచార న్యాయస్థానాలను ప్రారంభించినట్టే మేము సంచార కార్యాలయాలు ప్రారంభించాం. మీ భాషలో చెప్పాలంటే, మేం సంచార నేరస్థులం! మాకు ఓ స్థావరమంటూ లేదు! మేం ఏం చెయ్యాలన్నా యీ రోడ్లమీద తిరుగుతూనే చేస్తాం!" అన్నాడతను.

కిరణ్ ఆశ్చర్యాన్నణచుకుని, "మీరే దేశస్థులు? ఈ ఫార్ములాని అమ్మితే విదేశాలు మీ కెంత ముట్టచెపుతాయి? మీ నలుగురి వాటాకు ఎంత వస్తుంది?" అనడిగాడు.

రివాల్వర్ వ్యక్తి గంభీరంగా మారిపోయాడు "మిస్టర్ కిరణ్! ఏదోవిధంగా మానుంచి వివరాలు లాగాలని ప్రయత్నిస్తున్నావు. మేం అంత తెలివితక్కువ వాళ్ళం కాదు! మానుంచి నిజాన్ని సేకరించటం నీ తరంకాదు" అన్నాడు.

ఇంతలో పీప్....పీప్....అంటూ వైర్‌లెస్ మెసేజ్ ఎక్కడ్నుంచో వినిపించింది. రివాల్వర్ వ్యక్తి, డ్రైవర్ కూడా చెవిలొగ్గి విన్నారు. ఆ సంకేతాలు రివాల్వర్ వ్యక్తి ఎడమపక్కనున్న చిన్న రిసీవర్‌నుంచి వస్తున్నట్టు గ్రహించాడు కిరణ్. కార్‌కి బిగించే స్పీకర్‌లా వుంది ఆ పరికరం!

"మైడియర్ కిరణ్! నువ్వు చాలా తెలివైన వాడివని మాకు తెలుసుగాని, అలాగే కదలకుండా కూచో!" అంటూ ముందుసీట్లోంచి వెనకసీట్లోకి మారాడు రివాల్వర్ వ్యక్తి.

కిరణ్ అంతసేపూ చేతులు పైకెత్తే వుంచాడు.

కిరణ్ దుస్తులన్నీ జాగ్రత్తగా చెక్ చేశాడు ఆ వ్యక్తి. దుస్తుల్లో ఏమీ కనిపించకపోయాక. అతను ధరించిన సాక్స్‌లో పరిశీలించాడు. తరవాత లేసులు విప్పి షూస్ తీశాడు అతని కాళ్ళనుండి.

కిరణ్ ఏమాత్రం ప్రతిఘటించకుండా చూస్తున్నాడు. అతని జేబులోనుంచి రివాల్వర్ అంతక్రితమే రివాల్వర్ వ్యక్తి చేతుల్లోకి వెళ్ళిపోయింది. ఆయుధం లేదు! అయినా తన భుజబలంమీద అమితమైన విశ్వాసం వుంది అతనికి! అది ప్రదర్శించటానికి అది అనువైన సమయం కాదని అతనికి బాగా తెలుసు.

"షూస్‌లో నువ్వు ఫార్ములా జాగ్రత్తపరిచినట్టు మాకు మా ఫ్రెండ్సునించి మెసేజ్ వచ్చింది" అంటూ షూస్‌ని పొట్టి చాకుతో పరపర కోసేశాడు రివాల్వర్ వ్యక్తి. అతనా పని చేస్తున్నంతసేపు డ్రైవర్ రివాల్వర్ కిరణ్‌కి గురిపెట్టి వుంచాడు.

షూస్ సోల్‌తోబాటు ముక్కముక్కలుగా, పొరలు పొరలుగా జాగ్రత్తగా కోసినా. ఏమీ కనిపించలేదు.

కిరణ్ చిరునవ్వుతో అతను చేస్తున్న పనిని తిలకిస్తున్నాడు.

అతను కోపంగా చూశాడు కిరణ్‌వంక. "మిస్టర్ కిరణ్! మావాళ్ళు పొరబడరు. నీ షూస్‌లోనే సోల్‌లోపల రహస్యంగా అమర్చిన అరలో ఆ ఫార్ములా నల్ల పేపర్లో చుట్టి దాచినట్టు చెప్పారు కాని, ఎందుకో మొదటిసారిగా మావాళ్ళు పొరబడటమో, లేక నువ్వు పైఎత్తు వెయ్యటమో జరిగింది. ఇప్పటికైనా మించిపోయిందిలేదు. అదెక్కడ దాచావో యిచ్చెయ్యి. లేదా మీ యింట్లో ఎక్కడ దాచావో

చెప్పు. ఓ అరగంటలో దాన్ని స్వాధీనం చేసుకుని మా వాళ్ళు మాకు యిన్ఫర్మేషన్ యిస్తారు. ఆ వెంటనే మిమ్మల్ని క్షేమంగా వదిలేస్తాం" అన్నాడు ఆ వ్యక్తి అనునయంగా, నచ్చచెప్పే ధోరణిలో.

"డియర్ ఫ్రెండ్స్! ఆ ఫార్ములా వల్ల భారతదేశానికి అంతర్జాతీయ ఖ్యాతి లభించగలదనీ, భారతదేశం వైజ్ఞానికంగా వెనకబడి లేదని ప్రపంచ దేశాలు గ్రహించగలవనీ నేను వేరే చెప్పనక్కర్లేదు. అతి తక్కువ ఖర్చుతో, అంటే కేవలం పదివేల రూపాయల ఖర్చుతో అత్యాధునికమైన మూడు అంతస్థుల గృహాన్ని నిర్మించటానికి ఉపయోగపడే ఫైబర్ని ఎలా ఉత్పత్తి చేయవచ్చునో వివరించే ఫార్ములా అది!

ఆ ఫైబర్ ఫైర్ప్రూఫ్, సౌండ్ప్రూఫ్, వాటర్ప్రూఫ్-ఒకటేమిటి అల్ప్రూఫ్ ఫైబర్! తుఫానులొచ్చినా, మిన్ను విరిగి మీదపడినా ఆ ఫైబర్తో నిర్మించిన భవనాలు చెక్కు చెదరవు! భారతదేశం వంటి వేగంగా అభివృద్ధి చెందే దేశానికి యీ ఫార్ములా వరంలాంటిది! దీన్ని కొన్ని కోట్ల రూపాయలకు ఓ విదేశానికి అమ్మకం పెట్టారు మీరు! కనీసం ఒక్కొక్కరికి పదికోట్ల రూపాయలు లభించే బంగారు ఖని ఆ ఫార్ములా! నేను చెప్పింది నిజమేనా?" అన్నాడు కిరణ్ వాళ్ళవంక చూస్తూ గంభీరంగా.

వాళ్ళిద్దరు ముఖముఖాలు చూసుకున్నారు. కిరణ్ వైజ్ఞానిక పరిజ్ఞానానికి చిత్తరువుల్లా చూస్తూ వుండిపోయారు.

కిరణ్ నవ్వి, "మీరు యీ దేశస్థులు! విదేశీయుల తొత్తులుగా మారి మీ మాతృదేశాన్ని, మీ మానాభిమానాల్ని డబ్బుకోసం అమ్మకోవటం హీనాతిహీనం! కన్నతల్లిని హత్య చేసిందానితో సమానం. నా మాట విని యీ

ప్రయత్నం మానుకోండి. మీకు ఎలాంటి శిక్షలేకుండా, అసలు మీ నలుగురి విషయం ప్రభుత్వానికి తెలియకుండా వదిలేస్తాను ...” అన్నాడు.

రివాల్వర్ వ్యక్తి ఫెళ్ళున నవ్వి, “మిస్టర్. నీ ప్రాణాలు మా చేతుల్లో వున్నాయి నువ్వు మాకు ప్రాణభిక్ష పెట్టబోతున్నట్టు మాట్లాడుతున్నావే! నీ ప్రాణాలు రక్షించుకో బ్రదర్ ముందు!” అన్నాడు.

ఇంతలో యెక్కడ్నుంచో వైర్‌లెస్ మెసేజ్ ప్రారంభమయింది. రివాల్వర్ వ్యక్తి, డ్రైవర్ తమ రిసీవర్ వంక చూశారు. సంకేతాలు అక్కడ్నుంచి కాదు! తెల్లబోయి కిరణ్ వంక చూశారు.

కిరణ్ కుడిచేతిని చెవిదగ్గర ఆనించుకుని విన్నాడు. వాళ్ళిద్దరు అతనివంకే జాగ్రత్తగా కళ్ళప్పగించిచూస్తున్నారు.

“డియర్ ఫ్రెండ్సు! మీకో గుడ్ న్యూస్!” అన్నాడు కిరణ్.

“ఏమిటది?” ఒకేసారి అడిగారిద్దరు.

“మరేం లేదు. రెండు నిమిషాల క్రితమే ఆ ఫార్ములా గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గారికి అందచేయబడింది—మా గూర్ఖా రాంసింగ్ ద్వారా!”

“అబద్ధం! మీ గూర్ఖాని పట్టుకుని పరీక్ష చేశాకనే నిన్ను పరీక్ష చేయమని మావాళ్ళు మెసేజ్ పంపారు. రాంసింగ్ షూస్ కూడా తునాతునకలు చేసి చూశారు. అతని గుడ్డలు కూడా విప్పదీసి పరిశీలించారు. ఆ ఫార్ములా యెక్కడా కనిపించలేదు” అన్నాడు రివాల్వర్ వ్యక్తి.

“అదే పొరపాటు. మిమ్మల్ని తప్పుదారి తొక్కించాలనే నేను షూలో దాన్ని పెట్టినట్టు నాటకమాడాను. అవి నేను ధరించలేదు. తర్వాత రాంసింగ్ కూడా వాటిని ధరించ

లేదు. ఆ ఫార్ములా యింట్లో వున్న షూలోనే భద్రంగా వుంది. మీవాళ్ళు రాంసింగ్ బయటకి రాగానే అతన్ని అను సరించి, శల్యపరీక్ష చేసినపుడు అది అతని దగ్గర లేక పోవటంవల్ల మీ వాళ్ళకు దొరకలేదు. అయితే మీకు తెలీని మరో ముఖ్యమైన విషయం, మీ వాళ్ళిద్దరు ప్రస్తుతం పోలీసు మర్యాద చవిచూస్తూ పోలీస్‌కమీషనర్ ఛాంబర్స్‌లో వున్నారు...."

"అబద్ధం! అంతా ఉత్తది...." అంటూనే రివాల్వర్ వ్యక్తి వైర్‌లెస్ సెట్టు పైకి తీసి మెసేజ్ పంపాడు. అట్నుంచి సమాధానం లేదు. రెండు నిమిషాల తర్వాత ఎవరిదో కంఠం వినిపించింది. "వృధా శ్రమ! మీ వాళ్ళు రిమాండులో వున్నారు!" అని.

వాళ్ళిద్దరికీ ముచ్చెమట్లు పోశాయి. కిరణ్‌కి రివాల్వర్ గురిపెట్టిన వ్యక్తి, ఎడమచేత్తో వైర్‌లెస్ సెట్‌ని పట్టుకుని అతని ముందుపెట్టి, "మిస్టర్ కిరణ్! వెంటనే మావాళ్ళని వదిలిపెట్టమని యీ సెట్ ద్వారా సంకేతం పంపించు పోలీసు లకి! లేదా నిన్నీ క్షణమే చంపేసి, మీ పోలీసులకి బహూ మతిగా పంపిస్తాం!" అన్నాడు.

"మీ వైర్‌లెస్ అక్కర్లేదు. నా వైర్లెస్ వుంది!" అంటూ కుడిచేతి మధ్యవేలుకున్న ఉంగరం లోపల్నుంచి పొడవాటి తీగెను బయటికి లాగాడు కిరణ్. అది ఏరియల్ లాగా వుంది.

దాన్ని నోటిదగ్గిర పెట్టుకుని, "మిస్టర్ శ్రీనివాస్! ఎటాక్!" అన్నాడు కిరణ్.

అతని మాటలు పూర్తికాకుండానే టాక్సీని మూడు వైపులనుంచి పోలీసు వాహనాలు చుట్టుముట్టాయి.

రివాల్వర్ వ్యక్తి ట్రిగ్గర్ నొక్కబోయేంతలో వైర్లెస్

సెట్టును అంది పుచ్చుకుని అతని చేతిమీద బలంగా కొట్టాడు కిరణ్. ఖంగుమని చప్పుడు చేస్తూ టాక్సీ కిటికీలోనుంచి బయటపడిపోయింది. రివాల్వర్.

డ్రైవర్ టాక్సీ స్టీరింగ్ వదిలేసి రివాల్వర్ పైకి తీశాడు. మెరుపులా అతనిపై దూకి, మెడనరం విరిగిపోయేలా పిడిగుద్దు గుద్ది, స్టీరింగ్ వశపర్చుకుని, ఇంజన్ ఆపేశాడు కిరణ్.

క్షణాల్లో పోలీసులు టాక్సీని ఆయుధాలతో చుట్టుముట్టేశారు.

కిరణ్ విజయగర్వంతో టాక్సీడోర్ తెరుసుకుని కిందికి దిగాడు.

ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ నవ్వుతూ, "కంగ్రాచ్యులేషన్స్ బ్రదర్! ఈ సంచార నేరస్తుల్ని మరిక సంచరించ నవసరం లేకుండా అష్ట దిగ్బంధనం చేసేశావు. అమూల్యమైన ఫార్ములాని భారతదేశానికి దక్కించిన ఖ్యాతి నీదే! ముఖ్యమంత్రిగారు నిన్ను స్వయంగా అభినందించబోతున్నారు" అన్నాడు. □

ముందు జాగ్రత్త!

పొత్తూరు రాజేంద్ర ప్రసాద్ వర్మ

ఎడిటర్ చలపతి



"ఎడిటర్ గారూ!"

పిలుపు వినిపించి బయటి పైకి వచ్చాడు చలపతి. అతను 'ఆనందం' అనే పత్రిక్కి ఎడిటర్.

ఎదురుగా రచయిత విశ్వం చేతి సంచితో నిల్చున్నాడు.

చలపతికి విశ్వంతో పరిచయం వుంది. వెంటనే—

"రండి—" అంటూ లోపలికి వెళ్ళి కూర్చున్నాడు.

ఆ గదిని పరిశీలించిన తరువాత చాలా ఆశ్చర్య పోయాడు విశ్వం. నాలుగుప్రక్కల అతిధులు కూర్చోవ డానికి సోఫాలు, వాటి మధ్యలో టీపాయ్. వెనుకప్రక్క ఉమర్ ఖయాం అందమైన ఫోటో....ఆ గది అలంకరణ కూడా బాగుంది.

"రచయితగారు రూమ్‌ని అంతలా చూసేస్తున్నారు. కొంపతీసి ఏ నవల్లో కాని వర్ణించేయరు కదా?" అంటూ పకపక నవ్వాడు. అలా నవ్వుతున్నప్పుడు గ్లాస్కో లాల్చీ లోపల అతని పొట్టకూడా అదోమాదిరి బ్లేడరులా కిందా మీద రెండుమూడుసార్లు వూగి ఆగిపోయింది.

సాక్షాత్తు ఎడిటర్‌గారు అంత చెత్త జోకు వేసి అంతలా నవ్వేసిన తర్వాత, తను ఏమీ నవ్వకపోతే ఎక్కడ బాధపడిపోతాడో అని చిన్నగా నవ్వి వూరుకున్నాడు.

లోపల నుండి సర్వరు రెండు కాఫీలు ట్రేతో తెచ్చాడు. చలపతి ఒక గ్లాసు అందుకున్నాడు. విశ్వం మొహమాటం వలన "అబ్బే! ఎందుకండీ!" అన్నాడు.

"రచయితలై వుండీ టీ అలవాటు లేదా?" ఆ ఎడిటర్ మరోసారి నవ్వాడు. అతని బ్లేడరు పొట్ట, కంసాలి పొయ్యికి ఉపయోగించే తిత్తిలా మరో నాలుగుసార్లు క్రిందా మీదలకి ఉబ్బి వూరుకుంది.

"అలవాటు లేక కాదండి" అందుకున్నాడు గ్లాసు.

టీ త్రాగుతుండగా విశ్వం ఆలోచిస్తున్నాడు. తను వచ్చిన పని ఎంత తొందరగా సానుకూలం చేసుకుందామా అన్న తొందరలో వున్నాడు.

"అయ్యా రచయితగారూ! మీరేదో పనిమీద వచ్చినట్లు న్నారు. నాకు ఈ రోజు కాస్త పనివుంది. మీరు రేపు ఒక సారి వస్తే తీరుబడిగా అన్నీ మాట్లాడుకుందాం. మరేం

అనుకోకండి—అర్జంట్ పని పగిలింది."

"పర్వాలేదులెండి. ముందు మీ పని కానివ్వండి. రేపు నేను మరలా కలుస్తాను. నా పెర్సనల్ విషయాలు కొన్ని మాట్లాడాలి" అన్నాడు విశ్వం.

ఎడిటర్ తొందరగా, హుందాగా పైకి లేచారు. అప్పటికే కారు బయటికి వచ్చి ఆగివుంది. అతనితోపాటు విశ్వం కూడా బయటికి వచ్చాడు చలపతి కారులో కూర్చుని చెయి పైకి వూపాడు. ప్రతిగా విశ్వం కూడా చేయి వూపాడు.

ఆ తరువాత—

నాలుగుమైళ్ళ దూరంలో వున్న తన ఇంటికి నెమ్మదిగా నడక మొదలపెటాడు. ఊరికి మారుమూల అద్దె తక్కువ యింట్లో బ్రతకలేక బ్రతుకుతున్న అతనికి ఈ లోకం మీదా వ్యవస్థ మీదా—చెప్పలేని కోపం వుంది. తనవంటి దౌర్భాగ్యులు దేశంలో తయారవ్వడానికి కారణం ఈ వ్యవస్థలో వున్న కొన్ని స్వార్థపరశక్తులే అనే నమ్మకంగల వ్యక్తి—విశ్వం.

అతని రచనల్లో కసి బ్రహ్మాండంగా బట్టబయలవుతుంటుంది. అతని రచనలు ఆర్తితో నిండివుంటాయి. అతనికి తను రచనలు చేసేటప్పుడు—అతనున్న పరిస్థితులు తనకి జరిగిన అన్యాయాలు గుర్తు తెచ్చుకుంటాడు అంతే! అతనికి తెరలు తెరలుగా ఆవేశం హద్దులు దాటుతుంది. ఆలోచన పరవళ్ళు తొక్కుతుంది. రచన దానంతట అదే జలపాతంలా సాగుతుంది. అతని రచన పత్రికలో పడిందంటే పాఠకులు శ్రద్ధగా చదువుతారు. చాలామంది అసలు ఆ రచయిత అంత ఆవేశంగా ఎలా రాయగలుగుతున్నాడు అని కాలేజీలలో పందేలు కట్టుకుంటున్నారని వినికిడి.

మెల్లగా యింటిని సమీపించాడు.

ఇంటిని సమీపించాలంటే కుళ్ళుకాలువ దాటాలి. ఆ వీధిలో వారికి అదో పెద్ద తలనొప్పి.

తలుపు తట్టగానే ఒకావిడ ఎదురైంది. ఆమె కట్టుకున్న చీరకి పాతికపైగా చిరుగులు వున్నాయి. ఆమె చూపుల్లో ఆశ కనిపించింది. ఏమైనా తెచ్చారా? అని.

సంచి అందించాడు విశ్వం.

ఆతృతగా అందుకొని చూస్తే అందులో రాపిన కాగితాలు కనిపించాయి. కోపంతో గిరవాటేసింది.

"రాజ్యం! ఎడిటర్‌గార్ని కలిసాను. రేపు రమ్మన్నారు. మన పని రేపు సానుకూలం అవుతుంది. ఆయన దగ్గర టీ కూడా తాగాను" విశ్వం కళ్ళల్లో సాధించే పట్టుదల కనిపించింది.

రాజ్యం లోపలికి వెళ్ళిపోయింది.

ఒక కాలులేని కుర్చీలో జారిగిలబడ్డాడు విశ్వం తల పట్టుకొని. తన రచనలని చూసి అభిమానించి, తనను పెళ్ళాడి తనింట్లో అడుగుపెట్టిన ఆమెకు తానిచ్చిన ప్రతిఫలం ఇదా?

కళ్ళు మూసుకున్నాడు—భవిష్యత్తుని ఆలోచిస్తూ.

2

విశ్వం మంచి రచయిత.

అతను చదువుకుంటున్నప్పటి నుంచి కథలు, కవితలు రాసి రచయితగా గుర్తింపు పొందాడు. చదువుకన్నా రచనలకే అతను ప్రాధాన్యత నిచ్చాడు.

రచయితగా వున్న గుర్తింపు వలననే అతను రాజ్యం ప్రేమను పొందగలిగాడు. రాజ్యం ధనవంతుల ముద్దుల కూతురు. ఆమె విశ్వం గురించి తనవాళ్ళనందరినీ ఒదులుకుంది. విశ్వం నిరుద్యోగాన్ని ఎదుర్కోవడానికి చాలాకాలం

వరకూ ఆమె ఒంటినున్న బంగారు నగలు పనికి వచ్చాయి.

ఆ పట్నంలో మారుమూల ప్రాంతంలో ప్రజలకు దూరంగా వుంటున్న విశ్వానికి భార్య అవస్థలు చూపి జాలి కలిగింది. తనవలన ఆమె కష్టాలు పాలవుతుందని, ఆమెని సుఖపెట్టాలనీ అనుకొన్నాడు.

కానీ ఎలా?

అతను తిరగని ఆఫీసు లేదు.

అయినా ఉద్యోగం అన్నది కనుచూపు మేరలో కనిపించటంలేదు.

అప్పుల మీద అప్పులు....కష్టాల మీద కష్టాలు.... ఎన్నెన్నో.

రాజ్యం పుట్టింటికి వెళ్ళిపోతానంది.

విశ్వం వూరుకోలేదు. "రాజ్యం—నా గురించి అయిన వాళ్ళనందరినీ ఒదులుకున్నావు. నిన్ను ఎలాగైనా పోషిస్తాను" అనేవాడు. అయినా తన మాటని నిలబెట్టుకోలేక అవస్థపడేవాడు.

రోజూ బాధలు....

ఓ రోజు—

రోడ్డుమీద ఆలోచిస్తూ నడుస్తున్నాడు విశ్వం.

ఎవరో పిలిచినట్లయితే వెనక్కి తిరిగాడు.

ఓ లావుపాటి వ్యక్తి వచ్చి కలిసాడు. "మీరు విశ్వం కదూ" అన్నాడు.

విశ్వం ఆశ్చర్యపోయాడు.

"మిమ్మల్ని ఆ మధ్య రచయితల మీటింగ్‌లో చూశాను. నేను 'ఆనందం' వారపత్రిక ఎడిటర్‌ని. నా పేరు చలపతి" అన్నాడు ఆ వ్యక్తి.

విశ్వం సంతోషంతో అతన్ని విష్ చేశాడు.

ఆనందం పత్రికలో విశ్వం రాసిన అనేక కథలు ప్రచురించబడ్డాయి. వాటికి పాఠకుల నుండి కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది.

విశ్వంలో ఓ అలవాటు వుంది. అతను అనేక పత్రికలకి కథలు రాస్తుంటాడు. చాలా పత్రికలు అతను ఉంటున్న వూరిలోనే వున్నాయి. అయినా యింతవరకూ ఏ పత్రికా కార్యాలయానికి వెళ్ళలేదు. ఏ ఎడిటర్‌ని కూడా కలుసుకోలేదు. అలా పెర్సనల్ కాంటాక్టు పెట్టుకొని రచనలు అచ్చు వేయించుకోవడం అతనికి పరమ అసహ్యం. తన రచనలు పోస్టులోనే పంపిస్తుంటాడు అందువలననే 'ఆనందం' పత్రిక సంపాదకుడు అతనికి తెలియలేదు.

"విశ్వంగారూ— మీ రచనలు మా పత్రిక ఎన్నింటినో ప్రచురించింది. మీ రచనలు మిగతా రచయితల రచనల కన్నా ఎంతో విలక్షణంగా వుంటాయి" అన్నాడు.

"సంతోషమండి! నేను మామూలుగానే రాస్తాను. మీకు విలక్షణంగా వున్నాయనడం మీ అభిరుచికి నిదర్శనం"

రోడ్డుమీద నడుస్తూ మాట్లాడుకుంటున్నారు.

"రండి. అలా హోటల్‌లో కెళ్ళి కూర్చుని కాసేపు మాట్లాడుకుందాం" దారి తీసాడు చలపతి

మౌనంగా అనుసరించాడు విశ్వం.

ఇద్దరు కలిసి టీ త్రాగారు. ఆ తర్వాత ప్రస్తుత పత్రికల గురించి. రచయితల గురించి. ఆనందం పత్రికకి వున్న సర్క్యులేషన్ గురించి మాట్లాడుకున్నారు.

అ తర్వాత—

"విశ్వంగారూ! మీరు మా పత్రిక్కి రెగులర్‌గా ఓ శీర్షిక సంవత్సరంపాటు నడపాలి. మన పత్రిక వారపత్రిక

గాబట్టి ప్రతీవారం ఓ రచన రాయవలసి వుంటుంది. అందు వలన మీరు సుమారు యాభై రచనలు అయినా ఇవ్వవలసి వుంటుంది" అన్నారు.

విశ్వం సంతోషం పట్టలేకపోయాడు.

"తప్పకుండా రాస్తాను. మీ వంటి సంపాదకులు అడిగితే కాదనగలమా" అన్నాడు.

చలపతి చలించలేదు.

"మీరు మరోపని కూడా చేయాలి. మన పత్రిక ఈ సంవత్సరం కూడా కథల పోటీ నిర్వహిస్తుంది. పదివేలు బహుమతులు పెట్టాలనుకుంటుంది. మీరు పోటీకోసం రాసిన కథలు రెండు కావాలి."

"విశ్వం ఏం మాట్లాడలేదు.

"మా అల్లుడి తమ్ముడు కూడా ఏదో అప్పుడప్పుడు కథలు రాస్తుంటాడు ఈసారి వాడికి ఫస్టు ప్రయిజ్ రావాలి. వాడు ప్రచురణ అయ్యేటట్లు రాయలేడు. ఇక బహుమతికి ఏం రాయగలడు! చాలా రోజుల్నుండీ నన్ను తినేస్తున్నాడు. తనకి ప్రయిజ్ ప్రకటిస్తే తన రచనలకి గుర్తింపు వస్తుందట. అందుచేత అతని పేరుమీద మొదటి ప్రయిజు కథ మీరు రాయాలి. రెండవ బహుమతి మీది. అందులో—"

చలపతి ఇంకా ఏమేమో చెప్పబోతున్నాడు.

"చలపతిగారూ ఆపండి. అలాంటి దౌర్భాగ్యపు పనులు నేను చేయలేను" అంటూ విసురుగా పైకి వచ్చేసి రోడ్డు ఎక్కి యింటికి వచ్చేశాడు విశ్వం.

ఆ రోజంతా ఏపని చేయలేకపోయాడు.

ఆలోచనా పరంపర ....

ఆ తరువాత ఆ విషయాన్ని మరిచిపోయాడు. కాని ఆ తరువాత అతను తెలుసుకున్నది ఒకటే. అంతవరకూ

ఆనందం పత్రికలో పరిశీలనలో వున్న కథలన్నీ ఒకేసారి కట్టకట్టుకొని తిరిగి వచ్చేశాయి....

అప్పులు పెరిగిపోయాయి.

ఇంటి అద్దె కట్టడంలేదని యజమాని వెళ్ళగొట్టడానికి వార్నింగ్ ఇచ్చాడు.

విశ్వం తలలో సమస్యలు కందిరీగలు.

అతనిని ప్రేమించి పెళ్ళాడిన రాజ్యం సూటిపోటి మాటలు—మనసుని కలచివేసే ఆలోచనలు.

"మా నాన్న ఇంజనీరుకో, డాక్టరుకో ఇచ్చి పెళ్ళి చేస్తా నన్నారు. కానీ తెలియకే నేనీ రొంపిలో కూరుకుపోయాను" రాజ్యం ఏడ్చేది.

ఎంత ప్రేమలోనైనా ఈ ఆర్థికమైన సమస్యలు చిచ్చు పెట్టగలవని అతను అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు. కుమిలిపోయాడు....మౌనంగా ఏడ్చాడు.

"నన్ను ఇలాగే పోషిద్దామనుకుంటే నేను పుట్టింటికి వెళ్ళిపోతాను-మీరు జీవితంలో స్థిరపడిన తర్వాతే వస్తాను" అంది అతని భార్య

విశ్వం బతిమాలాడు.

ఎలాగైనా సమస్యలన్నీ తీరిపోతాయని ఊరడించాడు. వేలలో వున్న అప్పులు తీర్చడానికి అతను ఆలోచించాడు.

అప్పుడు మెదిలాడు ఆనందం ఎడిటర్ చలపతి.

'అతను కోరిన విధంగా చేస్తేనో? ఆత్మవంచన అవుతుందా?' విశ్వంలో ఓ రోజు ఆలోచనా పరంపర. ఆ తరువాత ఓ నిర్ణయానికి వచ్చాడు. రాత్రి పగలు కూర్చుని అతను కథలు రాశాడు. పరిస్థితులు అతనిచేత రాయించాయి. తర్వాత వాటిని తీసుకుని ఎడిటర్ దగ్గరికి వెళ్ళాడు.

కాని—అతను ఆ మర్నాడు మాట్లాడదామని వెళ్ళి

పోయాడు.

రేపు వెళ్ళి ఈ సమస్యని ఎలాగైనా తీర్చుకోవాలి. రచనలకి పేరుంచేనేం లేకపోతేనేం. ప్రస్తుతం జీవించడానికి డబ్బులు కావాలి.

ఆ రోజు రాత్రి విశ్వం కలత నిద్దురలోనే వున్నాడు. ఆ మరునాడు కథల కట్ట పట్టుకొని 'ఆనందం' పత్రికా కార్యాలయానికి వెళ్ళాడు.

3

ఆఫీసుకి వెళ్ళగానే వెంటనే పిలుపు వచ్చింది.

విశ్వం, ఎడిటర్ చలపతి గదిలోకి వెళ్ళాడు.

"నిన్న వచ్చారు కదూ?" అడిగాడు చలపతి.

"అవును. ఆ మధ్య మీరు నన్నో విషయం అడిగారు కదా? అది చేద్దామని వచ్చాను" అని సంచిలో నుండి కథల కట్ట బైటికి తీశాడు.

రెండు బహుమతి కథలూ, సంవత్సరానికి సరిపడా ప్రతీ వారం ప్రచురించడానికి ట్విష్టు కథలు యాభై వున్నాయి. వాటిని పరిశీలించిన తర్వాత సంతృప్తిగా తలాడించాడు చలపతి.

"మన 'ఆనందం' పత్రిక కథల పోటీని గతవారం ప్రకటించింది. మా అల్లుడి తమ్ముడికి ఇందులో మొదటి ప్రయిజ్ అయిదువేలు. రెండవ ప్రయిజ్ మూడువేలు మీకు. ఇంక మూడవ ప్రయిజు రెండువేల బహుమతిని ఎవరో పైవారికి ఇవ్వాలి" అన్నాడు.

విశ్వం ఆ మాటకి పొంగిపోయాడు. ఆ గదిలో వున్న ఎయిర్‌కండీషన్‌లా అతని మనస్సు చల్లబడింది.

"ఈ కథలు మీ పేరుమీద ఈ వారం నుండే ప్రారంభిద్దాం" అన్నాడు.

"ఎడిటర్‌గారూ మీ రుణం ఎలా తీర్చుకోవాలో తెలియటం లేదండీ" సంతోషం పట్టలేక అన్నాడు విశ్వం.

"ఋణం తీర్చటం ఎలాగో తెలియని రచయితలా.... ఇన్ని రచనలు చేస్తున్నారు?" తెరలు తెరలుగా నవ్వాడు. అతని బెలూన్ పొట్ట వూగడం కనిపించింది.

మరి తప్పదన్నట్లు నవ్వి వూరుకున్నాడు విశ్వం.

ఎవరినో ఆఫీస్‌బోయ్‌ని పంపించి కూల్‌డ్రింక్స్ తెప్పించాడు.

తర్వాత జేబులో చేయిపెట్టి రెండు - వందరూపాయల నోట్లు పైకి తీసాడు. "విశ్వంగారూ! ప్రస్తుతానికి ఇవి వుంచండి. తర్వాత ఆలోచిద్దాం" అంటూ అందించాడు.

కష్టాలలో వున్నవారికి చిన్నయెత్తు సహాయం కూడా ఎంతో పెద్దదిగా వుంటుంది. అసలు డబ్బివటం సహాయం కాదు. ప్రతిఫలంలో భాగం. అందుకొని బైటికి వచ్చేశాడు విశ్వం.

వెళ్తున్నవాడిని మళ్ళీ వెనుకకు పిలిపించాడు. ఏదో అగ్రిమెంట్ కాగితం తీసాడు. అందులో 'తన రచనలు ఇచ్ఛాపూర్వకంగానే ఇచ్చాను. ప్రతిఫలం ముట్టింది' అని వుంది. సంతకం చేయమని కోరాడు చలపతి.

"డబ్బు ఇంకా ముట్టలేదు కదా?" అన్నాడు.

"మీకు ప్రచురణ ప్రారంభం కాగానే యిచ్చేస్తాను. రేపే ఆడిటింగ్ వుంది. చూపించాలి కదా? మా బాధలు మావి. అర్థం చేసుకోండి సార్—నా మీద నమ్మకంలేదా?" ఆంధ్రదేశంలో అత్యధిక సర్క్యులేషన్ వున్న ఒక పత్రిక ఎడిటర్ అలా అడుగుతుంటే ఎదురు చెప్పలేకపోయాడు విశ్వం.

ఆ తరువాత ఇంటికి వచ్చి డబ్బుల సంపాదన గురించి

భార్యకి చెప్పాడు. రాజ్యం ముభావంగానే వింది. ఆమెకి భర్తమీద ఈ మధ్యకాలంలో అపనమ్మకం కలుగుతున్నది.

ఆ రోజు రాజ్యం రానంటున్నా బలవంతం మీద సినిమాకు తీసుకువెళ్ళాడు.

ఆ మరుసటి వారం విడుదల అయిన 'ఆనందం' పత్రికలో కథలపోటీ ప్రకటన, ట్విష్టుకథలు వచ్చేవారం నుండీ ప్రారంభమవుతాయన్న ప్రకటన పడ్డాయి. చదివి మౌనంగా వుండిపోయాడు విశ్వం.

ఇచ్చిన రెండువందలు ఖర్చు అయిపోతున్నాయి.

అయినా వీలైనంత పొదుపులోనే వాడుతున్నారు.

ఈ లోపల ఎడిటర్ ఇంటికి ఒకసారి వెళ్ళాడు. కానీ అతను లేడు. ఆఫీసుకు ఆ మరునాడు వెళితే వందరూపాయలు యిచ్చి పంపించాడు. అప్పటికే ట్విష్టు మినీ కథల ప్రచురణ ప్రారంభం అయింది.

ఆ నెలలోనే కథలపోటీ ఫలితాలను వేశారు.

అనుకున్నట్లే బహుమతులు వచ్చాయి. మొదటి. రెండు ప్రయిజులు వచ్చిన కథలను చూసి విశ్వం పొంగిపోయాడు. ఆ డబ్బులు వస్తే బాగుంటుంది. రాజ్యం సంతోషంగా వుంటుంది అనుకున్నాడు. ఆ కథలకి రెండింటికి నాలుగు వేలు రావచ్చును. యాభై మినీ కథలకి మరో నాలుగు వేలు రావచ్చును. దానితో ఉద్యోగం సంపాదించటంగాని, వ్యాపారం చేయటం కానీ చేయాలని నిశ్చయించుకొన్నాడు.

ఆ విషయం భార్యతో చెప్పాడు.

"మీరు చెప్పేది ఎప్పుడు జరిగింది చెప్పండి" అంది. అంతే. నీరుగారిపోయాడు విశ్వం.

ఛీ! తనలో రచయితను అణగద్రొక్కుతున్నది భార్యే అని అనుకొన్నాడు. పైకి వచ్చిన ఏ రచయిత జీవితాన్ని

తీసుకున్నా దానికి అతని భార్య ప్రోత్సాహం, సహకారం వుండటం నిజం. అదే తనలో కొరవడింది అందుకే తను పనికిరాకుండా ఇలా వుండిపోయాడు అని అనుకున్నాడు. ఆ రోజు ఏం తోచలేదు.

4

ఒకరోజు ఎడిటర్ దగ్గరికి వెళ్ళాడు.

అప్పటికే బహుమతి కథలు పడి నెలరోజులవుతుంది. అతనిని కలిసి రావలసిన డబ్బులు గురించి అడిగాడు.

"ఏం డబ్బులు?" ఎదురు ప్రశ్న వేశాడు చలపతి

ఆశ్చర్యపోయాడు విశ్వం.

కథల సంగతి—అగ్రిమెంట్ సంగతి చెప్పాడు.

"విశ్వంగారూ! మీరు మా సంస్థకి కొత్తగాబట్టి చెబుతున్నాను. ప్రతీసంవత్సరం కథలపోటీ పెడుతున్నాం. కానీ ఇంతవరకూ మొదటి, రెండవ బహుమతులు పైవారికి ఇవ్వలేదు. ఒకవేళ ఇచ్చినా ఆ సొమ్ములో తొంబయి శాతం నాదే—అర్థమైందా?" సూటిగా చెప్పాడు. విశ్వం కళ్ళకి ఆ ఎడిటర్ మనుషుల్ని పీక్కుతినే అగోరీలా కనిపించాడు. నోట మాట రాలేదు.

"మీరు ట్వెంటీ కథలు ఇచ్చారు. వాటికి బహుమతి కథలకి ఇప్పటికే మీకిచ్చినది చాలా ఎక్కువ. చాలవనుకుంటె ఈ వందా వుంచుకోండి.—దయచేసి మీ రచనల గురించి ఇక మరచిపొండి—ఆనందం పత్రికలో మీలా రాసే రచయితలు చాలామంది వున్నారు. వారికి నా ట్రీట్‌మెంట్ ఎంతో బాగుందని మెచ్చుకుంటున్నారు. ప్రతిసారి ఓ కొత్త రచయితకి అవకాశం ఇవ్వాలని ఇలా చేశాను" అంటూ వంద రూపాయిల నోటు అతనికి అందించాడు చలపతి.

విశ్వం స్థాణువై పోయాడు. దుఃఖంవలన నోట మాట

రాలేదు. ఎడిటర్ చేసిన దోపిడీ తెలుసుకొని అయిదు నిమిషాల వరకూ ఏం మాట్లాడలేకపోయాడు.

"మీమీద చర్య తీసుకుంటాను" నెమ్మది నెమ్మదిగా అన్నాడు. అతని గొంతు జీరబోయింది.

"విశ్వంగారూ! అనవసరంగా హైరానపడకండి. మీరు నన్నేం చేయలేరు. మీ చేతులతో రాసిన అగ్రిమెంటు నాదగ్గర వుంది అంత బాధపడ నక్కరలేదు. కావాలంటే మరో యాభై తీసుకోండి" అన్నాడు వగరపళ్ళు పైకి కనబడేటట్లు నవ్వుతూ.

"ఛీ! దుర్మార్గుడా!" విసురుగా బైటకి వచ్చేశాడు.

దుఃఖం వలన బాధ వలన ఏం చేయాలో తోచలేదు. ఇంటికి వెళ్ళాడు. ఎదురుగా దిష్టిబొమ్మలా భార్య—కోపం వచ్చింది. 'ఛీ! పెళ్ళయిన నుండే కదా కష్టాలు మొదలయ్యాయి' అనుకున్నాడు.

"రాజ్యం! గ్లాసుతో నీరు తీసుకురా!"

"మెల్లగా చెప్పలేరా? అరుస్తారేం?" అంటూ తెచ్చి టేబిలుమీద నీరుపెట్టింది. అంతే. విశ్వంలో కోపం ఉప్పొంగింది. "మర్యాద తెలీదూ?" అంటూ చెంపమీద కొట్టాడు. అసలు విశ్వానికి అంత కోపం యెప్పుడూ రాలేదు. చుట్టూ వున్న పరిస్థితులు అతనిని ఆ పని చేయించాయి.

మరి ఇంట్లో వుండలేకపోయాడు.

బయటికి వచ్చి రోడ్డుమీద పిచ్చెక్కినట్లు తిరిగాడు. మనస్సు దేనిమీదా స్థిరంగా నిలవడం లేదు. తనకు జరిగిన అన్యాయమే మనస్సుని దొలిచేస్తుంది. తనకు జరిగిన దోపిడికి ఏం చేయాలి? అసలు ఏం చేయగలడు? చేతిలో చిల్లిగవ్వలేదు. వూరిలో తెలిసిన వ్యక్తులు లేరు. సాయంత్రం వరకూ పిచ్చెత్తినట్లు తిరిగాడు. తను ఏం చేయలేకపోయా

నన్న నిరాశ అతనిని కృంగదీసింది.

ఇంటికి వచ్చేసరికి గొళ్ళెంవేసి వుంది. వెంటనే లోపలికి వెళ్ళాడు. రాజ్యం వున్న అలికిడి లేదు. టేబిల్‌మీద కాగితం—"మా వూట్టింటికి పోతున్నాను—మీ మనస్సు, మీరు బాగుపడినప్పుడే వస్తాను" — అని వుంది. క్రింద రాజ్యం సంతకం వుంది.

విశ్వం నీరసంగా కుర్చీలో కూర్చుండిపోయాడు.

రాజ్యంకోసం వెళ్ళాలనుకున్నాడు. కానీ అభిమానం అడ్డు తగిలింది. ఆమెమీద కోపం. ఎడిటర్‌మీద కోపం, తనమీదకి మళ్ళాయి. జీవితం వ్యర్థం అనుకున్నాడు. తనను అర్థం చేసుకొని వూరడించవలసిన అర్ధాంగి కూడా తనమీద కోపంతో వెళ్ళిపోయింది.

బ్రతకడం అసహ్యమనిపించింది.

చనిపోదామనుకున్నాడు. తను పిరికితనంతో చినిపోవడం లేదు. తెలుగు రచయితల్ని వేధిస్తున్న సమస్యని పరిష్కరించడానికి చనిపోతున్నాడు. సమస్యల పరిష్కారానికి చావు మార్గం కాదని అతనికి తెలుసు. కానీ బ్రతికివుండగా సాధించలేనిది చావు ద్వారా సాధించదలస్తే ఆ సమస్యకి చావే పరిష్కారం అని నమ్మకం ఏర్పరుచుకున్నాడు.

తను బ్రతికుండగా తనకు జరిగిన అన్యాయాన్ని యెదిరించలేడు. తన భార్య పరిస్థితి ఎలా వున్నా పర్వాలేదు.

రాత్రి కూర్చుని చాలా పెద్ద ఉత్తరం రాశాడు.

అందులో తనకు జరిగిన అన్యాయం—తనని, మిగతా రచయితల్ని 'ఆనందం' పత్రిక ఎడిటర్ ఏ విధంగా దోపిడీ చేశాడో వివరంగా రాశాడు. అదేకాకుండా తన చావుకి ఆ ఎడిటరే కారణమైనట్లు యెన్నో విషయాలు ఆధారాలు సృష్టించాడు. తనవంటి రచయిత చనిపోవడానికి ఆ ఎడిటరే

కారణమని. తనవంటి అభాగ్యులు మరణించకుండా రక్షించమని ప్రధానమంత్రిని, ముఖ్యమంత్రిని కోరుతూ పెద్ద ఉత్తరం రాసి—విషం తిని చనిపోయాడు—విశ్వం.

విశ్వం మరణవార్త దేశంలోనే పెద్ద సంచలనం కలిగించింది. అతను ఒక రచయిత గాబట్టి, అతను ప్రధానమంత్రిని, ముఖ్యమంత్రిని అభ్యర్థించాడు గాబట్టి, పత్రికలు చాలా ప్రాముఖ్యత నిచ్చాయి అతని మరణానికి. కొన్ని పత్రికలు అతని ఉత్తరాన్ని ప్రింట్ చేశాయి. రచయితల సంఘాలు, 'ఆనందం' పత్రిక దాడికి తట్టుకోలేని అనేక చిన్న పత్రికలు—ఆందోళన మొదలుపెట్టాయి. సమస్య తీవ్రతరం అయింది.

రచయితల్ని దోపిడీచేస్తూ లక్షలు ఆర్జించిన 'ఆనందం' వారపత్రిక ఎడిటర్ చలపతి అరెస్టు అయ్యాడు.

'ఆనందం' వారపత్రికకు ఇప్పుడు మరో ఎడిటర్ వచ్చాడు. □

కెమెరా లేని విలేఖరి?

కెమెరా లేకుండా ఇంటర్వ్యూకి ఎందుకు వచ్చావ్. పో అవతలకి !

నాట్యతారలు

ఎమ్.వి.వి.సత్యనారాయణ

నాట్యభారతి కోలాహలంగా వుంది. మొదటి వార్షికోత్సవం జరుపుకొంటున్న సందర్భంలో పురప్రముఖులు అంతా హాజరయారు.

హాలులో లైట్లు మందకొడిగా వెలుగుతున్నాయి. వేదిక మీద ప్రకాశవంతమైన వెలుతురులో హారతి మెరుపుతీగ లాగా కదులుతోంది.

జానపద నాయికలాగా అలంకరించుకుంది హారతి.

మొక్కజొన్న తోటలో ప్రియుడి సమాగమానికి మాట తీసుకుంటోంది. ఆమె హావభావాలు ప్రేక్షకులను సమ్మోహ పరుస్తున్నాయి. ఆమె కళ్ళ కదలికలు భావ ప్రకటనకు యథాశక్తి సహకరిస్తున్నాయి. ఆమె నాట్యం ముగిసింది.

వేదికమీద రైతు దంపతుల జంట జానపద నృత్యం మొదలైంది.

అతడు మసక చీకటిలో కదిలాడు. గుమ్మందాటి గ్రీన్ రూం గుమ్మంముందు నిలబడ్డాడు.

హారతి మేకప్ తుడుచుకుంటోంది గదిలో యింకా కళాకారులున్నారు. బట్టలు కట్టుకుంటున్నవాళ్ళూ, అలంకరణలు తొలగించి భద్రంగా పెట్టెలలో సర్దుకుంటున్నవాళ్ళూ అతడిని పట్టించుకోలేదు.

అద్దంలోకి చూచి పులిక్కిపడింది హారతి. గ్రీన్‌రూం గుమ్మంవద్ద అతడి రూపం స్పష్టంగా కనిపిస్తోంది.

"హారతీ!" అన్నాడతడు.

హారతి భయంగా చుట్టూ చూచింది. ఎవరూ ఆమెను పరిశీలించి చూడటంలేదు. ఆమె గుమ్మం వద్దకు వచ్చింది.

"ఎవరు కావాలి?" అడిగింది హారతి.

"జయ పంపింది."

"ఎందుకు?" అంది.

అతడు తీక్షణంగా చూచి, "జయ ఎందుకు పంపుతుందో తెలియదా?" అన్నాడు.

ఆమె నిర్ఘాంతపోయింది.

"పోర్టికోలో కాచుకోండి. వస్తున్నాను!"

అతడు తలూపి నడవాలోకి వెళ్ళి మాయమయాడు. హారతి చకచక దుస్తులు మార్చుకుంది.

హారతి వెనుక దారిలోంచి బయటపడింది. రోడ్డుమీద

ఖాళీ టాక్సీ ఆగివుంది. హారతి అటు పరుగెత్తింది. టాక్సీలో చిన్నదీపం వెలుగుతోంది. డ్రయివర్ డోర్ తెరచి ఆమె వైపు చూశాడు.

"డ్రయివర్! మధురానగర్ వస్తావా? ఆరోలైన్. నలభయ్యో ప్లాట్."

డ్రయివర్ తలూపాడు.

ఆమె లోపలికి వచ్చి కూర్చోబోయింది. అంతసేపూ సీటుమీద పడుకున్న అతడు లేచి కూర్చున్నాడు. అతడు గ్రీన్ రూం గుమ్మంలో కనిపించిన ఆగంతకుడు.

హారతి తడబడింది. కాలు వెనక్కి తీసుకోబోయింది. అతడు చురుకుగా ఆమె చెయ్యి పట్టుకుని సీటుమీదకు లాగాడు ఆమె వగర్చింది.

"ఏమిటది?" అరచిందామె

అతడు ఆమెమీద నుండి వొంగి తలుపు మూసి, "డ్రయివర్! పోనివ్. అడ్రస్ చెప్పింది కదా!" అన్నాడు.

టాక్సీ హుంషారుగా పరుగెత్తింది.

"ఎందుకలా చూస్తావ్? నన్ను పోర్టికోలో కాచుకుని వుండమన్నావ్. దొడ్డివారిన పారిపోయాలని చూచావ్. జయ పంపిన మనిషితో యిలాగేనా ప్రవర్తించేది?"

ఆమె కళ్ళు రోషంతో ఎర్రబడ్డాయి. "జయ ఎవరినీ పంపదు. తానే వస్తుంది. నీవు యెవరివో నాకు తెలియదు."

టాక్సీ మధురానగర్‌లో ఆగింది. నలభయ్యో ప్లాట్‌లో చిన్న డాబా యిల్లు వుంది. చుట్టూ ఖాళీస్థలం వుంది. ఇంటి గుమ్మంలో నలభై ఏళ్ళ వ్యక్తి నిలబడివున్నాడు.

"ఎవరతను?" అడిగాడు ఆగంతకుడు.

"మా బాబాయి" అంది హారతి.

"నువ్వు ఒంటరిగ వుంటున్నట్టు జయ చెప్పింది."

హారతి అనుమానంగా చూచింది. "నువ్వెవరు? నిజం చెప్పు" అంది.

"ఇంట్లో చెబుతాను. మీ బాబాయికి ఏం చెబుతావో చెప్పు. ఒక పావుగంటపాటు నీతో ఏకాంతంగా మాట్లాడాలి!"

ఇక తప్పదన్నట్టు హారతి టాక్సీ దిగింది. అతడు బాడుగ చెల్లించి, ఆమె వెనుక చురుకుగా అడుగులు వేశాడు.

"ఏమ్మా, కార్యక్రమం బాగా జరిగిందా?" అడిగాడు బాబాయి.

హారతి తలూపింది. "ఈయనను జయ పంపిందట!" అని లోపలకు నడిచింది. బాబాయిని తప్పించుకుని ఆగంతకుడు ఆమె వెంట లోపలకు వెళ్ళాడు.

హారతి వెనుక తలుపు మూసి, "జయ పంపిందంటే నువు నమ్మడంలేదు. నీ దగ్గరున్న ఫిలిం యివ్వు. ఫిలిం విషం చెబితేనయినా నమ్ముతావు గదా!" అన్నాడతను.

హారతి తెల్లబోయింది.

"మీది కంగ్లాదేశ్ కదా!" అంది అకస్మాత్తుగా.

"అవును. రాకా పట్నంలో నువూ, జయా, మల్లికా కలిసి నాట్య ప్రదర్శన లిచ్చారు. మల్లిక అక్కడ దౌత్య వుద్యోగితో చనువుగా వుండి సైనిక రహస్యాల ఫిలిం సంపాదించింది. దాన్ని మీ ముగ్గురూ శనిస్తాన్ దేశానికి బేరం పెట్టారు."

"అబద్ధం! నాకేం తెలియదు."

"రాకా నుండి వచ్చాక నువు మాత్రమే స్థానికంగా వున్నావు. ఫిలిం నీ వద్దనే వుంటుందని నేను సరిగ్గానే

వూహించాను."

"లేదు ...లేదు...."

అతడామె జుట్టు పట్టుకున్నాడు. "ఆఫ్ఘనిస్థాన్‌తో బేరం పెట్టడానికే మీ బాబాయిలాగా ఒక వ్యక్తిని సృష్టించుకున్నావు. ఫిలించుట్ట నాకు ఇచ్చి పంపెయ్ లేకపోతే నిన్ను చంపి అయినా ఆ చుట్టను తీసుకుపోతాను."

"ప్లీజ్ ....వదలిపెట్టు....నావద్ద ఎటువంటి ఫిలిం చుట్ట లేదు" ఆమె అతడి కాళ్ళవద్దకు జారిపోయింది. ఆమె చేతులు మంచం కింద తడిమాయి.

టిక్‌మని చిన్నగా శబ్దమయింది

అప్పుడే తలుపుమీద టకటక చప్పుడయింది.

ఆగంతకుడు జేబులోంచి కత్తితీశాడు. హారతి మొహంలో మృత్యుకళ తాండవిస్తోంది.

"ప్లీజ్ ....నన్ను వదలిపెట్టు! ప్లీజ్ ....ఫిలించుట్ట నావద్ద లేదు."

కత్తి విసురుగా గాల్లోకి లేచింది. ఆమె వీపులోకి కస్సున దిగింది.

2

"డిటెక్టివ్ శిరీష్‌ని మాట్లాడుతున్నాను!"

"శిరీష్! ఒకసారి మధురా నగర్ ఆరో లైన్—నలభయ్యో ప్లాట్‌కి రాగలవా?" అన్నాడు క్రయిమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కుమార్.

"ఇప్పుడే బయల్దేరుతున్నాను!" శిరీష్ రిసీవర్‌ను క్రెడిల్‌చేసి బయటికి పరుగెత్తాడు.

డాట్సన్ కారు మధురా నగర్ వైపు పరుగెత్తింది నలభయ్యో నెంబర్ ప్లాట్ ముందు పోలీసులు గుమిగూడారు. కారు రోడ్డుమీదనే ఆపి ఇంట్లోకి నడిచాడు శిరీష్.

కుమార్ అతడిని రిసీవ్ చేసుకున్నాడు.

మెయిన్ హాలులో నలభై ఏళ్ళ వ్యక్తి సోఫాలో పడు కొని వున్నాడు. అతడి ఒంటిన గాయాలున్నాయి. మేల్ నర్స్ అతడి గాయాలకు కట్లు కడుతున్నాడు.

"లోపల హారతి అనే నాట్యకత్తెను ఎవరో కత్తితో పొడిచి చంపారు" అన్నాడు కుమార్ అటు దారితీస్తూ.

డిటెక్టివ్ శిరీష్ అతడిని వెంబడించాడు.

హారతి బోర్లగిల పడువుంది ఆమె వీపులో కత్తిపోట్లు దిగి వున్నాయి కత్తి గచ్చునేలమీద పడివుంది. హారతి చేతులు రక్తంతో ఎర్రబడి ముందుకు చాచి తల కిరు ప్రక్కలా నేలమీద ఆన్చివున్నాయి.

"తతంగం మొత్తం ముగిసింది. శవం మార్చ్యురీకి వెళ్ళడమే తరవాయి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కుమార్.

డిటెక్టివ్ శిరీష్ తలూపి, "కత్తిమీద వ్రేలిముద్రలు దొరికాయా?" అన్నాడు.

"హంతకుడు తనను తాను దాచుకునే ప్రయత్నం చేయ లేదు. ముందు సోఫాలో పడుకున్నాడు చూడు—కత్తి పోట్లతో—అతడు హారతికి బాబాయి వరస అవుతాడు. పేరు పరశురామయ్య. అతడు హంతకుడిని చూశాడట...."

శిరీష్ ఏదో అనబోయాడు.

కుమార్ మందహాసంచేసి, "వ్రేలిముద్రలు తీసు కున్నాం. కత్తిమీది ముద్రలు అతడివి కావు....పైగా అతడి ఒంటిన వున్న గాయాలు అతడికి అతడు చేసుకున్నవి కావు. అలాంటి వీలులేని స్థలాలలో తగిలాయి పోట్లు. చేతికి వెనుకప్రక్కా, వెనుక కాలి పిక్కమీదా పొత్తి కడు పుకి ఎడమవైపూ. ఇవి హంతకుడి వునికిని స్పష్టపరుస్తు

న్నాయి" అన్నాడు.

"హారతిని అతడు ఎందుకు హత్యచేశాడు? అతడి పేరు పరశురామయ్యకు తెలిసివుండాలి!"

"హత్యకు కారణం పరశురామయ్య చెప్పలేదు.... హంతకుడి పేరుకూడా...." కుమార్ వెనుకప్రక్క బల్ల మీద వున్న టేప్‌రికార్డర్ అందుకున్నాడు.

"శిరీష్! హారతి చావుబతుకుల మధ్య ఈ టేప్‌రికార్డర్ ఆన్‌చేసింది. ఇది మంచం క్రింద వుంది. హంతకుడికీ ఆమెకూ జరిగిన సంభాషణలో కొంతభాగాన్ని రికార్డుచేసి హారతి మనకు అందించగలిగింది" అన్నాడు.

శిరీష్ మొహం వెలిగింది.

టేప్ రీవైండ్ చేసి ప్లేనొక్కాడు.

టేప్ నడుస్తోంది. 'బోనీ ఎమ్' సంగీతం వస్తోంది రెండు పాటలయాయి.

శిరీష్ ఓపికగా వింటున్నాడు.

పాట మధ్యలో ఆగిపోయింది....

తలుపుమీద టకటక చప్పుడయింది.

"ప్లీజ్....నన్ను వదలిపెట్టు! ప్లీజ్....ఫిలించుట్ట నావద్ద లేదు."

చెయ్యి విసిరినట్టు గాలికోత శబ్దం. కస్‌స్....

"వ్....వ్....అ....మ్మో...." చావుకేక.

తలుపు బయట టకటకలాడింది. స్త్రీ గొంతు బాధతో మెలిక తిరిగింది.

"చెప్పు....ఎక్కడ దాచావో...." అరిచాడు హంతకుడు.

"నన్ను....చంపక....అబ్బా....బాధ...."

"నీలాగే ఆ జయా, మల్లికా కూడా చస్తారు...."

"ప్లీజ్....నన్ను వదలిపెట్టు...."

"ఎవరది....తలుపు తియ్యి...." ఎవరో తలుపును తన్నుతున్నాడు.

"ఆ తన్నేది పరశురామయ్య" అన్నాడు కుమార్ మధ్యలో.

"ఫిలిం నా దగ్గర మొత్తం లేదు ...ప్లీజ్....నన్నువదలిపెట్టు."

"మొత్తం లేదా? ఏమయింది?"

హారతి ఏడుస్తోంది "ఏమో నాదగ్గర....మూడంగుళాల పొడవున్న మైక్రో ఫిలిం మాత్రమే వుంచారు....ఇలా ఎవరో .. మా యింటిమీదకు "

"ఏడుపు ఆపు. మైక్రో ఫిలిం యెక్కడ దాచావ్?"

"నేను చచ్చిపోతున్నాను....ఇక నీకు ఫి ...లి....ం"

"త్వరగా ..చెప్పు! నీ ప్రాణం రక్షిస్తాను."

"నిజమా!"

"........"

అటుతర్వాత పెట్టె వెతుకుతున్నట్టు శబ్దం. అడుగుల చప్పుడు.... జీప్ నడుస్తోంది. అడుగుల చప్పుడు దగ్గరవుతోంది. ఆమె నేలమీద పాకుతోన్నట్టుంది.

"ఆ(!" అన్నదామె. "వ్....వ్...." అంతే శబ్దం! తరువాత నేలమీద ఖంగుమంది. అడుగుల చప్పుడు దూరమవుతోంది.

"అతడికి మైక్రో ఫిలిం దొరికింది. ఆమెను కడతేర్చి కత్తి నేలమీదకు విసిరాడు" అన్నాడు శిరీష్.

కుమార్ తలూపి, "అటుతర్వాత తలుపు తెరిచాడు. తలుపు యివతల పరశురామయ్య కాచుకున్నాడు. హంతకుడిని యెదుర్కోబోయాడు. హంతకుడు చప్పున కింద పడే

పిన కత్తి అందుకున్నాడు. పరశురామయ్యను అందినచోట నల్లా కత్తితో గాయపరచి పారిపోయాడు" అన్నాడు.

"పరశురామయ్య మాట్లాడగలడా?" అడిగాడు శిరీష్.

కుమార్ తలూపి బయటికి నడిచాడు.

శవం అంబులెన్స్‌లోకి చేరుకుంది.

శిరీష్ సోఫాకి దగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

"పరశురామయ్యగారూ! హంతకుడిని మీరు యిదివరలో చూశారా?" అడిగాడు శిరీష్.

"లేదు సార్!" అన్నాడు పరశురామయ్య.

"ఇప్పుడు మరల చూస్తే గుర్తు పట్టగలరా?"

తప్పకుండా!"

"హంతకుడికి హారతి ఎలా తెలుసు?"

"ఆ విషయం తెలియదు సార్!"

"జయ యెవరు? మల్లిక యెవరు? మీకు తెలుసా?"

"మా అమ్మాయి స్నేహితురాళ్ళు."

"హారతి మీకెలా బంధువు?"

"మా అన్నయ్య కూతురు హారతి. మా అన్నయ్యా, వదినా ఆమెకు చిన్నతనంలోనే పోయారు."

"జయా, హారతీ, మల్లికా .. వీళ్ళకు మైక్రో ఫిలిం దొరకడం ఏమిటో, అసలు ఆ ఫిలింలో ఏముందో మీకు తెలుసా?"

"తెలియదు సార్! నేనూ యిప్పుడే మొదటిసారిగా వింటున్నాను."

"వీళ్ళు ముగ్గురూ కలసి ఈ మధ్య ఎక్కడికయినా వెళ్ళి వచ్చారా?"

"బంగ్లాదేశ్ వెళ్ళారు. రాకాపట్నంలో నాట్యప్రదర్శన లిచ్చారు."

శిరీష్ కళ్ళు మెరిశాయి. టేపును రివైండ్ చేసి మరల ప్లేచేశాడు. హంతకుడి గొంతును పరిశీలించుకున్నాడు.

"హంతకుడు ఎలా వుంటాడు?" అడిగాడు శిరీష్.

"ఎర్రగా వున్నాడు. కండలు తిరిగిన శరీరం. పల్చగా మాపిన గడ్డం. మీసం నున్నగా గొరిగి వుంది. గోధుమ రంగు పాంటు వేశాడు. ముదురుపచ్చ రంగు చొక్కా. కాళ్ళకు సేఫ్టీ షూ. మెడలో ఎర్రటి జేబురుమాలు కాలర్ చుట్టూ వేసుకున్నాడు."

శిరీష్ వర్ణనను నోట్ చేసుకుని. "రాకా పట్నంలో మీ అమ్మాయి ప్రదర్శన యిచ్చినపుడు మీరు అక్కడ లేరా?" అన్నాడు.

"వున్నాను సార్! అక్కడ విచిత్రం ఏమీలేదు."

"హంతకుడిని మీరు అక్కడ చూచి వుంటారు. బాగా గుర్తుకు తెచ్చుకోండి!"

పరశురామయ్య తల అడ్డం తిప్పాడు.

"జయ యెక్కడుంది?"

"మద్రాసులో సినిమాల్లో వేషాలకోసం ప్రయత్నిస్తున్నట్టుగా విన్నాను."

"ఆమె చిరునామా చెబుతారా! హంతకుడు ఆమెకోసం గానీ, మల్లిక కోసంగానీ బయల్దేరి వుంటాడు."

కుమార్ ఈలోపుగా హారతికి సంబంధించిన వస్తువులు వెతకసాగాడు. ఆమెకు వచ్చే వుత్తరాలు దొరికాయి. వాటిలో జయ రాసిన ఉత్తరం దొరికింది.

"కుమార్! హంతకుడికోసం గాలించాలి. రైల్వే స్టేషన్లలో, బస్టాండులో అతడి వర్ణనతో పోలిన వ్యక్తికోసం గాలించాలి" అన్నాడు శిరీష్.

తరువాత జయ రాసినవుత్తరం చేతిలోకి తీసుకున్నాడు.

3

"ఈ రోజు షూటింగులో నీకు నాలుగు క్లోజప్ షాట్స్ ఏర్పాటు చేశాను." అన్నాడు డైరెక్టర్ బోస్.

జయ ఒంపులు తిరిగింది. కళ్ళలో బోలెడంత కృతజ్ఞత నింపుకుంది.

"మీరు నాకు తారగా గుర్తింపు యిస్తున్నారు. మీ ఋణం తీర్చుకోలేను" అంది జయ.

బోస్ నవ్వి, "నీలాంటి నర్తకీమణి యీ రంగంలో రాణించదు. ఒళ్ళుకుదుపులతో చౌకబారు నాట్యం చేయాలి. అయినా మంచి నర్తకి పాత్రవస్తే పోనివ్వను. నీకు ఇప్పిస్తాను" అన్నాడు.

"థాంక్స్ సార్! భాగ్యలక్ష్మి వాళ్ళకు శాస్త్రీయనృత్యం వచ్చిన అమ్మాయి కావాలని విన్నాను. నన్ను శిఫారసు చేస్తారా?"

బోస్ ఆమె భుజంమీద చనువుగా చేయివేసి, ముందుకు వొంగి రిసీవరందుకోబోయాడు. అప్పటికే ఫోన్ మ్రోగింది.

బోస్ అందుకుని, "హలో...." అన్నాడు తనగురించి చెప్పుకుని.

"డిటెక్టివ్ శిరీష్, వైజాగ్ నుండి మాట్లాడుతున్నాను. మీ యూనిట్ లో జయ అనే అమ్మాయి పనిచేస్తోందా బోస్ గారూ!" అన్నాడు శిరీష్ అవతలనుండి.

బోస్ తెల్లబోయి, "జయా! పనిచేస్తోంది. అయితే రంగంలో చాలామంది జయలున్నారు. మీకు కావలసిన జయ....ఎవరో" అన్నాడు.

"ఎల్ జయ. వైజాగ్‌నుండి వచ్చింది. ఈ మధ్యనే బంగ్లాదేశ్ లో నృత్య ప్రదర్శనలిచ్చి వచ్చింది."

"అయితే మాట్లాడండి. ఆమె నా ప్రక్కనే వుంది." రిసీవర్‌ను జయకు అందించాడు బోస్.

"సార్! జయను మాట్లాడుతున్నాను" అందామె.

"మిస్ జయా! హారతి మీకు ఈమధ్య వుత్తరాలు రాసిందా?"

"హారతా! ఆ విషయం మీకు ఎందుకవసరమయిందో చెబుతారా?"

"హారతి యికమీదట మీకు వుత్తరాలు రాయలేదు."

"ఏం? ఎందుకని? ఏమిటిసార్—అసలు మీరెవరు?"

"హారతిని రుస్తుమ్ హత్యచేశాడు. ఆ కేసును పరిశోధిస్తున్న అపరాధ పరిశోధకుడిని. రుస్తుం ఎవరో నాకు తెలుసు!"

జయ గడగడలాడింది. వాణికిపోయింది. ఆమె చేతిలోంచి రిసీవర్ జారిపడింది. బోస్ ఆమె వీపుమీద ధైర్యంగా తట్టి. రిసీవరందుకున్నాడు.

"బోస్‌గారూ! జయ ప్రాణం ప్రమాదంలో వుంది. రుస్తుం ఆమెమీద దాడి చేయవచ్చును. ఆమెకు అక్కడ పోలీసు రక్షణ యివ్వవలసి వుంటుంది."

"శిరీష్‌గారూ! ఇప్పుడే ఆమెచేత పోలీసుల రక్షణ కోరిస్తాను."

"థాంక్స్! ఆమెకు మల్లిక ఎడ్రసు తెలుసా? అడగండి."

బోస్ ప్రక్కకు తిరిగి అడిగాడు. "బెంగుళూర్‌లో" అంది జయ.

"పూర్తి చిరునామా కావాలి!" అన్నాడు శిరీష్.

"నాకు తెలియదు సార్!" అంది జయ.

"విమానంలో వస్తున్నాను. అంతవరకూ చెప్పినట్టు చెయ్యండి" అవతల క్లిక్‌మంది.

"ఇదేమిటి? హారతి యెవరు? రుస్తుం యెవరు? ఆమెను రుస్తుం హత్యచేయడం ఏమిటి?" అన్నాడు బోస్.

జయ తల అడ్డంగా త్రిప్పి, "ఏమోనండి .. నాకు అంతా అయోమయంగా వుంది" అంది.

4

విమానం మీనంబాకం విమానాశ్రయంలో దిగింది. రుస్తుం విమానంలోంచి దిగాడు. చకచక ఫార్మాలిటీస్ ముగించుకుని విమానాశ్రయంలోంచి బయటపడ్డాడు.

టాక్సీ ఎక్కి అడ్రస్ చెప్పాడు.

ఇరవై నిమిషాల తర్వాత సన్నపాటి రోడ్డుమీద టాక్సీ దిగాడు. రోడ్డుకు అటూ యిటూ చిన్నచిన్న యిళ్ళు వున్నాయి. మురికి వీధులు కంపుకొడుతున్నాయి. చాలీ చాలని ఆదాయాల వాళ్ళు బతుకుతున్న కొంపలవి.

రుస్తుం యిళ్ళ మధ్యనుండి నడవసాగాడు. మురికి కాలవకు అవతల పెంకుటిల్లు వుంది. ఆ యింటి ముందు ఇద్దరు పోలీసులు కాపలా వున్నారు. తుపాకులు పట్టుకుని అరుగుమీద కూర్చున్నారు.

రుస్తుం ఒక యింటిచాటున ఆగాడు. వీధుల ప్లాన్ అంచనా వేసుకున్నాడు. వెనక వీధిలోంచి నడిచివచ్చాడు పోలీసులు కాపలా వున్న ఇంటివెనుక తలుపు మూసివుంది. అక్కడ కూడా ఒక సాయుధుడైన పోలీస్ కాపలా వున్నాడు.

రుస్తుం అతడివైపు నడిచాడు. జేబులోంచి సిగరెట్ తీసి ముట్టించాడు. చేతితో పట్టుకుని పోలీసువైపు చూశాడు.

"పదో నెంబర్ యిల్లు యెటువుంది?" అడిగాడు రుస్తుం.

పోలీసు చెయ్యిచాపాడు. ఏదో చెప్పబోయాడు. రుస్తుం

తన చేతిలోని సిగరెట్టును అతడి కాళ్ళవద్ద జారవిడిచాడు.

"తుస్....స్....స్...."

"అరె!" అన్నాడు పోలీస్.

చిన్న శబ్దంతో సిగరెట్ ప్రేలింది. మొదలు నరికిన చెట్టులాగా అతడు పడిపోయాడు.

రుస్తుం నవ్వుకున్నాడు. పోలీసును గుమ్మంలోంచి లోపలకు యీడ్చి తలుపు మూసి బోల్ట్ పెట్టాడు. తరువాత పిల్లిలాగా లోపలకు నడిచాడు. జయ అద్దంముందు కూర్చుంది. పెదిమలకు లిప్‌స్టిక్ అద్దుకుంది. పెదిమలొక దానితో ఒకటి తాకించి రంగు సమానంగా అంటుకునేలాగ చేస్తోంది.

అద్దంలో ఆమె వెనక అతడు ప్రత్యక్షమయాడు.

అదే ఆకారం! కండలు తిరిగిన శరీరం. పల్చగా మాపిన గడ్డం. నున్నగా గొరిగిన మీసకట్టూ, గోధుమ రంగు చొక్కా, కాళ్ళకు సేఫ్టీ షూ, మెడలో ఎర్రటి జేబు రుమాలూ ...

"నేనే జయా! రుస్తుంను" అతడు వ్యంగ్యంగా నవ్వాడు.

ఆమె కీచుగా అరవబోయింది. రుస్తుం ఆమె నోటిని మూశాడు.

"చంపేస్తాను. అరవక! మల్లిక సంపాదించిన ఫిలిం నీవద్ద వుంది. దాన్ని నాకు యిచ్చెయ్!"

"ఫిలిం నావద్ద లేదు."

"అలా అబద్ధం చెప్పి హారతి ప్రాణం కోల్పోయింది. ఆమె ఒంట్లో కత్తి దింపేవరకూ నిజం చెప్పలేదు."

జయ భయంగా చూస్తోంది. రుస్తుం లోపలకు యెలా వచ్చాడు? గుమ్మాలవద్ద కాపలావున్న పోలీసులు ఏమ

యారు?

"నిన్ను రక్షించడానికి యెవరూ రారు. త్వరగా యిచ్చెయ్!"

"ఏం....ఏ....ఏ ఫిలిం?"

అతడు జేబులోంచి పిస్తోలు తీశాడు. ఆమె గుండెల్లోకి గురిపెట్టాడు. "ఏ ఫిలిమా? నేను నీకు తెలుసు. నువ్వూ, మల్లికా నా దౌత్య కార్యాలయానికి వచ్చారు. మల్లిక నన్ను తన జాణతనంతో బుట్టలో వేసుకుంది! నావద్ద దౌత్య రహస్యాల ఫిలిం వున్నట్టు తెలుసుకుంది. ఆమె శత్రువులతో లాలూచీ పడి మా దేశం వచ్చింది. కేవలం ఫిలిం కోసమే ఆమె నామీద జాణతనం ప్రదర్శించింది. ఆమెను నువు వెంబడించుకుని వచ్చావు."

"మల్లిక నాకు ఫిలిం సంగతి చెప్పలేదు."

అతడు వికటంగా నవ్వాడు. "ఆమె నీకు ఫిలిం విషయం చెప్పింది. అందుకే నువు మరుసటి రోజు నా వద్దకు వస్తానని మాట యిచ్చి కూడా రాలేదు ఫిలింతో యెంత త్వరగా వీలయితే అంత త్వరగా కంగ్లాదేశ్ విడిచి పెట్టారు. మీ ముగ్గురూ ఫిలిం అమ్మగా వచ్చిన డబ్బు సమానంగా పంచుకోవాలనుకున్నారు. అంతవరకూ.... నమ్మకం కుదరక....ముగ్గురూ తలా ఒక భాగం దగ్గర పెట్టుకున్నారు....నీ దగ్గరున్న ఫిలిం వెంటనే తీసి ఇవ్వు" అన్నాడు కర్కశంగా.

బయట ఏదో వాహనం ఆగింది.

"పిస్తోలు ప్రేలుతుంది, ఫిలిం యెక్కడ దాచావు?" అతడు సేఫ్టీకాచ్ తప్పించాడు.

జయ జేబులు సొరుగు చూపించింది. అతడు చప్పున సొరుగులాగి చేత్తో వెతకసాగాడు.

వాకిట మెట్లమీద బూట్ల చప్పుడవుతోంది.

ఆమె శక్తినంతా కూడకట్టుకుంది. బలంగా సొరుగును లోపలికి తోసింది. అతడు యెగిరి గంతేశాడు గిలగిలలాడుతున్నాడు. మణికట్టుకు యెగువభాగంలో చెయ్యి నొక్కుకుపోయింది.

అతడు బాధను పండ్ల బలిమిని అణచుకున్నాడు. జయను ప్రక్కకు తోశాడు. సొరుగులోంచి చేతిని లాక్కున్నాడు. ఆమె గుండెలో బుల్లెట్లు దింపి బయటికి పరుగెత్తాడు. అతడి వెనుక బూట్ల చప్పుడు వెంబడించింది.

రుస్తుం బులెట్‌లాగా పరుగెత్తాడు. రోడ్డు మలుపు తిరిగాడు.

డిటెక్టివ్ శిరీష్ రోడ్డుమీదకు వచ్చాడు. వగుర్చుతున్నాడు. రుస్తుం అప్పుడే మలుపు తిరుగుతున్నాడు.

శిరీష్ గురిచూసి పిస్తోలు ప్రేల్చబోయాడు. ఎవరో కుర్రాడు సైకిలుమీద అడ్డంగా వచ్చాడు. పిస్తోలు ప్రేల్చడం ఆపి డిటెక్టివ్ శిరీష్ ముందుకు పరుగెత్తాడు.

5

"ప్రఖ్యాత నాట్యతార మల్లిక నృత్య ప్రదర్శనం! అపూర్వమైన అవకాశం!" పేపరమ్మే కుర్రాడు అరుస్తున్నాడు.

ప్రతి యింటి నెంబర్ పరిశీలించుకుంటూ రుస్తుం నడుస్తున్నాడు. బసవణ్ణ గుడి వీధిలో పేపరమ్మే కుర్రవాడు అతడికెదురుపడ్డాడు. పేపరమ్మే కుర్రవాడు యింకా అరుస్తున్నాడు.

రుస్తుం అతడిని ఆపి ఒక దినపత్రిక కొన్నాడు. మొదటి పేజీలోనే మల్లిక నృత్యభంగిమ అచ్చువేశారు.

"షణ్ముఖానంద హాలులో ఈ రోజే మల్లిక కార్యక్రమం

ఇస్తోంది. సాయంత్రం ఆరు గంటలకు!" గొణుక్కున్నాడు రుస్తుంది. తరువాత నడచుకుంటూ లాడ్జికి వెళ్ళాడు. సాయంత్రం వరకూ అసహనంగా గడిచింది. జేబులో కత్తి సర్దుకున్నాడు. రెండో జేబులో పిస్తోలు తెరచి బుల్లెట్లు లోడ్ చేశాడు.

సాయంత్రం అయిదవుతోనే షణ్ముఖానంద హాలులో ప్రవేశించాడు. హాలులో కుర్చీలు సర్దుతున్నారు. వేదిక నలంకరించేవాళ్ళు హడావుడిగా వున్నారు. ప్రేక్షకులు క్రమంగా హాలులో గుమిగూడారు. ప్రేక్షకుల కుర్చీలవద్దకు వచ్చి టిక్కట్లు కత్తిరించి యిస్తున్నాడు ఒక వ్యక్తి.

అరగంటలకు మల్లిక వేదికమీద నృత్యం ప్రారంభించింది. ఆమెతోబాటు మరికొంత మంది నర్తకీమణులు నృత్యం చేశారు.

తొమ్మిది గంటలకు నృత్యప్రదర్శన ముగిసింది. మల్లిక గ్రీన్ రూంలో వేషం మార్చుకుంటోంది. రుస్తుం ప్రేక్షకులలోంచి బయటపడి గ్రీన్ రూంవైపు నడిచాడు. మల్లిక చకచక దుస్తులు మార్చుకుంది. హాలులోంచి బయటపడింది.

రుస్తుం ఆమెను వెంబడించాడు. ఆమె టాక్సీని పిలిచి ఎక్కి కూర్చుంది. టాక్సీలోపల రుస్తుం ప్రత్యక్షమయాడు. మల్లికకు తల తిరుగుతోంది. ఆమె తన కళ్ళు తానే నమ్మలేనట్టు చూస్తోంది.

రుస్తుం చేతిలో పిస్తోలు ప్రత్యక్షమయింది.

"అరవక! నేను నీ వెంట వస్తాను!" అన్నాడు రుస్తుం. టాక్సీ కదిలింది.

"ఎందుకు?" మల్లిక గొంతు బొంగురుపోయింది.

"నీతో మాట్లాడాలి!" టాక్సీ వేగంగా పరుగెత్తు

తోంది.

"మైక్రోఫిలిం ఎక్కడ దాచావు?" అడిగాడు రుస్తుం.

"ఏ మైక్రోఫిలిం?"

ఆమె చెక్కిలిమీద ఛెళ్‌మంది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఆ రోజు నా పడక గదిలో ప్రవేశించావు. మా దేశ సైనిక రహస్యాల మైక్రోఫిలిం అపహరించావు. కొంత ముక్క హారతివద్దా, మరికొంత జయవద్దా దాచి వుంచావు. జయ వద్ద వున్న ఫిలిం సంపాదించకలేపోయాను. నీ వద్ద ఫిలిం ముక్క యివ్వు."

ఆమె మాట్లాడలేదు. పిస్తోలు ఆమె కణతలకు గురి పెట్టాడు రుస్తుం.

"నీకు శనిస్థాన్ మనిషి ఇస్తానన్న సొమ్ముకంటె ఎక్కువ ఇస్తాను. మైక్రోఫిలింను నేను మా జనరల్‌కి ఈ వారంలో చూపించాలి. లేకపోతే నాకు సైనిక న్యాయ స్థానంలో మరణశిక్ష వేస్తారు."

"అవును. మిస్టర్ రుస్తుం!"

రుస్తుం ఉలిక్కిపడ్డాడు. మరుక్షణంలో అతడి భుజాల క్రిందనుండి రెండు లోహపుకడ్డీలు పొడుచుకువచ్చాయి. వాటికి లోహపు పట్టీలున్నాయి. అవి అతడి భుజాలను పట్టి వుంచాయి. పిస్తోలు జారి అతడి చేతిలోంచి పడింది.

"మీ గురించి మీ దేశానికి తెలియపరిచాం మద్రాసులో జయవద్ద నుండి పారిపోయి వచ్చిన మీకు బెంగుళూరు రాక తప్పదని తెలుసు. నువు మీ న్యాయస్థానానికీ, మల్లికను మా దేశపు చట్టాలకూ ఒప్పచెప్పక తప్పదు" అన్నాడు డిటెక్టివ్ శరీష్. □

ఆపన్న దొంగలు

కె. లక్ష్మి

"నేను రేపు సాయంత్రానికల్లా వస్తాను. జాగ్రత్త! ఒక్క దానివి బయటకు వెళ్ళకు. ఎవరొచ్చి ఏం చెప్పినా నమ్మకు" అతను ఎప్పుడు కేంప్ కెళ్ళినా, ఇలా చెప్పడం, తను మౌనంగా తల వూపటం అలవాటుగా మారిపోయింది వీణకి.

భర్తని పంపి, తలుపులు మూపి, సన్నని కూనిరాగం

తీస్తూ వంటగదిలోకి వెళ్ళింది వీణ.

తనకిష్టమైన జీడిపప్పు ఎర్రగా వేయించుకుని, ఉప్పు కారం జల్లుకుని. హాలులోకి వచ్చి, టేప్‌రికార్డర్ ఆన్‌చేసి, "కూలిన గోడలు" నవల చేతపట్టుకుని, సోఫాలో పడుకుని, జీడిపలుకులు తింటూ పేజీలు తిరగెయ్యసాగింది వీణ

"ట్రింగ్! ట్రింగ్!" అంటూ కాలింగ్‌బెల్ ఆమెను డిస్టర్బ్ చేసింది. కేంప్ కెళ్ళకుండా తిరిగొచ్చారా! ఏమిటో? అనుకుంటూ "ఎవరూ?" అంది, ఐ హోల్ నుండి బయటికి చూస్తూ.

"టెలిగ్రామ్"

అదురు గుండెతో తలుపులు తెరుస్తున్న వీణని తోసుకుంటూ ఓ యువకుడు లోపలికి వచ్చి గడియపెట్టడం రెప్పపాటు కాలంలో జరిగిపోయింది.

"నేను చెప్పినట్లు విన్నావా? నీ ప్రాణానికేం ముప్పులేదు. లేదా," దువ్వెన సైజులో ఒక సైడు దువ్వెన. రెండవ సైడు చాకులా వున్న చాకుని తీపి చూపిస్తూ "దీనికి పని చెప్పవలపి వస్తుంది" అన్నాడు క్రూరంగా.

వీణ పై ప్రాణాలు పైనే పోయాయి.

"బెడ్‌రూంకి పద" అన్నాడు నీణ జబ్బపట్టుకు ముందుకు తోస్తూ.

"తాళాలు తియ్యి, నా మాట విన్నావంటే నీ ప్రాణానికి మానానికి కూడ భయంలేదు. పిచ్చివేషాలు వేశావో, నీకు రెండు దక్కవు."

"ఆదర్శాల దొంగన్న మాట" అనుకుంది పరుపుక్రింద తాళాలు తీస్తూ వీణ.

"ట్రింగ్! ట్రింగ్!" అంటూ మ్రోగిన కాలింగ్‌బెల్‌కి

ఉలిక్కిపడ్డారు ఇద్దరూ.

"ఎవరు?" అడిగాడు ఆదర్శాల దొంగ.

తెలీదన్నట్లు బుర్ర వూపింది వీణ.

"వచ్చిన నాయాళ్ళని వెంటనే పంపెయ్యి. వెర్రివేషాలు వేయబోకు."

"ట్రింగ్! ట్రింగ్!" కాలింగ్ బెల్ మళ్ళీ మ్రోగడంతో వీధితలుపు దగ్గరకు పరుగెత్తింది వీణ.

"మూర్తి! వున్నాడమ్మా!" అంటూ చొరవగా వీణని తోసుకుంటూ లోపలికి వచ్చాడు, 35 సం.ల లోపు వయస్సు గల పిల్లిగడ్డం, పైజామా, కురతా ధరించి, కళ్ళకి కంసాలి కళ్ళజోడు పెట్టుకున్న మనిషి. చాలా తమాషాగా వున్నాడు.

"ఆయన లేరండి. మీరు....?" అడిగింది వీణ. ఆ టైములో దేముడు పంపిన దేవదూతలా కన్పించాడా మనిషి వీణకి.

"నేను, మూర్తి ఫ్రెండ్ ని, నా పేరు జి డి. అంటారు ఈయన ...?" అంటూ ఆగిపోయాడు వీణ వెనుకగా నుంచున్న దొంగని చూస్తూ.

"మా తమ్ముడు" అంటూ అబద్ధం ఆడించి — వీపుకి గుచ్చుకుంటున్న చాకుకి దడిచి వీణ.

"హల్లో! గ్లాడ్ టు మీట్ యు!" అంటూ చెయ్యి ముందుకు చాచాడు జి.డి.

"థాంక్సు! సేమ్ టుయు" అంటూ తన చెయ్యిని జి డి. చేతితో కలిపాడు దొంగ.

"టీ పట్టుకొస్తాను. కూర్చోండి" అంది వీణ.

"అందులో కొంచెం అల్లం, ఏలకాయ కూడ వెయ్యమ్మా!" అంటూ సోఫాలో కూర్చుని జీడి పలుకులు

నోటిలో వేసుకున్నాడు జి.డి.

ఈ జిడ్డుగాడు యెంతసేపుంటాడో తెలీదు. తను పట్టి చేతులతో వెనక్కి తిరిగి యెప్పుడూ వెళ్ళలేదు ఇంతవరకు. పెద్ద బ్యాగ్‌తో వచ్చాడంటే రెండుమూడు రోజులు మకాం వేసేవాడిలా వున్నాడు ఇద్దర్ని భయపెట్టి ఇప్పుడే వచ్చిన పని చేసుకుపోతే ఉత్తమం, అనుకుంటూ జి.డి. షర్టు పట్టుకుని, "నీ దగ్గర ఏముందో తీసి ఇలా పడెయ్యి" అన్నాడు కరకుగా దొంగ. చేతిలో కత్తి తళతళ మెరిసింది.

"వాట్.... నీవు....?"

"నీ యబ్బ. నేనేం దాని తమ్ముడ్ని కాదు. జల్దీ నీ దగ్గర వున్నవి నాముందు పడెయ్యి, డోంట్ వేస్ట్ మై టైము."

"ఓ.కె. ఓ.కె." అంటూ జేబులో చెయ్యిపెట్టి నల్లగా నిగనిగ మెరుస్తున్న రివాల్వర్ పైకి తీశాడు జి డి

"ఏమిటిది?" అంటూ జి.డి. ని వదలి దూరంగా జరిగాడు దొంగ.

"కప్పించటం లేదు. సైలెన్సర్‌ది. మిస్టర్, నీది, నాది ఒకటే జాతి. నాపేరు జి డి. అంటె ఏమిటో తెలుసా? ఘరానా దొంగ నన్ను నమ్ముకున్న వారికి అన్యాయం చెయ్యను. దొరికిన దాంట్లో ఫిఫ్టీ. ఫిఫ్టీ, ఓ.కె." అన్నాడు జి.డి.

ఒక నిముషం ఆలోచించి ఓ.కె. అంటూ తన అంగీకారం తెలిపాడు మొదటి దొంగ.

వీణ మౌనంగా టీ కప్పులు పట్టుకొచ్చి, టీపాయ్ మీద పెట్టింది.

"అమ్మాయి! నేను...."

"తెలుసు, ఘరాన దొంగగారు" అంది కోపంగా వీణ.

"గుడ్! నేను ఏ పని చేసినా తొందర పడకుండా చేస్తాను. ఈ టీలో ఏమి కలపలేదుకదా?" అన్నాడు జి డి.

"కలపడానికేముంది నా బొంద త్రాగి చూపించనా?" అంది కోపంగా వీణ.

"కొంతమంది కోపంలోనే అందంగా వుంటారోయి, పార్ట్‌నర్!" అన్నాడు టీకప్పు చేతిలోకి తీసుకుంటూ జి.డి.

"ఓ.కె ఇప్పుడిక మన పని ప్రారంభించవచ్చు" అంటూ లేచాడు జి.డి.

అదే సమయంలో—

"ట్రింగ్! ట్రింగ్! ట్రింగ్!" ఆగకుండా మ్రోగ సాగింది బెల్.

ఇప్పుడు మూడో "ఆదర్శ దొంగేమో" అనుకుంది వీణ.

తలుపు తెరచిన జి డి ని త్రోసుకుంటూ, "ఆంటీ! మా డాడీ! నన్ను సినిమాకి తీసుకెళ్తారుట, జడ వెయ్యవా" అంటూ వచ్చింది—ఆరేళ్ళ ఆషా. ప్రక్క ఇల్లు వాళ్ళది.

ఆషా వాళ్ళమ్మ రెండు నెలల క్రితమే పోయింది. ఆషా వాళ్ళ అమ్మది, నాన్నది ఒకే కులం కాకపోవటంవల్ల, ఇరు పక్షాల చుట్టాలు వాళ్ళని "వెలి" వేశారు. తల్లి పోయినా, కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడు వాళ్ళ నాన్న.

"ఏమిటి చెయ్యడం" అన్నట్లు వాళ్ళవంక చూసింది వీణ.

"ఆంటీ! వీళ్ళెవరు?"

"మూర్తి అంకుల్ ఫ్రెండ్స్! నీకు జడ వేస్తాను పద" అంటూ ఆమెను బెడ్‌రూంకి తీసుకెళ్ళింది వీణ.

"ఛ! ఈవేళ, ఏ వెధవముండ మొహం చూశామో ఎదురొచ్చిందో?" విసుక్కున్నాడు మొదటి దొంగ.

"ఇక్కడివి చక్క బెడదాం" అంటూ అక్కడ వున్న విలువైన వస్తువులన్నీ సర్ద సాగాడు జి.డి.

జడ అల్లుతూ ఈ దొంగల బారినుండి ఎలా తప్పించుకో వాలా అని అలోచిస్తోంది వీణ.

"వస్తా నాంటీ!" అంటూ హాలులోకి వచ్చింది ఆషా.

"కమాన్! బేబీ! వాటీజ్ యువర్ నేమ్" అంటూ ఆమె తొడుగుకున్న బట్టలు చెక్ చెయ్యసాగాడు జి.డి.

"మై నేమ్ ఈజ్ ఆషా! ఈ ఫ్రాక్ మా డాడీ, నా బర్త్‌డేకి తెచ్చారు" గొప్పగా చెప్పింది ఆషా.

"వెరీగుడ్! వెరీగుడ్!" అంటూ ఆషాని పంపించాడు జి.డి.

"క్విక్! తాళాలు యియ్యి" అంటూ వీణను తొందర పెట్టాడు మొదటి దొంగ.

తాళాలు ఇచ్చేసి ఒక పక్కగా నుంచుంది వీణ.

ఒక కంట వీణని కవర్‌చేస్తూ డబ్బు, నగలు, బేగ్‌లో సర్దారు ఇద్దరు దొంగలు.

"మాతో సహకరించినందుకు చాలా థాంక్స్" అన్నారు ఇద్దరూ బయటకు నడుస్తూ.

ఇద్దరు ఘరానా దొంగలు మెట్లు దిగి క్రిందికి వెళ్ళగనే గేటు దగ్గర "కమాన్, ఫ్రెండ్స్!" అంటూ స్వాగతం పలికాడు ఇన్‌స్పెక్టర్ రాజేష్.

తమ కళ్ళు కప్పి ఇన్‌స్పెక్టర్‌కి కబురు ఎలా పంపిందో అర్ధంకాక, తప్పించుకునే వీలులేక తలలు ఒంచుకు నుంచు న్నారు ఇద్దరు పార్టనర్సు.

అప్పుడే వచ్చి ఆగిన పోలీసు జీప్ వాళ్ళనిద్దర్ని ఎక్కిం చుకుని వెళ్ళింది.

* * *

వీణ దొంగల్ని పట్టి ఇచ్చిన సందర్భంలో అందరికీ పార్టీ ఇస్తున్నాడు మూర్తి ఆరోజు.

"ఇంతకీ మీరు ఇన్‌స్పెక్టర్ రాజేష్‌గార్కి మెసేజ్ ఎలా పంపారు?" కొత్తగా వెలువడుతున్న "జ్యోతిమిత్ర" పత్రిక విలేఖరి అడిగాడు వీణని.

"ఇదికోసం ఆషా వచ్చింది. ఆషా చేతిలో వున్న డాలీని చూడగానే నాకు అయిడియా తట్టింది. ఏమయితే అయ్యిందని చిన్న స్లిప్‌మీద "దొంగలున్నారు! నన్ను రక్షించండి" అంటూ డాలీ బుర్రపీకి దానిలో వుంచాను. ఆషాతో "ఈ బొమ్మ బుర్రలో తమాషా వుంచాను. మీ నాన్నగార్కి చూపించు" అన్నాను నెమ్మదిగా. నాయందు భగవంతుడుండి, ఆషా ఇంటికి వెళ్ళగానే వాళ్ళ నాన్న గార్కి అనగా—రాజేష్‌గార్కి చెప్పిందిట. ఆయన డాలీ బుర్ర వూడతీసి చూసి వెంటనే రక్షించారు. మీరంతా మెచ్చుకోవలసింది నన్ను కాదు—ఆషాని" అంది వీణ, ఆషాని ముద్దుపెట్టుకుంటూ.

"ఒక్క నిముషం" అంటూ వాళ్ళిద్దరిని ఫోటో తీశాడు ఫోటోగ్రాఫర్. □

చెబితే విన్నావా?

ఎర్రసిరామరకలు

ప్రతాపరవిశంకర్



డిటెక్టివ్ రణధీర్‌కి అతను హంతకుడు అని ఇన్‌స్పెక్టర్ భూషణ్ ఎంత గట్టిగా చెబుతున్నా ఎందుకో నమ్మాలనిపించలేదు.

"నాపేరు ఆనంద్" అని తనని పరిచయం చేసుకున్నాడతను. ఎర్రగా—కొంచెం సన్నగా పొడుగ్గా వున్నాడు. కళ్ళు అమాయకంగా లేవు కాని హత్యలు చేసే మనిషంటే నమ్మకం కలగటం లేదు.

అప్పుడు సాయంత్రం ఐదుగంటలు కవస్తోంది

అంతకు ముందు పది నిమిషాల క్రితమే పోలీసు డాక్టరు సైనెడ్ ప్రయోగంతో ఆయన చంపబడ్డాడని చెప్పాడు. ఐతే ఆ విషాన్ని ఆయన శరీరంలోకి యెలా ప్రవేశపెట్టారో ఎంత ప్రయత్నం చేసినా డాక్టరు తెలుసుకో లేకపోయాడు.

నాలుగు గంటలు దాటుతున్నప్పుడు ఆ భవనంలో వుంటున్న నిరంజనం చనిపోయాడని యెవరో పోలీసులకు ఫోన్ చేశారు. ఐతే నిరంజనం మరణం సహజంగా అని పించినట్లయితే పోలీసులకు ఫోన్ కాల్ వెళ్ళేదికాదు ఆయన ఆత్మహత్య చేసుకున్నట్టుగా అనుమానం రావడంతో పోలీ సుల జోక్యం తప్పలేదు.

నిరంజనం ఆత్మహత్య చేసుకున్నాడేమో అని అను మానం రావటానికి కారణం వుంది. అది ఆయన తల వాల్చి పడివున్న టేబుల్‌మీది ఇన్లాండు కవరు. అప్పటికి ఆ కవర్ని ఓపెన్ చెయ్యలేదు.

పోలీస్ ఇన్‌స్పెక్టర్‌తో ఆ ఫోన్‌కాల్ వచ్చినప్పుడు మరో కేసు విషయమై వచ్చిన డిటెక్టివ్ రణధీర్ అక్కడే వున్నాడు. అందువల్ల పోలీసులతో అతనూ అక్కడకు వచ్చాడు.

రావడంతోనే అతనికి టేబుల్‌మీది ఆ ఉత్తరం కనిపిం చింది. దానిమీది యెడ్రసు చూశాడు.

డి. సుందరమూర్తి — రిటైర్డ్ టీచర్ — టెంపుల్‌స్ట్రీట్ కాకినాడ — అని వుంది.

ఆ ఉత్తరాన్ని ఓపెన్‌చేసి చదివాడు రణధీర్.

అందులో ఆయన మరణానికి సంబంధించిన విశేష మేదీ కనిపించలేదు. చాలా మామూలుగా రాసిన ఉత్తరం

అది.

నిరంజనం కాకినాడలో వున్న తన మిత్రుడు సుందర మూర్తికి తన క్షేమ సమాచారాలు తెలియజేస్తూ బాల్ పెన్‌తో రాశాడు అందులో తన ఆరోగ్యం బాగానే వుందనీ ఇంత వరకు ఒక్కసారికూడా గుండెపోటు రాలేదనీ ఈ వయసులో కూడా అంత ఆరోగ్యంగా వుండటానికి కారణం తనకు యెటువంటి దురలవాట్లూ లేకపోవటమేనని రాశాడు.

ఆ ఉత్తరం చదవగానే ఆశ్చర్యం కలిగింది రణధీర్‌కి ఎందుకంటే ముందుగా నిరంజనాన్ని చూసినప్పుడు ఆయన ఆత్మహత్య చేసుకున్నాడనే అనుమానం వచ్చింది. కాని ఆ ఉత్తరాన్ని చదివిన తర్వాత తప్పకుండా అది ఆత్మ హత్యకాదని, నిరంజనం హత్య చెయ్యబడ్డాడని ఇన్‌స్పెక్టర్ భూషణ్‌తో చెప్పాడు రణధీర్.

అప్పటికే ఆనంద్‌తో మాట్లాడిన ఇన్‌స్పెక్టర్ అతనే నిరంజనాన్ని హత్యచేసి వుంటాడని అనుమానించాడు.

ఆనంద్ పోలీసులు ఆ ఇంట్లోకి ప్రవేశించడానికి ముందే అంటే ఓ పదినిమిషాల క్రితమే అక్కడకు వచ్చి నిరంజనం శవాన్ని చూసి షాకైనాడు.

అతడిగురించి తెలుసుకున్న తర్వాత ఆనంద్ విచారాన్ని చూసి అతను నటిస్తున్నాడని అనుకున్నాడు భూషణ్.

ఆనంద్ విషయంలో ఇనస్పెక్టర్ భూషణ్‌కీ డిటెక్టివ్ రణధీర్‌కీ ఏకాభిప్రాయం కుదరలేదు.

హత్య చేయబడినట్టుగా భావించబడుతున్న నిరంజనం- ఆనంద్‌కి దూరపు బంధువు వరసకు మామయ్య అవు తాడు. నిరంజనానికి భార్య పిల్లలు ఇంకెలాంటి దగ్గరి బంధువులు లేని కారణంగా అతడి లక్షల ఆస్తికి ఆనంద్ ఒక్కడే వారసుడవుతాడు. అందువల్లనే త్వరగా ఆ ఆస్తి

నంతటినీ చేజిక్కించుకోటానికి ఆనంద్ నిరంజనాన్ని హత్యచేశాడని ఇన్‌స్పెక్టర్ ఉద్దేశ్యం.

"ప్లీజ్. నా మాట నమ్మండి. మామయ్యను నేను హత్య చెయ్యలేదు. రెండు గంటల క్రితం నేను ఈ వూళ్ళోకి వచ్చాను. ఓ ఫ్రెండ్‌ని కలుసుకోటానికి ఇప్పటి వరకూ తిరిగి అతను కలవకపోవటంతో ఇక్కడికి వచ్చాను. వచ్చేసరికి మామయ్య మరణించి వున్నాడు."

అలా మాట్లాడుతున్నప్పుడు ఆనంద్‌కు దుఃఖం పొంగి వచ్చింది.

"అంతా అబద్ధం ...నువ్వే ఈ వూళ్ళోకి రావటంతోనే వచ్చి సైనెడ్‌తో ఆస్తికోసం నిరంజనాన్ని హత్యచేసి వెళ్ళి పోయి మళ్ళీ వచ్చావు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నేను చెప్పేదే నిజం. ఆస్తికోసం మామయ్యను హత్య చెయ్యవలసిన అవసరం నాకులేదు. ఆయన పోయిన తర్వాత యెప్పుడైనా ఆయన ఆస్తంతా నాకే వస్తుంది. ఇందుకోసం ఆయన్ని ముందుగానే హత్య చెయ్యవలసిన అగత్యం నాకేమీ లేదు. లక్ష రూపాయల పెట్టుబడితో ఒంగోలులో మామయ్యే నాచేత ఓ బిజినెస్ పెట్టించాడు. ఇప్పుడది మూడు లక్షలకు పెరిగిపోయింది. ఆయనకు నేనంటే యెంతో ఇష్టం. నన్ను కాదని అయన ఈ ఆస్తినంత టినీ మరో మనిషికి రాస్తాడనే భయంలేదు. కాబట్టి నన్ను నమ్మండి. మామయ్య హత్యతో నాకు సంబంధం లేదు. ఆయన్ని హత్యచేసిన మనిషిని పట్టుకుని ఉరికంబం ఎక్కించండి. మీరు కోరినంత ఫీజు చెల్లిస్తాను—" అన్నాడు ఆనంద్.

ఆనంద్ మాటలు ఇన్‌స్పెక్టర్‌కు అబద్ధాలుగా అనిపించాయి కాని డిటెక్టివ్ రణధీర్‌కు అతను నిజమే చెబుతున్నా

దని గట్టిగానే అనిపించింది.

మూడుగంటల సమయంలో హత్య జరిగివుంటుందని పోలీసు డాక్టరు డిటెక్టివ్‌తో చెప్పాడు. సైనెడ్ శరీరం లోకి ప్రవేశించడంతోనే ప్రాణం పోయివుంటుందని అన్నా డాయన.

ముందుగా నిరంజనం శవాన్ని చూపి పోలీసులకు ఫోన్ చేసిన మనిషితో డిటెక్టివ్ రణధీర్ మాట్లాడాడు.

ఆయన పేరు భానోజీరావు. సెంట్రల్ ఎక్సయిజ్ డిపార్టుమెంటులో పనిచేసి ఏడాది క్రితమే రిటైరయ్యాడు.

"నేను ఈ రోడ్డులో వున్న మూడో ఇంట్లో వుంటు న్నాను. వారంరోజుల క్రితం ఓసారి నిరంజనం కలిసి నప్పుడు ఈ ఇంట్లో ఓ పోర్షన్ మరో పదిరోజుల్లో ఖాళీ అవుతుందని చెప్పాడు. నా స్నేహితుడికి అద్దెకు ఓ ఇల్లు కావాలని చెప్పాడు. ఆ విషయం గురించి మాట్లాడాలని వచ్చాను. గది తలుపులు దగ్గరకు మూసి వున్నాయి. నెట్ట గానే తెరుచుకున్నాయి. ఎదురుగా కుర్చీలో కూర్చుని టేబుల్‌మీద తలవాల్చి పడివున్న నిరంజనం కనిపించాడు. పిలిస్తే పలకలేదు. అనుమానం వచ్చింది. రెండు నిమి షాల తర్వాత ఆయన చనిపోయాడని తెలిసింది. ఎదురుగా ఓ ఇన్లాండ్ కవరు వుంది. ఆయన ఆత్మహత్య చేసుకున్నా డేమో అనిపించింది. వెంటనే పోలీసులకు ఫోన్‌చేశాను."

"నిరంజనం ఆత్మహత్య చేసుకున్నాడని యెలా అను కున్నారు? మీ కెందుకలా అనిపించింది?" అనడిగాడు రణ ధీర్ ఆయన్ని.

"ఇందుక్కారణం వుంది. ఆయన యెప్పుడయినా కలిసినప్పుడు తన ఆరోగ్య రహస్యం గురించి గొప్పగా అందరికీ చెబుతూ వుంటాడు. తనకు యెటువంటి చెడ్డ

అలవాట్లు లేకపోవడంవల్ల, ఆహారం విషయంలో కూడా కొన్ని నియమాలను పాటించడంవల్ల యెక్కువ మందికి ఈ వయసులో వచ్చే గుండెపోటు తనకు ఒక్కసారి కూడా రాలేదని అనేవాడు. అలాంటి మనిషి హఠాత్తుగా చని పోయాడని అనుకోలేకపోయాను" అన్నాడు భానోజీరావు.

"సరే....ఇంకో సహజమైన ప్రశ్న....నిరంజనానికి మీకు తెలిసి శత్రువులు యెవరైనా వున్నారా?"

"ఐతే నిరంజనం ఆత్మహత్య చేసుకున్నాడని మీరు అనుకోవటం లేదా?" అనడిగాడు భానోజీరావు ఆశ్చర్యంగా.

"లేదు. ఆయనకు ఆత్మహత్య చేసుకోవలసినంత సమ స్యలు ఏవీ లేవని ఆనంద్ చెప్పాడు. ఆత్మహత్యకు దారి తీయించే అనారోగ్యం కూడా ఆయనకు లేదు. అటువంట ప్పుడు తప్పకుండా నిరంజనం హత్యచెయ్యబడ్డాడనే అనుకో వాలి. చెప్పండి. ఆయనకు శత్రువులు ఎవరు?"

"ఎవరూ లేరు. ఆయన మంచి మనిషి. తొందరపడి ఎవర్నీ ఏమీ అనే స్వభావంలేదు."

"రైట్. ఇక మీరు వెళ్ళండి. అవసరమైతే నేను మిమ్మల్ని మళ్ళీ కలుసుకుంటాను" అన్నాడు రణధీర్.

భానోజీరావు—రణధీర్‌కు థాంక్స్ చెప్పి అక్కడినించి బయటకు వెళ్ళి మళ్ళీ తిరిగి వచ్చాడు.

"సారీ....ఇంతకు ముందు గుర్తురాలేదు. ఓ వారం రోజుల క్రితం నిరంజనానికీ గోవర్ధనానికీ పెద్ద ఘర్షణ జరి గిందిట. నిరంజనం చెప్పాడు. గోవర్ధన్ మేడపైన గదిలో వుండే విద్యాసాగర్ స్నేహితుడు. రోజూ ఇతని రూముకు వచ్చి గిటార్ ప్రాక్టీస్ చేసుకుంటున్నాడుట. అర్ధరాత్రికూడా నిద్ర లేకుండా చేస్తున్నాడని వెళ్ళి గోవర్ధన్‌ని మందలించా డట నిరంజనం. గోవర్ధన్ వినకుండా నిరంజనాన్ని తిట్టా

దట. అతన్ని ఇంట్లోనించి బయటకు పొమ్మన్నందుకు చంపుతానని బెదిరించాటట" చెప్పాడు రణధీర్‌తో.

"థాంక్‌యూ. మంచి ఇన్ఫర్‌మేషన్ ఇచ్చారు. గోవర్ధన్ ఎక్కడ వుంటున్నాడో మీకు తెలుసా?"

"తెలుసు. స్టార్‌క్లబ్ పక్కనే వున్న రోడ్డులో ఓ మేడ మీది గదిలో వుంటున్నాడు."

వెళ్ళిబోయాడు భానోజీరావు.

నిరంజనం శవాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించారు.

తన అనుమతి లేకుండా వూరు వదిలి వెళ్ళకూడదని ఆనంద్‌తో చెప్పాడు ఇన్‌స్పెక్టర్ భూషణ్. అతడ్ని అనుమానంమీద అరెస్టు చేస్తానంటే రణధీర్ ఒప్పుకోలేదు.

డిటెక్టివ్ టేబుల్‌మీది నిరంజనం రాపిన ఆ ఉత్తరాన్ని తీసి మరోసారి చదివాడు. కాని అందులో క్లూ ఏమీ వున్నట్టు అనిపించలేదు

కవర్ని మడిచి జేబులో వుంచుకుని గోవర్ధన్‌ని కలుసుకోటానికి స్కూటర్‌మీద బయల్దేరాడు.

2

స్టార్‌క్లబ్ పక్కరోడ్డులో గోవర్ధన్ వుంటున్న గదిని డిటెక్టివ్ రణధీర్ సులభంగానే తెలుసుకోగలిగాడు.

కాని—గోవర్ధన్ గదిలో లేడు. ఎక్కడికి వెళ్ళాడో తెలీదు. అతని గురించి తెలియజెయ్యటానికి ఆ ఇంటి కింది పోర్షన్‌లో వుంటున్న ఓ అమ్మాయి అంతగా ఇష్టాన్ని చూపించలేదు.

ఆమెకు గోవర్ధన్ అంటే బాగా కోపం వుందని ఆమె మొహంలోని ఫీలింగ్స్ చూడగానే గ్రహించాడు.

అందుకే—

"ఒక హత్యకేసు దర్యాప్తు విషయమై వచ్చాను. గోవ

ర్ధన్ కూడా ఓ అనుమానితుడు. నేను అతన్ని తప్పకుండా కలుసుకుని తీరాలి" అన్నాడు రణధీర్.

హత్యకేసు అనేసరికి ఆమె వెంటనే "లోపలకు రండి" అన్నది.

రణధీర్ ఆమెతో లోపలకు వెళ్ళిన తర్వాత "హత్య కేసు అంటున్నారు. గోవర్ధన్ అన్నంతపనీ చేశాడన్న మాట. ఎవర్ని? ఆ ఇంటి ఓనర్ నిరంజనంగార్నేనా హత్య చేసింది" అనడిగింది.

అతనికి బాగా ఆశ్చర్యం కలిగింది.

"మీకెలా తెలుసు? ముందుగా ఎలా వూహించారు?" అనడిగాడు.

ఆమె "నేను వూహించడం కాదు. ఈ మధ్య ఒకరోజు సాయంత్రం గోవర్ధన్ పైకివెళ్ళే మెట్లదగ్గర నిలబడి తన ఫ్రెండ్‌తో మాట్లాడుతున్నప్పుడు విన్నాను. ముసలాడు నిరంజనం గిటార్ ప్రాక్టీస్ చేస్తున్నందుకు అందరిముందు తనని దేమిజింగ్‌గా మాట్లాడి బయటకు వెళ్ళిపొమ్మన్నాడనీ, అలా మాట్లాడిన వాడ్ని పైకి పంపించక తప్పదనీ చెప్పాడు. అందుకు తగిన ప్లానుకోసం చూస్తున్నానని కూడా అన్నాడు. ఆ మాటలను నేను విన్నాను. అందుకే మీరు ఓ హత్యకేసు గురించి గోవర్ధన్‌కోసం వచ్చారనగానే నిరంజనం విషయమే అనుకున్నాను" అన్నది.

"అవును. నిరంజనం హత్యచేయబడ్డాడు. ఎవరో చాలా తెలివిగా సైనేడ్‌తో ఆయన్ని చంపారు. సైనేడ్‌ను ఆయన శరీరంలోకి ఎలా ప్రవేశపెట్టారో కూడా తెలీదు. గోవర్ధన్ నిరంజనాన్ని బెదిరించటం గురించి తెలిసింది. అందుకే యిప్పుడు నేను గోవర్ధన్‌ని కలుసుకోవాలని వచ్చాను."

"అతనెక్కడ వుంటాడో తెలీదు. మరోసారి రండి"

"థాంక్ యు, మళ్ళీ వస్తాను" అని లేచి నిలుచున్నాడు రణధీర్.

అతను బయటకు వస్తుండగా ఆమె అన్నది—

"గోవర్ధన్ గురించి నేను చెప్పినట్టు అతనికి తెలియ నివ్వకండి. గోవర్ధన్ మంచివాడు కాదు."

నవ్వుతూ తలవూపి అక్కడ్నించి బయల్దేరాడు.

గోవర్ధన్ ఇలాంటి విలనా? ఆమె మాటలనుబట్టి అత నికి విరోధులే యెక్కువమంది వుండే అవకాశం వుందని అనిపించింది.

ఆ రోజు రాత్రి తొమ్మిది గంటల సమయంలో గోవర్ధన్ తన గదిలో డిటెక్టివ్ రణధీర్‌కి దొరికాడు.

గోవర్ధన్ ముందు రణధీర్‌ను యెవరో అనుకున్నాడు. కాని అలా రణధీర్ నిరంజనం హత్యదర్యాప్తు విషయమై వచ్చినట్టుగా చెప్పిన తర్వాత అతను భయపడ్డాడు.

"నాకోసం యెందుకు వచ్చారు?"

"నిరంజనానికీ నీకూ జరిగిన ఘర్షణ గురించి తెలి పింది. నువ్వు ఆయన్ని చంపుతానని బెదిరించావుట. నువ్వలా బెదిరించటం చాలామంది విన్నారు. ఇప్పుడాయన హత్య చెయ్యబడ్డాడు. అందువల్ల ఆ హత్యా నేరంలో మొదటి అనుమానితుడివి నువ్వే."

గోవర్ధన్ మరింత బెదిరిపోయి "ప్లీజ్........నన్ను నమ్మండి. ఆయన ఆ రాత్రి అందరిముందూ నన్ను బయ టకు వెళ్ళమనేసరికి కోపం వచ్చి ఆయన్ని బెదిరించటం నిజమే. ఆ తర్వాత కూడా ఆయనమీద నాకు కోపంపోలేదు కాని తర్వాత ఆలోచిస్తే ఆయన ముసలాయన అనీ, అలాంటి మనిషిమీద నాకు కోపం యేమిటని ఆ సంఘట ననే మరచిపోయాను" అన్నాడు.

"మధ్యాహ్నం రెండుగంటల నించి ఐదుగంటల వరకు నువ్వెక్కడున్నావ్?" అడిగాడు రణధీర్.

"కాలేజీలో వున్నాను....కావాలంటే రుజువు చెయ్యగలను."

నవ్వేడు రణధీర్.

"మిస్టర్ గోవర్ధన్. ఇప్పుడు హంతకులు చాలా తెలివిగా వ్యవహరిస్తున్నారు. వాళ్ళు చెయ్యదల్చుకున్న హత్యలను వాళ్ళు గట్టి ఎలిబీ సృష్టించుకుని మరో మనిషిచేత చేయిస్తున్నారు. అందువల్ల నువ్వు కాలేజీలో వున్నట్టుగా సాక్ష్యం వున్నా, నిజంగా నువ్వే నిరంజనం మరణానికి కారణం ఐతే నువ్వు తప్పించుకోలేవు."

"ప్రామిస్....నన్ను నమ్మండి."

మళ్ళీ కలుస్తానని రణధీర్ అక్కడినించి కదిలాడు— స్కూటర్ మీద.

అతను నిరంజనం ఇంటిదగ్గరగా వచ్చాడు. ఆ రోడ్డు మలుపు తిరుగుతూ వున్నప్పుడు రోడ్డుమీద తూలుతూ నడుస్తూ స్కూటరుకు అడ్డుగా వచ్చాడు ఓ మనిషి.

సడన్ బ్రేకుతో కీచుమంటూ ఆగిపోయింది స్కూటరు. ఆగకుండా వున్నట్లయితే అతను స్కూటరుకింద పడివుండేవాడు.

"సారీ....సారీ" అన్నాడతను లేచి నిలబడటానికి ప్రయత్నిస్తూ.

పొట్టిగా లావుగా వున్నాడతను. నలభై యేళ్ళుంటాయి. నల్లగా వున్నాడు మొహంమీద పడుతున్న జుట్టు. కళ్ళు ఎర్రగా వున్నాయి. బాగా తాగివున్నాడు.

రణధీర్ మాట్లాడలేదు. అతను లేచి ముందుకు అడుగులు వేశాడు. ఇంతలోనే యెవరో మనిషి గబగబా వచ్చి

"కొడుక్కి జబ్బుగా వుందని చెప్పి డబ్బులు తీసుకుని తాగి వస్తున్నావా" అన్నాడు.

తాగినతను "తాగడానికని చెబితే నువ్విచ్చేవాడివేనా?" అన్నాడు తూలుతూనే.

నవ్వుకుంటూ రణధీర్ స్కూటర్ని ముందుకు దూకించాడు.

తాగుడుకోసం మనుషులు ఎన్ని అబద్ధాలను కల్పిస్తున్నారు? తాగటానికి మనుషులు ఎంత పని చెయ్యటానికీ వెనుకాడటం లేదు.

పోలీసు స్టేషన్‌కు వెళ్ళేసరికి నిరంజనం పోస్టుమార్టం రిపోర్టు సిద్ధంగా వుంది.

సైనెడ్ నిరంజనం నోటిద్వారానే లోపలకు వెళ్ళిందిట.

అప్పుడు రణధీర్‌కు అనుమానం వచ్చింది. ఎవరికీ తెలియని పరిస్థితుల్లో చిక్కుకుపోయి నిరంజనం ఆత్మహత్య చేసుకున్నాడా?

అందుకే అతను మరోసారి తెల్లారిన తర్వాత నిరంజనం యింటికి వెళ్ళి అక్కడి పోర్షన్లలో వుంటున్న వాళ్ళందరినీ ఆయన గురించి ఎంక్వయిరీ చెయ్యాలని అనుకున్నాడు.

ఇన్‌స్పెక్టర్ భూషణ్ నిరంజనం హత్యకేసు దర్యాప్తు బాధ్యతను డిటెక్టివ్ రణధీర్‌మీద వుంచేశాడు.

3

ఆ పోర్షన్లలో వుంటున్న వాళ్ళంతా ఒక్కటే మాట చెప్పారు—నిరంజనానికి ఆత్మహత్య చేసుకోవలసినంతటి సమస్యలు ఏవీ లేవని. అందువల్ల నిరంజనం హత్య చెయ్యబడ్డాడు. ఎవరో అతన్ని చాలా తెలివిగా హత్యచేశారు.

ఎవరు?

స్కూటరు మీద తిరిగి వస్తుండగా ఆ వెనుక రోడ్డులో

వున్న పోస్టాఫీసు కనబడింది. అప్పుడే డిటెక్టివ్ రణధీర్‌కి హఠాత్తుగా గత నాలుగు రోజులుగా తను ఓ ఫ్రెండ్‌కి లెటర్ రాయాలని అనుకుంటున్న విషయం గుర్తుకువచ్చి స్కూటరాపి లోపలకు వెళ్ళాడు

పోస్టుమాస్టర్‌ను చూస్తూనే గుర్తించాడు.

అతనే పొట్టిగా—నల్లగా వున్నాడు. ఎర్రగా వున్న కళ్ళు-మొహంమీద పడుతున్న జుట్టు.

రాత్రి తాగి తూలుతూ వచ్చి తన స్కూటరు కింద పడ బోయిన మనిషి. అతనే అన్ని పనులూ చేసుకుంటున్నాడు పోస్టాఫీసులో.

"ఓ ఇన్లాండ్ కవరివ్వండి."

రణధీర్‌ను అతను గుర్తించలేదు.

ఇన్లాండ్ కవరిచ్చాడు. దాన్ని తీసుకుని పక్కకు వస్తూ చూసి వులిక్కిపడ్డాడు రణధీర్. ఆ కవరుకు ఓ పక్కగా ఎర్రని సిరా మరకలు వున్నాయి. గబుక్కున తన జేబులో వున్న నిరంజనం రాసిన ఉత్తరాన్ని తీశాడు. ఆ కవరుకు కూడా అదే స్థానంలో ఆ ఎర్రని సిరా మరకలు వున్నాయి. అంటే పోస్టాఫీసులో వున్న ఇన్లాండు కవర్లన్నిటి మీదా ఎర్ర సిరా బాటిల్లోనించి వొలికి పడివుంటుంది అందుకే ఒకేచోట అన్నింటి మీదా ఆ ఎర్ర సిరామరకలు పడ్డాయి. నిరంజనం కూడా నిన్న యిక్కడే ఇన్లాండు కవరుకొన్నాడు.

వెంటనే అతని మెదడులో ఏదో తళుక్కున మెరిసింది.

రణధీర్ తలెత్తాడు. ఎదురుగా కిళ్ళీ బంకు వుంది. గబ గబా అక్కడకు వెళ్ళి బంకులో కూర్చున్న మనిషితో ఏదో మాట్లాడాడు.

డిటెక్టివ్ రణధీర్ అక్కడ్నించి వెళ్ళి దగ్గరలోనే వున్న ఓ ఇంట్లో నించి నిరంజనాన్ని హత్య చేసిన హంత

కుడు దొరికాడనీ, వెంటనే బయల్దేరి రమ్మనీ ఇన్‌స్పెక్టర్ భూషణ్‌కి ఫోన్ చేశాడు,

*　　　　*　　　　*

"ఈ పోస్టుమాస్టరే నిరంజనాన్ని సైనెడ్‌తో హత్య చేసిన హంతకుడు నిరంజనానికి తరచు స్నేహితులకు ఉత్తరాలు రాసే అలవాటు ఉండటంతో వారానికి నాలుగైదు సార్లయినా పోస్టాఫీసుకు వచ్చేవాడు. అందుకే నిరంజనానికి ఇవ్వదల్చుకున్న ఇన్లాండు కవరు ఫోల్డువేసి అంటించే గమ్ మీద, షహనాయ్ కెమికల్స్‌లో పనిచేసే తన తమ్ముడి ద్వారా తెప్పించిన సైనెడ్‌ను పూసి, ఆ కవర్ని నిన్న మధ్యాహ్నం వచ్చిన నిరంజనానికిచ్చాడు. నిరంజనం ఉత్తరం రాసిన తర్వాత దాన్ని అంటించటానికి నాలుకతో తడి చేశాడు. సైనెడ్ అతని నోట్లోకి వెళ్ళింది. కవర్ని అంటిస్తూనే అతను చనిపోయాడు" చెప్పాడు రణధీర్.

"ఇదంతా నిజమేనా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ పోస్టు మాస్టర్ని గద్దిస్తూ. తల వూపాడతను.

"నిరంజనాన్ని యెందుకు హత్య చేశావ్?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"నేను కొంతకాలం అతనింట్లో కిరాయికు వున్నాను. నిరంజనాన్ని తాగుడుకోసం అప్పుడప్పుడు డబ్బులు అడిగే వాడ్ని. మొదట్లో కొన్నిసార్లు యిచ్చాడు. ఆ డబ్బులను నేను తిరిగి ఇవ్వకపోవటంతో నాకు డబ్బు యివ్వటం మానే శాడు. పైగా ఇల్లు ఖాళీ చేయించాడు. నాక్కోపం వచ్చింది. భార్యపిల్లలులేని లక్షల ఆస్తివున్న నిరంజనాన్ని చూస్తుంటే రోజు రోజుకీ నాలో జెలసీ పెరిగిపోయింది. అందుకే నిరంజనాన్ని హత్య చేశాను." □

హైక్లాస్ పిట్ట

మల్లిక్

సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథం అన్నమాటలు విన్న హెడ్ కానిస్టేబుల్ వీరన్న ఎగిరి గంతేసినంత పనిచేశాడు. తను సరిగానే విన్నాడా అన్న అనుమానం వచ్చింది.

“ఏంటండి?”

అనుమాన నివృత్తి చేసుకోవడం కోసం అడిగాడు వీరన్న యస్.ఐ. జగన్నాథాన్ని.

"మంచి పిట్టలేమైనా దొరుకుతాయా?" అన్నాడు జగన్నాథం పళ్ళు ఇకిలిస్తూ.

"తమరు కావాలని అనుకోవాలేగానీ పిట్టలకేం కొదవండీ?...." అన్నాడు తనూ పళ్ళికిలిస్తూ వీరన్న.

జగన్నాథం ఆ ఊరికి కొత్తగా ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాడు. అతను డ్యూటీలో చేరి కేవలం రెండు రోజులే అయ్యింది. కొత్త ఇన్‌స్పెక్టర్ వచ్చాడంటే హెడ్ కానిస్టేబులుకీ, మిగతా కానిస్టేబుళ్ళకీ గుండె దడగా వుంటుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ స్ట్రిక్టుగా వుంటే తమకొచ్చే పైరాబడి వుండదు....కానీ జగన్నాథం అడిగిన ప్రశ్నకి వీరన్నలోని అనుమానాలూ, భయాలూ అన్నీ మబ్బుల్లా విగిపోయాయి.

జగన్నాథం వాచ్‌వంక చూశాడు.

రాత్రి పదకొండు గంటలైంది. కిటికీలోంచి చలిగాలి రివ్వున వీచింది ఒక్కసారిగా.

జగన్నాథం చేతులు రెండూ కట్టుకుని బుజాలు రెండు చెవుల వరకూ ఎత్తి ముడుచుకుంటూ "ఓహ్....చలి!" అన్నాడు.

"అల్మారాలోంచి సీసా తియ్యమంటారా సార్?" అన్నాడు వీరన్న పెదాలు తడుపుకుంటూ.

తన బాస్ మొదలు పెడితే తనకూ కాస్త తీర్థం దొరుకుతుందని అతని ఆశ.

"పిట్ట కావాలోయ్...." అన్నాడు జగన్నాథం.

"ఇప్పుడే?" అన్నాడు వీరన్న.

"ఏం కుదరదా?"

"ఎందుకు కుదరదు సార్?... రెండు వీధుల వెనుక నీలవేణి వుంది....దాన్ని తీసుకురమ్మంటారా సార్....పిట్ట భలే పిటపిటలాడ్తుంది. బిజినెస్ మొదలెట్టి ఆర్నెల్లే

అయ్యింది."

"బ్రోతల్ కేసులు మనకొద్దోయ్ ఆరోగ్యం పాడవుద్ది" అన్నాడు.

ఇదివరకోసారి రాజమండ్రిలో లాడ్జి రెయిడ్ చేసినప్పుడు దొరికిన ఒక కేసును అదే రాత్రికి బుక్ చేసుకుని దానికల్ల అంటుకున్న రోగానికి ఆరు నెలలు బాధపడ్డాడు జగన్నాధం. అందుకే వాళ్ళంటే భయం అతనికి.

"పోనీ తూర్పువీధిలోని గూడెం సరుకుని తెమ్మంటారా?....చాల బావుంటుంది సార్ వాళ్ళయితే...."

జగన్నాధం అడ్డంగా తల వూపాడు.

వీరన్న సందేహంగా అతనివైపు చూసాడు.

"నీకు తెలీదోయ్....బీదజనం జోలికి ఎప్పుడూ వెళ్ళకూడదు."

"ఎందుకు సార్?"

"వాళ్ళు పరువు, ప్రతిష్టా అంటూ ప్రాకులాడరు. మనం ఏదైనా చేస్తే ఫలానా ఇన్స్పెక్టర్, హెడ్డు నన్నిలా బలాత్కారం చేశారని నిర్భయంగా చాటింపు చేస్తారు. దాన్ని పట్టుకుని, ఏ పనిలేని రాజకీయ నాయకుడో మన పేర్లు పేపర్ల కెక్కిస్తాడు. అధికారంలో వున్న పార్టీ ప్రభుత్వం పాలన అవకతవకగా వుందని దుయ్యబడ్తాడు. దాంతో మన పరువు పోవడమే కాదు....ఉద్యోగాలు కూడా పోతాయ్. పరువు పోయినా ఫర్వాలేదుగానీ ఉద్యోగం పోతే ఎలా, ఆ?"

"అవునండి....మీరు చెప్పింది నిజమే" అన్నాడు వీరన్న తల ఊగిస్తూ.

"అందుచేత ఎప్పుడూ వాళ్ళ జోలికి వెళ్ళకు....తెలిసిందా?"

"మరిప్పుడే చెయ్యమంటారండీ?"

"ఇంత చెప్పినా నీ కర్థం కాలేదా?"

వక్రంగా నవ్వాడు జగన్నాధం.

వీరన్న తల అడ్డంగా వూపాడు అయోమయంగా.

"ఈ క్లాస్ పీపుల్ వున్నారే....వాళ్ళకి పరువు. ప్రతిష్ట లంటే ప్రాణంకన్నా తీపోయ్ ప్రాణం మానం పోయినా పర్వాలేదుకానీ పరువు-పోతే మాత్రం ఒడ్డున పడిన చేప పిల్లల్లా గిలగిల కొట్టుకుంటారు...."

"అవునండీ" వంతపాడాడు వీరన్న.

"కాబట్టి ... నువ్వు డబాయించో .... భయపెట్టో .... మాయచేసో ...ఏం చేస్తావో నీకే వదిలేస్తున్నాను....ఒక మంచి హై క్లాస్ పిట్టని తీసుకురా. దాన్ని మనం ఏం చేసినా గొడవ చెయ్యకుండా, ఎవ్వరికీ చెప్పకుండా గుట్టు చప్పుడు కాకుండా ఇంటికెళ్ళిపోతుంది. ఏం గొడవ చేసినా ఎవరికి చెప్పినా పోయేది తన పరువూ. తమ కుటుంబ మర్యాదా అని నోరు మూసుకుని, ఏం ఎరగనిదానిలా గొప్ప పతివ్రతలా భర్తతో కాపురం చేసుకుంటుంది హాయిగా"

పకా పకా నవ్వాడు జగన్నాధం.

సబ్ ఇన్స్పెక్టర్ నవ్వుతో శృతి కలిపాడు హెడ్ కానిస్టేబులు వీరన్న.

"మరి వెళ్తావా?" అన్నాడు జగన్నాధం వాచ్ చూస్తూ.

"ఇప్పుడు హై క్లాస్ పిట్టని ఎక్కడ నుండి తేను?" తెల్లముఖం వేశాడు వీరన్న.

"ఇప్పుడే వీలు కుదిరేది. కాస్సేపట్లో సెకండ్ షో వదుల్తారు. ఆ జనంలో ఎవర్నయినా మగతోడు లేని ఆడో ళ్ళని ఫాలోచేసి ఎవరూ లేని సందులో బెదిరించి తీసు

కురా. యూనిఫాంలో వెళ్ళకు....కొంపలు మునుగుతాయ్...."

"ఆ మాత్రం తెలీదా సార్?" వీరన్న నవ్వాడు.

"అలమారులోని బాటిల్ ఇలా తే."

"అలాగే సార్...."

అలమారులోంచి గ్లాసు, విస్కీ సీసా తీసి టేబుల్‌మీద పెట్టి సీసాలోంచి విస్కీ గ్లాసులో కాస్త పోసి. నీళ్ళతో గ్లాసుని నింపాడు వీరన్న.

"తినడానికి?"

"అదీ రెడీ సార్."

అలమారలోంచి పొట్లంతీపి టేబులు మీద పెట్టి విప్పుతూ అన్నాడు "కారం కారం మిరపకాయ బజ్జీలు సార్...."

"వెరీగుడ్....నువ్వింక వెళ్ళు..."

వీరన్న విజిల్ ఊదుకుంటూ స్టేషన్ బయటికి వెళ్ళాడు.

2

అప్పుడే సెకండ్ షో వదిలారు.

హాల్లోంచి జనం బిలబిలమంటూ వస్తున్నారు. వీరన్న హాలుకి కాస్త దూరంగా చీకట్లో ఒక మూల నిలబడి వున్నాడు. అతను తెల్లని లాల్చీ పైజామాలో వున్నాడు. లాల్చీలోంచి అతని పొట్ట కుండలా కనిపిస్తుంది.

హాలు బయటికి వస్తున్న జనం కొద్ది కొద్దిగా పల్చబడుతున్నారు. చివరగా వచ్చిన వాళ్ళిద్దరి మీదా వీరన్న దృష్టి పడింది. అతని కళ్ళముందు వెయ్యి మెర్క్యూరీ దీపాలు ఒక్కసారి వెలిగినట్టయ్యింది.

"ఓహ్....ఎంత బావుందో. అందమంటే దీనిదే" అనుకున్నాడు. "దీన్ని గనుక అయ్యగారికి అప్పగిస్తే, ఇంక నా

దారికెప్పుడూ అడ్డురాడు. మనదే రాజ్యం ఈ స్టేషన్లో. నేనేం చేసినా ఏమీ అనడు....'' అనుకున్నాడు.

వాళ్ళు ఇద్దరు: ఒక ముసలావిడ, ఒక పడుచావిడ. ముసలావిడకి యాభై అయిదూ అరవై మధ్య వుంటుంది వయసు. ఆ పడుచుపిల్లకి బహుశా ఇరవై అయిదు వుండొచ్చు. వీధిలైటు గుడ్డికాంతిలోనే ధగధగ మెరిసి పోతుంది.

వాళ్ళు వీరన్న వున్న వైపుకే అడుగులు వేసుకుంటూ వస్తున్నారు.

"ఏయ్ రిక్షా....'' ఆ వైపుగా వెళ్తున్న రిక్షాని కేకేసింది ఆమె.

వీరన్న ఉత్సాహం నీరుకారి పోయింది.

ఇప్పుడు వాళ్ళు రిక్షా ఎక్కి వెళ్ళిపోతే ఎలా?

"రామాలయం వీధిలోకి వస్తావా?'' అడుగుతుంది.

"రెండు రూపాయ లిప్పించండి.''

"రెండు రూపాయ లెందుకూ? ఇక్కడేగా?''

ఆ ముసలావిడ రెట్టించి అడిగింది.

"ఇంత అర్ధరాత్రివేళ అంతకు తక్కువ ఎవరొస్తారండి అమ్మగారూ?''

"రూపాయిన్నర ఇస్తా'' అంది ఆమె.

"రూపాయిన్నర ఎందుకూ? రూపాయే....'' అంది ముసలావిడ.

"రెండ్రూపాయలకి ఒక్కపైసా తగ్గదండి. వస్తే రండి లేకపోతే లేదు'' అన్నాడు రిక్షావాడు పొగరుగా.

"అయినా పట్టుమని పదడుగులు లేవు ఇక్కడికే రిక్షా ఎందుకే అమ్మాయ్? ...ఈ కాలం పిల్లలకి అసలు ఓపికే లేదు. మీకన్నా మేమే నయం. మీ వయసులో అసలు ఈ

రిక్షాగట్రా ఎక్కేవాళ్ళమా? ఎంతదూరం వున్నా నడిచే వెళ్ళే వాళ్ళం. అందుకే ఈ వయసులో కూడా ఇంత ఆరోగ్యంగా వున్నాం.... పద.... నడుచుకుని వెళ్ళిపోదాం."

"నడవలేక కాదు పిన్నిగారూ. ఇంటికి నడుచుకుని వచ్చినట్టు తెలిస్తే ఆయన తిడ్తారు."

"నువ్వు చెప్తేనే కదా ఆయనకు తెలిసేది?"

వాళ్ళిద్దరూ వీరన్నను దాటి కాస్త ముందుకు వెళ్ళి ఎడమప్రక్క సందులోకి వెళ్ళారు. వీరన్న వాళ్ళకి ఇరవై గజాల దూరంలో పిల్లిలా అడుగులు వేస్తూ ఫాలో అయ్యాడు.

"ఛ....ఛ....సినిమా అస్సలు బాగోలేదు. పరమ ఛండాలంగా ఉంది ఓ భక్తా పాడా, అన్నీ వెధవ డాన్సులు" అంది ముసలావిడ.

"ఏం చేస్తాం ఆయన పన్నెండు దాకా రారు. ఇంట్లో ఒక్కదాన్ని బోరు కొడ్తుంది. అనవసరంగా సినిమాకి తోడు రమ్మని మిమ్మల్ని బలవంతంచేసి మీకు విసుగు పుట్టించాను."

"పోన్లే అమ్మాయ్ ... ఇదో కాలక్షేపం."

అర్ధరాత్రి కావడంచేత ఆ నిశ్శబ్దంలో వాళ్ళ మాటలు వీరన్నకి స్పష్టంగా వినిపిస్తున్నాయ్.

వీరన్న అటూ ఇటూ మాశాడు. ఏ ఇంట్లోనూ లైట్లు వెలగడంలేదు. అందరూ ఇళ్ళలో హాయిగా నిద్రపోతు న్నారు. వీధిలో వీళ్ళు ముగ్గురు తప్ప ఎవరూ లేరు.

వీరన్న ఇక ఆలశ్యం చెయ్యదలచుకోలేదు. గబగబ ముందుకు అడుగులు వేసి వాళ్ళని సమీపించాడు.

"ఆగండి ..." అన్నాడు.

వాళ్ళిద్దరూ ఆగి వెనక్కి తిరిగి తెల్లబోతూ వీరన్నని

చూశారు.

"ఏయ్ అమ్మాయ్.... నువ్వు నాతో రా."

"ఎందుకూ?" ఆమె భయభయంగా చూస్తూ అడిగింది.

"ఎందుకో తర్వాత చెప్తాగానీ.... పదవే" అంటూ చెయ్యి పట్టుకున్నాడు. ఆ అమ్మాయి కెవ్వున అరిచింది.

వీరన్న చటుక్కున కత్తి తీశాడు.

"అరిచావంటే పొడిచేస్తా"

"మమ్మల్ని చంపుతున్నార్రో నాయనో.... రక్షించండి" అని ముసలావిడ అరిచింది.

వీరన్న చటుక్కున ముసలావిడ దగ్గరికి వెళ్ళి ఆమె నోరు నొక్కి జేబులోంచి క్లోరోఫాంలో అద్దిన రుమాలు తీసి ఆమె ముక్కుదగ్గిర పెట్టాడు.

ముసలావిడ తల వాల్చేసింది.

ఇంతలో ఆ అమ్మాయి రోడ్డుమీదకు పరుగుతీసింది.

వీరన్న ముసలావిడని రోడ్డుమీద వదిలేసి ఆమె వెంట బడ్డాడు.

ఆడది ఎంతకని పరుగెత్తగలదు?

రెండు నిముషాల తరువాత వీరన్న చేతికి చిక్కింది ఆమె.

"నన్ను వదులు.... ఛీ.... దుర్మార్గుడా .... వదుల్తావా లేదా?" ఆమె గింజుకోసాగింది.

వీరన్న జేబురుమాలు ఆమె ముక్కుకేసి బలంగా అదిమిపెట్టి నిమిషంపాటు పట్టుకున్నాడు. ఆమె తల వాల్చేసింది.

ఆమెని పేవ్‌మెంటుమీద మెల్లిగా పడుకోబెట్టి చకచక అడుగులు వేసి సెంటరుకు చేరుకున్నాడు. అక్కడ మూడు రిక్షాలు ఉన్నాయి. రిక్షావాళ్ళు వాటిల్లోనే కాళ్ళు ముడిచి

పెట్టుకుని వాటిల్లో నిద్ర పోతున్నారు.

"రేయ్... నిద్రలే...." వీరన్న ఒక రిక్షావాడిని తడ్తూ అన్నాడు.

"ఇప్పుడు సవారీ కట్టవండీ" కళ్ళు తెరవకుండానే విసుక్కుంటూ అని మరింత ముడుచుకున్నాడు రిక్షావాడు.

"లెగరా అంటుంటే" గట్టిగా కుదిపాడు వాడిని వీరన్న.

వాడు కళ్ళు తెరిచి వీరన్నని చూసి దిగ్గున లేచి కూర్చున్నాడు.

"అయ్ బాబో!.... హెడ్డుగారా? నమస్కారం బాబూ."

"పోలీసు స్టేషనుకి పద" అంటూ రిక్షా యెక్కాడు వీరన్న. "ముందు ఆ సందులోకి తీసుకెళ్ళు."

రిక్షాని ఆమె దగ్గర ఆపాడు.

"అయ్యో! ఎవరో ఆడకూతురండీ పాపం!" అన్నాడు రిక్షావాడు, ఆమెని కళ్ళు పెద్దవిచేసి చూస్తూ.

"ఇటు వస్తుంటే యీామె యిక్కడ పడివుండడం చూశాను. పోలీసు స్టేషనులో అప్పజెప్పి తెలివొచ్చాక ఆమె యింట్లో అప్పజెప్పుదామనీ" అన్నాడు వీరన్న.

ఇద్దరూ కలిసి ఆమెని ఎత్తి రిక్షాలో కూర్చోబెట్టారు. వీరన్న ఆమె ప్రక్కన కూర్చుని ఆమె ప్రక్కలకి ఒరిగిపోకుండా రెండు చేతుల్తో పొదివి పట్టుకున్నాడు. ఆమె మెత్తని శరీరం వీరన్నని ఏవేవో లోకాలకు తీసుకెళ్తుంది.

"అయ్యగారు పూర్తి చేసింతర్వాత నేను కూడా ఆయన్ని అడిగి ఓ పట్టుపట్టాలి" అని అనుకున్నాడు.

వీరన్న చేయి మెల్లిమెల్లగా ఆమె గుండ్రని మెత్తని గుండెలమీద తిరుగుతోంది.

వీరన్న ఒళ్ళు ఉద్రేకపడిపోసాగింది.

3

రిక్షా స్టేషను ముందు ఆగింది.

"లోపలికి సాయం పట్టమంటారా బాబూ?" అని అడిగాడు రెండు చేతులూ కట్టుకుని రిక్షావాడు.

"అక్కర్లేదులే" అని రిక్షాలోంచి ఆమెని ఎత్తి భుజం మీద వేసుకున్నాడు వీరన్న.

"కిరాయి రేపిస్తాలే వెళ్ళు" అన్నాడు.

రిక్షావాడు "అలాగే బాబూ" అంటూ ఆ చీకట్లో రిక్షా తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

వీరన్న ఆమెను మోసుకుంటూ పోలీసు స్టేషనులో ఇలా అడుగు పెట్టాడో, లేదో కరెంటు పోయింది.

గుమ్మంలో అలికిడికి తలెత్తి చూశాడు జగన్నాధం. మసగ్గా వీరన్న ఆకారం....భుజంమీద మరో ఆకారం కనిపించాయి అతనికి.

"వచ్చావా?....అదేంటి మోసుకొచ్చావ్?" అతని మాటలు మత్తుగా వచ్చాయ్.

"క్లోరోఫాం పెట్టి తీసుకొచ్చా."

"వెరీ గుడ్....సమయానికి కరెంట్ పోయింది. నీకు లైటార్పే శ్రమ లేకుండా....హహహ...."

నవ్వాడు సబ్ ఇన్స్పెక్టర్ జగన్నాధం.

అమెని లోపల గదిలో పడేసి బయటికి వచ్చాడు వీరన్న.

"ఈ రాత్రంతా నాకు దానితో గడపాలని వుంది. ఇంటికెళ్ళి నాకు అర్జంటు కేసు తగిలిందని, రాత్రి యింటికి రావడంలేదని అమ్మగారితో చెప్పు."

వీరన్న చేతులు నలుపుకుంటూ నిలబడ్డాడు.

"ఏం అలా నిలబడ్డావ్?"

"మీ యిల్లు నాకు తెలీదు కదా సార్?"

"మా యిల్లు తెలీదా?"

"మీరు జాయిన్ అయినప్పుడు నేను లీవులో ఉన్నాను. ఈవేళే కదా సార్ నేను డ్యూటీలో జాయిన్ అయ్యింది" అన్నాడు వీరన్న.

జగన్నాధం విసుక్కున్నాడు.

"ఊ....సర్లే. నువ్విదే వుండు."

ఆమె వున్న గదిలోకి మెల్లగా అడుగులు వేసుకుంటూ వెళ్ళాడు యస్సై జగన్నాధం.

గది మధ్యలో చీకట్లో నీడలా ఆమె ఆకారం కనిపించింది.

జగన్నాధం మోకాలి మీద కూర్చుని ఆమె ఒంటిమీద బట్టలన్నీ వలిచేసి ఆమెని ఆక్రమించాడు.

స్పృహలేని ఆమెని యిష్టం వచ్చినట్టు అనుభవించాడు.

"బ్రహ్మాండంగా ఉందోయ్ నువ్వు పట్టుకొచ్చిన సరుకు త్వరలో యస్సై అయిపోతావ్" దీవించాడు వీరన్నని జగన్నాధం.

తన కోరిక తీరగానే బయటికి వచ్చాడు జగన్నాధం.

"హిహిహి....థాంక్స్ సార్....మరి నేను కూడా వెళ్ళొచ్చా" అన్నాడు చేతులు నలుపుకుంటూ.

"ఊ....కానీయ్. దాన్ని జాతీయం చేసేశాం. ఎవరికైనా దానిమీద హక్కుంది" అన్నాడు జగన్నాధం నవ్వి కుర్చీలో కూర్చుంటూ.

వీరన్న ఒక్క ఉదుటున గదిలోకి పరుగు తీశాడు.

జగన్నాధం గ్లాసులోకి మరికాస్త విస్కీ పోసుకున్నాడు.

సరిగ్గా ఆ సమయంలో కరెంటు వచ్చి గుప్పున లైట్లు వెలిగాయి.

లోపల గాజుల చప్పుడు వినిపించింది.

'దానికి మెలకువ వచ్చినట్టుంది' అనుకున్నాడు జగన్నాధం.

"ఛీ....నన్ను వదులు....దుర్మార్గుడా" ఆమె అరవడం మొదలుబెట్టింది.

ఆమె అరుపులు విని జగన్నాధం మత్తు సగం వదిలిపోయింది.

ఒక్క ఉదుటున గది గుమ్మం దగ్గరికి గెంతాడు.

గదిలో ఆమె పూర్తి నగ్నంగా వుంది. ఆమెను ఆక్రమించుకుంటున్నాడు వీరన్న. ఆమె అరుస్తూ గింజుకుంటుంది.

"సుశీలా!!...." అంటూ దిక్కులు అదిరేలా అరిచి గుమ్మంలో నిస్సత్తువతో కూలిపోయాడు తన భార్య సుశీలని చూస్తూ యస్సై జగన్నాధం. □

లాఠీ చార్జి!

ఏమిటీ లాఠీ చార్జిలో జనాన్ని కాకుండా మంత్రిగార్ని
కూడా బాదేశారా? మీరుదంచమనగ కొట్టమంచేశారు



బస్టాండుకి జీప్ వేసుకుని వచ్చేశాడు సంతోష్.

బస్ దిగుతున్న ప్రణవ్‌ని, సునీలని చూసి సంతోషంగా పలకరించాడు.

"ఒరే ప్రణవ్, ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు? పెళ్ళికాకముందు రమ్మని ఎన్నిసార్లు రాశాను? ఇన్నాళ్ళకి, అదీ పెళ్ళయ్యాక మొదటిసారిగా నువ్విక్కడికి రావటం నాకు చాలా ఆనం

దంగా వుంది!'' అన్నాడు సంతోష్, ప్రణవ్‌ని గట్టిగా సందిట బంధించి ఆనందంగా.

సునీల నవ్వుతూ వాళ్ళిద్దరి వంకా చూస్తోంది.

''ఈమె నా మిసెస్ సునీల. సునీ, వీడే నా బెస్టు ఫ్రెండు సంతోష్. నేను చెప్పిన రేంజి ఆఫీసర్'' అంటూ పరిచయాలు చేశాడు ప్రణవ్.

చేతులు జోడించి నమ్రతగా నమస్కారం పెట్టింది సునీల. ఆమె అపురూప సౌందర్యాన్ని కళ్ళప్పగిస్తూ చూస్తూండిపోయాడు సంతోష్. తర్వాత తేరుకుని ప్రతి నమస్కారం చేశాడు. చాలా అందమైన యువతి అనుకున్నాడు మనసులో.

''అసలు నేన్నీతో మాట్లాడకూడదనుకున్నాను. నా పెళ్ళికెందుకు రాలేదు?'' కోపం నటించాడు ప్రణవ్.

''సారీరా బ్రదర్! సరిగ్గా నీ పెళ్ళికి రెండు రోజుల ముందునుంచీ మాకు యినస్పెక్షన్ జరుగుతోంది ఎంత ప్రయత్నించినా ఆఫీసర్సు నన్ను వదల్లేదు. నేను చాలా రెస్పాన్సిబుల్ పోస్ట్ డీల్‌చేయటంవల్ల తప్పించుకోలేక పోయాను. అందుకే మిమ్మల్ని ఇక్కడకు ఆహ్వానించాను నా ఆహ్వానాన్ని మన్నించి వచ్చినందుకు మీ ఇద్దరకూ నా కృతజ్ఞతలు! ఏదీ, ఆ సూట్‌కేస్ యిలా తే....'' అంటూ సంతోష్ ప్రణవ్ దగ్గరి సూట్‌కేసు అందుకుని జీప్‌లో పెట్టాడు.

''ఆ ఏర్‌బాగ్ యిలా యివ్వండి!'' అంటూ సునీల దగ్గర్నుంచి చనువుగా బ్యాగ్ తీసుకుని సూట్‌కేస్ మీద పెట్టాడు.

తర్వాత స్టీరింగ్ దగ్గర కూచుని వెనకాల కూచోబోతున్న ప్రణవ్‌ని ఆపి, ''అలా ఎక్కడికి? ఇలా వచ్చి

ముందుసీట్లో నాపక్క కూచోండి. వెనక కుషన్‌సీట్లుకావు. ఐరన్ రాక్. మా వర్కర్సుకోసం ఉద్దేశింపబడినవి" అన్నాడు సంతోష్ నవ్వుతూ.

"ముగ్గురం సరిపోతామా?" అన్నాడు ప్రణవ్ సందేహంగా.

"ఫరవాలేదు. మిసెస్ సునీల డోర్‌వైపు కూచోగలరా? —సారీ, జీప్‌కదా, డోర్‌లేదు. కుదుపులకి పడిపోతారేమో. మధ్యన కూచోండి. మావాడు ఆ చివరకు కూచుంటాడు" అన్నాడు చొరవగా సునీలతో సంతోష్.

సునీల యిబ్బందిగా నిల్చుండిపోయింది.

ప్రణవ్ కల్పించుకొని "రా సునీ, యిలా కూచో! ఈ చివరగా నేను కూచుంటాను" అన్నాడు. సునీల తప్పదన్నట్టు వాళ్ళిద్దరి మధ్య కూచుంది.

ఎగుడుదిగుళ్ళు వచ్చినపుడు ఆమె చాలాసార్లు సంతోష్ వైపు ఒరిగిపోవలసి వచ్చింది. ఇది చాలా అసౌకర్యం కలిగించిందామెకు. అదీగాక గేర్ మార్చుకోవటం కోసం సంతోష్ మాటిమాటికీ ఆమెని తాకాల్సి వచ్చేది. సునీల కుంచించుకుపోతుండేది.

"ఇక్కడి కెన్ని కిలోమీటర్లు నీ నివాసం?" అనడిగాడు ప్రణవ్.

"వచ్చేశాం. ఇంకో రెండున్నర కిలోమీటర్లు. అంతే!" అన్నాడు సంతోష్. అతనికింకా మెల్లగా ఓ గంటసేపు అలా జీప్ నడుపుతుంటే హాయిగా వుంటుందనిపించింది. పక్క ఓ అందాల రాశి కూచుని వున్నదన్న భావన అతనిలో వింత పులకరింతలు రేపుతోంది.

ముందుగా ఇన్‌స్పెక్షన్ బంగళా తగిలింది.

"బంగళాలో ఎవరో మన ల్తున్నట్టు కనిపిస్తోందే...."

అన్నాడు ప్రణవ్.

"నిన్న రాత్రి ఏలూరు నుంచి ఓ మిలట్రీ మేజరు అతని స్నేహితులు డాక్టరొకతను, లాయరొకతను వచ్చారు. మా హెడ్డాఫీసు నుంచి పర్మిషన్ తెచ్చుకున్నారు. అందుకని ఆ బంగళా వాళ్ళకోసమని కేటాయించాం. మా కుక్ని, ఓ వర్కర్ని వాళ్ళకిచ్చాను. ఎంతయినా మా ఆఫీసరునించి పర్మిషన్ తెచ్చుకొన్నారు. ఆమాత్రం నే చూడకపోతే బావుండదుకదా!" నవ్వాడు సంతోష్.

"నీకీ ఉద్యోగం ఎలా వుంది?"

"నిజం చెప్పాలంటే మూడు చందనం చెట్లు, ఆరు కలప లారీల్లాగా వుంది! నీకుగనక చెప్పాను. ఎక్కడైనా వాగేవు. మోస్ట్ కాన్ఫిడెన్షియల్!" భయం నటిస్తూ అన్నాడు.

హాయిగా నవ్వారు ఇద్దరూ.

జీపు బంగళా సమీపించింది. కావటానికి అడవే అయినా, చక్కటి బంగళా యిచ్చారు సంతోష్కి. చాలా నీట్గా, అందంగా వుంది.

అంతవరకు పడ్డ శ్రమ, ఆ బంగ్లా చూడగానే మరిచిపోయింది సునీల. ఆమె చూపుల్ని బట్టే ఆ వాతావరణం ఆమెకి బాగా నచ్చిందని అర్ధంచేసుకున్నాడు ప్రణవ్.

బంగళా లోపల యింకా అందంగా వుంది. ముందుగా పెద్ద హాలు, సోఫాసెట్టు, ఫర్నిచరు, చాలా అందంగా అలంకరించబడి వుంది. లోపల మూడు గదులున్నాయి. ప్రతి గదిలోను రోజ్వుడ్ టేబిలు, ఛైర్సు వున్నాయి సీలింగ్ ఫాన్లున్నాయి.

ఎర్ర చందనంతో తయారుచేసిన ఏనుగు బొమ్మలు,

సింహం బొమ్మలు, యింకా రకరకాల వన్యప్రాణుల బొమ్మలు గోడలకు తగిలించబడి కనులకు పండుగే కాకుండా నాసికా పుటాలకి పరిమళాన్ని అందచేస్తున్నాయి.

"ఈ రూం మీకోసం!" అన్నాడు ఓ రూం చూపించి సంతోష్.

రూం చాలా నీట్‌గా వుంది ఫ్లోరింగ్ చాలా స్మూత్‌గా, నీటిచుక్క నేలమీద పడితే జారిపోయేటంత నున్నగా వున్నది. నీడ కనిపిస్తోంది. తక్కిన గదుల్లాగే ఫర్నిచర్స్.

"ఇంతకీ మీరుండే దెక్కడ? ఐమీన్, మీ పడకగది?" అన్నాడు నవ్వుతూ ప్రణవ్.

"మీరు అంటున్నావు. నేనిప్పుడు ఒంటరివాడ్ని!"

"అంటే...." ప్రణవ్ సందిగ్ధంలో ఆగిపోయాడు.

"నా నిర్మల చనిపోయి ఆర్నెల్లయింది."

ప్రణవ్‌తోబాటు సునీల కూడా ఉలిక్కిపడి చూసింది.

"అదేమిటి? నాకు తెలియదే! అరరె, యింత చిన్న వయసులో ...."

"అదే నా దురదృష్టం పులి చంపేసింది."

"పులా?" వింటున్న ఇద్దరు ఒకేసారి అన్నారు.

"అవును పెద్దపులి. మేమెవరంలేని సమయంలో బంగళామీద దాడిచేసి నిరూని పొట్టన బెట్టుకుంది."

"వెరీ సారీరా!....అయితే యీ అడవిలో పెద్దపులు లున్నాయా? ఈ మధ్య మీ అటవీశాఖవాళ్ళు యిక్కడో పులిని పట్టుకుని హైదరాబాదు జూకి పంపేసినట్టు పేపర్లో వార్తలు వచ్చాయి."

"కరెక్టు! అదే పులి. ఆ సంఘటన జరిగాక మా వాళ్ళే వేటగాళ్ళను తీసుకొచ్చి పులిని మాటువేసి పట్టుకుని, జూకి తీసుకుపోయి అప్పగించారు."

"నిన్ను అనవసరంగా ఆ పాతజ్ఞాపకాలకు తెచ్చి బాధ పెట్టాను. క్షమించరా!" అన్నాడు ప్రణవ్.

సునీల అతని వంక జాలిగా చూసింది. సర్వమూ పోగొట్టుకున్నవాడిలా బాగా డీలాపడిపోయాడు సంతోష్.

సంతోష్ వాళ్ళ పరిస్థితి గమనించి, "మీ మూడ్ చెడ గొట్టాను. వేణ్ణీళ్ళు సిద్ధంగా వున్నాయి స్నానంచేసి విశ్రాంతి తీసుకోండి. వంట కూడా పూర్తయింది. స్టీరియో టేప్ రికార్డరు మీ రూంలో బిగిస్తాను. మీకు కాలక్షేపమవుతుంది! రేపు మీకు ఈ అడవి అంతా త్రిప్పి చూపిస్తాను" అని వాళ్ళను ఒంటరిగా వదలి బయటకు వెళ్ళాడు.

2

"ఎలా వుంది అరణ్యవాసం" అడిగాడు ప్రణవ్ భార్యని.

"నా మటుకు చాలా హాయిగా వుంది. ప్రకృతి ఒడిలో సేద దీర్చుకుంటున్నట్టు వుంది. నగర జీవితంతో విసిగి పోయిన మనుషులు యీ జీవితం రుచిచూస్తే మళ్ళీ పొరపాట్న కూడా నగర జీవితం కోరుకోరు!" పూర్తి కిటకీలో నుంచి పచ్చటి ప్రకృతిని చూస్తూ అన్నది సునీల.

వాళ్లొచ్చి రెండు రోజులయింది. రెండు క్షణాల్లా గడిచిపోయినట్టుంది సంతోష్ ఆతిధ్యంలో ఆ రెండు రోజులు.

"పాపం మీ స్నేహితుడు మన గురించి చాలా శ్రమ తీసుకుంటున్నాడు. కాకపోతే మనకు విందు చెయ్యటాని కోసమని అమాయకమైన చెవుల పిల్లుల్ని, కౌజు పిట్టల్ని, కణుసుల్ని జీవహింస చేయటమే నాకు నచ్చలేదు."

"నీకు సిటీలో కావాలంటే మాత్రం వీటి మాంసం దొరుకుతుందా? వెరైటీ తిండి తినిపిస్తున్నందుకు వాడ్ని

అభినందించాలి!''

సంతోష్ లోపలికి రాబోయి గుమ్మం దగ్గరే ఆగి, "మే ఐ కమిన్!'' అన్నాడు మర్యాదగా.

"భలేవాడివే రారా!'' అన్నాడు ప్రణవ్.

సునీల సర్దుకుని కూచుంది.

"ఎక్కడికైనా బయటికి వెళ్దామా?'' అన్నాడు సంతోష్.

"ఎక్కడికి వెళ్తాం? అడవిలోకేనా?''

"బాగా లోపలికి కాదు. బయటినుంచే దారి వున్నంత మేరా మిమ్మల్ని తిప్పిచూపిస్తాను. అయితే జీప్ పోదు లోపలికి! కొంతదూరం మాత్రమే చెట్లుకొట్టి కూపులారీల కోసమని దారి చేశారు మా వాళ్ళు. అంతమేరా జీప్‌లో పోయి చూదాం! ఇంకా నడవగలమంటే దిగి కొంతదూరం పోయి చూడొచ్చు!'' అన్నాడు.

సునీల ఉత్సాహం చూపింది.

ఓ అరగంటలో జీప్‌లో బయల్దేరారు ముగ్గురే!

"ఏదయినా అవసరముంటుందని తుపాకీ, బుల్లెట్లు కూడా తెస్తున్నాను'' అన్నాడు సంతోష్.

చెట్లు చాలా గుబురుగా వున్నాయి. పట్టపగలే దారి కని పించకుండా చిక్కగా అలుముకున్నాయి. సూర్యరశ్మి నేల మీద పడకుండా భారీ వృక్షాలు!

సునీల వింతగా రకరకాల చెట్లవంక, గుబురు పొదల వంక, ఉండి వుండీ పొదల చాటునుంచి అటు యిటు పరుగులు పెడ్తున్న కుందేళ్ళ వంక, దూరంగా కనిపిస్తున్న విసీల పర్వతాలవంక పరీక్షగా వింతగా చూస్తోంది.

ఎండుటాకుల పైన జరజర మని చప్పుడు చేసుకుంటూ రెండు నల్లత్రాచులు పరుగులు పెడుతూ పోవటం కని

పించింది.

సునీల గుండె ఓ క్షణం ఆగి కొట్టుకుంది. "బాబోయ్, నల్లత్రా...." ఆమె చెయ్యి నొక్కి మాట్లాడవద్దని సైగ చేశాడు సంతోష్. ఆమె చటుక్కున చేయి లాక్కుంది. ఆమె మొహంలోని భావాలు బయట పడకుండా నిశ్చలంగా జీప్ విండోలోనించి చూస్తోంది.

పాములు తమ మానాన వెళ్ళిపోయాయి. అలా రెండు గంటలపాటు అడవి తిరిగి చూశారు.

ఇంతలోనే ప్రకృతిలో విపరీతమైన మార్పు వచ్చేసింది. మబ్బులు కమ్మేశాయి.

"ఏ క్షణంలోనైనా వర్షం వచ్చేలా వుంది. ఇక వెళ్ళి పోదాం" అన్నాడు ప్రణవ్. సునీల ముఖంలో కూడా అదే భావం.

మౌనంగా జీప్ స్టార్టు చేశాడు సంతోష్. జీప్ని బ్యాక్ చేయటానికి అనువుగా వున్న చోటువరకు రివర్స్లాగే పోనిచ్చి, టర్న్ చేసుకున్నాడు.

ఒక్కసారిగా ఢోరున వర్షం మొదలయ్యింది.

"అడవిలో ఎప్పుడు వర్షం పడుతుందో, ఎప్పుడు దావాగ్ని పుడుతుందో చెప్పలేం! చెట్లు కదా!" అన్నాడు సంతోష్.

జల్లు వాళ్ళ ముఖాలకు బాణాల్లా కొడుతోంది. దారంతా జలమయమైపోయింది.

"టాప్ వుంది గాబట్టి కనీసం తల తడవకుండా రక్షించు కోగలుగుతున్నాంగాని, ఒళ్ళంతా తడిసి ముద్దయిపోయింది" అన్నాడు ప్రణవ్.

వర్షం ధారగా పడుతోంది. వైపర్స్ ఆన్ చేశాడు సంతోష్. హెడ్ లైట్సు వేశాడు. కాని దారి సుగమంగా

కనిపించటంలేదు.

అరగంటసేపు జీప్ నడిచినా బంగళా చేరుకునే సూచ నలు కనిపించలేదు. అప్పటికే ముగ్గురు తప్పగా తడిసి పోయారు. తడిపిన దుస్తుల్లో సునీల సంతోష్ కళ్ళకు ముగ్ధ మోహనంగా, మనోహరంగా కనిపిస్తోంది. సీట్లో ముడు చుకుపోయి కూచుందామె.

అకస్మాత్తుగా అన్నాడు సంతోష్ "మనం దారి తప్పి పోయాం!" అని.

3

ప్రణవ్ సునీలల గుండెల్లో బండరాళ్ళు పడినట్టవిపిం చింది.

"అరె, యిప్పుడెలా?" అప్రయత్నంగా అరిచారు.

"జీప్‌కి ఎదురుగొప్పులు తగుల్తున్నాయి. దారి కనిపిం చటంలేదు. ఏ డైరెక్షన్లో వచ్చామో గుర్తుపట్టడం అశ క్యంగా వుంది!" అన్నాడు సంతోష్.

అప్పటికే ఆ ప్రదేశమంతా చీకట్లు అలముకున్నాయి. పట్టపగలే ఆ అడవిలో వెల్తురు అంతంత మాత్రంగా వుంటుంది! అలాంటిది కారుమబ్బులు కమ్మితే కాళరాత్రిలా తోపింప చేస్తోంది.

"పోనీ, నడిచి వెళ్ళిపోదామా?" అన్నాడు ప్రణవ్.

అతనికేసి వింతగా చూసి నవ్వి "ఈ అడవిలో చెట్లు చేమలే కాదు, పెద్దపెద్ద గోతులు, ముళ్ళపొదలు పాము పుట్టలు కూడా దట్టంగానే వున్నాయి. మన కాలు ఎక్కడ పడుతుందో అగమ్యగోచరం! చాలా ప్రమాదకరం!" అన్నాడు సంతోష్.

"ఎలా మరి? ఆకాశం చిల్లులు పడినట్టు ఏకధారగా పడు తోంది. ఇంత తొందరలో తగ్గే అవకాశంలేదు. నీటి

మట్టం కూడా పెరుగుతోంది. జీప్ సగంవరకు మునిగి పోయింది. కాసేపటికి మనం కూడా మునిగిపోవడం ఖాయం!" అన్నాడు ప్రణవ్.

సునీలయితే పూర్తిగా భయపడిపోయింది.

సంతోష్ రెండు నిమిషాలేదో ఆలోచించి, "జీప్‌ని ఎత్తయిన ప్రదేశానికి తీసుకుపోవటానికి ప్రయత్నిద్దాం!" అన్నాడు. చాలాసేపు ప్రయత్నించాడుగాని సెల్ఫ్ కాలేదు.

వాళ్ళిద్దరి వంకా నిస్సహాయంగా చూసి, "జీప్ స్టార్ట్ కావడంలేదు. ఆ కనబడే మెరక మీదికి జీప్‌ని నెట్టుకుని పోవటం తప్ప మరో దారి లేనట్టుంది. ఇంజన్లోకి నీళ్ళు వచ్చేశాయి!" అన్నాడు.

"ఫారెస్టుగార్డూ వాళ్ళు వుండేది కూపుల దగ్గర అని చెప్పావు కదా. అంటే ఈ పరిసర ప్రాంతాల్లోనే ఉంటాడు కదా! ప్రయత్నిస్తేనో...." అన్నాడు ప్రణవ్.

"ఈ వర్షం హోరులో ఎంత గొంతు చించుకున్నా వినే నాథుడుండడు! అదీగాక మనం దారి తప్పివున్నాం! గార్డు వున్న యిల్లు ఏ దిశలో వున్నదో కూడా చెప్పలేం!" అన్నాడు నిరాశగా సంతోష్.

"అయితే నేను నెట్టుతాను. నువ్వు స్టీరింగ్ చూసుకో!" అంటూ నేలమీదికి దిగాడు ప్రణవ్. మోకాలి లోతువరకు నీళ్ళు వచ్చాయి

"నేనూ దిగుతాను" అన్నది సునీల భర్త అవస్థ చూడలేక.

"వద్దొద్దు, నువ్వు నెట్టలేవు!" అన్నాడు ప్రణవ్ వారిస్తూ

కాని మోకాటిలోతు నీరు మొలలోతు వరకు పెరిగిపోగా, తన శక్తి వంచన లేకుండా జీప్‌ను నెడుతూ, వర్షంలో

తప్పగా తడిసిపోయి, జుట్టునుంచి నీరు ధారలుగా కారి పోతుంటే భర్త జీప్‌ను నెట్టడం. ఆ జీప్‌లో తనుండటం ఆమె హృదయాన్ని రంపపు కోత కోస్తూంటే, సునీల రాబోతున్న దుఃఖాన్ని కంఠంలోనే ఆపుకున్నది.

జీప్ కొంతదూరం దొర్లి మళ్ళీ ఆగిపోయింది. ఏదో అడ్డు వచ్చింది.

అప్పటికే వర్షం నీరు నడుముదాకా వచ్చేసింది ప్రణవ్‌కి. నీటిలో చిన్న చిన్న జంతువుల కళేబరాలు, పాములు, చెత్త చెదారం కొట్టు వస్తున్నాయి.

అతని ఒళ్ళు గగుర్పొడిచింది. అప్పటికే పూర్తిగా తడిసిపోయిన దుస్తులు శరీరాన్ని ఒణికిస్తున్నాయి.

సునీల కేకపెట్టింది "ఏమండీ, జీప్‌లోకి వచ్చేయండి!" అని. అప్పటికే జీపు సగానికి మునిగిపోయింది.

సంతోష్ జీప్ టాప్‌మీదికి ఎక్కాడు. కాని అతని బరువుకి జీప్‌పై టార్పాలిన్ అణిగిపోయింది. అలాగే చెయ్యి సాయంతో సునీలని పైకి లాక్కోబోయాడు ఆమె సంకోచించినా తప్పనిసరయి అతని చేయి పట్టుకుంది. కాని జారి పోబోయింది.

ప్రణవ్‌కి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. చకచక పక్క చెట్టు ఎక్కేశాడు. జీప్‌కి సరిగ్గా పైకివచ్చే కొమ్మ మీదికి వచ్చి చేతులు చాచి సునీలను పైకి చేదుకున్నాడు. అప్పటికి జీప్ టాప్‌కూడా మునిగిపోయింది.

సునీలని కొమ్మపైకి లాగాక, గుబురుగా వున్న చెట్టు శాఖలమీదికి జాగ్రత్తగా కూర్చుండచేసి సంతోష్‌ని పైకి లాగటానికి చేతులు చాచాడు ప్రణవ్.

సంతోష్ అతని సాయంతో తనూ కొమ్మమీదికి ఎగబాకాడు.

కాని, అంతలోనే అనుకోని అవాంఛనీయ సంఘటన జరిగిపోయింది.

ప్రణవ్ ఎవరో కిందికి దిగలాగినట్టుగా దబ్బున కొమ్మ మీదినుంచి జారి నీళ్ళలో పడిపోయాడు. అతనికి యీత రాదు. టపటప నీళ్ళమీద కొట్టుకుంటున్నాడు. ప్రవాహంలో కొట్టుకుపోతున్నాడు.

సునీల కెవ్వున అరిచింది. "అయ్యో, ఏమండీ, ఏమండీ" అంటూ హృదయవిదారకంగా ఏడ్చేస్తోంది.

ప్రణవ్ తలెత్తి వాళ్ళవైపు చూడటానిక్కూడా అవకాశంలేదు. అలాగే ముందుకు కొట్టుకుపోతున్నాడు.

"ఏదయినా చెట్టును పట్టుకో ప్రణవ్" అంటూ అరిచాడు సంతోష్.

సునీల చెట్టు మీదినుంచి దూకెయ్యబోయింది పెద్దగా ఏడుస్తూ.

కాని సంతోష్ ఆమె ప్రయత్నం కొనసాగనివ్వలేదు. ఆమె గింజుకున్నది.

"నన్ను ఆపకండి. వారితోనే నేనూ నీళ్ళలోపడి కొట్టుకుపోతాను. బతికినా, చచ్చినా యిద్దరం కలిసే అనుభవిస్తాం!" అన్నది హిస్టీరికల్‌గా నెత్తి బాదుకుంటూ. ఆమె చేతులకు నిండుగా వున్న గాజులు భళ్ళున బద్దలయ్యాయి.

"మరీ పిచ్చిదానిలా ప్రవర్తించకు. ప్రణవ్ తెలివి తక్కువవాడు కాదు. ఏదో చెట్టునో, మరో దుంగనో, చెక్కనో ఆధారం చేసుకుని ప్రాణం దక్కించుకుంటాడు. ఈ అడవిలో వాటికేం లోటులేదు. ఎక్కడ పడితే అక్కడే వున్నాయి!" అన్నాడు సంతోష్ ఆమెకు ధైర్యం కలిగించాలని.

"మీరు ... మీరు .... చూస్తూ వూరుకుంటారేం? నీటిలో

దూకి మీ స్నేహితుడ్ని రక్షించే ప్రయత్నమేదీ చేయరేం!?" అన్నదామె వెక్కిళ్ళ మధ్య.

"సారీ సునీలా, నాకూ ఈతరాదు. నేను నీళ్ళలోకి దూకినా ప్రవాహ వేగానికి కొట్టుకుపోవటం తప్పిస్తే ప్రయోజనముండదు! అది అంత తెలివైన పనికాదు. అనవసరంగా వర్రీ అవుతున్నావుగాని, ప్రణవ్ ఏదోక చెట్టు కొమ్మ సంపుకుని యీ పాటికి ఏదోక చెట్టెక్కి ప్రాణం రక్షించుకునే వుంటాడు!" అన్నాడు సంతోష్.

ఆ మాటలు సునీలకి రుచించలేదు. అప్పటికే ఆమె పూర్తిగా తడిసిపోయింది. చీర, జాకెట్టు, లోపలి లంగాతో పాటు పూర్తిగా శరీరాని కతుక్కుపోయిన విషయంగాని, తన శరీరంలోని వంపులవైపు సంతోష్ చూస్తున్నాడని గాని, ఆమెకు గుర్తింపుకు రావటం లేదు.

ఆమె మనసులో వున్న ఒకే ఒక రూపం - తన భర్త ప్రణవ్, అతను నీళ్ళలో పడిపోయిన దయనీయ దృశ్యం!

4

"ఫణీ, ఎంత పని చేశావయ్యా, నీ వేట కాదుగాని మా ప్రాణాని కొచ్చింది! బతికి బయట పడతామంటావా?" అన్నాడు డాక్టర్ ధనంజయ.

"ఇష్టపడి వేటకని వచ్చాం ఏం చేసినా, ఏమయిపోయినా యిక చేసేదేంలేదు. ఇదో రకమైన అనుభవం! లెటజ్ ఎంజాయ్!" అన్నాడు లాయర్ పరబ్రహ్మం జారిపోకుండా చెట్టుకొమ్మ గట్టిగా పట్టుకుంటూ.

"అనుభవమే? ఏమాత్రం అజాగ్రత్తగావున్నా చెట్టు దిగువ సుళ్ళు తిరుగుతున్న ప్రవాహంలో పడిపోయి సరాసరి నరకానికి పోవటం చాలా గొప్ప అనుభవం" అన్నాడు

ధనంజయ.

మేజర్ ఫణీంద్ర మాత్రం యిదేం పట్టనట్టు కింద సుళ్ళు తిరుగుతున్న సీటికేసి దీర్ఘంగా చూస్తున్నాడు.

ఇన్‌స్పెక్షన్ బంగ్లానుండి ఆ మధ్యాహ్నం వేటకని బయల్దేరారు ముగ్గురు మిత్రులు. ఈ నాలుగు రోజుల్లోను డాక్టర్‌కి, లాయర్‌కి తుపాకీ ఎలా హేండిల్ చెయ్యాలో, ఎలా లోడ్ చెయ్యాలో టార్గెట్‌కి ఎలా గురి చూసి కొట్టాలో క్షుణంగా నేర్పాడు మేజర్.

లాయరు, డాక్టరు స్కూల్‌డేస్‌లో నేర్చుకున్న ఎన్.సి.సి. పరిజ్ఞానంతో తొందరగానే ఫాలో అయ్యారు ఫణీంద్రని. లాయర్ ఎగిరే పక్షుల్ని రెండింటిని నేల కూలిస్తే, డాక్టర్ ఓ కముసును చంపి కూరకు మాంసం సంపాదించాడు.

"వీటిని కాదు వేటాడటం? పెద్ద పులినో, సింహాన్నో వేటాడాలి. అది మగవాడితనం!" అంటూ కవ్వించాడు మేజర్.

"ఈ అడవిలో కనీసం లేళ్లు, దుప్పులు కూడా కని పించలేదే, పులెక్కడుంటుంది?" అంటూ వేళాకోళం చేశాడు ధనంజయ.

"భలేవాడివే. గతంలో ఇక్కడి రేంజర్ భార్యని పులి చంపేసిందని కుక్ చెప్పాడు, వినలేదా?" అన్నాడు లాయరు పరబ్రహ్మం.

ఫణీంద్ర అతని మాటలు బలపరుస్తూ "ఎస్. అందుకే నేనీ అడవికి టూర్ వేశాను. అప్పుడప్పుడు తమకు పులి గర్జనలు వినిపిస్తుంటాయని యిక్కడి నేటివ్స్ చెప్పగా విన్నాను" అన్నాడు.

ఇదంతా ఆ రోజు ఉదయం జరిగిన సంభాషణ—యిన్

స్పెక్షన్ బంగళాలో.

దాన్ని గుర్తు చేశాడు డాక్టర్ ధనంజయ.

ప్రస్తుతం ఆ ముగ్గురు అడవిలో ఇంకో మూల ఒక పెద్ద చెట్టుమీద కూచుని ప్రాణాలు రక్షించుకుంటున్నారు.

ముగ్గురు సురక్షితంగా వున్న గుబురు కొమ్మలమీద జాగ్రత్తగా సర్దుకుని కూచున్నారు.

చూస్తుండగానే వర్షం బాగా పెరిగిపోయి పెద్ద ప్రవాహం అయింది. అడవిలోని చెట్లు, పుట్టలు, గుట్టలు అన్నీ ఏకమై పోయాయి. జలమయమైపోయాయి. తిరిగి ఇన్‌స్పెక్షన్ బంగళాకు వెళ్ళగలమా అని అనుమానంగానే వుంది ముగ్గురికీ.

"అదుగో, దూరంగా ఏదో కొట్టుకొస్తోంది" అన్నాడు ధనంజయ.

"పెద్దపులి వర్షానికి కాలవలో మునిగిపోయి చచ్చి పోయిందేమో...." అన్నాడు పరబ్రహ్మం.

ధనంజయ నవ్వాడు. ఫణీంద్ర కళ్ళు చికిలించి చూశాడు ఆ కళేబరం వంక.

"ఎవడో మనిషే! బతికున్నాడో, లేదో తెలీదు!" అన్నాడు ఫణీంద్ర.

ఇంతలో ఆ ఆకారం వాళ్ళు కూచున్న చెట్టు కిందికి వచ్చింది.

"అరెరె, ఆ కుర్రాడిలా వున్నాడే...." అన్నాడు డాక్టర్.

ముగ్గురికి ఆ శరీరం రెండు రోజుల క్రితం రేంజర్ బంగళాలో దిగిన కొత్త దంపతుల్లో మగాడిదని గుర్తు పట్టారు.

ఫణీంద్ర చటుక్కున చెట్టుమీది నుంచి నీటిలోకి దుమి

కాడు.

అతడు గజఈతగాడు. రెండంగల్లో ప్రణవ్‌ని చేరుకుని అతన్ని చేజిక్కించుకున్నాడు. ప్రవాహానికి ఎదురీది చెట్టు కిందికి ప్రణవ్‌తో ఈదుకుంటూ వచ్చేశాడు.

"ఇతనికి స్పృహలేదు—నీళ్ళు బాగా తాగేశాడు!" అన్నాడు ఫణీంద్ర. అటు యిటు చూశాడు. తాటాకులు కొట్టుకొస్తుంటే, వాటినందుకున్నాడు ఫణీంద్ర.

క్షణాల్లో తాటాకు తడపతో తాడు తయారుచేశాడు ఫణీంద్ర. ఓ చివర ప్రణవ్ నడుముకు కట్టాడు. రెండో చివర కొమ్మమీదున్న ధనంజయ, పరబ్రహ్మంల వైపు విసిరాడు.

వాళ్ళిద్దరూ ప్రణవ్‌ని పైకి చేరుకుంటుంటే కిందినుండి తను అతను జారిపోకుండా పైకి తోశాడు. ప్రణవ్‌ని కొమ్మలమీద పడుకోబెట్టిన తరవాత తను కూడా చెట్టెక్కి వాళ్ళున్న కొమ్మమీదికి చేరాడు ఫణీంద్ర.

"నీళ్ళు బాగా తాగాడు. కక్కించాలి!" అన్నాడు డాక్టర్ ధనంజయ, ప్రథమ చికిత్స చేయడానికి సిద్ధమవుతూ.

ప్రణవ్‌ని కొమ్మమీద బోర్లా పడుకోబెట్టి, చేతుల్ని కాళ్ళవైపు సమాంతరంగా తీసుకునివచ్చి నీళ్ళు కక్కించే ఏర్పాటు చేశాడు. తర్వాత వెల్లకిలా పడుకోబెట్టి కూడా పొట్టమీద అదిమి నీళ్ళు కక్కించాడు.

అయితే ప్రణవ్‌కి స్పృహరాలేదు. అతని అరిచేతులు, అరికాళ్ళు రుద్దుతూ వేడి పుట్టించటానికి, అతన్ని స్టిమ్యులేట్ చెయ్యటానికి చెయ్యగలిగిందంతా చేస్తున్నాడు ధనంజయ.

వర్షం హోరున పడుతూనే వుంది.

అప్పటిదాకా ఆర్టిఫిషియల్ రెస్పిరేషన్ (కృత్రిమ శ్వాస

(ప్రక్రియ) కోసం ప్రయత్నించాడు డాక్టర్ ధనంజయ-తన నోటితో అతని నోటిలోనికి గాలి పూరిస్తూ. అది కూడా విఫలమయింది.

"ఏం కండిషన్ ఎలా వుంది?" అనడిగాడు పరబ్రహ్మం.

ధనంజయ పెదిమ విరిచి, "మూవ్‌మెంట్స్ లేవు. బాగా నీళ్ళు తాగేశాడు. ఈత రాదనుకుంటాను. పైగా బాగా కలుషితమైన నీరు తాగేశాడేమో, శ్వాసకోశంలో మట్టి చిక్కుకుని, గాలిని చొరకుండా గాలిగోశాలు మూసుకుపోయాయి. నా దగ్గిర కిట్‌లో లైఫ్‌సేవింగ్ డ్రగ్సున్నాయి. కాని కిట్ బంగళాలో వుంది. మనం అక్కడికి చేరుకునే వీల్లేదు. ఎలా?" అన్నాడు ఏదో ఆలోచిస్తూ.

ఫణీంద్రలో ఒక్కసారిగా ఏదో నిర్ణయానికొచ్చిన స్థిరత్వం కనిపించింది.

"ధనం, నీకు ఈత వచ్చును కదా!?" అన్నాడు.

"ఆఁ వచ్చును" అన్నాడు ధనంజయ.

"నాకు రాదు!" అన్నాడు పరబ్రహ్మం.

"అయితే మనిద్దరం వెంటనే ఇతన్ని బంగళాకు తీసుకువెళ్దాం, పద!" అన్నాడు ఫణీంద్ర ధనంజయతో, ప్రణవ్‌నుద్దేశించి చెపుతూ.

"ఎలా తీసుకు వెళ్తాం? దాదాపు మనం మునిగిపోయేటంత నీరు ప్రవహిస్తోంది. ఎటు చూసినా అపార జలసముద్రంలా వుంది. పైగా బంగళాకు దారి తెలియదు కదా!?" అన్నాడు ధనంజయ.

"నేనీ అడవికి ఇరవై ముప్ఫయి సార్లు వచ్చాను. ఏ దారిన పోతే ఏమొస్తుందో నాకు తెలిసినంత బాగా ఇక్కడి ఉద్యోగులకి కూడా తెలియదు. ఈ తాటాకు తాడుతో

యితన్ని నా వీపుకు బలంగా కట్టెయ్యండి మీ రిద్దరు కలిపి. నేను గజ ఈతగాడినని నీకు తెలుసు. పది నిమిషాల్లో బంగళాకి చేరుస్తాను .... నువ్వు నాతోబాటు యీదుతూ ఫాలో కా!" అన్నాడు ఫణీంద్ర.

"మీరిద్దరు వెళ్ళిపోతే, మరి నా గతి?" అన్నాడు పర బ్రహ్మం.

ఫణీంద్ర అతని వంక చురుగ్గా చూసి: "నేను మళ్ళీ వచ్చి నిన్ను బంగ్లాకు తీసుకువెళ్తాను. డోంట్ వర్రీ. ఈ లోపల నీవు ఏమీ అయిపోవు. నా రైఫిల్ నీ దగ్గిరే వదిలి వెళ్తాను. రౌండ్స్‌తోబాటు. అవసరమైతే ఉపయోగించు" అన్నాడు.

పరబ్రహ్మం "ఓకే! అబ్బే, నాకేం భయంలేదు. ఈత వస్తే నేనూ మీతో వచ్చేవాడిని కదా అని...." అని మాటలు మింగేశాడు.

క్షణాలమీద ప్రణవ్‌ని ఫణీంద్ర వీపుకి కట్టేశారు ధనం జయ, పరబ్రహ్మం.

ఫణీంద్ర నీళ్ళలోకి బాలెన్స్‌డ్‌గా ఉరికాడు. ధనంజయ తనూ ఉరికి ఫణీంద్రను అనుసరించాడు.

ఆ నిశ్శబ్ద వాతావరణంలో వారిద్దరు నీటిపై తపతప కొడ్తున్న చేతుల, కాళ్ళ శబ్దాలు తప్ప మరేం వినపడటం లేదు.

"చీకట్లో ఏమీ కనిపించటంలేదు, ఏవేవో ప్రాణులు కాళ్ళకి తగుల్తున్నాయి. పాములా వున్నాయి" అన్నాడు ధనంజయ.

"ఏదయినా తప్పదు! ఓ ప్రాణాన్ని రక్షించవలసిన డాక్టరువి నువ్వు. ఆపదలో వున్న ప్రాణిని రక్షించటం కోసం మనిద్దరి ప్రాణాలు బలిపెట్టాల్సి వచ్చినా వెనుతియ్య

కూడదు!" అన్నాడు ఫణీంద్ర ఏకాగ్రతతో యీదుతూ.

"గుడ్! నీ మిలిట్రీ క్రమశిక్షణ, స్వార్థరాహిత్యం నాకు బాగా నచ్చాయి ఫణీ! నువ్వు యీ కాలం వాళ్ళకు ఆదర్శ ప్రాయుడివి. రియల్లీ యు ఆర్ గ్రేట్!" అన్నాడు ధనం జయ మనస్ఫూర్తిగా.

అంతలోనే ఏదో గుర్తొచ్చినట్టు "మనం ఇతన్నొక్కడ్నే చూశాం. ఇతని భార్య. స్నేహితుడు వాళ్లేమయినట్టు? ప్రవాహంలో కొట్టుకుపోయారంటావా?" అన్నాడు ధనంజయ.

ఫణీంద్ర రెండు క్షణాలు ఆలోచించి, "అలా జరగ టాని కవకాశముంది. పాపం, కొత్త దంపతులని విన్నాం. యిలా అర్ధాంతరంగా...." అని వూరుకున్నాడు.

"అదిగో, దూరంగా మన బంగళాలో లైట్లు వెలుగు తున్నాయి... దగ్గర కొచ్చేస్తున్నాం" అన్నాడు ఫణీంద్ర.

అంత చీకట్లో కూడా బంగళా ఏ దిశలో వుందో గ్రహించి అటు ఈదుతూ మార్గం చూపుతున్న ఆ మిలిటరీ ఆఫీసరు తెగువకు, సునిశితమైన పరిజ్ఞానానికి, వీపుమీద మరో మనిషిని మోస్తూ కూడా ఏ మాత్రం ఆయాసపడ కుండా తేలిగ్గా చేపలా యీదుకుంటూ పోతున్న అతని దేహదారుఢ్యానికి అబ్బురపడుతున్నాడు ధనంజయ.

భోరున వర్షం కురుస్తూనే వుంది.

5

"ప్లీజ్, ఏడవకు! ప్రణవ్‌కేం ప్రమాదం లేదన్నాను కదా! ఈపాటికి ఏదోక చెట్టుకొమ్మ మీదికి ఎక్కి ప్రాణం రక్షించుకునే వుంటాడు" ఆమెను ఊరడించటానికి ప్రయ త్నిస్తున్నాడు సంతోష్.

సునీల ఏకధాటిగా ఏడుస్తూనే వుంది. ఆమె కన్నీరు

వర్షం నీరుతో కలిసి ఆమె శరీరంమీది నుంచి కింది ప్రవాహంలో పడిపోతున్నాయి.

"ఈ వర్షంలో, ఈ ప్రవాహంలో ఆయన యెలా ప్రాణాలు దక్కించుకుంటారో.... అసలే ఈతరాని మనిషి! ఆయన నా కిక దక్కరు...." దుఃఖోద్వేగంతో ఆమె పిచ్చిదయిపోతుందనిపించిందతనికి.

"ప్లీజ్, ఏడవకు నీకు నేనున్నాను తోడు" అంటూ రెండు చేతులతోను ఆమె ముఖాన్ని పట్టుకుని అనునయించబోతున్నట్టు నటిస్తూ, ఆమెను దగ్గరగా తీసుకోబోయాడు సంతోష్.

సునీల నిప్పును తాకినట్టు ఒక్కసారిగా అతని చేతులు విదిలించి దూరంగా జరిగింది.

"కంగారుపడకు! ఆ ...ఆ.... వెనక్కు జరగకు, కిందకు పడిపోతావ్ ..." అన్నాడు సంతోష్.

"నువ్విలా ప్రవర్తిస్తే నే నీ ప్రవాహంలోకి దూకి చచ్చిపోతాను. ఆయన లేకపోయాక నేను బతికీ లాభం లేదు. నీలాంటి వ్యక్తి ఆయనకు స్నేహితుడని చెప్పుకోవటానికే అసహ్యంగా వుంది ."

సునీల కంఠం దుఃఖం నుంచి కోపానికి మారింది.

సంతోష్ నవ్వాడు "డియర్! నిన్ను బస్టాండ్‌లో చూసినప్పటినుండీ నాకు మతిపోయింది. లోకంలో యింత అందమైన ఆడది వుంటుందా అని మొదటిసారిగా ఆశ్చర్యం వేసింది. నీలాంటి సౌందర్యమూర్తిని సృష్టించిన బ్రహ్మ జన్మ తరించిందనుకున్నాను. నా యింటికే నువ్వు రావటం, నాకు చక్కటి అవకాశాన్ని ఆ భగవంతుడే యిచ్చాడని మురిసిపోయాను.

"రెండు రోజులుగా అవకాశం కోసం చూస్తున్నాను. అది యీ రూపంగా యిలా దొరుకుతుందని కల్లో కూడా అనుకోలేదు—ఎనీవే థాంక్‌గాడ్! రా, యీ వర్షంరాత్రిని మనిద్దరం సద్వినియోగం చేద్దాం. ఈ విశాలమైన చెట్టు కొమ్మే మనకు పూలపాన్పు. ఈ చలిని, మన వేడి కలయికతో ఏకం చేద్దాం!" ఉన్మత్తుడిలా వూగిపోతూ ఆమెను తన బాహువుల్లోకి లాక్కున్నాడు.

"ఛీ! వదులు దుర్మార్గుడా! స్నేహితుడి భార్యను నన్ను కామించి, నా భర్త ఆపదలో వుంటే రక్షించకపోగా, పైగా నాతో యీ పరిస్థితిలో సరసానికి దిగుతావా? నువ్వు నరరూప రాక్షసుడివి! శవాలతో భోగించే కాముకుడివి! నే నిప్పుడు జీవచ్ఛవాన్ని. నా భర్త కేమయిందోననే భయాందోళనలతో యింత క్రితమే నేను మానసికంగా చచ్చిపోయాను. ఇప్పుడీ శరీరాన్ని అంతం చేసుకుంటాను...." గింజుకుంది, కిందికి దూకెయ్యటానికి.

"ఊహూఁ, నిన్ను వదలను! ఈపాటికి నీ మొగుడు చచ్చే వుంటాడు. నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తాను. కాదనకు" అంటూ ఆమెను మరింత గట్టిగా కౌగిట బంధించసాగాడు.

"నోర్మూయ్!....నా కిప్పుడర్థమవుతోంది నువ్వు కావాలనే జీప్‌ని పక్కదారి పట్టించి, దారి తప్పిపోయామని నాటకమాడావు. ఇంజన్ కావాలనే ఆపేసి, ఆయన్ని నెట్టమన్నావు. ఆ ప్రవాహంలో ఆయన కొట్టుకుపోతాడని ఆశించావు.

"కాని ఆయన తెలివిగా చెట్టెక్కేశారు. నన్ను పైకి చేదుకుని నిన్ను కూడా చేదటానికి చెయ్యి అందించారు. అప్పుడు నువ్వు కావాలనే ఆయన్ని కిందికి బలంగా

గుంజావు. నీట్లో పడిపోయారు. ఇదంతా నువ్వు నా మీది కోరికతో కావాలనే చేశావు.

"నా అనుమానమే నిజమయితే నీకు యీత కూడా వచ్చేవుంటుంది. కావాలనే మావారిని రక్షించకుండా నీళ్ళ పాలు చేసేశావు. ఇప్పుడు వంటరిగా వున్న నన్ను యీ అర్ధరాత్రి యీ ఘోరమైన అడవిలో అనుభవించాలని చూస్తున్నావు. నువ్వు మనిషివా? ఛీ. ఎందుకీ పాడు జన్మ?" అంటూ తుపుక్కున అతని మొహాన ఉమ్మింది సునీల.

"ఇంతసేపు నీ ఉపన్యాసం వింటూ వూరుకోవటం నాదే బుద్ధి తక్కువ! నువ్వు రెచ్చిపోతున్నావు నిన్ను క్షమించకూడదు. నిజమే. నువ్వూహించిందంతా నిజమే! నీ మొగుణ్ణి కావాలనే నీళ్ళలోకి లాగేశాను. వాడుంటే నా కోరిక తీరేదెలా? ఇప్పుడు నిన్ననుభవించి నిన్నూ నీళ్ళలోకి తోసేస్తాను. ఏం చేస్తావు?" ఆమెను సందిట బంధిస్తూ అన్నాడు సంతోష్.

సునీల కండరాలను ఒక్కసారిగా సంధించి కాళ్ళనెత్తి అతని పొత్తికడుపు కిందిభాగంలో తన్నింది. ఒక్కసారిగా మెలికలు తిరిగి ఆమెను పట్టుకున్న చేతుల్ని వదిలేసి "అబ్బా!" అంటూ తొడ దగ్గర పట్టుకున్నాడు సంతోష్.

అదే అవకాశంగా చటుక్కున నీళ్ళలోకి దూకేసింది సునీల.

సునీల ప్రవాహంలో కొట్టుకుపోతోంది.

భోరున వర్షం కురుస్తూనే వుంది.

6

"ఫరవాలేదు. గండం గడిచింది" అన్నాడు డాక్టర్ ధనంజయ, ఫణీంద్రతో.

బంగళాకు రాగానే చకచక మెడికల్ ఛెస్టు తెరిచి, స్టిమ్యులేషన్ కోసం యింజక్షను చేశాడు ధనంజయ.

పది నిమిషాల తర్వాత ఆశించిన ఫలితం కనిపించింది. ప్రణవ్‌లో కదలికలు మొదలయ్యాయి. ఊపిరి పీల్చుకోవటం సక్రమంగా మొదలయ్యింది. ధనంజయ అతని దుస్తులు మార్పించి, పొడిదుస్తులు తొడిగాడు. బంగళా వాచ్‌మన్, కుక్, అటెండరు అతనికి బాగా సహాయపడ్డారు.

"మీరిక్కడ్నుంచి వెళ్ళిన ఓ గంట తర్వాత మా పెద్దయ్యాయాయన, యీయన భార్య జీప్‌లో అడవిలోకి ఎళ్లారు బాబూ. యింతలోనే యీ మాయదారి వొర్సం మొదలై ఒక్కసారిగా ఉప్పెనలా పెరిగిపోనాది. అయ్యగారు రాలేదా బాబూ, అమ్మాయిగా రేరండీ?" అన్నాడు కుక్, ఫణీంద్రను చూసి.

ధనంజయ. ఫణీంద్ర ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. అయితే రేంజరు, యితని భార్య ఆ ప్రవాహంలో ....?

ఫణీంద్ర తల విదిలించాడు. "ఎక్కడో ఏ చెట్టుమీదో ఎక్కి ప్రాణాలు కాపాడుకుని వుంటారు. నేను మళ్ళీ అడవిలోకి వెళ్తున్నాను. నాతో ఎవరైనా వస్తే రావచ్చు!" అన్నాడు. అతని కళ్ళలో భయం భయంగా చెట్టుమీద కూచునివున్న పరబ్రహ్మం కదుల్తున్నాడు. అప్పటికి వర్షం తగ్గుముఖం పట్టింది.

"అట్టాగే బాబూ! మేవందరం వొస్తం. మా పెద్దయ్యగారి కోసరమని కల్లల్లో ఒత్తులేసుకుని ఎదురుచూస్తూ వున్నాం. అక్కడ అయ్యగారి బంగళాలో కూడా రాణే దారు, గార్డు కూకొని వున్నారండి. మేం సాయమొద్దా

వంటే, వార్సం యెక్కడా తెరిపియ్యందేనండీ....పదండి బాబూ, యీ మాట కూసంత ఆ గార్డుగోరి సెవులో ఏపి వొచ్చేత్తాను" అన్నాడు కుక్, సంతోష్ బంగళాకు వెళ్ళ టానికి సిద్ధమవుతూ.

"అయితే నువ్వు వెనక రా! నే నీ వాచ్‌మన్‌ను తీసు కుని వెళ్తాను!" అన్నాడు ఫణీంద్ర కుక్‌తో.

"అట్టాగే బాబూ! ఈ యీరన్నను కూడా తీసుకెళ్ళండి" అన్నాడు కుక్ అలెండర్ని చూపించి.

"అతను మా డాక్టర్‌గారికి తోడుగా వుంటాడు. ఏదయినా అవసరముంటుంది" అని, ధనంజయతో, "పేషెంటుని జాగ్రత్తగా చూసుకుంటావు కదూ, నేను వెళ్తాను. పర బ్రహ్మాన్ని తీసుకొస్తాను. ఫారెస్టు రేంజరు, ఇతని భార్య ఏమయిపోయారో చూడాల్సి వుంది!" అన్నాడు ఫణీంద్ర ఫోర్ సెల్ టార్చిలైట్లో సెల్సు నింపుతూ.

ధనంజయ తలూపి, "బ్రహ్మం కంగారుపడుతూ వుంటాడు!" అన్నాడు.

వాచ్‌మన్ హరికేన్ లాంతరు వెలిగించుకువచ్చి "పదం డయ్యగారూ!" అన్నాడు.

ముందు ఫణీంద్ర, వెనక వాచ్‌మన్ బయల్దేరారు.

7

చీకటి కలవాటుపడిన లాయరు పరబ్రహ్మం కళ్ళు నీటి మీద తేల్తూ మునుగుతూ వస్తూన్న ఆకారాన్ని సులువుగానే గుర్తుపట్టాడు.

ఆ ఆకారం చెయ్యి నీటిమీదికే వుంది. తపతప కొట్టు కుంటోంది. అంటే యింకా స్పృహతప్పి పోలేదన్న మాట!

పరబ్రహ్మం కొమ్మమీద బోర్లాపడుకున్నాడు! రెండు

చేతుల్లోకి రైఫిల్ తీసుకున్నాడు. ఆకారం సరిగ్గా చెట్టు కిందకి రావటానికి ఓ నిమిషం ముందే అరిచి చెప్పాడు: "ఇదిగో, ఈ రైఫిల్ కొనపట్టుకో! నిన్ను చెట్టుమీదికి లాగుతాను" అని.

ఆ ఆకారం సరిగ్గా చెట్టుకిందికి, అతను బోర్లాపడుకున్న కొమ్మకిందికి వచ్చేసింది. అప్రయత్నంగానే చేతులు గన్ బారెల్‌ను పట్టుకున్నాయి. పరబ్రహ్మానికి ఆ బరువుకు కిందికి పడిపోతాననిపించింది. ఎలాగో కష్టంమీద నిల దొక్కుకున్నాడు. అసలే బక్కప్రాణం! నీళ్ళలోకి పడి పోయే ప్రయాదం లేకపోలేదు.

"అమ్మాయి. నువ్వా? భయపడకు. నేను యినస్పెక్షన్ బంగళాలో దిగిన లాయర్ని. అలాగే, యీ కొమ్మను మెల్లగా అందుకో!" అంటూ పక్కనున్న సన్నపాటి కొమ్మను నీటిమీదకు వంచాడు పరబ్రహ్మం.

సునీల కొమ్మ పట్టుకొంది. ఆమె పట్టుకున్న కొమ్మ వైపు జరిగి. జాగ్రత్తగా ఆమె చేతుల్ని పట్టుకుని పెద్ద కొమ్మమీదికి చేరుకున్నాడు.

ఆమె తేలిగ్గానే వుండటంవల్ల, తను కూడా కొంత కృషి చేయటంవల్ల క్షేమంగానే పైకి చేరుకోగలిగింది. బాగా ఆయాసపడిపోతోంది. చెమట్లు దిగకారిపోతూ ఆమె శరీరంలోని నీట్లో కలిసి, చెమటో, నీరో తెలియటం లేదు.

"నయం. నీళ్ళు తాగకుండా జాగ్రత్తపడ్డావు గాని లేకుంటే చాలా ప్రమాదమయ్యేది! ఇందాకా మీ ఆయన నీళ్ళు బాగా తాగేశాడు...." పర బహ్మం మాట పూర్తికానే లేదు, ఆనందంతో కేకపెట్టింది సునీల.

"మావారు....మావారు....మీకు కనిపించారా? బ్రతి

కున్నారా....ఎక్కడున్నారు? క్షేమంగా వున్నారా?" సంభ్రమంగా అరిచింది.

పరబ్రహ్మం పైకి మామూలుగా వుండటానికి ప్రయత్నిస్తూ, "బాగానే వున్నాడు. మావాళ్ళు అతన్ని బంగళాకు తీసుకువెళ్ళారు. మా ఫణీంద్ర వస్తాడు. రాగానే మనమూ బంగళాకు వెళ్దాం. స్థిమితపడమ్మాయ్!" అన్నాడు.

సునీల రెండు చేతులూ జోడించి, "నా నెత్తిన పాలు పోశారు, మావారి క్షేమవార్త చెప్పి. చచ్చిపోదామనే అనుకున్నాను ఓ నిమిషం క్రితం. ఇప్పుడు మావారికోసమే బ్రతికాలనిపిస్తోంది. మీరు అడ్డుపడి రక్షించకపోతే యీపాటికి నీళ్ళలో మునిగిపోయి వుండేదాన్ని!" అన్నది. ఆమె కళ్ళ వెంట ఆనందబాష్పాలు జలజల రాలిపోతున్నాయి.

"చూడమ్మా. మీ ఆయన నువ్వూ కలిసిరాలేదా? అతనొక్కడూ ఎలా పడిపోయాడు ప్రవాహంలో? మీరిద్దరే వచ్చారా? వెంట మీ ఆయన ఫ్రెండు ఆ రేంజరు రాలేదా" ప్రశ్నల వర్షం కురిపించాడు పరబ్రహ్మం.

అప్పటికి వర్షం వెలిసి నీరు బాగా తీసేసింది. మోకాటి లోతువరకు మాత్రమే వుంటుంది. మబ్బులు చెదిరిపోయాయి.

అతనితో సంతోష్ గురించి నిజం చెప్పేద్దామని నిర్ణయించుకుంది సునీల. తనకి, తన భర్తకి ద్రోహం తలపెట్టిన ఆ కిరాతకుడి గురించి అంతా చెప్పేసి మనసు తేలిక చేసుకోవాలనుకుంది.

మబ్బులు వీడిన ఆకాశంలో చంద్రుడు కనిపించాడామెకు చెట్ల ఆకుల సందునించి చిత్రం, అంతదాకా ఉధృతంగా భూమిని అతలాకుతలం చేసేసిన ప్రకృతి

ప్రశాంతంగా మారిపోయింది. పైగా వెన్నెల జల్లులు కురిపిస్తోంది.

సునీల చెప్పడానికి నోరు తెరిచింది. సరిగ్గా అదే సమయానికి వాళ్ళ చెట్టుకిందికి ఎవరో వచ్చారు. పరబ్రహ్మం కిందికి పరికించి చూసి, "అరే, అడుగో రేంజర్!" అంటూ అరిచాడు సంభ్రమంగా.

పక్కన బాంబు పడినట్టు త్రుళ్ళిపడింది సునీల. కిందికి చూసింది. నిజమే! అక్కడ సంతోష్ నిలబడి వున్నాడు. నీరు మోకాలిలోతు కూడా లేదు. ఈ దుర్మార్గుడు తప్పించుకుని బతికి బయటపడ్డాడే.... తను తన్నిన తన్నుకు వాడి పంచప్రాణాలు విలవిల్లాడి చచ్చివుంటాడనుకుంది. కాని జరిగింది మరొకటి!

పరబ్రహ్మం గట్టిగా అరిచిచెప్పాడు. "హలో ఫ్రెండ్! మేమిక్కడున్నాం! మీ ఫ్రెండు క్షేమం. మీ ఫ్రెండు భార్య, నేను పైన వున్నాం" అంటూ.

సంతోష్ చెట్టుపైకి చూశాడు. అతని చూపులు సరాసరి తనని తూట్లు పొడుస్తుంటాయని ఆమెకు తెలుసు. అతని ఘోరకృత్యం గురించి నిజం చెప్పేలోపల అతనే ఇక్కడికొచ్చేశాడు. తమని చూసేశాడు. ఇప్పుడు పరబ్రహ్మానికి జరిగిన సంగతి చెప్పటానికి అవకాశం లేదు.

ఎలా?....ఎలా?....

"హల్లో! సునీలా, క్షేమమే కదా! ప్రణవ్ కూడా క్షేమమేనట! అదృష్టవంతురాలివి....లాయర్ గారూ, ఆమెను కిందికి దించండి, నేను కిందినుంచి పట్టుకుంటాను" అన్నాడు చేతులు సాచుతూ

సునీల తల అడ్డంగా తిప్పి, "ఊహూ! వద్దు. నేను దిగను!" అన్నది బెదురుగా.

పరబ్రహ్మం ఆమెవంక విచిత్రంగా చూసి, "అదేమి టమ్మా, మీవారి ఫ్రెండు దించుతా నంటుంటే....నీరు లాగేసింది. ఇక ఫరవాలేదు! మ గ్గురం వున్నాం, బంగ ళాకి వెళ్ళిపోవచ్చు!" అన్నాడు.

సునీల వేగంగా అంది. "మీకు తెలియదు. అసలు జరి గిందేమిటంటే ..." అనబోతుండగా కిందినుంచి సంతోష్ గట్టిగా అరిచి, "అవన్నీ తర్వాత. ముందు దిగు! లాయర్ గారూ! ఆ రైఫిల్ నా కందించి మీరూ దిగండి!" అని సంతోష్ అనటం, రైఫిల్ పరబ్రహ్మం అతని చేతుల్లా పడేలా వదిలెయ్యటం చాలా వేగంగా జరిగిపోయాయి.

సునీల వద్దని వారించేలోపలే జరిగిపోయిన సంఘట నకు దిగ్భ్రమ చెందింది. ఇప్పుడు ఆయుధం అతని చేతికి చిక్కింది. దాంట్లో గుళ్ళుంటాయి. తమ ఇద్దర్నీ చంపెయ్య టానికి ఆ గుళ్ళు చాలు!

పరబ్రహ్మం రౌండ్సున్న బెల్టు కూడా తీసి సంతోష్ వైపు విసరబోయాడు. చటుక్కున అతని చేయి పట్టి ఆపింది సునీల. "ఇవ్వకండి, అతను దుర్మార్గుడు. నన్ను నా భర్తను అతనే చంపబోయాడు!" చెప్పేసింది.

పరబ్రహ్మం నిర్ఘాంతపోయి చూశాడామెవంక...."మరి ఇంతసేపు చెప్పలేదేం....? అరెరె, ఎంత పని జరిగి పోయింది!?" అన్నాడు.

సంతోష్ ఆమె మాటలు వినేశాడు.

"మిస్టర్ లాయర్, ఆమె చెప్పిందంతా అబద్ధం. నమ్మొద్దు ఆమెకు మతిచలించింది...."అన్నాడు కోపంగా.

సునీలకి దూరంగా యేదో వెల్తురు కనిపించింది. ఆమెకి ధైర్యం వచ్చింది. ఎవరో యిటే వస్తున్నారు. తమని రక్షిస్తారు! కాని, ఆ వచ్చేది —సంతోష్ మనుషులే

అయితే? ...తమని రక్షించే దెవరు?

పరబ్రహ్మంవైపు కళ్ళతోనే సైగచేసి ఆ వెల్తురు చూపించింది సునీల అతను చూశాడు. నేలమీదున్న సంతోష్‌కి ఆ వెలుగు కనపడే అవకాశంలేదు. వాళ్ళు దగ్గర కొచ్చేవరకు అతనికితెలియదు చుట్టూచెట్లు పుట్టలు పొదలు!

"మైడియర్ లాయర్! ముందామెను కిందికి దింపు! ఊఁ, వెంటనే....." ఆజ్ఞాపించే ధోరణిలో అన్నాడు.

పరబ్రహ్మం నిశ్చలంగా చూశాడతనివంక. "ఏం దింపకపోతే ?" అన్నాడు.

"ఈ గుళ్ళు నీ శరీరంలోకి దూరి నీ రక్తాన్ని రుచి చూస్తాయి. ప్రాణాలు దక్కించుకోవాలంటే నే చెప్పినట్టు చెయ్యి. వాదించకు!"

"ఈమెనేమి చెయ్యాలనుకుంటున్నావు?"

"అదంతా నీకనవసరం! ఆమెను వెంటనే కిందికి దించు లేదా, నిన్ను అంతంచేసి ఆమెను వెంట తీసుకు వెళ్తాను."

సునీల వూపిరి బిగబట్టి చూస్తోంది. వెల్తురు అంత కంతకూ దగ్గరపడుతోంది. ఇంకొక్క పదినిమిషాలు లేదా పదిహేను నిమిషాలు! వాళ్ళు దగ్గిరపడ్తున్నారు! తమకు సాయం చేస్తారు. ఈలోపల అతన్ని మాటల్లో పెట్టి కాల యాపన చెయ్యాలి!

"సంతోష్, నీకిది న్యాయంకాదు! మమ్మల్ని యేం చెయ్యకుండా వదిలెయ్యి. మా దారిన మేం పోతాం— మావారు, నేను తెల్లవారేసరికినీ బంగళా వదిలేపి వెళ్ళి పోతాం. నీ విషయాలు యిక్కడితో వదిలేస్తాం! జన్మలో మళ్ళీ నీ పేరెత్తం ప్లీజ్!" అభ్యర్థనగా అన్నది సునీల.

సంతోష్ పెద్దగా నవ్వాడు.

"ఇంత జరిగాక నువ్వు యేం చెప్పకుండా బుద్ధిమంతు రాలిలా వెళ్ళిపోతానంటే నమ్మటానికి నేనేం వెర్రివాడ్ని కాదు మిస్టర్ లాయర్, అనవసరంగా కాలయాపన చెయ్యకు! ఆమెను దింపుతావా, నిన్ను కాల్చెయ్యమంటావా?" అరిచాడు సంతోష్.

పరబ్రహ్మం పెద్దగా నవ్వాడు తను కూడా! "పిచ్చివాడా! ఆ రైఫిల్లో గుళ్ళులేవు. ఇదిగో బుల్లెట్లున్న బెల్టు నా దగ్గరుంది. అది ఎందుకూ పనికిరాదు!" అన్నాడు.

సంతోష్ ఒక్క క్షణం అపనమ్మకంగా చూశాడు దాని వంక. సరిగ్గా అదే సమయంలో చెట్టుమీది నుంచి సంతోష్ మీదికి పడేలా వురికాడు పరబ్రహ్మం.

నిట్టనిలువుగా నేలమీద పడిపోయాడు సంతోష్. అతని మీద పరబ్రహ్మం పడ్డాడు. తప్‌మని నీళ్ళమీద శబ్దమయింది. అప్పటికి నీరు పూర్తిగా లాగేసింది. చాలా తక్కువగా వున్నాయి నీళ్ళు. సంతోష్ ఒక్కసారిగా పక్కకి దొర్లి పరబ్రహ్మాన్ని కాళ్ళతో బలంగా తన్నాడు.

అసలే సన్నగా వుండే పరబ్రహ్మం, పహిల్వాన్‌లా వున్న సంతోష్ దెబ్బకు తట్టుకోలేక దూరంగా యెగిరి పడ్డాడు.

ఈ లోపల సంతోష్ సర్దుకుని లేచాడు. గన్ లోడ్ అయినదేనని గ్రహించాడు. గురిచూసి పరబ్రహ్మాన్ని కాల్చటానికి ప్రయత్నించాడు. అయితే అదే సమయానికి సునీల అతని మీదికి ఉరికేసింది.

చాపచుట్టలా మళ్ళీ నేలమీద పడిపోయాడు సంతోష్— గన్ అవతలకు పడింది. పరబ్రహ్మం చువ్వలా లేచి నించున్నాడు. గన్ దగ్గరకు ఓ గంతువేశాడు. కాని సంతోష్

చాలా క్విక్‌గా, మెరుపులా యెగిరి గన్ అందుకున్నాడు.

మరుక్షణం పరబ్రహ్మం, సంతోష్ చేతిలోని గన్‌కు బలయిపోవలసిందే! కాని, ఏదో వస్తువు బలంగా వచ్చి అతని చేతిమీద తగిలింది. పట్టుసడలి గురి తప్పింది! గాల్లో పేలింది బుల్లెట్.

అమాంతం వెనక నుంచి తనని వాటేసుకున్న మని షెవరో అర్థం చేసుకునే లోపల సంతోష్ పక్కటెముకలు పళపళమని చప్పుడు చేశాయి.

ఆ ఉక్కు కౌగిలి అరితేరిన మిలిటరీ మేజర్ ఫణీంద్ర దని తెల్సుకునేసరికి ఆలస్యమయింది!

"యూ! బాస్టర్డ్ నా ఫ్రెండునే కాల్చి చంపాలనుకున్నావా? నిన్ను ప్రాణాలతో వదలను!" హుంకరిస్తూ, సంతోష్ పీక పట్టుకున్నాడు ఫణీంద్ర.

సంతోష్‌కి ఊపిరాడలేదు! గిలగిల లాడాడు. హరికేన్ లాంతరు పట్టుకుని చిత్తరువులా నిలబడి ఇదంతా చూస్తు న్నాడు వాచ్‌మన్!

కిందపడ్డ టార్చిలైటు తీసి "సమయానికి మీరొచ్చి మా ప్రాణాలు కాపాడారు! మీ ఋణం తీర్చుకోలేను" అన్నది సునీల కృతజ్ఞతగా.

"అతన్ని శిక్షించటానికి కోర్టుంది—పోలీసుల కప్పగిం చటం వరకే మన బాధ్యత!" అన్నాడు లాయరు పర బ్రహ్మం, ఫణీంద్రను సమాధాన పరుస్తూ.

ఫణీంద్ర సంతోష్‌ని రెక్కలు విరిచికట్టి, "పదరా రాస్కెల్! నీ పాపం పండింది!" అన్నాడు ముందుకు తోస్తూ.

అందరు బంగళా వైపు సాగిపోయారు. □

తికమక శవం

ఓరుగంటి పద్మావతి



"ఆ 25 జతల కళ్ళు కేసుతో మన పేరు తెలుగు దేశంలో వెలిగిపోతోంది బాస్. నే చెప్పాను కదా, ఆ కేసు ఒప్పుకోండని. నాకు తెలుసు ఆ కేసు ద్వారా మనం కూడా పెద్ద డిటెక్టివ్‌ల లిస్టులో చేరిపోతామని" అన్నాడు శర్మ.

"సీ బొంద. ఆ కేసులోంచి బయటపడేసరికి తల ప్రాణం తోకకి వచ్చింది. ఆ ఇన్‌స్పెక్టర్ చిరంజీవికి జాలి, దయ

అనేవి వున్నాయి, కాబట్టి మనల్ని వదిలేసాడు. లేకపోతే ఈపాటికి కటకటాలు, టకటకా లెక్కబెడుతూవుండే వాళ్ళం. ఇదంతా నీ మూలానే'' అన్నాడు అవధాని.

"ఇంత జరుగుతుందని నాకేం తెలుసు బాసు. ఏదో దొంగ నోట్లు మార్చటమే కదా. సులువుగా చేయవచ్చు. పైగా ట్రిప్పుకు పదివేల రూపాయలు వస్తాయి అనుకొన్నాను. కాని ఆ వెధవలు దొంగ నోటకి బదులు 25 జతల కళ్ళు ఆ సూటుకేసులో పెడతారని నే నేమన్నా కల గన్నానా'' అన్నాడు శర్మ బాధగా.

"సరే. అయిపోయిందేదో అయిపోయింది. ఇక అలాంటి కేసులు ఒప్పుకోవద్దు. కేసులు రావు సరికదా, మన పరువు పోతుంది. బైదిబై నువ్వు ఆఫీసులో వుండు నేను అలా వెళ్ళొస్తాను'' అన్నాడు అవధాని.

"ఎంత సేపట్లో వస్తారు బాసు. ఏం లేదు. నాకు కూడా కాస్త బజార్లో పని వుంది. అందుకని'' అన్నాడు శర్మ నసుగుతూ.

"ఎంత అరగంటలో వచ్చేస్తాను. మొన్న టైలర్‌కి బట్టలు ఇచ్చాను కదా. అవి తీసుకొనిరావటమే. నువ్వు మాత్రం ఎక్కడికీ వెళ్ళకు. ఆఫీసులోనే కూర్చో. ఏమైనా కేసులు వస్తే నేను వచ్చేదాకా కూర్చోపెట్టు'' అని శర్మకి జాగ్రత్తలు చెప్పి అవధాని రోడ్డు ఎక్కాడు.

శర్మ టేబుల్ మీద వున్న ఆంధ్రప్రభ తీపి చదువుకో సాగాడు. ఇంతలో పుస్తకంమీద ఎవరిదో నీడ పడటంతో తలెత్తి చూశాడు శర్మ. ఎదురుగా ఎవరో అపరిచిత వ్యక్తి నిలబడి వున్నాడు.

"ఎవరు మీరు? ఏం కావాలి?'' అని ప్రశ్నించాడు శర్మ.

"కూర్చోవచ్చా?" అని ఎదురుప్రశ్న వేసాడు ఆ వ్యక్తి.

"నిక్షేపంగా" అన్నాడు శర్మ మర్యాదగా.

ఆ వ్యక్తి కూర్చొని అటూ ఇటూ చూడసాగాడు.

"ఆ ఇప్పుడు చెప్పండి. ఎవరు మీరు, మీకేం కావాలి" అని మళ్ళీ ప్రశ్నించాడు శర్మ.

"అవధానిగారు లేరా" అన్నాడా వ్యక్తి.

"నేనే అవధానిని. చెప్పండి" అన్నాడు శర్మ.

"సింహానికి, నక్కకి తేడా తెలుసుకోలేని చవట వెధవని కాను. ఇంతకీ అవధానిగారు లేరా?" అన్నాడా వ్యక్తి.

శర్మకి వళ్ళు మండిపోయింది, "మాటలు జాగ్రత్తగా రానీయండి. నేను నక్కలా కనబడుతున్నానా" అని అడిగాడు శర్మ కోపంగా.

"అంత కోపం ఎందుకయ్యా బాబూ. నక్కలా వున్నావు. నువ్వే నాకు కావాలి. అవధానిగాని లోపల వున్నాడేమో అని అలా అడిగాను. నాకు సింహం పరాక్రమం అక్కరలేదు. నక్కల జిత్తులు కావాలి. అందుకే నీకోసం వచ్చాను" అన్నాడు శర్మని పొగుడుతూ ఆ వ్యక్తి.

శర్మ ఆనందంతో లేచి నిలబడి, "ఏమిటి, నాతో పని వుండి వచ్చారా, చెప్పండి, చెప్పండి" అన్నాడు కుతూహలంగా.

"మీరో హత్య చేయాలి?" అన్నాడు ఆ వ్యక్తి నింపాదిగా.

"హత్యా?" అంటూ శర్మ ఆశ్చర్యపోయాడు.

"డిటెక్టివ్ లయుండి 'హత్య' అన్న పదానికే ఖంగారు పడుతున్నారే, నేనింకా మీరేదో తెలివిగలవారనుకొన్నాను.

నా అంచనా తప్పన్న మాట" అన్నాడా వ్యక్తి కుర్చీలోంచి లేస్తూ.

"అబ్బే కూర్చోండి కూర్చోండి. లేవకండి. ఒక్కసారిగా 'హత్య' అన్న మాట మీ నోట వినపడి ఆశ్చర్యపడ్డాను. అంతేగాని నాకేం భయంగాని, ఖంగారు గాని లేదు" అని ఆ వ్యక్తికి చెప్పి శర్మ కుర్చీలో కూర్చున్నాడు. ఆ వ్యక్తి కూడా కుర్చీలో కూలబడ్డాడు.

"ఆ ఇప్పుడు చెప్పండి, హత్య ఎవర్ని చేయాలి, ఎప్పుడు చేయాలి. ఎక్కడ చేయాలి గబగబా చెప్పండి, కాసేపట్లో మా బాసు వచ్చేస్తాడు. ఆయనకి యిలాంటి కేసులు తీసుకోవటమంటే ఇష్టం వుండదు. 'నీతి-నిజాయితీ' అంటూ వుంటాడు" అన్నాడు శర్మ.

"అయితే హత్య చేయటానికి మీరు సిద్ధమేనా. మాట తప్పరు కదా!" అన్నాడా వ్యక్తి.

"సిద్ధమే. చెప్పండి ఎవర్ని పంపాలి పైకి" అన్నాడు శర్మ.

"నన్నే" అన్నాడు ఆ వ్యక్తి నింపాదిగా.

శర్మకి ఒక్క క్షణం నోట మాట రాలేదు. తరువాత తేరుకొని, "మిస్టర్, మీరెవరో నాతో పరాచికాలాడుతున్నారు" అన్నాడు.

"పరాచికాలు కాదు పచ్చి నిజాలు. నన్ను పూర్తిగా చెప్పనివ్వు. నా పేరు ఆనందరాజు. అనేక వ్యాపారాలు చేసాను. ఏదీ అచ్చిరాలేదు. అన్నిటా నష్టమే వచ్చింది. ఈ వూర్నిండా అప్పులే వున్నాయి. నిన్ననే లక్ష రూపాయలకి ఇన్సూర్ చేసాను. ఇక ఈ వూరిలో నాకు అప్పు పుట్టే మార్గంలేదు. నిన్ననే నా వ్యాపారాలన్నీ అయినకాడికి దొంగచాటుగా అమ్మి సొమ్ము చేసుకొన్నాను. ఇక అప్పుల

వాళ్ళకి మిగిలింది నా బూడిదే. అందుకే నీ సాయం కావలసి వచ్చింది.

నా పద్దూ పొడవు చూసావు కదా, నాలాగే వుండే తాజా శవాన్ని నువ్వు సంపాదించు. ఆ శవానికి మొహం చెక్కేసి, మా యింట్లో పడేస్తాను. నేనే చచ్చాననుకొని అప్పుల వాళ్ళు ఒక ఏడుపు ఏడిచి ఊరుకొంటారు. ఇన్సూరెన్సు కంపెనీవాళ్ళు నా భార్యకు పువ్వుల్లో పెట్టి లక్షరూపాయ లిస్తారు. ఆ డబ్బు చేతికి రావటంతోనే అప్పుల వాళ్ళకి కనపడకుండా రాత్రికి రాత్రే నా భార్య నా దగ్గరకు వచ్చే స్తుంది. ఇక ఈ వూరికి 'రాం, రాం' కొట్టి హైద్రాబాదు పారిపోతాం. మళ్ళీ అక్కడ మరో పేరుతో ఈ డబ్బుతో హాయిగా జీవిస్తాం. అదీ నా ప్లాను. ఇందులో నువ్వు చేయవలసింది చాలా తక్కువ.

"నాలాగే వుండే ఒక శవాన్ని తీసుకొనివచ్చి, నాకు అప్పగించటం, పదివేల రూపాయలు పట్టుకొనిపోవటం. వెరీ సింపుల్. ఏం చేస్తావ్?" అన్నాడు ఆనందరాజు, శర్మ వంక పట్టిపట్టి చూస్తూ.

"ఇంత గ్రంథాన్ని నడిపించిన మహానుభావులు, ఆ శవాన్ని సంపాదించుకొనే పని కూడా తమరే చేయవచ్చు కదా. అనవసరంగా నాకు పదివేలు ఇవ్వటం యెందుకు?" అన్నాడు శర్మ అనుమానంగా.

"నాకు ఇంకా చాలా పనులున్నాయి ఈ రాత్రితో నా ఈ జీవితాన్ని ఈ లోకం దృష్టిలో చాలించాలి కదా, యింకా ఇద్దరు, ముగ్గురు మిత్రులున్నారు నా వ్యాపారాన్ని హామిగా పెట్టి వాళ్ళ దగ్గర నుంచి కూడా ఏమైనా రాబట్టవచ్చేమో చూస్తాను. అయినా ఆ శవాన్ని వెతికే ఓపిక నాకు లేదు.

అందుకే పదివేలు పోతేపోయాయి ఆ పని నీకు అప్పగిస్తు న్నాను. ఇదిగో నా అడ్రసు. శవాన్ని ఈ రాత్రి ఒంటి గంటా రెండుకి మధ్యన తీసుకొని రా. చాలా జాగ్రత్త! ఎక్కడా నా పేరు బయట రాకూడదు. ఇదిగో ఈ డ్రస్సు కూడా తీసుకో. ఆ శవానికి నా డ్రస్సు తొడిగి తీసుకొని రా" అని చెప్పి శర్మకి తన డ్రస్సు, తన అడ్రసు యిచ్చాడు ఆనందరాజు.

"నా కిస్తానన్న పదివేలు కూడా ఇప్పుడే ఇవ్వండి. అసలే మీరు మిత్రులని కూడా మోసం చేసే ఉద్దేశంలో వున్నారు. నన్ను మోసం చేయరని గ్యారంటీ ఏమిటి?" అన్నాడు శర్మ మొండిగా.

"ఛలేవాడివయ్యా నువ్వు. సరే. ఇప్పుడే ఇస్తాను" అని చెప్పి పదివేల రూపాయలు తీసి శర్మ చేతికి యిచ్చాడు ఆనందరాజు.

ఆ డబ్బుని లెక్కపెట్టుకొని జేబులో దోపుకొని. "సరే, మీరు వెళ్ళండి, రాత్రికి శవాన్ని మీకు అప్పగిస్తాను" అన్నాడు శర్మ ఆనందంగా.

"జాగ్రత్త" అని మరొకసారి చెప్పి ఆనందరాజు బయటికి వెళ్ళిపోయాడు.

శర్మ రాత్రి చేయబోయేదాని గురించి ఆలోచనలోపడ్డాడు. అవధానికి ఈ కేసు విషయం చెప్పకూడదని ముందే నిశ్చ యించుకొన్నాడు శర్మ. అవధానికి చెబితే ఈ కేసు తీసుకో నివ్వడు.

2

ఆనందరాజు ఇంటి దగ్గరగా వున్న చెట్టు దగ్గర సైకిల్ ఆపాడు శర్మ. ఆ సైకిల్ వెనక కారేజీకి ఒక మూట ఉంది. ఆ మూటలో వుంది శవం.

ఆ శవాన్ని సంపాదించటానికి శర్మ చాలా కష్టపడ్డాడు. ఏలూరులో వున్న స్మశానాలన్నీ తిరిగాడు శర్మ. ఎక్కడా ఆనందరాజుని పోలిన శవం కనిపించలేదు. అలా శవం కోసం వెతుకుతూ వస్తుంటే బస్టాండు దగ్గర ఇద్దరు ముష్టి వాళ్ళు ఒక శవాన్ని ఎదురుగా పెట్టి అడుక్కోవటం కనిపించింది. ఆ శవం మొహానికి ముసుగు వుంది.

అటూ ఇటూ చూసి ముసుగు తీసి శవం మొహం చూసాడు శర్మ. ఆనందరాజు మొహానికి దగ్గర పోలికలు వున్నాయి ఆ శవంలో. వడ్డూ, పొడగూ సరిపోయాయి. అయితే ఆ శవం మొహం నిండా స్ఫోటకం మచ్చలు వున్నాయి. కొంచెం ముదురుగా వుంది మొహం. ఇక ఈ శవాన్ని మించి రాత్రిలోగా మరొక శవాన్ని సంపాదించటం కష్టమని తలచి ఆ శవానికి బేరం పెట్టాడు. వెయ్యి రూపాయలు ఇస్తానన్నాడు శర్మ.

ఆ ముష్టివాళ్ళు ఆనందంతో ఒప్పుకొన్నారు. అసలు ఈ రాత్రి దాకా ఆ శవాన్ని పెట్టి అడుక్కొని, ఆ తరువాత శవానికి దహనం జరిపిద్దామనుకొన్నారు. అలాంటిది ఒక్కసారిగా పెద్దబేరం రావటంతో వాళ్ళకి చాలా సంతోషం కలిగింది.

అయితే శర్మ ఒక కండిషన్ పెట్టాడు. 'రాత్రి ఒంటి గంటకి శవానికి తను ఇచ్చిన బట్టలు తొడిగి, శవాన్ని ఒక గోనెసంచిలో పెట్టి, ఈ బస్టాండు దగ్గరేతనకి అప్పగించాలని' చెప్పి, ఆనందరాజు ఇచ్చిన డ్రస్సు ముష్టి వాళ్ళకి ఇచ్చాడు శర్మ.

ఈ కండిషన్ ముష్టివాళ్ళకి మరీ ఆనందాన్ని కలిగించింది. రాత్రిదాకా ఈ శవాన్ని పెట్టి అడుక్కోవచ్చు కదా అని వాళ్ళిద్దరూ సంబరపడ్డారు. అన్నట్టుగానే రాత్రి ముష్టి

వాళ్ళ దగ్గర నుంచి శవాన్ని తీసుకొన్నాడు శర్మ.

ఆ విధంగా శర్మ శవాన్ని సంపాదించాడు. నెమ్మదిగా పైకిల్‌కి స్టాండువేసి, విక్రమార్కుడు, బేతాళుడిని భుజాన వేసుకొన్నట్టుగా, ఆ గోనె సంచిని తన భుజాన వేసుకొని, ఆనందరాజు యింటికి బయలుదేరాడు శర్మ.

ఆనందరాజు ఇల్లు ఇంకా పదడుగుల దూరంలో వుండ గానే, అటువైపు నుంచి ఒక పోలీసు జీపు రయ్యిమని వచ్చి ఆనందరాజు యింటి గుమ్మంముందు ఆగింది. అందులో నుంచి అవధాని, పోలీసు ఇన్‌స్పెక్టర్ గిరిబాబూ ఇతర పోలీసులూ దిగారు.

శర్మకి ఆశ్చర్యంతో మతిపోయింది.

అంతకు మించిన భయంతో వళ్ళంతా చెమటలు పట్ట సాగింది. ముందుకు వెళ్ళి కొరివితో తల గోక్కోవటం కంటే కాలికి బుద్ధి చెప్పటం మంచిదనిపించింది. అలా అనిపించాక ఆలస్యం చేయలేదు శర్మ.

ఆ గోనెసంచిని భుజాన వేసుకొనే పరుగు ప్రారంభిం చాడు. గోనెసంచితోటి పరుగెత్తటం కష్టంగా వుంది. ఇలాగైనా గోనెసంచిని వదిలించుకోవాలను కొన్నాడు శర్మ.

అలా అనుకోవటమే ఆలస్యం ఎదురుగా కనిపించిన యింటి ప్రహరీగోడ మీదుగా ఆ గోనెసంచిని లోపలికి విసిరేసాడు శర్మ. 'దబ్బు'మంటూ మొక్కల్లో పడింది ఆ గోనెసంచి. 'బాబోయ్' అన్న అరుపు వినపడింది శర్మకి.

అప్పటిదాకా శర్మకి వున్న కాస్త ధైర్యం కూడా ఆ అరుపుతోపాటే పారిపోయింది. ఇప్పటిదాకా తాను మోపింది శవం వున్న గోనెసంచిని కాదు, దయ్యం వున్న గోనెసంచిని అని తెలుసుకోవటంతోనే అతని పాంటు తడిపి

పోయింది. ఆ ఇద్దరు ముష్టివెధవల్నీ బండబూతులు తిట్టు కుంటూ శక్తి కొద్దీ పరిగెత్తసాగాడు శర్మ.

శర్మ ఏమాత్రం ఆలోచించకుండా శవాన్ని ప్రహరీగోడ మీదుగా పడేసిన, ఆ యింటి ఓనర్ పేరు పతంజలి, ఆ పతంజలి ఇంట్లో కన్నం వేయటానికి వచ్చిన దొంగ ఒకడు, పతంజలి యింట్లో లైట్లారిపోయాక తన పని ప్రారంభిద్దామని నిశ్చయించుకొని, ఆ మొక్కల్లో కూర్చొ న్నాడు ఎవరికీ కనపడకుండా. ఇంతలో ఆ దొంగ వీపుమీద 'ధబ్బ'మని ఒక గోనె మూట పడటంతో 'బాబోయ్' అని అనుకోకుండా అరిచేశాడు.

ఎప్పుడయితే దొంగాడి అరుపు వినపడిందో అప్పటి దాకా ఏదో ఆఫీసు ఫైల్ చూసుకొంటున్న పతంజలి, అదిరి పడి, తలుపులు తీసుకొని బయటికి వచ్చాడు.

తనమీద గోనెమూట పడటం, ఆ వెంటనే పతంజలి బయటకి రావటంతో ఖంగారుపడిన దొంగ, ఇంకేమాత్రం ఆలస్యం చేయకుండా, ప్రహరీగోడ ఒక్క ఎగురున ఎక్కి, అవతలకి దూకి, పరుగు అందుకొన్నాడు.

శర్మకి శవాన్ని అమ్మి, కాస్త 'కుషీ' చేసుకొని ఆనందంగా ఆ దారినే వస్తున్నారు ఆ యిద్దరు ముష్టి వాళ్ళు.

దొంగ రోడ్డుమీద యెవరినీ గుర్తించే స్థితిలో లేడు. పరుగెత్తుకుంటూ వచ్చి 'ధనేలు' మని ఆ యిద్దరు ముష్టి వాళ్ళని ఒక్క గుద్దు గుద్ది దబ్బుమంటూ క్రింద పడ్డాడు. పడిన వెంటనే తేరుకొని లేచి మళ్ళీ పరుగు అందు కొన్నాడు.

బయటికి వచ్చిన పతంజలికి యెవరో ప్రహరీ గో దూకి పారిపోయినట్టు అయింది. 'ఎవరై వుంటారు?

అనుకొంటూ ప్రహరీగోడ దగ్గరకు రాబోతూ ఆ చీకట్లో గోనెసంచీలో వున్న శవాన్ని గుద్దేసి. ధనేల్‌మంటూ క్రింద పడ్డాడు. ముందు పతంజలికి అర్థంకాలేదు, ఆ గోనెమూట అక్కడికి ఎలా వచ్చిందో.

నెమ్మదిగా ఆ గోనెసంచీని వెలుతురులోకి లాక్కొని వచ్చి సంచి మూతవిప్పి, అందులో ఏముందో చూసిన పతంజలికి ముందు ఆశ్చర్యము. తర్వాత ఆగ్రహమూ కలిగాయి.

శర్మ పరిగెత్తి పరుగెత్తీ ఆయాసంవచ్చి ఒక స్తంభాన్ని ఆనుకొని నిలబడ్డాడు. ఆయాసంతో అతనికి ఊపిరి అందటంలేదు. నోరు తెరుచుకొని గొడ్డులా రొప్పుతూ 'ఆనందరాజు యింటికి పోలీసులతోపాటు తన బాస్ ఎలా వచ్చాడు' అని ఆలోచనలో పడ్డాడు.

ఓవర్‌స్పీడులో పరిగెత్తుకొని వస్తున్న దొంగకి శర్మ గాని, శర్మ ఆనుకొని వున్న స్తంభం కాని కనిపించలేదు. 'ఫట్' మంటూ స్తంభాన్ని గుద్దేసి. క్రిందపడ్డాడు.

ఆలోచనలతో సతమతమవుతున్న శర్మ. తన పక్కనే 'ఫట్'మని శబ్దం వినపడి, తన కాళ్ళదగ్గర ఏదో బరువుగా పడటంతో పోలీసులు విసరిన లాఠీకర్ర స్తంభానికి తగిలి, తన కాళ్ళదగ్గర పడివుంటుందని తలచి, మళ్ళీ పరుగు అందుకొన్నాడు.

స్తంభాన్ని గుద్దేసి క్రిందపడిన దొంగ, తలకి తగిలిన తిమ్మిరి తగ్గగానే మళ్ళీ పరుగు ప్రారంభించాడు.

3

తలుపు చప్పుడికి శర్మే, శవాన్ని తెచ్చివుంటాడని ఆనందంగా తలుపుతీసిన ఆనందరాజుకి మతిపోయింది.

ఎదురుగా పోలీసులతో పాటు, అవధాని కనిపించాడు.

"మిస్టర్ ఆనందరాజు! మీ ఇంట్లో ఏదో గూడుపుఠానీ జరుగుతున్నట్టు. అవధానిగారు మాకు రిపోర్టు యిచ్చారు. మీ యిల్లు సోదా చేయాలి...." అన్నాడు ఇన్‌స్పెక్టర్ గిరిబాబు.

ఆనందరాజు తలాడించాడు.

పోలీసులు. ఆనందరాజు యిల్లంతా గాలించారు. అవధాని చెప్పినట్లు ఎక్కడా శవంగాని మరేవిధమైన ఆచూకీ గాని కనిపించలేదు.

ఆనందరాజుకి 'సారీ' చెప్పి బయటకి వచ్చిన అవధానికి, పోలీసులకి ముందు శర్మ, ఆ వెనక దొంగ పరిగెత్తటం కనిపించింది.

శర్మని చూస్తూనే అవధాని, "శర్మా, శర్మా" అని అరుస్తూ, శర్మని పట్టుకోవటానికి పరుగు ప్రారంభించాడు.

అవధాని యెక్కడ తనని పట్టుకొంటాడో అన్న భయంతో శర్మ తన పరుగుయొక్క స్పీడును పెంచాడు.

అప్పటిదాకా కంగారుగా పరిగెత్తుకొని వస్తున్న దొంగకి శర్మా. శర్మా అన్న కేకలు, ఆ తరువాత ఎవరో తన వెనక పరుగెత్తుకొని రావటంతో భయంతో మతిపోయి పిచ్చివాడిలా పరిగెత్తసాగాడు.

ఈలోపున ఇన్‌స్పెక్టర్ గిరిబాబు.పోలీసులని ఎక్కించుకొని జీపుని స్పీడుగా పోనిచ్చి అవధానిని. దొంగని ఓవర్ టేక్ చేసి. శర్మ దగ్గరకి రావటంతోనే పక్కకి తిప్పి జీపుని ఆపేశాడు.

'గుడ్డెద్దు చేలో పడ్డట్టు' స్పీడుగా వస్తున్న శర్మ ఆగివున్న జీపుని చూసుకోకుండా 'ధనేల్'మని గుద్ది జీపులో పడ్డాడు.

శర్మ వెనకేవస్తున్న దొంగకూడా జీపుని 'ధనేల్'మని గుద్ది. ఆ విసురుకి జీపుకి అవతలపోయి పడ్డాడు.

"శర్మా ఏమైంది, శర్మా ఏమైంది?" అని అరుస్తూ అక్కడికి పరుగెత్తుకొని వచ్చాడు అవధాని.

ఈలోపుగా దొంగని, శర్మని లేపి జీపులో కూర్చో పెట్టి కాస్త నీరు ఆ యిద్దరి మొహాలమీదా చల్లాడు గిరి బాబు.

4

"మీ కసలు బుద్ధుందా, నే చెప్పిన పనేమిటి, మీరు చేసిన పనేమిటి?" అని అరిచాడు పతంజలి.

"ఎందుకు బాబూ అట్టా అరుస్తారు? మీరు శవాన్ని యిచ్చి గుట్టుచప్పుడు కాకుండా మాయం చేయమన్నారు. మాయం చేసేసాం కదా, ఇంకేమిటి?" అన్నాడు ఒక ముష్టి వాడు.

"ఛస్, నోర్మూయండి. మాయం చేశారట, మాయం చేశారు. మీరు మాయం చేసిన ఆ శవాన్ని నేను చూపిస్తా రండి," అని ఆ యిద్దరి ముష్టివాళ్ళనీ తీసుకొనివెళ్ళి గోనె సంచిలో వున్న శవాన్ని చూపించాడు పతంజలి.

పతంజలికి ఆ శవాన్ని చూడగానే ఆశ్చర్యం కలిగి, ఆ ముష్టివాళ్ళ మిద ఆగ్రహం కలిగి వాళ్ళకోసం బయటికి రావటంతోనే వాళ్లే యెదురయ్యారు పతంజలికి.

ఆ శవాన్ని చూడంగానే ఆ ముష్టివాళ్ళిద్దరికీ కూడా భయంతో మతిపోయింది.

"ఏరా, ఇప్పటికయినా నమ్మకం కుదిరిందా, నేను యిచ్చిన శవాన్ని నా యింటిలోనే పారేసి, నన్ను వెధవని చేస్తారా, శవాన్ని మాయం చేయమని రెండువేల రూపా యలు మీకిచ్చింది నా ఇంట్లో శవాన్ని పడేయమనేనా"అని

కోపంగా అడిగాడు పతంజలి.

"లేదు బాబయ్యా, ఆ శవాన్ని తీసుకొనివెళ్ళి పాతి పెట్టేద్దామని అనుకున్నాం. కాని దానిమీద డబ్బు సంపాదించవచ్చు అని ఆలోచించి ఆ శవానికి ముసుగువేసి అడుక్కొంటుంటే, ఎవరో బాబు వచ్చి 'శవం తనకు కావాలని' అడిగారు. వెయ్యి రూపాయలు యిస్తామన్నారు. డబ్బుకి కక్కుర్తిపడి ఆ శవాన్ని ఆయనకు ఇచ్చేశాం. ఆ తరువాత ఆ శవం యిక్కడికి యెలా వచ్చిందో అర్థం కావటంలేదు దొరా...." అన్నారు వాళ్ళిద్దరూ ముక్త కంఠంతో.

"మా అమ్మాయి రాణిని ప్రేమించాడట వీడు. మా అమ్మాయి కూడా ఈ రామారావుగాడిని ప్రేమించిందట. ఆస్తిని కాదని, కన్నతండ్రిని కాదని ఈ రామారావుగాడి వెనకాల పడిపోతానంటోంది. అందుకే రామారావుగాడిని విషప్రయోగం ద్వారా చంపాను. మొహానికి స్ఫోటకం మచ్చలు వచ్చినట్లుగా పెయింటుతో చుక్కలు పెట్టాను. అన్నీ చేసి శవాన్ని మీకిచ్చి పారేసిరమ్మని రెండువేలు ఇస్తే, మీరుచేసిన నిర్వాకం ఇదా!" అన్నాడు పతంజలి ఆవేశంగా.

"ఇప్పుడు మాత్రం మించిపోయిందేమిటి బాబూ, ఇప్పుడే వెళ్ళి ఈ శవాన్ని పాతిపెట్టి వస్తాం" అని గోనె సంచిని అందుకొన్నాడు ఒక ముష్టివాడు. తాడు తెచ్చి దాని మూతి బిగించాడు రెండో ముష్టివాడు.

ఇంతలో "ఆపండి మీ వ్యర్థప్రయత్నం" అన్న కేక వినపడింది ఇద్దరు ముష్టివాళ్ళు, పతంజలి ఖంగారుగా దిక్కులు చూడసాగారు.

బిలబిలమంటూ పోలీసులు వచ్చి పతంజలిని, ఇద్దరు ముష్టివాళ్ళని చుట్టుముట్టారు.

పతంజలికి యేం అర్థంకావటం లేదు. అంతా అయోమయంగా వుంది. తాను పారేయమన్న శవం మళ్ళీ తన దగ్గరకి యెలావచ్చిందో, ఈ పోలీసులు యెలా వచ్చారో ఏంఅర్థం కావటంలేదు.

"ఖంగారుపడకుండా స్థిమితంగా విను పతంజలీ, అంతా చెబుతాను.

ఆనందరాజు అనే వెధవ ఇన్సూరెన్సు కంపెనీని మోసం చేయటానికి. తనలాంటి శవాన్నే తెచ్చిపెట్టమని డిటెక్టివ్ శర్మని అడిగాడు. సహజంగా డిటెక్టివ్‌లు చేయకూడని పనికి శర్మ ఒప్పుకున్నాడు. వీళ్ళిద్దరికి ఈ మాటలు జరిగేటప్పుడు టైలర్‌షాపు కట్టేసి వుండటంతో తిరిగి వచ్చిన అవధాని విన్నాడు. విని నాకు అంతా చెప్పాడు. అప్పుడే శర్మని పట్టుకోవచ్చు. కాని వల వేసి ఆనందరాజుని పడదామని చెప్పాడు అవధాని: అదీ మంచికే అయింది.

నీ కూతురు రాణిని ప్రేమించిన రామారావుని చంపి, ఆతని మొహంమీద ఆనవాలు పట్టకుండా స్ఫోటకం మచ్చలు అద్ది, ముష్టివాళ్ళకి అప్పచెప్పావు. వాళ్ళు డబ్బుకి ఆశపడి ఆ శవాన్ని శర్మకి ఇచ్చారు. శర్మ ఆ శవాన్ని ఆనందరాజుకి ఇద్దామని తెచ్చి, అక్కడ మేము వుండడంతో ఖంగారుపడి దానిని తెలియక నీ ఇంట్లో పడేశాడు.

ఆపాటికే శర్మ. ఆనందరాజు యింటికి శవాన్ని తీసుకొనివచ్చేసి వుంటాడన్న ఆలోచనతో మేం కొంచెం ముందుగా ఆనందరాజు ఇంటికి వచ్చాం. అదీ మంచిదే అయింది. ఈ విధంగా మీరూ చిక్కారు.

శర్మ డబ్బుకి ఆశపడి, బాస్‌కి కూడా చెప్పకుండా తీసుకొన్న కేసు యిద్దరు దుర్మార్గులకి బుద్ధి వచ్చేలా, వాళ్ళు చట్టానికి పట్టుపడేలా చేసింది" అని చెప్పాడు గిరి బాబు.

పతంజలిని, ఇద్దరు ముష్టివాళ్ళని జీపు ఎక్కించారు పోలీసులు. అప్పటికే ఆ జీపులో శర్మ, దొంగ, ఆనంద రాజులు వున్నారు. రామారావు శవాన్ని కూడా జీపులో ఎక్కించారు.

జీపు భారంగా కదలి, వేగంగా పోలీసుస్టేషన్ వైపు బయలుదేరింది.

తన అసిస్టెంటుని తలచుకుంటూ భారంగా నిట్టూర్చి, వేగంగా తన రూమ్‌వైపు బయలుదేరాడు డిటెక్టివ్ అవధాని. □

స్నేహం



సీరియల్

కాంచన శిఖరం

(గత సంచిక తరువాయి)

"నన్ను క్షమించండి భాయ్! మిమ్మల్ని విసిగించాను" అన్నాడా వ్యక్తి మూలుగుతూ.

"ఫరవాలేదు ఇప్పటికైనా నమ్మకం కుదిరింది గదా!" అన్నాడు జ్వాలా.

అతడు మాట్లాడలేదు.

"ఎవరు నువ్వు. కాళ్ళకు గాయాలేమిటి?" ప్రశ్నించాడు జ్వాలా.

"చెప్తాను. నాకు మంచినీళ్లు కావాలి" అన్నాడతను ఆయాసపడుతూ.

"రెడ్డీ! నువ్వెళ్ళి మంచినీళ్లు పట్టుకురా! ఛాయ్ వుంటే తీసుకురా. పాపం తిండీ, తిప్పలు లేనట్లున్నాయ్" అన్నాడు.

మేఘనాధ్ రెడ్డి పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ వెళ్ళాడు. జ్వాలా లైటర్ వెలిగించి పట్టుకున్నాడు వెలుతురు కోసం.

"నీ పేరేమిటి భాయ్?" ప్రశ్నించాడు జ్వాలా.

"రాహుల్."

"నువ్వుగూడా ఢాకూ వేనా?"

రాహుల్ తలెత్తి జ్వాలా కళ్ళలోకి చూశాడు.

"భయపడకు. నేను నీకు ఏమీ హాని చేయను" అన్నాడు జ్వాలా.

రాహుల్ నీరసంగా నవ్వాడు.

"నా పరిస్థితి నాకు తెలుస్తోంది. చావు నాకు దగ్గర్లోనే వుంది. ఇప్పుడు ఎవరికీ భయపడాల్సిన పనిలేదు. కాని శత్రువు చేతిలో చనిపోగూడదనే నా కోరిక" అన్నాడు.

ఇంతలో మేఘనాధ్ నీళ్లు, గ్లాసుతో 'టీ' తెచ్చాడు. రాహుల్ నీళ్ళు త్రాగి కొంచెం సేద తీరాడు. 'టీ' గ్లాసు ఆప్యాయంగా అందుకున్నాడు.

"నిజం చెప్పండి ఢోల్‌పూర్‌లో మీ బంధువులు ఎవరు?" ప్రశ్నించాడు రాహుల్.

జ్వాలా మాట్లాడలేదు.

"నాకు అబద్ధం చెప్పారు మీరు?" అన్నాడు మళ్ళీ.

"ఎలా తెలుసు నీకు?"

అతను నవ్వాడు.

"మీ ముఖాలు చూస్తుంటేనే తెలుస్తోంది ఈ ప్రాంతం వాళ్ళు కాదని. మీకు తెలీదేమో ఢోల్‌పూర్ మంగల్‌సింగ్ కోటలాంటిది?" అన్నాడు రాహుల్.

జ్వాలా, మేఘనాధ్ రెడ్డి ముఖ, ముఖాలు చూసుకున్నారు.

"రాహుల్ భాయ్! ఢోల్‌పూర్‌లో మా బంధువులున్నారని మాటవరసకి చెప్పాను. ఒకటి మాత్రం నిజం. మేము బాటసారులం. ఢోల్‌పూర్ దాటి వెళ్ళాల్సిన వాళ్ళమే" అన్నాడు జ్వాలా.

"నా మాట వినండి. ఢోల్‌పూర్ వూళ్లోకి మాత్రం వెళ్ళకండి. మీరు పోలీసులేమోనని అనుమానించి ఇబ్బంది పెడతారు ఆ వూరి వాళ్ళు. వాళ్ళు మంగల్‌సింగ్ తొత్తులు" చెప్పారు రాహుల్.

"నీ సలహా పాటిస్తాము" అన్నాడు జ్వాలా.

"దాదా! అతని రెండు కాళ్ళకి గాయాలున్నాయి. వాటికి మందువేసి, కట్లు కడితే బాగుంటుందేమో?" అన్నాడు మేఘనాధ్.

"ఇతన్ని మన టెంట్ దగ్గరికి తీసికెళ్తే మంచిది." అని రాహుల్‌తో చెప్పాడు, "భాయ్! ఈ ప్రక్కనే మేము టెంట్ వేసుకుని బస చేశాం, నువ్వు అక్కడికి వస్తే బాగుంటుంది."

రాహుల్ తల అడ్డంగా వూపాడు.

"వద్దు. నా కోసం మంగల్‌సింగ్ అనుచరులు వెతుకుతున్నారు. మంగల్‌సింగ్ కోసం పోలీసులు మారువేషాలలో గూడా రావచ్చు. నేను గూడా ఢాకునే కాబట్టి వారి

కంటపడితే ప్రమాదం. నాతోపాటు మీకూ ఇబ్బంది కలుగుతుంది" అన్నాడు.

"అయితే ఇక్కడ్నుంచి కదలవన్నమాట. మేము నీ కేమి సహాయం చెయ్యగలం?" అన్నాడు జ్వాలా.

"నా కొక సహాయం చేసిపెట్టండి. ఇక్కడికి దగ్గర్లోనే సిద్ధీ అనే గ్రామం వుంది. కుడిప్రక్కగా లోయలో వుంటుంది. అక్కడ శంభునాధ్ వుంటాడు. ఆయన నా పెద్దన్న. నేను ఇక్కడ వున్నట్లుగా సమాచారం అందించండి. చాలు. నేను చనిపోయాక ఆ వూళ్ళోనే సమాధి చేయబడాలని నా కోరిక" అన్నాడు రాహుల్ నీరసంగా.

జ్వాలాప్రతాప్ కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయాడు. మేఘనాధ్ అయోమయంగా జ్వాలా వంక చూశాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? మీకేమీ హాని జరగదు. శంభునాధ్ మీకు ఏమి కావాలన్నా సమకూరుస్తాడు. ఆ వూళ్ళో వాళ్ళంతా మాకు బంధువులే. మీరు భయపడాల్సిన పనిలేదు" అన్నాడు రాహుల్.

"దాదా! ఇతనికి ఆ వూళ్ళో జరిగిన ఘోరం గురించి తెలిసినట్లు లేదు" తెలుగులో అన్నాడు మేఘనాధ్.

మేఘనాధ్ మాట్లాడిన భాష రాహుల్‌కి అర్థం కాలేదు.

"ఏమిటి మీ సంశయం?" ప్రశ్నించాడు రాహుల్.

"ఏంలేదు భాయ్! ఆ విషయం నీకెలా చెప్పాలో మాకు అర్థం కావడంలేదు...." అన్నాడు జ్వాలా విచారంగా.

"ఏ విషయం?"

"సిద్ధీ గ్రామం మాకు తెలుసు. సాయంకాలం అక్కడికి వెళ్ళి వచ్చాము."

రాహుల్ ముఖంలో సంతోష చిహ్నాలు కనిపించాయి.

"శంబునాధ్ కనిపించాడా? అసలు మీరు కలుసుకున్నారా?"

జ్వాలా అడ్డంగా తల వూపి "లేదు భాయ్! మా కా అవకాశం లేకుండా పోయింది. ఈ రాత్రికి అక్కడే మకాం వెయ్యాలని వెళ్ళాం....కాని...."అన్నాడు మాటలు మింగుతూ.

"శంభునాధ్ లేడా?"

"ఆ వూళ్ళో ఎవరూ లేరు భాయ్!"

రాహుల్ ముఖం నల్లబడిపోయింది.

"అంతా ఏమై పోయారు?" ప్రశ్నించాడు.

"శవాలై పోయారు. తోడేళ్ళ గుంపు వాళ్ళని పీక్కు తింటున్నాయి. మాకు భయంవేసి వెనక్కి తిరిగి వచ్చేశాం భాయ్."

ఆ మాటలు విని రాహుల్ వణికిపోయాడు. అంత లావు మనిషీ దుఃఖంతో అల్లాడిపోయాడు. వెక్కి వెక్కి ఏడ్చాడు.

"ఇదంతా ఆ మంగల్‌సింగ్ ముఠావాళ్ళే చేశారు. ఆ దుర్మార్గులు అందర్నీ చంపారు. గ్రామాన్ని సర్వనాశనం చేశారు. చేతగాని వెధవలు. నామీద కసి వుంటే నన్ను చంపాలిగాని, అమాయకులైన వాళ్ళని చంపడం ఏం మగతనం...." ఏడుస్తూనే అన్నాడు రాహుల్.

జ్వాలా అతన్ని ఓదార్చాడు. కాని రాహుల్ దుఃఖానికి అంతులేదు. మంగల్‌సింగ్‌ని తిడుతూనే వున్నాడు. ఏడుస్తూనే వున్నాడు.

మేఘనాధ్ టెంట్ దగ్గరికి వెళ్ళాడు రాహుల్ కాళ్ళకి డ్రెస్ చెయ్యడానికి మందులు తీసుకురావడానికి. రాహుల్

మాత్రం తన కే మందులూ వద్దనీ, తను ఎటూ చావ బోతున్నాననీ కేకలు పెట్టాడు.

18

రాహుల్ రెండు కాళ్ళల్లోను బులెట్లు దిగి వున్నాయి. నెత్తురు పోవడం, వెంటనే ట్రీట్ మెంట్ ఇవ్వకపోవడంతో కాళ్ళు వాచిపోయాయి. అతను కాళ్ళను ముట్టుకోనివ్వడం లేదు. బాధతో అరుస్తున్నాడు. జ్వరం గూడా తీవ్రంగా వుంది.

మేఘనాథ్ డెట్టాల్‌తో గాయాలు శుభ్రంచేసి ఆయింట్ మెంట్ పూసి కట్లు కట్టాడు. బాధ మరిచిపోయి నిద్ర పోతాడని కాంపోజ్ ఇంజెక్షన్ చేశాడు. కాని అది పది నిమిషాలే పని చేసింది. అతనికి నిద్ర పట్టడం లేదు. బాధతో మూలుగుతూనే వున్నాడు.

"భాయ్! నాకు చావు దగ్గరకు వచ్చింది. జరిగిందంతా మీకు చెప్తాను. నేను పాపని. నేను చేసిన పాపంవల్లనే నా బంధువులంతా నాశనమై పోయారు" అంటూ రాహుల్ చెప్పసాగాడు:

"పదేళ్ళ క్రితం విచిత్రమైన పరిస్థితుల్లో మంగల్ సింగ్‌కి దగ్గరయ్యాను. అదంతా చెప్పడానికి ఇప్పుడు వ్యవధి లేదు! అప్పుడు నేను చాలా హుషారుగా వుండే వాడిని. మంగల్‌సింగ్ ఏ పని చెప్పినా వెంటనే దూకే వాడిని. ఎన్నడూ ఎదురు చెప్పలేదు. ఆ పని ఎంత కష్ట మైనదైనా, ప్రమాదంతో కూడుకున్నదైనా వెనుకా ముందూ చూసేవాడిని కాదు. కత్తిలా దూసుకుపోయి సాధించేవాడిని. ఎన్నో దోపిడీలలో సింగ్‌కి కుడిభుజంలా పని చేశాను.

మంగల్‌సింగ్ నన్ను ఎంతో మెచ్చుకునేవాడు. నా తర్వాత వీడేరా మీ నాయకుడు అని అందరితోనూ అనే వాడు. అంతలా కలిసిపోయాను. స్వంత మనిషిలా మసలుకునేవాడిని.

మంగల్‌సింగ్ దోపిడీలు చేసి లెక్కలేనంత డబ్బు, బంగారం, రత్నాలు, వజ్రాలు సంపాదించాడు. అదంతా ఎక్కడ దాస్తాడో ఎవరికీ తెలియదు. అతని భార్యకు మాత్రమే తెలుసునని మాలో కొందరు అనేవాళ్ళు. భార్య కయినా తెలుసో లేదో నాకు తెలీదు

నాకు మాత్రం మంగల్‌సింగ్ దోచిన సంపద మీదే కన్ను వుండేది. అదంతా నా స్వంతమైతే మహారాజులా బ్రతకొచ్చు అనుకునే వాడిని. ఆ సంపద నా పరం కావ డానికి ఒక్కటే మార్గం వుంది. అది మంగల్‌సింగ్‌కి అల్లుడు కావడమే. అతనికి ఒక్కతే కూతురు.

మంగల్‌సింగ్ భార్యకు ఎన్నో బహుమానాలు యిచ్చి ప్రసన్నం చేసుకున్నాను. నన్ను స్వంత తమ్ముడిలా చూసు కునేది. అతని కూతురు నన్ను ప్రేమిస్తే బాగుండునని అనుకునేవాడిని.

కాని ఆ పిల్లకి నాపట్ల పెద్ద ఆసక్తి వుండేది కాదు. ఎందుకో తెలీదు నన్ను మామూలుగా అందరితోపాటే చూసేది. ఆ పిల్లను ప్రసన్నం చేసుకునే వ్యవధి నాకుం డేది కాదు. ఎప్పుడూ దోపిడీలు, గుట్టాల మీద అడవుల్లో సంచారమే సరిపోయేది.

కావలసినంత డబ్బు, బంగారం సంపాదించావు గదా ఏ పట్టణానికో పోయి గౌరవంగా బ్రతకవచ్చు గదా అని ఒకసారి మంగల్‌సింగ్‌తో అన్నాను. అతను నవ్వి దొంగ తనం మన కులవృత్తిరా. మానేస్తే పాపం. కాళీ మనల్ని

మ్రింగుతుంది అనేవాడు. అదొక మూఢ నమ్మకం.

నేను మాత్రం అతని కూతుర్ని పెళ్ళి చేసుకుని ఏదైనా పట్నం వెళ్ళిపోయి హాయిగా జీవించాలని అనుకునేవాడిని. నాకంటే కుర్రవాడు, చురుకయినవాడు, నమ్మకస్తుడు అతని జట్టులో ఎవరూ లేరు. అందుకని మంగల్‌సింగ్ అల్లుడయ్యే యోగ్యత నాకే వుందని అంతా అనుకునేవారు. అతను గూడా నన్ను త్రాగి వున్న సమయాల్లోను, హుషారుగా వున్నప్పుడు అల్లుడూ అని పిలిచేవాడు. నేను వుప్పొంగిపోయేవాడిని.

కాని నా ఆశలన్నీ నిరాశ అని ఒక రోజు తెలుసుకున్నాను.

ఆ రోజు విక్రమ్‌సింగ్ మా ముఠాలో ప్రవేశించిన రోజు. కాళికా పూజ చేసి, నాలుగు పొటేళ్ళను బలి ఇచ్చి పెద్ద విందు చేశాడు మంగల్‌సింగ్. విక్రమ్‌సింగ్‌ను చూస్తూనే నా ఆశాసౌధాలు కూలిపోయాయి. అతను మంగల్‌సింగ్ మేనల్లుడు. వాళ్ళ నాన్న గూడా బందిపోటే. తండ్రి చనిపోయాక మేనమామ దగ్గర చేరాడు విక్రమ్.

అతను ఇరవై రెండేళ్ళ కుర్రాడు. అరేబియా మేలు జాతి గుర్రంలా మెరిసిపోతున్నాడు చాకులా హుషారుగా వున్నాడు ఎత్తుగా, అందంగా గూడా వున్నాడు. నా కంటే అన్ని విధాలా మంగల్‌సింగ్‌కు అల్లుడయ్యే అర్హత అతనికే వుంది.

ఆ రోజు నుంచి నాకు విక్రమ్ మీద ఈర్ష్య మొదలైంది. నా స్థానంలోకి ప్రవేశించినందుకు కోపంతో నాలో నేను దహించుకుపోయేవాడిని. కాని పైకి మామూలుగా వుండేవాడిని కాలం గడిచిపోతూ వుంది. విక్రమ్‌తో కూతురు పెళ్ళి చేయాలని మంగల్‌సింగ్ సన్నాహాలు

చేస్తున్నాడు.

నాలో కసి మరీ పెరిగి పోసాగింది. భరించలేనంత ఆవేదన. బాధతో గిలగిలలాడి పోయేవాడిని. తుపాకీతో తల పేల్చుకుని చావాలని గూడా అనుకునేవాడిని. నిరాశ, నిస్పృహలతో నీరసంగా వుండేవాడిని.

మంగల్‌సింగ్ నా వాటా క్రింద ఇచ్చే డబ్బు బంగారం నా పెద్దన్న శంభునాధ్‌కి ఇచ్చేవాడిని. సిద్ధీ గ్రామానికి పెద్ద ఆయనే. నన్ను పెళ్ళి చేసుకోమని ఎప్పుడూ పోరుతూనే వుండేవాడు. మంగల్‌సింగ్‌కి అల్లుడవ్వాలనే లక్ష్యంతో వున్న నేను పెళ్ళికి ఒప్పుకునేవాడిని కాదు. మేనల్లుడు దగ్గర చేరగానే మంగల్‌సింగ్ నన్ను మోసం చేశాడని నేను బాధ పడసాగాను.

మా పెద్దన్న నాలో మార్పు గమనించాడు. విషయం ఏమిటని గట్టిగా అడిగాడు. నేను అసలు విషయం ఆయనకు చెప్పాను. బాధతో ఏడ్చాను గూడా. నాకు చావాలని వుందని. బాధ భరించలేననీ అన్నాను.

చచ్చి సాధించేది ఏమీ లేదనీ బ్రతికి వుండి సాధించాలనీ సమయం చూసి అడ్డు తొలిగించుకోమని శంభునాధ్ సలహా యిచ్చాడు. ఇన్నాళ్ళూ నా కా ఆలోచన రానందుకు విచారించాను. విక్రమ్ అడ్డు సమయం చూసి తొలగించాలని నిర్ణయించుకున్నాను. అవకాశం కోసం ఎదురు చూస్తూ వున్నాను.

ఒక రోజు రాత్రి రైలు దోపిడీకి పథకం సిద్ధమైంది. విక్రమ్‌సింగ్ నాయకత్వంలో బయల్దేరాం. ఈ దోపిడీకి మంగల్‌సింగ్ రావడం లేదు ఇటువంటి చిన్న చిన్న దోపిడీలకు అతను స్వయంగా రాడు.

విక్రమ్‌సింగ్ ఇంజన్‌లోకి గెంతి డ్రయివర్ని గాయ

పరచి రైలు ఆపు జేయించాడు. దోపిడీ మొదలయింది. కాని లోపల సాయుధులైన పోలీసులు వున్న సంగతి మాకు తెలీదు. వాళ్ళు కాల్పులు మొదలు పెట్టారు. మా వాళ్ళు పారిపోవడం సాగించారు.

ఇదే అదనుగా భావించి నేను విక్రమ్‌సింగ్‌ను గురి చూసి కాల్చాను. అది వృథా కాలేదు. అతను చావు కేక పెట్టి గుర్రం మీద నుంచి క్రింద పడిపోయాడు.

విక్రమ్‌ని చంపానని నేను సంతోషించాను కాని నేను చేసిన దారుణం మంగల్‌సింగ్ స్వయంగా చూశాడని నేను గ్రహించలేదు. రైలు దోపిడీ ఎలా జరుగుతున్నదో చూడ డానికి మంగల్‌సింగ్ వచ్చి దూరంగా నిల్చున్నాడు. బైనాక్యులర్స్‌తో అంతా చూశాడు.

నేను విక్రమ్‌ని కాల్చడం గమనించి నా వైపుకి మెరుపు వేగంతో వచ్చాడు. క్షణంలో జరిగిన పొరబాటు గ్రహించాను. మంగల్‌సింగ్‌కి దొరికితే నాకు చావు తప్పదు ప్రాణ భయంతో పారిపోసాగాను.

మంగల్‌సింగ్ నన్ను తరుముతూనే కాల్పులు సాగించాడు. కాని నా కాళ్ళను మాత్రమే గాయపరచగలిగాడు. నేనా చీకట్లో అడవిలోకి తప్పుకున్నాను. గుర్రాన్ని వదిలేసి పరుగెత్తాను.

గుబురుగా వున్న పొదలో దాక్కున్నాను. గుర్రాన్ని తరుముతూ మంగల్‌సింగ్ దాటిపోయాడు. నేను అతి కష్టం మీద ఇక్కడకు చేరుకున్నాను. శంభునాథ్‌కి కబురు చెయ్యాలనుకున్నాను. ఎవరూ కనిపించలేదు.

"నేను దొరక్కపోయేసరికి మంగల్‌సింగ్ మా వూరు వెళ్ళి వుంటాడు. నేను ఎక్కడ దాక్కున్నదీ వాళ్ళకి తెలుసని అతని వుద్దేశ్యం. వాళ్ళు చెప్పకపోయేసరికి అందర్నీ

చంపి వుంటాడు రాక్షసుడు."

రాహుల్ ఏడుస్తూ జరిగిన దారుణమంతా చెప్పాడు.

"నేను మిమ్మల్ని ఒక్క కోరిక కోరతాను. తీరుస్తారా?" అన్నాడు రాహుల్.

"చెప్పు భాయ్! మాకు చేతనయితే చేస్తాం" అన్నాడు జ్వాలా.

"పిర్థీ గ్రామం నావల్ల నాశనమైంది. వాళ్ళ శవాలకు దహన సంస్కారాలు చేసే నాధుడు గూడా లేకపోయాడు. నా కోరిక ఒక్కటే. వాళ్ళ శవాలను దహనం చేయండి. అంతే చాలు" అన్నాడు రాహుల్

మేఘనాథ్ గుండెలో రాయి పడినట్లయింది. ఆ దుర్వాసన తలుచుకుంటేనే శరీరం జలదరిస్తోంది.

"అలాగే భాయ్!" అన్నాడు జ్వాలా సంకోచించకుండా.

"శంభునాథ్ ఇంట్లో కాళీ విగ్రహం క్రింద బంగారం వుంటుంది. అది మీరు తీసుకోండి" అన్నాడు రాహుల్.

జ్వాలా మాట్లాడలేదు.

"అది దోపిడీ సొమ్మని సంకోచించకండి. బంగారానికి దొంగ బంగారమనీ, దొర బంగారమనీ తేడా లేదు. అవసరాలను ఎవరికయినా తీరుస్తుంది" అన్నాడతడు మళ్ళీ.

"నాకు అటువంటి సందేహం ఏమీ లేదు" అన్నాడు జ్వాలా.

"ఇక మీరు వెళ్ళి పడుకోండి భాయ్. రేపు వుదయం కలుద్దాం" అన్నాడు రాహుల్.

ఇద్దరూ శెలవు తీసుకుని బయల్దేరారు.

దారిలో అన్నాడు మేఘనాథ్.

"దాదా! మనం మళ్ళీ ఆ వూరెళ్ళి శవాలను కాల్చడం

జరిగే పనేనా!"

"ఏం? ఎందుకు జరగదు?"

"ఆ దుర్వాసన తట్టుకుని, ఆ తోదేళ్ళని తరిమి కొట్టి."

"మనకి ఎంతయినా పుణ్యం వస్తుంది భాయ్!" అన్నాడు జ్వాలా.

ఇంతలో తుపాకీ ప్రేల్చిన శబ్దం అయింది. ఇద్దరూ వెనక్కి పరుగెత్తారు.

రాహుల్ తల పగిలి నెత్తురు ధారలై కారుతోంది. తలకి గురిపెట్టి తుపాకీతో కాల్చుకుని ప్రాణం వదిలాడు రాహుల్.

"పూర్ ఫెలో..." నిట్టూరుస్తూ అన్నాడు జ్వాలా.

19

తూర్పు ఎర్రబడుతూ వుండగా రాహుల్ చితి మంటలలో బూడిదై పోయాడు.

నిద్రలేమితో మేఘనాధ్ కళ్ళు మూతలు పడుతున్నాయి. జ్వాలా నేత్రాలు ఎరుపెక్కి వున్నాయి.

రాహుల్ వారికి అపరిచితుడే అయినా అతని మరణం ఖిన్నుల్ని చేసింది. అతను ఎవరో? ఎక్కడ పుట్టాడో? ఎక్కడ పెరిగాడో? చివరకు అతని అంత్యక్రియలు వారు చేశారు. మానవత్వం వారిచే ఆ పని చేయించింది.

వేడి వేడి 'టీ' తయారు చేసి అందరికీ ఇచ్చింది అపర్ణ.

"దాదా! అర్ధరాత్రి నిద్ర లేవడంతో నీరసంగా వుంది. ఈ పూట జర్నీ బ్రేక్ చేద్దాం. నిద్ర పోకపోతే నడవడం కష్టం" అన్నాడు కృష్ణమూర్తి.

"ఈ రోజు జర్నీ లేదు. ఇక్కడే మకాం. కాని మనం చెయ్యాల్సిన కార్యక్రమం ఒకటి వుంది" అన్నాడు దాదా.

మేఘనాధ్‌కి అదేమిటో తెలుసు. మౌనంగా కూర్చున్నాడు.

"ఏమిటది?" ప్రశ్నించాడు కృష్ణమూర్తి.

రాహుల్‌కి ఇచ్చిన మాట ప్రకారం పిద్దీ గ్రామంలో దహన సంస్కారాలు గురించి వివరంగా చెప్పాడు జ్వాలా.

అందరి ముఖాల్లోను ఆశ్చర్యం ద్యోతకమైంది శవాలను పీక్కు తినే తోడేళ్ళు గుర్తొచ్చి శరీరం జలదరించింది. ఆ పని చెయ్యడం ఎవరికీ ఇష్టం లేనట్లు మౌనంగా వుండిపోయారు.

"దాదా! అది మనవల్ల అయ్యేపనేనా?"

"తోడేళ్లు మనల్ని బ్రతకనిస్తాయా?"

"కుళ్ళిపోతున్న శవాల మధ్య మనం కొద్దిసేపున్నా కలరా తగులుతుంది."

అయిష్టంతో అన్నారు.

జ్వాలా మేఘనాధ్ వైపు చూశాడు. అతను మౌనంగా వుండిపోయాడు.

తుపాకీ చేత పట్టుకుని బయల్దేరాడు. జ్వాలా అతని వెనుకనే మరొక తుపాకీ పట్టుకుని అనుసరించాడు మేఘనాధ్ రెడ్డి.

ఎవరూ వూహించని పరిణామం అది. జ్వాలా అలా ఒంటరిగా బయలుదేరి వెళ్ళిపోతాడని అనుకోలేదు. అంతా నివ్వెరపోయారు. ఒకరి ముఖం మరొకరు చూసుకున్నారు.

ఫణీంద్ర పరుగున వెళ్ళి జ్వాలాకి అడ్డంగా నిల్చున్నాడు.

"దాదా ఏమిటిది? ఒంటరిగా వెళ్తావా?" అన్నాడు.

"జ్వాలా ఆడిన మాట తప్పడు. నేను రాహుల్‌కి మాట ఇచ్చాను అతడి బంధువుల శవాలకు దహన సంస్కారాలు చేస్తానని" సీరియస్‌గా అన్నాడు.

"నువ్వు మాట ఇచ్చావు సరే. అందులో వున్న కష్ట నష్టాలు ఆలోచించావా? తోడేళ్ళ గుంపును చెదరగొట్టాలి. శవాలు కుళ్ళిపోయి వున్నాయి. వాటి దుర్గంధం మనం భరించాలి, కలరా తగిలితే మనలో ఒక్కరం గూడా మిగలం. దాదా! ఇచ్చిన మాట కోసం ప్రాణాలు పణంగా పెట్టగలమా? ఆలోచించు దాదా!" ఫణీంద్ర ప్రతిమాలుతూ అన్నాడు.

"మీరెవరూ ప్రాణాలు పణంగా పెట్టనక్కర లేదు. మీ రిక్కడే వుండండి. సాయంకాలానికి తిరిగి వస్తే కలుసుకుందాం. లేకపోతే మీరు ముందుకు వెళ్ళండి" అన్నాడు దాదా.

"ఒక్కో మనిషికి ఒక్కో ప్రిన్సిపిల్ వుంటుంది. దాదా గురించి మనకు తెలిసీ వేరే ప్రపోజల్స్ అనవసరం ఫణీ" అన్నాడు మేఘనాధ్.

అంతా జ్వాలా చుట్టూ చేరారు.

"నిన్ను నమ్మి వచ్చాం. ఏం జరిగితే అదే జరుగుతుంది. మేము గూడా నీతో వస్తాం దాదా! డియర్ ఫ్రెండ్స్ మనం దాదాని అనుసరించడం మంచిది" అన్నాడు కృష్ణమూర్తి.

"సరే దాదా! నీతో వస్తాం."

అంతా దాదా వెంట పిద్దీ గ్రామం వెళ్ళడానికి సిద్ధపడ్డారు.

"మనం ఏదైనా తిని వెళ్తే మంచిది. మళ్ళీ అక్కడ్నుంచి ఎప్పుడు వస్తామో!" అన్నాడు కిశోర్.

అందరికీ ఆకలిగానే వుంది. ఏదైనా కడుపులో పడితే బాగుండుననిపిస్తోంది.

"అపర్ణా! తినడానికి ఏమైనా చేస్తున్నావా?" నవ్వుతూ అడిగాడు కిశోర్.

ఎండిన జింక మాంసంతో బఠాణీ గింజలు వేసి సూప్ చేస్తోంది ఆమె. రొట్టెలతోపాటు తినడానికి. ఎంతో రుచిగా వుంటుంది. ఆ విషయమే చెప్పింది అపర్ణ.

రొట్టెలు చెయ్యడంలో సాయపడ్డాడు కిశోర్.

కాసేపటికి వంట పూర్తయింది.

అందరూ తిని బయల్దేరారు. టెంట్ ఎత్తివేసి సామానులు గాడిదల మీద సర్దారు.

కొండ దిగడం మొదలు పెట్టారు.

లోయలో సిద్ధిగ్రామం ఇళ్ళు కనిపిస్తున్నాయి. వంద గజాల దూరంలో ఆగిపోయారు. తోడేళ్ళు స్పష్టంగా కనిపిస్తున్నాయి. శవాలను పీక్కుతింటున్నాయి. దుర్వాసన ముక్కులను పగలగొడుతోంది. జ్వాలా అందర్నీ ముక్కులకు గుడ్డలు అడ్డంగా కట్టుకోమని చెప్పాడు. అలా చేసినా ఇంతా వాసన వస్తూనే వుంది. ముందుకు వెళ్ళేకొద్దీ దుర్భరంగా వుంది.

మేఘనాథ్ తుపాకీ పట్టుకుని ముందు నడుస్తున్నాడు. జ్వాలా తన చేతిలోని తుపాకీ ఫణీంద్రకు ఇచ్చాడు,

ఫణీంద్ర తుపాకీ అందుకుని "దాదా! నా గురి సరిగా వుండదేమో? నాకంటే దీన్ని నువ్వే వుపయోగిస్తే మంచిది" అన్నాడు.

జ్వాలా నవ్వి "ఉపయోగించాల్సిన అవసరం రాదు. ఒకవేళ వుపయోగించాల్సి వచ్చినా గురి తప్పినా ఫరవా లేదు" అన్నాడు.

"అదేమిటి?"

"రాహుల్ వదిలిపోయిన హేండ్ బ్యాగ్‌లో కొన్ని నాటుబాంబు లున్నాయి. మొదట వాటిని వుపయోగిస్తాను. తోడేళ్ళు బెదిరిపోయి పారిపోతాయి. ఒకటీ అరా మిగిలితే వాటిని మీ తుపాకీలతో పని పట్టండి" అన్నాడు జ్వాలా.

నాటు బాంబు లున్నాయనే సంగతి తెలుసుకుని అందరికీ ధైర్యం వచ్చింది.

పిద్రీగ్రామంలో వున్న ఇళ్ళన్నీ సర్కిల్లో వున్నాయి. అన్నీ పూరిళ్ళు, మధ్య ఖాళీస్థలంలో జరిగింది భీభత్సం. వూళ్ళో అందర్నీ ఒకచోటుకి చేర్చి మూకుమ్మడిగా చంపి వుంటాడు ఆ కిరాతకుడు. స్త్రీలని, పిల్లలని జాలి గూడ చూపలేదు.

శవాలు చిందర వందరగా పడి వున్నాయి. కొన్ని శవాలు అస్తిపంజరాలుగా మారిపోయాయి. చేతులు, కాళ్ళు పోయి కొన్ని, ప్రేగులు బైటపడి కొన్ని కనిపిస్తున్నాయి. చూడటానికి భయంకరంగా వుంది ఆ దృశ్యం. తోడేళ్ళు మాత్రం ఆనందంగా విందు చేసుకుంటున్నాయి.

ఇళ్ళకు దగ్గరగా వచ్చారు.

"అంతా ఒక వైపునే వుండండి" హెచ్చరించాడు జ్వాలా.

గుంపుగా నిల్చున్నారు.

"బాంబ్ శబ్దానికి మన గాడిదలు భయపడి పరిగెత్త వచ్చు. వాటిని కదలకుండా ఏదైనా చెట్టుకి కట్టేయండి" చెప్పాడు జ్వాలా.

పెద్ద సాల వృక్షానికి కట్టేశారు వాటిని.

జ్వాలా ముందుకు వెళ్ళాడు. తోడేళ్ళు మనుషుల్ని చూశాయి తల ఎత్తి. వాటి కళ్ళు మెరుస్తున్నాయి.

బాంబ్ ప్రేలింది.

తోడేళ్ళు చెల్లా చెదురయ్యాయి. చెట్లమీద పక్షులు భయంతో ఎగిరిపోయాయి. పెద్ద శబ్దం కొండల మధ్య ప్రతిధ్వనించింది. తుపాకీలతో అవసరం లేకుండానే తోడేళ్ళ గుంపు అడవిలోకి పారిపోయింది.

"క్విక్. శవాలను ఒక చోటికి చేర్చి తగలబెడితే సరి పోతుంది" మేఘనాథ్ అన్నాడు.

"ఇన్ని శవాలను కాల్చడానికి కట్టెలు ఎక్కడ వున్నాయి?" సందేహంగా అడిగాడు కృష్ణమూర్తి.

"ప్రతి ఇంట్లోను కట్టెలు వుంటాయి. ఇళ్ళమీద దూలాలు వున్నాయి. వాటిని పీకి పేర్చితే సరిపోతాయి" అన్నాడు జ్వాలా.

జ్వాలా చెప్పింది నిజమే. ప్రతి ఇంట్లోను కట్టెలు వుండనే వున్నాయి. పెద్ద పెద్ద ఇళ్ళకు దూలాలు వున్నాయి. వాటిని వూడదీసి మధ్యలో పేర్చారు. వాటి మీద శవాలు పడేశారు.

అంతా సిద్ధమైంది.

ఇక నిప్పు ముట్టించడమే తరువాయి.

"దాదా! శంభునాథ్ ఇంట్లో కాళి విగ్రహం క్రింద బంగారం వుందన్నాడు రాహుల్" మేఘనాథ్ అన్నాడు.

"సమయానికి గుర్తు చేశావు. నేను మర్చిపోయాను" అన్నాడు జ్వాలా.

"మనం శంభునాథ్ ఇంటిని గుర్తించడం ఎలా?"

"సింపుల్. అతని ఇంట్లో మాత్రమే కాళి విగ్రహం వుంటుంది" అన్నాడు జ్వాలా.

"కాళి విగ్రహం ఏ ఇంట్లో వుందో చూడండి" అందర్నీ వుద్దేశించి అన్నాడు మేఘనాథ్.

తలా ఒక దిక్కుకు వెళ్ళారు. చివరగా పెద్ద ఇల్లు శంభునాథ్‌దే. ఆ ఇంట్లోనే కాళీ విగ్రహం వుంది. అంతా అందులోకి వెళ్ళారు.

విగ్రహం నాలుగు అడుగులు వుంటుంది. చెక్కతో చేసిన విగ్రహం. మట్టి దిమ్మెమీద నిలబెట్టి వుంది. జ్వాలా విగ్రహం తొలగించాడు. మట్టిని తవ్వేసరికి లోపల ఒక చెక్క పెట్టె బయట పడింది. దానికి తాళం వుంది. పగల గొట్టారు లోపల అన్నీ బంగారు నగలే.

కళ్ళు జిగేల్ మన్నాయి.

"ఇంత బంగారం దొరికాక ఇక మనకు కాంచన శిఖరంలో పని ఏముంది దాదా?" జోక్‌గా అన్నాడు మేఘనాథ్.

అంతా నవ్వారు.

"డబ్బు గురించి ఇగ దిగులు లేదురా భాయ్! లక్కీగా బంగారం దొరికింది" సంతోషంగా అన్నాడు జ్వాలా.

చితికి నిప్పు అంటించి బయల్దేరారు.

అప్పటికి సాయంకాలం మూడయింది.

20

పగలంతా ప్రయాణం సాఫీగా సాగింది.

చీకటిపడే సమయానికి మజిలీ వెయ్యడానికి మంచి ప్రదేశమే దొరికింది.

అక్కడ ఒక సెలయేరు గలగలా ప్రవహిస్తోంది. ఆ నీళ్ళతో పెద్ద తటాకం ఏర్పడింది దానిచుట్టూ చిక్కటి చెట్లు అల్లుకుపోయి మనోహరంగా కనిపిస్తోంది. దగ్గర్లోనే వున్న కొండల్లోంచి జీవనదిలా ప్రవహిస్తున్న సెలయేటి నీళ్ళు తియ్యగా వున్నాయి.

వెలుగు వుండగానే అంతా స్నానాలు చేశారు. కొంచెం

దూరంలోనే టెంటు వేయించాడు జ్వాలా. చుట్టుపక్కల ఎక్కడా యింత పెద్ద నీటివసతి లేదు. వున్నా ఎండాకాలం ఎండిపోతాయి. ఇది ఏ కాలంలోనూ ఎండే ప్రసక్తి లేదు. అందుకని జంతువులు నీళ్ళు తాగడానికి ఇక్కడకు రావడం అలవాటు చేసుకుని వుంటాయి. దూరంగా వుండడం ఎంతో మంచిదని దూరంగా మజిలీ చేయించాడు జ్వాలా.

వెన్నెల నిండుగా కాస్తోంది.

చెట్ల కొమ్మల్లోంచి వెన్నెల టెంట్ మీద పడుతోంది.

భోజనాలు అయిపోయిన తర్వాత అంతా నిద్రకు వుపక్రమించారు. రాహుల్ చనిపోయిన నాటి రాత్రినుంచి ఎవరికీ సరిగా నిద్రలేదు. అందుకే గాఢంగా నిద్రపట్టింది అందరికీ.

రాత్రి పది నుంచి రెండువరకూ సెంట్రీ డ్యూటీ తను చేస్తానని కూర్చున్నాడు జ్వాలా.

నెగడు ఎర్రగా మండుతోంది.

అపర్ణకు మెలకువ వచ్చింది.

కళ్ళు తెరిచి చూసింది. ఆమె పెదవులమీద ఎవరివో వేళ్ళు కదులుతున్నాయి. ఆమె ప్రక్కనే ఎవరో కూర్చుని ముఖంలో ముఖంపెట్టి చూస్తున్నారు. మసక వెలుగులో ముఖం స్పష్టంగా కన్పించడంలేదు.

ఆమె ఆ చేతిని గట్టిగా పట్టుకుంది.

"అపర్ణా!"

ఆ గొంతు కిశోర్ ది.

"కిశోర్" నెమ్మదిగా పిలిచింది.

"వూఁ...." అంటూ అతను మరింత దగ్గరగా జరిగాడు. అతని రెండుచేతులూ ఆమె భుజాలమీద వేసి

సన్నిహితంగా వచ్చాడు. ఇద్దరూ గాఢంగా పెనవేసుకున్నారు. కొద్దిసేపు వెచ్చటి కౌగిలిలో హాయిగా వుండిపోయారు. ఎవరైనా మేలుకుని వుంటే వారికి ముద్దుల చప్పుడు వినిపించి వుండేది. కాని అంతా నిద్రలో వున్నారు.

కిశోర్ చెయ్యి ఆమె జాకెట్ హుక్స్ తియ్యడానికి ప్రయత్నిస్తుంటే అపర్ణ వారించింది.

"వద్దు కిశోర్."

"అపర్ణా! ప్లీజ్...." గోముగా చెవిలో అన్నాడు.

"ఎవరైనా మేలుకుని వుంటే బాగుండదు."

"అంతా నిద్రపోతున్నారు."

"ఎలా తెలుస్తుంది మనకు?"

"నువ్విలా అంటావని నాకు ముందే తెలుసు."

"కిశోర్! తొందరపడకు. జీవితాంతం కలిపి వుండేవాళ్ళమేగా."

"అవుననుకో. అయినా యెప్పటి అనుభవం అప్పటిదే. కాలం కరిగిపోతూ వుంటుంది. ఈ రాత్రి రేపు వుండదు."

"అబ్బాయి వేదాంతం మాట్లాడుతున్నాడే."

"వేదాంతం కాదు. వాస్తవం."

"పరిస్థితులు గమనించి మనం ప్రవర్తించాలి. ఎవరైనా చూస్తే సిగ్గుతో చచ్చిపోతాను. రేపు వాళ్ళ ముఖాలు ఎలా చూడగలను?"

"చూస్తే ఏం భయమా? మనమేం తప్పు చెయ్యడం లేదు."

కావొచ్చు. కొద్ది రోజులు ఓపికపట్టు కిశోర్. ఈ యాత్ర పూర్తి కానీ ఆ తర్వాత హాయిగా జీవిద్దాం."

"ఈ యాత్ర ఎప్పటికి పూర్తవుతుందో! అసలు

పూర్తవుతుందో లేదో? ఇంతవరకు మొదటి మెట్టుమీదే వున్నాం. అదీగాక దీనిలో ఎన్ని ప్రమాదాలు పొంచి వున్నాయో ఎవరికి తెలుసు. బ్రతికి బయట పడతామో లేదో?"

"అశుభం పలుకకు."

"కీడెంచి మేలెంచమన్నారు పెద్దలు. ఈ యాత్ర మధ్యలోనే మనం చనిపోయామనుకో. జీవితం వేస్ట్ అయి పోయినట్టే గదా. అందుకే అందినంతవరకూ అనుభవాలు పంచుకుందాం."

మధ్యలోనే చనిపోతామేమో? అనే మాట అపర్ణ హృదయాన్ని కరిగించి వేసింది.

"కిశోర్" అంటూ గాఢంగా పెనవేసుకుంది.

"అనుభవం నాకూ ఇష్టమే కిశోర్. కాని ఇందరి మధ్య భయంగా. బెరుకుగా, ఎవరైనా చూస్తున్నారనే జంకుతో ఏం సుఖం చెప్పు? వ్రతం చెడ్డా ఫలితం దక్కదు."

"అందుకే మనం హాయిగా గడపడానికి ఒక చోటు చూసి వచ్చాను."

"ఎక్కడ?" ఆశ్చర్యంతో ప్రశ్నించింది అపర్ణ.

"పద చూపిస్తాను."

"ఇంత రాత్రా? ఈ అడవిలో క్రూరమృగాలు, పాములు ఎన్నో వుంటాయి గదా!"

"ఫరవాలేదు పద."

అపర్ణ నెమ్మదిగా లేచి నిల్చుంది.

ఇద్దరూ టెంట్‌లో నుంచి బైటకు వచ్చారు.

కిశోర్ వాచీ చూశాడు.

టైమ్ మూడు గంటలైంది.

నెగడు ఎర్రగా మండుతోంది.

అపరాధ పరిశోధనపోటీ-195

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో రూ. 1-00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1-00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-10-'84 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు డిసెంబరు '84 నెల సంచికలో ప్రచురిస్తాము.

1. పాపకార్యం చేయడంలో ఆదర్శ ప్రాయుడైన రాష్ట్రి గవర్నరు—? (జగ్ మోహన్, రాంలాల్)
2. నాదెండ్ల ప్రభుత్వానికి మొదట మద్దతు ప్రకటించిన రాజకీయ పార్టీ—? (మజ్లిస్, సంజయ్ విచార్ మంచ్)
3. ప్రజలలో రోజురోజుకు పలుకుబడి కోల్పోతున్న అధికార పార్టీ—? (అన్నా డి.ఎమ్.కె., కాంగ్రెస్-ఐ)
4. ఎన్.టి ఆర్. తర్వాత పదవీచ్యుతుడు కాబోయే మరో ముఖ్యమంత్రి ఈయనే అంటున్నారు—? (రామకృష్ణహెగ్డే, ఎమ్.జి.ఆర్.)
5. ఇందిరాగాంధికి ప్రతిపక్షాలు పెట్టిన ముద్దు పేరు—? (అబద్దాల పుట్ట, ప్రియదర్శిని)

కృష్ణమూర్తి సెంట్రీ డ్యూటీ చేస్తున్నాడు. తెల్లవారే వరకూ అతనే సెంట్రీగా వుంటాడు. మధ్యలో యెవరూ లేరు. సంతృప్తిపడ్డాడు కిశోర్.

ఇద్దరూ అడుగులో అడుగు వేసుకుంటూ పిల్లుల్లా జారుకున్నారు అక్కడ్నుంచి.

కిశోర్ పెన్‌టార్చి వేసి దారి చూపుతూవుంటే, అపర్ణ అతని భుజం మీద చేతులువేసి నెమ్మదిగా అడుగులు వేస్తోంది.

సెలయేరు తటాకంలోకి దూకుతున్న ప్రదేశానికి దగ్గర్లో చేరుకున్నారు. ఒడ్డున పెద్ద చెట్టుకి మంచె వుంది. ఎవరో పులివేట కోసం ఏర్పాటు చేసుకుని వుంటారు.

"అదే మనకి పట్టెమంచం" నవ్వుతూ అన్నాడు కిశోర్.

"అంత పైకి ఎక్కడం ఎలా?" అంది అపర్ణ ఇబ్బందిగా.

"ఈజీ. నేను ఎక్కి చూశాను."

కిశోర్ నెమ్మదిగా ఎక్కి మంచె పైక్కి వెళ్ళాడు. తర్వాత అపర్ణ ఎక్కడానికి సాయపడ్డాడు.

21

"కిశోర్ తెల్లవార వచ్చింది. ఇక వెళ్దాం" గోముగా అంది అపర్ణ.

"ఊఁ...." అంటూ అయిష్టంగా లేచాడు కిశోర్.

"కిశోర్...." ఆందోళనతో కేక పెట్టింది అపర్ణ.

"ఏమిటి?"

"నా చీర, జాకెట్ కన్పించడంలేదు."

"వ్వాట్...." పెన్‌టార్చి వేసి చూశాడు.

ఒక ఎండు కొమ్మకి తగిలించిన చీర, జాకెట్, కిశోర్ షర్టు, ప్యాంటు గూడా కన్పించలేదు.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి. మీ నెంబరు ప్రతి నెలా వి. పి. ప్యాకెట్టు మీద వుంటుంది.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-10-'84 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు డిసెంబరు '84 నెల సంచికలో ప్రకటిస్తాము. *

జూలై '84 పోటీ ఫలితాలు

(1) ఆగస్టునెల '84 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

టోపీ ఎత్తిపెట్టకు !
తుపాకీ తిప్పి కొట్టకు ! !

పంపినవారు: శ్రీవింజమూరి కృష్ణమూర్తి, కెనరా బ్యాంకు, పోస్ట్ బాక్స్ - 1045, బషీర్‌బాగ్, హైద్రాబాదు.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

దొర వేషం వేశావు !
దొంగ చేతిలో చిక్కావు ! !

పంపినవారు: శ్రీ యం. శంకరరెడ్డి, గాంధీచౌక్ రోడ్, బెల్లంపల్లి - 504 251, (ఆదిలాబాదు జిల్లా.)

"ఏమైపోయాయి?" ఆశ్చర్యంతో అన్నాడు.

"జారి క్రింద పడ్డాయేమో చూడు" కంగారుగా అంది అపర్ణ.

కిశోర్ అండర్‌వేర్, బనీన్‌తో చెట్టు దిగి వెళ్ళాడు. చెట్టు క్రింద అంతా వెతికాడు. వాళ్ళ బట్టలు యెక్కడా కన్పించలేదు.

"అపర్ణా!....మన బట్టలు ఎక్కడా కన్పించలేదు."

"ఎక్కడికి పోయాయి?"

"అదే వండర్‌గా వుంది."

"అంతా మాయగా వుందే. మనం నిద్ర గూడా పోలేదుగా."

"మైకంలో వున్నాం."

"యూ....సిల్లీ. ఇప్పుడెలా?"

"దిగిరా పోదాం?"

"ఇలాగా....నాకు సిగ్గుగా వుంది బాబూ!" తన వంక చూసుకుంటూ అంది. లోపలి లంగా, బ్రా మాత్రమే వంటి మీద వున్నాయి.

"ఫర్వాలేదు దిగిరా. ఎవరూ నిద్ర లేవకముందే వెళ్ళిపోదాం."

అపర్ణ మంచెమీద నుంచి క్రిందకు దిగటానికి ప్రయత్నిస్తూ వుంది, కిశోర్ టార్చివేసి ఆమెకు వెలుగు చూపిస్తూ డైరెక్షన్ ఇస్తున్నాడు దిగడానికి.

ఇంతలో ఏదో ఒక ఆకారం అపర్ణ మీదకు దూకింది. ఆమె భయంతో 'కెవ్వు'న కేకపెట్టి పట్టు తప్పి దబ్బుమని శబ్దం చేస్తూ క్రింద పడిపోయింది. ఆమె క్రిందపడిన మరుక్షణం ఆ ఆకారం చెట్టుపైకి స్పీడుగా పాకింది. అంతా క్షణంలో జరిగిపోయింది.

Blank Page

Regd. no: H/HD 48
PRABHAKAR